
# కారెక్టర్ ఆర్టిస్టులు



యస్.వి. రామారావు

# క్యారెక్టర్ ఆర్టిస్టులు

**ఎస్.వి.రామారావు**




**కిన్నెర పబ్లికేషన్స్**

**కిన్నెర ఆర్ట్ థియేటర్స్**

2-2-647/153,

సెంట్రల్ ఎక్సైజ్ కాలనీ,

హైదరాబాద్ - 500 013

ఫోన్ : 040-27425577

# క్యారెక్టర్ ఆర్టిస్టులు

**(Character Artistulu)**

తొలి ముద్రణ : **ఏప్రిల్ 2011**

ప్రతులు : **1000**


మూల్యం : **80/-**
$ 5

**రచయిత చిరునామా :**
ఎస్.వి.రామారావు
ఫ్లాట్ నెం : 500, ఇంటి నెం. 2-4-681/3
వీధి నెం. 10/A , న్యూ నాగోల్ కాలనీ
హైదరాబాద్ - 500035
ఫోన్ : 24032300

డి.టి.పి : **శ్రీమతి లక్ష్మీశ్రీనివాస్,** 9885021639
ముద్రణ : **హిమాలయ గ్రాఫిక్స్**
చిక్కడపల్లి, హైదరాబాద్
ఫోన్: 040- 66100227

**ప్రతులకు :**
**విశాలాంధ్ర బుక్ హౌస్,** అబిడ్స్, హైదరాబాద్. ఫోన్ : 2474 4580
**కిన్నెర పబ్లికేషన్స్,** 2-2-647/153, సెంట్రల్ ఎక్సైజ్ కాలనీ, ఫోన్ : 040-27425577
**నవోదయ బుక్ హౌస్,** ఆర్యసమాజ్ మందిర్ ఎదురుగా, కాచిగూడ, హైదరాబాద్. ఫోన్ : 2465 2387
**నవయుగ బుక్ హౌస్,** క్లాక్ టవర్ ఎదురుగా, సుల్తాన్ బజార్, హైదరాబాద్. ఫోన్ : 2475 4688
**తెలుగు బుక్ హౌస్,** ఆర్యసమాజ్ మందిర్ ఎదురుగా, కాచిగూడ, హైదరాబాద్. ఫోన్ : 92474 46497

**Dr. R. Prabhakar Rao**
D.LITT (HON)
Indian Police Service (Retd.)
Director General of Police Andhra Pradesh (Retd.)
Ex.Director, Central Board, State Bank of India



# కిన్నెరమాట

'కిన్నెర ఆర్ట్ థియేటర్స్' సాంస్కృతిక సంస్థకు అనుబంధంగా ప్రారంభించ బడినది 'కిన్నెరపబ్లికేషన్స్'. ఇప్పటివరకూ సాహిత్యంలోని వివిధ ప్రక్రియలకు చెందిన 79 గ్రంథాలను ప్రచురించింది. వాటిల్లో పలు గ్రంథాలు రెండు, మూడు, నాలుగు ముద్రణలకు నోచుకున్నాయి.

కీ॥శే॥ మద్దాళి సుబ్బారావుగారు శ్రీ రమణమహర్షిపై వ్రాసిన దాదాపు పది ఆధ్యాత్మిక రచనలను పాఠకులు యెంతగానో ఆదరించారు. శ్రీ ఎస్.వి.రామారావు కిన్నెర సంస్థలో శాశ్వత సభ్యులు, అంతేకాదు ఆ సంస్థ కార్యక్రమాల రూపకల్పనలోనూ, నిర్వహణలోనూ మిత్రుడు రఘురామ్‌కు తన సహకారాన్ని అందించి యెన్నో సినీసంగీత కార్యక్రమాలకు రసవత్తరమైన వ్యాఖ్యానాన్ని అందించారు.

తెలుగు సినిమా చరిత్రపై శ్రీ రామారావు వ్రాసిన నాలుగు గ్రంథాలను 'కిన్నెర' ప్రచురించటం, వాటిలో రెండింటికి రాష్ట్రప్రభుత్వ పురస్కారం లభించటం 'కిన్నెర'కు ఆనందదాయకం.

తెలుగు సినిమా చరిత్రకు చెందిన వివిధ అంశాలను గురించి యెందరో గ్రంథస్తం చేశారు. అయితే ఆ రంగంలో కీలకమయిన క్యారెక్టర్ ఆర్టిస్టులు గురించి గ్రంథంగా లేదు. ఆ బాధ్యతను శ్రీ రామారావు స్వీకరించి నాటి సి.ఎస్.ఆర్.ఆంజనేయులు, కన్నాంబ నుంచి నేటి కోట శ్రీనివాసరావు, తెలంగాణా శకుంతల వరకూ గల అరవైమంది కారెక్టర్ ఆర్టిస్టుల గురించి వివరంగానూ, మరో నలభైమంది గురించి రేఖామాత్రంగానూ పరిచయం చేసిన గ్రంథం 'క్యారెక్టర్ ఆర్టిస్టులు'. అది కిన్నెర 80వ ప్రచురణగా వెలువడటం ఒక విశేషమైతే దానిని అరవైయేళ్ళు పూర్తిచేసుకొంటున్న 'షష్ఠిపూర్తి కథానాయకుడు', కిన్నెర సారథి, శ్రీ మద్దాళి రఘురామ్‌కు స్నేహ పూర్వకంగా, ఆత్మీయంగా అంకితమివ్వటం 'కిన్నెర' చరిత్రంలో మరో మధురఘట్టం.

ఈ సందర్భంగా కృతికర్త శ్రీ ఎస్.వి.రామారావు స్వీకర్త శ్రీ మద్దాళి రఘురామ్‌ను యీ వేడుక నిర్వహిస్తున్న ఢిల్లీ తెలుగు ఎకాడెమీ సారథి శ్రీ నాగరాజును మనస్ఫూర్తిగా అభినందిస్తున్నాను.

**- ఆర్.ప్రభాకరరావు**

# ఆత్మీయంగా నాలుగు మాటలు....

నేను చిన్నప్పట్నుంచీ సినిమాపట్ల అభిమానం పెంచుకుని – ఆ రంగంలో లబ్ధప్రతిష్టులైన సర్వశ్రీ అక్కినేని నాగేశ్వరరావు, గుమ్మడి వెంకటేశ్వరరావు, కాంతారావు, మురళీమోహన్, కైకాల సత్యనారాయణ, అంజలీదేవి, జానకి, కృష్ణకుమారి వంటి నటీనటులతోను, కె.ఎస్.రామారావు, వాకాడ అప్పారావు, కె.రాఘవ వంటి నిర్మాతలతోనూ, కమలాకర కామేశ్వరరావు, దాసరి నారాయణరావు, కోడి రామకృష్ణ, పి.సాంబశివరావు, రేలంగి నరసింహారావు వంటి దర్శకులతోనూ, సత్యం, కె.వి.మహదేవన్ వంటి సంగీతదర్శకులతోనూ, సి.నారాయణరెడ్డి, ఆరుద్ర వంటి సాహితీమూర్తులతోనూ మరెందరో సాంకేతిక నిపుణులతోనూ వున్న సాన్నిహిత్యం, సినీ పరిజ్ఞానాభివృద్ధికి ఎంతగానో సహకరించాయి.

నేను ప్రేమించేది, శ్వాసించేది తెలుగు సినిమా. దాని చరిత్రను రికార్డుచేసి సినిమా అభిమానులకు భావితరాలకు అందించే దిశగా 'తెలుగుతెర, నాటి 101 చిత్రాలు, విజయగీతాలు, సినీగీతవైభవం, సి.నా.రె.సినీసూక్తులు, పాడనా తెలుగుపాట, అక్కినేనీ కథానాయికలు' వంటి గ్రంథాలు వ్రాసాను. ఇంకా సినీరంగ దిగ్గజాలయిన నిర్మాత డి.వి.ఎస్.రాజు, తమ్మారెడ్డి కృష్ణమూర్తి, నటుడు గుమ్మడి వెంకటేశ్వరరావు, నటి జమున, కళాదర్శకుడు కళాధర్, వీరి జీవిత చరిత్రలు గ్రంథరూపంలో రావటానికి సహకారం అందించాను.

అయితే చిత్ర విజయానికి తెరముందు హీరోహీరోయిన్‌లతో సహకరించిన కారెక్టర్ ఆర్టిస్టులు నాటి సి.యస్.ఆర్. ఆంజనేయులు నుంచి నేటి వరకూ ఎందరెందరో వున్నారు. వారి చరిత్ర సంక్షిప్తంగా రికార్డుకావాల్సిన అవసరం వుంది.


ఈ దృష్ట్యా 'క్యారెక్టర్ ఆర్టిస్టులు' అనే యీ గ్రంథ రచనకు శ్రీకారం చుట్టాను. నా ఆత్మీయమిత్రుడు కిన్నెర రఘురామ్ షష్టిపూర్తి సందర్భంగా అరవైమంది గురించి వీలయినంత వివరంగానూ, మరో నలభైమంది గురించి రేఖామాత్రంగాను యీ గ్రంథంలో ప్రస్తావించాను. ఈ గ్రంథాన్ని చదివిన పాఠకులకు ఫలానా ఆర్టిస్టు గురించి ఉదహరించలేదే అని సందేహం కలగవచ్చు. దానికి నేను ఇచ్చుకొనే సవినయమైన సంజాయిషీ ఒక్కటే!

హీరో హీరోయిన్‌లుగా వెలుగొందిన అక్కినేని, జగ్గయ్య, కాంతారావు, శోభన్‌బాబు, భానుమతి, అంజలీదేవి, జానకి, కృష్ణకుమారి, శారద, జయసుధ మొదలగువారు, హాస్యరసావిష్కరణలో అందెవేసిన మహామహులు మొన్నటి రేలంగి, రమణారెడ్డి, రామలింగయ్య, రావికొండలరావు, రాధాకుమారి, నిన్నటి సుత్తివేలు, వీరభద్రరావు, రాళ్ళపల్లి, మల్లికార్జునరావు, శ్రీలక్ష్మి, నేటి కొండవలస, రఘుబాబు వంటి ఎందరెందరో నటీనటులు క్యారెక్టర్ ఆర్టిస్టుల పాత్రలను పోషించారు గదా. వారిని గురించి ఉదహరించలేదే అని ప్రశ్న తలెత్తవచ్చు. దానికి నా సమాధానం తెలుగు సినీచరిత్రపై ఎవరు ఏ గ్రంథం వ్రాసినా అది ఎప్పటికీ సమగ్రం కాదు. ఏవో కొన్నికొన్ని అంశాలు, కొందరి వ్యక్తుల గురించి వివరాలు ఉండకపోవచ్చు. ఒక్కొక్కరి గురించి ఒక్కో పుస్తకమే రాయొచ్చు. అయితే చారిత్రిక నేపథ్యం, కొనుగోలుదారునిగా సామాన్య పాఠకుని శక్తి, ప్రాధాన్యతాక్రమం ఇటువంటి అంశాలను పరిగణిస్తే వందలాది విషయాలను, వ్యక్తులను గురించి ఒకే గ్రంథంలో సమగ్రంగా చర్చించడం అసాధ్యం. అందుకే నా దృష్టిలో నా సినీజ్ఞానం అనుమతించిన మేరకు సినీచరిత్రను, వ్యక్తులను గూర్చి విశ్లేషిస్తూ రచనలు చేస్తున్నాను.

ఈ బృహత్ ప్రయత్నంలో సహకరించిన నా శ్రీమతి మాణిక్యేశ్వరి, కుమార్తె అపర్ణ, అల్లుడు రాజేష్ (అమెరికా), సి.హెచ్.వి.ఎం. నాగేశ్వరరావు, పుస్తకరూపకల్పనలో సహకరించిన ఎమ్బీయస్.ప్రసాద్, నవీన్, డి.టి.పి. చేసిన శ్రీమతి లక్ష్మీశ్రీనివాస్, అందంగా ముద్రించిన హిమాలయ గ్రాఫిక్స్ సిబ్బందికి, నిర్వాహకులు సూరిగారికి నా కృతజ్ఞతలు.

సహృదయ పాఠకులు ఏమైనా సూచనలు తెలిపితే మలి ముద్రణలో పొందుపర్చటానికి ప్రయత్నిస్తాను. శలవ్. కృతజ్ఞతలతో...

**- ఎస్.వి.రామారావు**



# అంకితం

రాజధానీ నగరం హైద్రాబాద్‌లో నా సాంస్కృతీ వ్యాసంగానికి పునాది వేసిన వ్యక్తి 'కిన్నెర' సారథి శ్రీ మద్దాళి రఘురామ్. ఆ సంస్థ రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన కార్యక్రమాల్లో సైతం నాకు సముచిత స్థానం కల్పించారు.

'కిన్నెర' రూపకల్పన చేసే కార్యక్రమాల గురించి నాతో చర్చించటమేగాక తమ కుటుంబ సభ్యునిగా ఆత్మీయతను పంచియిచ్చారు. నా ప్రగతికి ఎంతగానో సహకరించిన ఆత్మీయమిత్రుడు.

తెలుగు సినిమా చరిత్రపై నేను వ్రాసిన 'తెలుగుతెర, నాటి 101 చిత్రాలు, పాడనా తెలుగుపాట, అక్కినేనీ కథానాయికలు' గ్రంథాలను కిన్నెర పబ్లికేషన్స్ ద్వారా ప్రచురించారు. వాటిలో మొదటి రెండిటికి రాష్ట్రప్రభుత్వం నందీ ఎవార్డు లభించింది.

ఉదాత్త స్నేహానికి ప్రతిరూపమైన శ్రీ రఘురామ్‌కు వారి షష్టిపూర్తి సందర్భంగా నా యీ రచన 'క్యారెక్టర్ ఆర్టిస్టులు' – మా మైత్రి బంధానికి తీపి గుర్తుగా అంకితమిస్తున్నాను.

**- ఎస్.వి.రామారావు**

# విషయసూచిక


| | |
|---|---|
| సురభి కమలాబాయి | 11 |
| సి.యస్.ఆర్. ఆంజనేయులు | 13 |
| కన్నాంబ | 15 |
| నాగయ్య | 17 |
| శాంతకుమారి | 20 |
| దొరస్వామి | 21 |
| యస్.వరలక్ష్మి | 22 |
| లింగమూర్తి | 24 |
| లక్ష్మీరాజ్యం | 25 |
| ముక్కామల | 27 |
| జి.వరలక్ష్మి | 29 |
| గోవిందరాజుల సుబ్బారావు | 31 |
| ఋష్యేంద్రమణి | 32 |
| గౌరీనాథశాస్త్రి | 34 |
| టి.జి.కమలాదేవి | 35 |
| ఎస్.వి.రంగారావు | 36 |
| సూర్యకాంతం | 39 |
| గుమ్మడి వెంకటేశ్వరరావు | 41 |
| పి.హేమలత | 44 |
| ఆర్.నాగేశ్వరరావు | 46 |
| నాగభూషణం | 48 |
| నిర్మలమ్మ | 50 |
| రాజనాల | 52 |
| పెరుమాళ్ళు | 54 |
| కె.వి.ఎస్.శర్మ | 56 |
| ఛాయాదేవి | 58 |
| రామన్నపంతులు | 60 |
| మిక్కిలినేని | 62 |
| యం. బాలయ్య | 64 |
| రమణమూర్తి | 66 |

| | |
|---|---|
| కైకాల సత్యనారాయణ | 68 |
| డా॥ యం.ప్రభాకరరెడ్డి | 70 |
| గీతాంజలి | 72 |
| ధూళిపాళ | 74 |
| పి.జె.శర్మ | 77 |
| త్యాగరాజు | 79 |
| పి.ఎల్.నారాయణ | 81 |
| రావుగోపాలరావు | 82 |
| చలపతిరావు | 85 |
| చంద్రమోహన్ | 86 |
| అన్నపూర్ణ | 88 |
| మురళీమోహన్ | 90 |
| గిరిబాబు | 92 |
| నూతన్‌ప్రసాద్ | 93 |
| రంగనాథ్ | 95 |
| గొల్లపూడి మారుతీరావు | 97 |
| జె.వి.సోమయాజులు | 99 |
| నర్రా వెంకటేశ్వరరావు | 101 |
| శరత్‌బాబు | 102 |
| ఆహుతి ప్రసాద్ | 103 |
| ధర్మవరపు సుబ్రహ్మణ్యం | 104 |
| కోట శ్రీనివాసరావు | 105 |
| యు.సుబ్బరాయశర్మ | 107 |
| తెలంగాణ శకుంతల | 108 |
| ప్రకాష్‌రాజ్ | 109 |
| తనికెళ్ళభరణి | 111 |
| జయప్రకాష్‌రెడ్డి | 113 |
| దాసరి నారాయణరావు | 115 |
| కె.విశ్వనాథ్ | 118 |
| ఎస్.పి.బాలసుబ్రమణ్యం | 120 |
| క్యారెక్టరు ఆర్టిస్టులుగా రాణించిన మరికొందరు | 122 |



# సురభి కమలాబాయి

1908 ఏప్రిల్ 4వ తేదీన సురభి నాటకసంస్థవారు హైదరాబాదులో నాటక ప్రదర్శనలు యిస్తుండగా, అందులో ప్రముఖపాత్ర ధరించే నటికి పురిటినొప్పులు రావటం జరిగింది. అందుకై తెరదించేయగా, ఆ స్టేజీపైనే ఆ నటి ఓ ఆడబిడ్డను ప్రసవించింది. ఆ పాపకు ప్రేక్షకులు ఆనందంతో డబ్బులు అందించటం, ఆ బిడ్డ తెలుగు నాటక సినీరంగ చరిత్రలో ప్రముఖస్థానం పొందిన కమలాబాయి కావటం విశేషం. తండ్రి కృష్ణారావు నాటక కంపెనీ నిర్వహించటంచేత నటన ఆమెకు వెన్నతో పెట్టినవిద్య అయింది. చిన్నతనంలోనే రంగస్థలంపై బాలకృష్ణుడు, ప్రహ్లాదుడు మొదలగు పాత్రలు పోషించి శభాష్ అనిపించుకుంది.

సహజనటిగా పేరుపొందిన సురభి కమలాబాయి తొలి తెలుగు టాకీచిత్రం "భక్తప్రహ్లాద"లో హీరోయిన్ లీలావతి పాత్రకు ప్రాణం పోసింది. రెండవ టాకీ చిత్రం "పాదుకాపట్టాభిషేకం"లో సీతగాను, మూడవ టాకీచిత్రం "శకుంతల"లో కథానాయిక వేషం ధరించే అవకాశం కమలాబాయినే వరించింది. ఆ రెండు చిత్రాలకు బాదామి దర్శకుడుకాగా, కథానాయకుని పాత్రను ప్రముఖ రంగస్థల నటుడు యడవల్లి సూర్యనారాయణ పోషించారు.

అప్పటి మూకీ చిత్రాల ప్రదర్శనలో రీలుకు, రీలుకు మధ్యగల వ్యవధిలో కొన్ని బృందాలు కమ్మగాపాడుతూ చక్కని నృత్యాలతో ప్రేక్షకుల్ని ఆకర్షించేవారు. నాట్యకళలో, గానంలో ఆరితేరిన కమలాబాయికి ఆ బృందాలలో ప్రత్యేకస్థానం వుండేది.


నాటక సినీరంగ నటిగా బహుశా కమలాబాయి పొందినన్ని రజిత, స్వర్ణపతకాలు మరెవ్వరూ పొందలేదన్నది అతిశయోక్తికాదు. ఆమె మధుర గాయని మాత్రమేకాదు

హార్మోనియం, సారంగి, వయోలిన్ వాయిద్యాలను, నైపుణ్యంతో అద్భుతంగా పలికించేది. టాకీల నిర్మాణపు తొలి దశలో ఒక్కోసారి షూటింగ్ సమయంలో ఏం తియ్యాలో, ఎలా తియ్యాలో అని దర్శకుడు తికమక పడ్డప్పుడు ఆమె సూచనలతో షూటింగ్ పూర్తిచేసిన సందర్భాలు కూడా ఉన్నాయి.

"హోరి భగవంతుడా ఓ కొడుకుని ఇమ్మంటే ఇటువంటి రాక్షసుణ్ణి ఇచ్చావేమిటి" అంటూ 'పాతాళభైరవి' కథానాయకుడు తోటరాముణ్ణి విసుక్కున్న తల్లిగా నటించి, అదే సంవత్సరం విడుదలైన క్లాసిక్ 'మల్లీశ్వరి' చిత్రంలో బసక్క పాత్రను పోషించింది. "పారూ... అయినవాళ్ళు ఇంటికి వస్తే అలాగేనా మర్యాద చేసేది" అంటూ దేవదాసులో పార్వతి బామ్మగా కొడుకు నీలకంఠంను నియంత్రించటానికి ప్రయత్నించారు. ఈ తరహా, వయసు మళ్ళిన పాత్రల్ని అత్యంత సహజంగా నటించటంలో అందెవేసిన నటి సురభికమలాబాయి.

1953లో వచ్చిన 'అమ్మలక్కలు' చిత్రంలో టైటిల్ రోల్ పోషించారు. టాకీల తొలిదశకం చిత్రాలు (1931–40) కలకత్తాలో షూటింగ్ జరిగినప్పుడు కమలాబాయి నటనకు, గానానికి ముగ్ధుడైన అలనాటి ప్రముఖనటుడు, గాయకుడు (దేవదాసు ఫేమ్) కె.ఎల్.సైగల్ ఆమెను ఎంతగానో ప్రశంసించారు. అప్పుడే కమలాబాయి కొన్ని హిందీ చిత్రాలలో కూడా నటించారు.

పృథ్వీపుత్ర, ద్రౌపది మానసంరక్షణ, తుకారాం, భక్తజయదేవ, పత్ని, కీలుగుర్రం, మంగళ, ప్రియ, రోహిణి, శభాష్‌రాముడు, మాంగల్యబలం మొదలగు చిత్రాలలో నటించిన కమలాబాయిని ఆంధ్రనాటక కళాపరిషత్తువారు ఏలూరులో ఘనంగా సత్కరించారు. అక్కడే ఆమె తన 63వ యేట 18.02.1971న కాలధర్మం చెందారు.



# సి.యస్.ఆర్. ఆంజనేయులు

గుంటూరుజిల్లా నరసరావుపేటలో 11.07.1907న జన్మించిన చిలకలపూడి సీతారామాంజనేయులు, ఎస్సెల్సీ వరకూ, చదివి సహకారశాఖలో ఉద్యోగి అయ్యారు. కాని ఆ ఉద్యోగాన్ని వదులుకుని తను మనసుపడ్డ నాటకరంగాన్నే జీవనోపాధిగా ఎన్నుకున్నారు.

తెలుగు టాకీలు పుట్టకముందే రంగస్థలంపై శ్రీకృష్ణుడు, భవానీశంకరుడు, రామదాసు, తుకారాం, సారంగధర, శ్రీరాముడు, సత్యవంతుడు, విజయరామరాజు పాత్రల్ని సమర్ధవంతంగా పోషించి యావదాంధ్రప్రేక్షకుల్ని తన వైవిధ్య నటనతోనూ, గానంతోనూ, ఉర్రూతలూగించారు.

1933లో ఈస్టిండియా ఫిల్మ్‌కంపెనీవారు నిర్మించిన 'రామదాసు'లో కథానాయకునిగా చిన్నవయసులో భక్తిరసాన్ని అద్భుతంగా రక్తికట్టించారు. తరువాత 1936లో గ్లామర్, గానం, నటన కలబోసిన భారత కథానాయకుడు శ్రీకృష్ణునిగా "ద్రౌపదివస్త్రాపహరణం" హీరోగా శభాష్ అనిపించుకున్నారు.

1939లో పి.పుల్లయ్య రూపొందించిన 'వెంకటేశ్వర మహాత్మ్యం'లో కథానాయకుడు శ్రీనివాసుని పాత్రకు ప్రాణం పోసారు.

తొలినాటి సినిమాల్లో 'చూడామణి' చిత్రంలో పోషించిన హీరో మధుసూధన్ పాత్రలోనే నవరసాలు ప్రదర్శించారు. అయితే యల్.వి.ప్రసాద్ దర్శకత్వంలో 1946లో వచ్చిన సారధి వారి 'గృహప్రవేశం'లో 'హాల్లో మైడియర్ తులశమ్మక్కా' అంటూ అక్కను బుట్టలో వేసుకొని కథానాయికను దక్కించుకోవటంకోసం ఇంగ్లీషు పాటలుపాడి అష్టకష్టాలు పడ్డ ఆషాఢభూతి టైపులో తీర్చిదిద్దిన కామెడి విలన్ రమణారావు పాత్ర సి.యస్.ఆర్ లోని విలక్షణ నటనావిశ్వరూపానికి అవకాశం ఇచ్చింది.

తరువాతికాలం నుంచి హాస్యాన్ని రంగరించిన విలన్ పాత్రలు (వీటికి ఫైటింగ్ చేయ్యాల్సిన అవసరం వుండదు. ఎంతసేపూ ఎత్తులు వేసి హీరోని దెబ్బతీయటం వీటి లక్ష్యం) ఆయన్ని వరించాయి.

ఈ కోవలోనే 'భలేరాముడు', 'కన్యాశుల్కం'లో రామప్పపంతులు, 'ఇల్లరికం', రాజనాలతో కలిసి "తాళంచేతులు ఇచ్చి చచ్చాన్రో పిచ్చికన్నా" అని విలనీలో హాస్యాన్ని పండించిన 'జగదేకవీరునికథ' చెప్పుకోదగ్గవి. ఈ తరహా పాత్రపోషణకు పరాకాష్ఠ మాయాబజార్'లో శకుని పాత్ర 'ముక్కోపానికి విరుగుడు ముఖస్తుతి వుండనే వుందిగా" అని కథను మంచి రసపట్టులో నడిపించి 'శకుని వుంటేచాలు, శనిఏలనని కదా' అనే పద్యాన్ని భావస్ఫోరకంగా వినిపించారు.

మరోకోణంలోంచి పరిశీలిస్తే "ఆ కాలంలో నేను కాలేజీలో చదువుకునే రోజుల్లో " అంటూ డైలాగుల్ని సాగదీస్తూ 'జీవితం' లోనూ, నూరు పెళ్ళిళ్ళు చేయించిన మామిడాకుల సీతారామయ్యగా 'కన్యాదానం'లో మతిమరుపు మహారాజుగా 'జయం మనదే'లో హుందాతనం, గంభీరత నింపుకున్న ఉజ్జయిని మహారాజుగా 'పాతాళభైరవి'లోనూ, ఏకాదండయ్యగా 'స్త్రీ సాహసం'లోనూ విలక్షణ పాత్రల్ని సులక్షణంగా పోషించిన విశిష్టనటుడు సి.యస్.ఆర్

నాణానికి మరోవైపు చూస్తే విలక్షణ హాస్యాన్ని అందించిన 'చక్రపాణి', యస్.వి.రంగారావు కాంబినేషన్‌లో వేయి నవ్వులు పండించిన 'అప్పుచేసి పప్పుకూడు', 'మామకు తగ్గ అల్లుడు' చెప్పుకోవచ్చు. పద్యాలను అందంగా, అర్థవంతంగా విరిచి, విరామం పాటిస్తూ పలకటంలో ఆయన శైలి అనితరసాధ్యం. సిల్వర్‌జూబ్లీ చిత్రం 'రోజులు మారాయి'లో మునసుబు సాగరయ్య పాత్రకు ఒక చేతిలో చుట్ట, మరో చేతిలో పొన్నుకర్రతోను అభినయాన్ని జోడించి నటించి, మెప్పించిన తీరు న భూతో న భవిష్యతి.

అంతటి మహామహుడు కూడా సినిమారంగంలో విధి వంచితుడుగాక తప్పలేదు. 'శివగంగ', 'అగ్నిమంత్రం', 'రిక్షావాలా' అనే మూడు చిత్రాలను స్వీయ దర్శకత్వంలో ప్రారంభించి అర్ధాంతరంగా ఆపేయటం అందుకు ఉదాహరణ.

ది. 8.10.1963న కాలధర్మం చెందే నాటికి దాదాపు వంద చిత్రాల్లో నటించిన సి.యస్.ఆర్. ఆంజనేయులు హీరోగా, విలన్‌గా, కమెడియన్‌గా, గుణచిత్ర నటుడిగా నేటికి ఏనాటికి చిరస్మరణీయుడు.



# కన్నాంబ
## (1912-1964)

ఒక కంట కరుణరసపోషణతో ప్రేక్షకుల కంట కన్నీరు చిందించటం, మరో కంట రౌద్రరస పోషణలో చంద్ర నిప్పులు కురిపించి ఔరా అనిపించటం యావత్ భారత్‌దేశ చలనచిత్ర చరిత్రలో ఒక్క కన్నాంబకే చెల్లింది.

1912లో జన్మించిన పసుపులేటి కన్నాంబ చిన్నవయసులోనే నావల్ నాటక సమాజంలో చేరి సతీసావిత్రి, అనసూయ, చంద్రమతి పాత్రలు ధరించి శభాష్ అనిపించుకున్నారు. ఆమె పాడిన 'కృష్ణం భజే రాధా' గ్రామఫోన్ రికార్డ్ ఆంధ్ర దేశాన్ని ఉర్రూత లూగించింది.

పి.పుల్లయ్య దర్శకత్వం వహించిన 'హరిశ్చంద్ర' చిత్రం ద్వారా చంద్రమతి పాత్రలో 1935లో సినీ రంగ ప్రవేశం చేశారు. నాటినుంచి 1964లో వచ్చిన చివరిచిత్రం 'వివాహ బంధం' దాకా సుమారు 150 తెలుగు, తమిళ చిత్రాల్లో నటించారు కన్నాంబ.

"ద్రౌపది వస్త్రాపహరణం', కనకతార, సారంగధర, గృహలక్ష్మి, చండిక చిత్రాల్లో నాయిక పాత్రలు ధరించి, 1942లో తమిళంలో నిర్మించిన 'కణ్ణగి'లో టైటిల్‌రోల్ పోషించి కీర్తిశిఖరాల నధిరోహించారు.

1941లో దర్శకుడు కడారు నాగభూషణంను వివాహం చేసుకున్నాక రాజరాజేశ్వరి ఫిలిం కంపెని స్థాపించి, తెలుగు, తమిళ భాషల్లో సుమారు 30 చిత్రాలు నిర్మించారు.

వాటిల్లో చెప్పుకోదగ్గవి 'తల్లిప్రేమ, సౌదామిని, లక్ష్మి, శ్రీకృష్ణతులాభారం, ఆప్తమిత్రులు, దక్షయజ్ఞం'.


'సక్కుబాయి'లో అత్తగా పెత్తనం చేసిన కన్నాంబ, ప్రేమను పంచి యిచ్చిన మాతృమూర్తిగా "అభిమానం'లో కంటతడి పెట్టించారు. మహారాజు నిర్లక్ష్యానికి బలియైన మహారాణిగా సంయమనాన్ని పాటించి, ఆవేశపూరితుడైన కొడుకును అదుపులో వుంచి


సమయం చూసి అన్యాయాన్ని అంతమొందించమని అనుజ్ఞ ఇచ్చిన రాజమాతగా 'మనోహర' చిత్రంలో శాంత, వీర, రౌద్ర రసాలను ఆంగిక వాచి కాభినయంలో ఆమె ప్రదర్శించిన తీరు తెలుగు, తమిళ ప్రేక్షకులు మరచిపోలేరు. అనార్కలి, జగదేకవీరునికథ, రాజమకుటం' చిత్రాలలో పాత్రలు వైవిధ్యమైనవి.

కన్నాంబ వ్యాంపిష్ టచ్‌వున్న పాత్రలను పోషించిన మహోన్నత చిత్రాలు 'ముగ్గురు మరాటీలు, పల్నాటియుద్ధం'. కథానాయకులు ముగ్గురుని చంపి రాజ్యాన్ని కైవసం చేసుకోవడం కోసం భర్త గోవిందరాజు సుబ్బారావు తను ఆడించినట్టు ఆడేలా చేసి 'నేనే రాణి' అంటూ ఠీవిగా గానంచేసిన రుక్కుబాయిపాత్రను చిరస్మరణీయం చేశారు. అదే గోవిందరాజుల సుబ్బారావు బ్రహ్మనాయుడిని పాత్రను పోషించగా, పల్నాటియుద్ధానికి బీజంవేసి బ్రహ్మనాయుడిని సవాలు చేసిన నాయకురాలు నాగమ్మ పాత్రను ఎంతో హుందాగా, గంభీరంగా సుబ్బారావుతో పోటీపడి నటించారు.

యస్.వి.రంగారావుకు అర్థాంగిగా 'తోడికోడళ్ళు'లోనూ, మాంగల్యబలంలో తల్లిగానూ నటించి మెప్పించటం ఆమెకే చెల్లింది. విశిష్టనటనతో, విస్పష్టభావ ప్రకటనతో, విలక్షణ సంభాషణ పటిమతో తెలుగు, తమిళ ప్రేక్షకుల నీరాజనాలందుకున్న మహానటి కన్నాంబ. అంతేకాదు సినిమా పిచ్చితో మద్రాసు సెంట్రల్ స్టేషన్‌లో దిగి ఏ దిక్కూతోచని అభాగ్యుల్ని ఎందరినో ఆదుకున్న మానవతావాది కన్నాంబ. ఈ కోణంలో తనకు అన్నంపెట్టి, ఆదరించి, వేషాలిచ్చి ప్రోత్సహించిన మహాతల్లి కన్నాంబ అని నటుడు పద్మనాభం తన 'ఆత్మకథ'లో రాసుకున్నాడు.

తెలుగుతోబాటు తమిళచిత్రాలలో కూడా నటించి అక్కడ ప్రేక్షకులను మెప్పించిన కన్నాంబ ఉభయభాషా ప్రవీణగానూ, ఉభయరంగ ప్రవీణగానూ చిరస్మరణీయురాలు.





# నాగయ్య

సంగీత ప్రపంచంలో త్యాగయ్యకు వున్న స్థానం అందరికీ తెలిసిందే. ప్రతి యేటా త్యాగరాజు ఆరాధనోత్సవాలు అటు తమిళనాడులోనూ, ఇటు ఆంధ్రప్రదేశ్‌లోనూ సంగీత ప్రియులందరూ ఘనంగా నిర్వహించి పరవశిస్తారు. అయితే చాలామందికి ఆయన రూపురేఖలు తెలియవు. చిత్రపటాల ద్వారానే లభ్యమయ్యే సమాచారం మాత్రమే. దానికి అతీతంగా బహుశా త్యాగయ్య ఇలా వుండేవారేమో అన్నంత భ్రమకల్గించే రీతిలో ఆ పాత్రను పోషించి రసజ్ఞుల ప్రశంసలందుకున్న విశిష్టనటుడు, గాయకుడు, సంగీతజ్ఞుడు, నిర్మాత, దర్శకుడు అయిన చిత్తూరు వి.నాగయ్యగా వినుతికెక్కిన వుప్పలదడియం నాగయ్య.

28.03.1903న రేపల్లెలో జన్మించిన నాగయ్య సామాన్య విద్యతో చదువుకు స్వస్తి చెప్పి కొన్నాళ్ళు చిత్తూరులో చిరుద్యోగం చేశారు. అందుకని ఆయన్ని చిత్తూరు నాగయ్యగా సంభోధించేవారు. ఆయన అసలు పేరు నాగేశ్వరరావు. సర్పగండాన్ని అధిగమించడం వల్ల ఆయన్ని పెంచినవారు ఆ పేరు పెట్టారు. అయితే మద్రాసుకు మకాం మార్చాక దేశోద్ధారక, కాశీనాధుని నాగేశ్వరరావుగారు, వీరూ ఒకే వీధిలో వుండడం మూలంగా వారి ఉత్తరాలు వీరికి, వీరి ఉత్తరాలు వారికీ అందేవి. దాంతో ఈయన పేరు నాగయ్యగా కుదించుకున్నారు.

మద్రాసు సుగుణ విలాససభ, చెన్నపురి ఆంధ్రమహాసభ నిర్వహణలో నాటకాలు ప్రదర్శించి సారంగధర నాటకంలో చిత్రాంగి వేషానికి బంగారు పతకం అందుకున్నారు.

1938లో హెచ్.ఎం.రెడ్డి స్వీయదర్శకత్వంలో నిర్మించిన గృహలక్ష్మి చిత్రంలో ప్రధానపాత్రలో సినీరంగానికి పరిచయమయ్యారు. ఆయన పాడిన 'కల్లుమానండోయి బాబూ, కళ్ళు తెరవండోయ్' పాట ప్రేక్షకుల్ని విశేషంగా ఆకర్షించింది.

ఆ తరువాత బి.ఎన్.రెడ్డి (స్వర్గసీమ), కె.వి.రెడ్డి (భక్తపోతన) దర్శకత్వంలో

రూపొందిన వాహినీ చిత్రాలలో కథానాయకునిగా నటించారు. జీవితకాలంలో 200ల దాకా, తమిళ, తెలుగు, కన్నడ చిత్రాలలో విభిన్న పాత్రలు పోషించారు.

నాగయ్య నటజీవితంలో అనంత యశస్సును ఆర్జించిన పాత్రలు భక్తపోతన, త్యాగయ్య, యోగివేమన, రామదాసు, బీదలపాట్లు, చక్రధారి (తమిళం).

భక్తపోతన చిత్రాన్ని చూసిన పశువుల కాపరి ముమ్మిడివరంలో బాలయోగిగా మారాడు. త్యాగయ్య పాత్ర దేశ, విదేశాల్లో ప్రశంసలనందుకుంది. ఇది నాగయ్య స్వీయదర్శకత్వంలో నిర్మించడమే కాకుండా సంగీతాన్ని కూడా అందించిన చిత్రం. ఆ చిత్ర నిర్మాణం కొనసాగినన్నాళ్ళు రేణుకా ఆఫీస్ సంగీత, సరస్వతి నిలయంలా ఉండేది. అంతేకాకుండా అందరికి అది ఒక ధర్మసత్రం. చిన్న చితకా వేషాలు వేసే వాళ్ళంతా అక్కడ వుంటూ ఉచిత భోజన వసతులు అనుభవించేవారు.

త్యాగయ్య పాత్ర పోషణకు మెచ్చి తిరువాన్కూరు రాజావారు, మైసూర్ మహారాజావారు నాగయ్యను, ఘనంగా సత్కరించారు.

వైవాహిక జీవితం నాగయ్యగారికి కలిసిరాలేదు. ఆయనది చాలా సున్నిత మనస్తత్వం. ఒకసారి కారు డ్రైవ్ చేస్తుండగా ఒక కుక్క ఆయన కారు క్రిందపడి మరణించింది. దాంతో ఆయన డ్రైవింగ్‌కు స్వస్తి చెప్పారు.

స్వంతంగా 'భాగ్యలక్ష్మి' చిత్రాన్ని పి.పుల్లయ్య దర్శకత్వంలో నిర్మించారు. తరువాత స్వీయదర్శకత్వంలో త్యాగయ్య, నా ఇల్లు, రామదాసు చిత్రాలు నిర్మించారు. అయితే రామదాసు నిర్మాణ దశలో నిజంగా ఆ రామదాసు ఎన్ని కష్టాలు పడ్డారో వాటినన్నింటినీ నాగయ్య అనుభవించారు. కల్లాకపటం అంటే ఏమిటో తెలియని మనిషి నాగయ్య. ఎందరివల్లో మోసపోయారు. మరెందరికో అపాత్రదానాలు చేశారు.

యావత్భారత దేశంలో కథానాయకుడిగా జెమినీవారి చక్రధారి చిత్రానికి అత్యధిక పారితోషికం (అప్పట్లో 50 వేలు) తీసుకున్న నాగయ్య జీవిత చరమదశలో అంటే 1970-73 ప్రాంతాల్లో కొన్నివందలకే వేషాలు వెయ్యాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇంతకంటే విచిత్రం ఏముంటుంది?

ఆయన సంగీతం హాయిగొలుపుతూ, మరోలోకాల్లో మనల్ని విహరింపజేస్తుంది. ఇందుకు ఆయన సంగీతం అందించిన వాహిని చిత్రాలు వందేమాతరం, భక్తపోతన, స్వర్గసీమ, యోగి వేమన, ఉదాహరణలుగా పేర్కొనవచ్చును. ఆయన పాడిన 'సర్వమంగళ నామా సీతారామా, ఆ కంటిలో జ్యోతి, జయజయ గోకులబాల' వంటి పాటలు నేటికీ చిరంజీవులే. ఘంటసాలతో కలిసి ఆలపించిన 'చిల్లరరాళ్ళకు మొక్కుతువుంటే' (పూలరంగడు), 'కొండఎలుక లిచటరెండు' (తెనాలిరామకృష్ణ) చెప్పుకోదగ్గవి. నాయిల్లు

చిత్రంలో సారంగరాగంలో ఆయన స్వరపరచిన అద్భుతగీతం, 'అదిగదిగో గగనాసీమ' మరువలేనిది.

మద్రాస్‌లో త్యాగరాయనగర్‌లో ఒక కళావేదిక ఉండాల్సిన అవసరం గుర్తించి వాణీమహల్ నిర్మాణానికి అంకురార్పణ చేశారు. మద్రాస్‌లో పాన్‌గల్‌పార్కులో ఆ మహానటుని శిలావిగ్రహాన్ని ఎప్పుడో ఆవిష్కరించారు.

భారత ప్రభుత్వం చేత 1965లో పద్మశ్రీ అవార్డు అందుకున్నారు. వయసు మళ్ళిన తరువాత ఆయన గుణచిత్ర నటునిగా కొనసాగారు. ఆ పరంపరలో ఎన్నదగిన చిత్రాలు– 'శాంతినివాసం, అనార్కలి, తెనాలి రామకృష్ణ, ముద్దుబిడ్డ, పూలరంగడు, రాము, మూగనోము, లవకుశ, పుట్టినిల్లు – మెట్టినిల్లు, పాండురంగమహాత్మ్యం'.

నట, గాయకుడైన నాగయ్యకు 'బొబ్బిలియుద్ధం'లో యస్.రాజేశ్వరరావు, 'శాంతినివాసం'లో పి.బి.శ్రీనివాస్, 'లవకుశ'లో ఘంటసాల, నేపథ్యగానం చేయటం ఓ విశేషం.

సినీపరిశ్రమలోని ప్రముఖులు ఆయన్ని 'నాన్నగారు' అంటూ సంబోధించేవారు. ఏమైనా అపాత్రదానం చేసి జీవితంలో చాలా నష్టపోయాను అని చివరి దశలో ఆయన గుర్తించారు. కాని ఫలితం శూన్యం. అందుకే నాగయ్య నటజీవితం ఎందరికో ఆదర్శం, వ్యక్తిగత జీవితం మరెందరికో గుణపాఠం.

తెలుగు ప్రేక్షకలోకంతోపాటు తమిళ ప్రేక్షకలోకం ఆయన్ని ఎంతో గౌరవించింది.

ఇటీవల హైదరాబాద్ ఫిల్మ్‌నగర్‌లో నాగయ్యగారి విగ్రహాన్ని నాటి ముఖ్యమంత్రి డా.రాజశేఖర్‌రెడ్డి ఆవిష్కరించడం ఓ చారిత్రాత్మక అంశం.

# శాంతకుమారి




వయసులో తన కంటే నాలుగు సంవత్సరాలు చిన్నవాడైన అక్కినేని నాగేశ్వరరావుతో మాయాలోకం చిత్రంలో కథానాయికగాను, తనకంటే పదెనిమిదేళ్ళు చిన్నవాడైన గుమ్మడి వెంకటేశ్వరరావుతో అరడజను చిత్రాల్లో గుణచిత్ర నటిగాను మెప్పించిన తొలితరం కథానాయిక, గాయని శాంతకుమారి.

1939లో ఆమె భర్త పి.పుల్లయ్యగారి దర్శకత్వంలో 'వెంకటేశ్వరమహాత్యం' చిత్రంలో కథానాయక పద్మావతి పాత్రను పోషించి, అదే పుల్లయ్యగారు 1960లో విడుదల చేసిన "శ్రీవెంకటేశ్వరమహాత్యం"లో వకుళమాతగా నటించి 'ఎన్నాళ్ళకి నా కన్నులు కాయగా ఎదురు చూతురా గోపాలా' అంటూ భక్తిరసం ఉట్టిపడేలా గానం చేశారు. ఈమె గాన వైభవానికి ముచ్చటపడ్డ యన్.టి.ఆర్.స్వీయ దర్శకత్వంలో నిర్మించిన 'తల్లా పెళ్ళామా' చిత్రంలో కీలకమయిన తల్లిపాత్రను ఇవ్వటమేకాక, ఆమెనోట "మమత లెరిగిన నా తండ్రు" అంటూ ఆర్ధ్రత ఉట్టిపడేలా పాడించారు.

శాంతకుమారి అసలుపేరు వెల్లాల సుబ్బమ్మ. 1936లో పి.వి.దాస్ నిర్మించిన 'మాయాబజార్' చిత్రంలో శశిరేఖగా చిత్రసీమలో ప్రవేశించారు. 'సారంగధర'లో చిత్రాంగిగా నటించారు. ఆమెకు పి.పుల్లయ్యతో వివాహయ్యాక ఆమె పేరును శాంతకుమారిగా మార్చారు. పేరుకు తగ్గట్టు ఎన్నో చిత్రాలలో ఎన్.టి.ఆర్, ఎ.ఎన్.ఆర్ లకు తల్లిగా, వదినెగా శాంత, కరుణ రసపూరిత మయిన నట ప్రదర్శించారు. అర్ధాంగి చిత్రంలో అహంకారియైన జమిందారిణిగా, 'జయభేరి'లో ఎ.ఎన్.ఆర్.కు వదినగా, అమోఘంగా నటించారు.

శాంతకుమారి సహజగాయని. ఆమె పాత్రలకు పాటలను ఆమె స్వయంగా పాడుకొనేవారు. గుణసుందరికథలో ఆమె ఆలపించిన గీతాలు (కళకళ ఆ కోకిలేమో, చల్లనిదొరవేలే చందమామ) శ్రావ్యంగా వుంటాయి.

కొద్దిగా గయ్యాళితనం స్వార్ధం కూడిన అక్కగా గుణసుందరికథలో ఇంకా భాగ్యలక్ష్మి, కృష్ణప్రేమ, వరవిక్రయం చిత్రాలలో నటించిన శాంతకుమారి నిండుగోదారి లాంటి మానిని.



# దొరస్వామి

తెలుగు సినీ పరిశ్రమలో రచయితల్లో పింగళి నాగేంద్రరావు, ఆర్టిస్టుల్లో పాల్‌దొరస్వామి; వీరిద్దరూ జీవితాంతం బ్రహ్మచారులుగా వుండి తెలుగు తెరకు విశిష్టమైన సేవలందించారు.

బి.ఎన్.రెడ్డి రూపొందించిన 'వందేమాతరం, సుమంగళి' చిత్రాలలో కథానాయకుని తండ్రిగా, టాకీల తొలిదశకంలోనే (1938-39) సినీరంగ ప్రవేశం చేశారు దొరస్వామి. 1947లో 'యోగివేమన'లో అప్పన్నగా నటించిన దొరస్వామి సమర్ధతకు తగిన పాత్ర వాహినీవారి 'మల్లీశ్వరి' చిత్రంలో లభించింది. అది కథానాయిక మల్లీశ్వరి తండ్రి నారప్ప భూమిక. భార్యమాటకు ఎదురు చెప్పలేక కూతురి మనసు తెలుసుకొని కుమిలిపోయే తండ్రిగా వుదాత్తంగా నటించారు. అందుకు భిన్నమైన పాత్రను విజయవారి 'పెళ్ళిచేసి చూడు' చిత్రంలో పోషించారు. అది దుష్టుడైన ప్రయివేటు గోవిందయ్య. కుటుంబాల మధ్య తగువులు పెట్టి పెళ్ళిళ్ళు చెడగొట్టడానికి ప్రయత్నించటం. ఈయన భార్యగా సూర్యకాంతం నటించారు. హీరో పెళ్ళి చెడగొట్టటానికి ప్రయత్నించి విఫలుడై చివరకు ధూపాటి వియ్యన్న చేతిలో పరాభవం పొందుతాడు.

ఇక వినోదావారి 'దేవదాసు'లో నాయిక పార్వతి తండ్రి నీలకంఠంగా నత్తినత్తిగా మాట్లాడుతూ జమిందారుగా నటించిన ఎస్.వి.రంగారావుతో పెళ్ళి సంబంధం మాట్లాడటానికి వెళ్ళినపుడు ఆయనతో దీటుగా నటించారు.

'మిస్సమ్మ' చిత్రంలో నాయిక మేరీ పెంపుడు తండ్రిగా చాలా గంభీరంగా అమాయకంగా నటించి రక్తి కట్టించారు. చంద్రహారం చిత్రంలో కూడా కథానాయిక శ్రీరంజని తండ్రిగా అత్యంత సహజంగా పాత్రకు న్యాయం చేశారు.

వేషాల కోసం అర్రులుజాచక వచ్చిన వేషాలకు పరిపూర్ణ న్యాయం చేసిన సహజన నటుడు దొరస్వామి.



# యస్.వరలక్ష్మి

'ఎవరినే నేనెవరినే...' (బాలరాజు), 'వరాలబేరమయా...' (శ్రీవెంకటేశ్వర మహాత్మ్యం), 'లీలాకృష్ణా నీలీలలు....' (మహామంత్రి తిమ్మరుసు), 'వేయి శుభములు కలుగు నీకు...' (శ్రీకృష్ణార్జున యుద్ధం) ఈ పాటలు వింటుంటే కళ్ళముందు కదలాడే రూపం, సుస్వరాల గాయని యస్.వరలక్ష్మిది. కథానాయికగా, గాయనిగా, గుణచిత్ర నటిగా, పాత్ర ఏదైనా తన నటనతో ఓ వైవిధ్యాన్ని చూపటం, ఆమెకే చెల్లింది. తొలిరోజుల్లో ఆమె పాటల కోసమే జనం, సినిమాలు చూసే వారంటే ఏ మాత్రం అతిశయోక్తి లేదు.

కాకినాడ దగ్గర జగ్గంపేటలో 1927సం॥లో శ్రావణ శుక్రవారంనాడు పుట్టారు. అందుకే ఆమెకు వరలక్ష్మి అని పేరు పెట్టారు. చిన్నతనంలోనే తల్లి, తండ్రి ఆమెను కర్నూలు తీసికెళ్ళి పెంచారు. ఆమె పెదతండ్రి రంగయ్యనాయుడు, ఆమెకు స్వయంగా సంగీతం నేర్పారు. సుస్వరమైన గాత్రం కలిగి ఉండటంతో తొలుత ప్రముఖ దర్శకులు గూడవల్లి రామబ్రహ్మం గారు తీస్తున్న 'బాలయోగిని' చిత్రంలో బాలనటిగా నటించారు. ఆమె రెండో చిత్రం సేనాసదన్ అనే తమిళ చిత్రం (1938), మూడవ చిత్రం ప్రేమసాగర్ (హిందీ 1939) అలా ఆమె చిన్నతనంలోనే మూడు భాషా చిత్రాలలో నటించారు.

దాదాపు 20 చిత్రాల్లో బాలనటిగా నటించారు. ఆ తరువాత రామబ్రహ్మంగారు నిర్మించిన 'మాయాలోకం' (1945) అక్కినేని సరసన నటించే అవకాశం ఇచ్చారు. రామబ్రహ్మంగారు నిర్మించిన పల్నాటియుద్ధంలో అక్కినేని బాలచంద్రుడిగా, వరలక్ష్మి మగువ మాంచాలగా నటించారు. అక్కినేని కాంబినేషన్‌లో నటించిన బాలరాజు (1948)లో పాడిన పాటలకు, నటనకు యస్.వరలక్ష్మికి ప్రేక్షకులు నీరాజనాలర్పించారు.

కర్ణాటక సంగీతంలో మంచి సాధన చేసి శాస్త్రీయ సంగీత కచేరీలు కూడా చేసారు యస్.వరలక్ష్మి. ఆ రోజుల్లో ఆమె పాటకచేరీకి బాగా డిమాండ్ వుండేది. అక్కినేని నాగేశ్వరరావు గారి పెళ్ళికి యస్.వరలక్ష్మి గాత్ర కచేరి జరిగింది.

ఆమె నటించిన ఇతర చిత్రాలు కోడరికం, జీవితం, తమిళంలో శివాజిగణేశన్‌తో 'వీరపాండ్యకట్ట బొమ్మన ఆ చిత్రం కైరో జరిగిన అంతర్జాతీయ చలన చిత్రోత్సవంలో

ప్రదర్శించారు. సతీసక్కుబాయి (1954), శ్రీకృష్ణతులాభారం (1955), నాగపంచమి (1956) ఇలా ఎన్ని చిత్రాలలో ఎక్కువగా కన్నాంబగారి శ్రీరాజరాజేశ్వరి వారి చిత్రాల్లో నటించారు.

'శ్రీవెంకటేశ్వరమహాత్మ్యం' (1960) శ్రీమహాలక్ష్మిగా, కృష్ణప్రేమ (1961)లో రాధగా, 'మహామంత్రి తిమ్మరుసు' (1962), 'శ్రీకృష్ణార్జునయుద్ధం'లో ఎన్.టి.ఆర్ సరసన సత్యభామగా (1963) హీరోయిన్‌గా ఆఖరి చిత్రం 'సత్యహరిశ్చంద్ర'లో (చంద్రమతి), నిర్మాతగా 'సతీసావిత్రి, వీరభాస్కరుడు' చిత్రాలు నిర్మించారు.


గుణచిత్ర నటిగా అనేక వైవిధ్యభరిత పాత్రలు పోషించారు యస్.వరలక్ష్మి. ఆమె ధరించటంతో ఆ పాత్రలకు ఓ నిండుదనం ఆమె గొంతులో హుందాతనం, దర్పం ప్రకటితమయ్యేవి (పోటిపడేవి).

వాటిల్లో కొన్ని ఉమ్మడి కుటుంబంలో రెండవ కోడలుగా సత్యనారాయణకు భార్యగా నటించారు. భర్త ప్రేమను అర్థం చేసుకోలేక పుట్టిల్లు చేర్చి, భర్త అవమానాలు తట్టుకోలేక ఇల్లు వదిలివెళ్ళాక, పశ్చాత్తాపంలో మారిన ఇల్లాలుగానూ, పేదవాడిని ప్రేమించి పెళ్ళాడి కూతురిని చేరదీయలేని అహంకారిగా 'ఆస్తులు – అంతస్తులు'లో, ఇదే అహంకారి అత్తగా, ఒక కూతురు పేదవాడిని పెళ్ళి చేసుకుని వెళ్ళిందని కోపించి, ఆ కూతుర్ని దూరం చేసుకొని, ఆస్తి ఉన్న రెండవ కూతురు మరణిస్తే, ఆ ఆస్తి పెత్తనం తన చేతుల్లోకి తీసుకు అల్లుడిని, అల్లుడు తమ్ముడిని దూరం చేయాలని ఎత్తులు వేస్తూ, తన మూడవకూతురిని రెండో అల్లుడికి చేయాలనే దురాశ, ఎన్నో షేడ్స్ గల అత్తగారి పాత్రను శభాష్ అన్పించేలా 'బొమ్మా బొరుసు'లో పోషించారు. విజయనిర్మల దర్శకత్వంలోని 'మీనా'లోనూ, కూతురిపై మమకారంతో, గొప్ప సంబంధం చేయాలని తపించి, ఆమె మేనల్లుడిని ప్రేమించి పెళ్ళి చేసుకున్నందుకు కుమిలిపోయే తల్లిగా దర్పాన్నీ, వాత్సల్యాన్ని సమపాళ్ళలో పోషించి మెప్పించారు.

'దానవీరశూరకర్ణ' (1977)లో కుంతిగా, 'చాణక్యచంద్రగుప్త'లో మురగా ఉదాత్తంగా నటించారు.

నేటి భారతం చిత్రంలో నెగెటివ్ టచ్ వున్న వేశ్యమాత పాత్రను పోషించారు. ఆ పాత్రకు ప్రేక్షకుల నుంచి మంచి స్పందన లభించింది. తెలుగులో యస్.వరలక్ష్మి నటించిన చివరి చిత్రం 'ముద్దులకృష్ణయ్య' (1986) బాలకృష్ణకు అత్తగా నటించి ఓ పద్యం కూడా పాడడం ఓ విశేషం.

వెండి తెరపై వెలిగిన సుస్వరాల లక్ష్మిగా యస్.వరలక్ష్మి ప్రేక్షకుల మదిలో నిల్చిపోయారనటంలో సందేహం లేదు.



# లింగమూర్తి

1954లో విడుదలయిన వాహినివారి 'పెద్దమనుషులు'' చిత్రంలో ఉదాత్తమయిన పత్రికాసంపాదకుడు రామదాసు పాత్రను అత్యంత సహజంగా పోషించి, ఉత్తమనటుడుగా కేంద్రప్రభుత్వ ప్రశంసలందుకున్న నటుడు ముదిగొండ లింగమూర్తి. 1937లోనే సినీరంగప్రవేశం చేసి 'భక్త తుకారాం' చిత్రంలో సి.యస్.ఆర్ ఆంజనేయులు సరసన గోస్వామి పాత్ర ధరించారు.

వాహిని సంస్థ తొలి చిత్రం 'వందే మాతరం'లో డాక్టరు పాత్ర ఆయనకు నటుడిగా మంచి గుర్తింపు తెచ్చింది. వాహినివారి చిరస్మరణీయ చిత్రాలు 'భక్తపోతన'లో ఆజామీళుడుగను, 'యోగివేమన'లో అభిరామునిగా, నాగయ్యగారి 'త్యాగయ్య'లో జపేశంగా నటించి ఆ పాత్రలు రక్తి కట్టించారు.

'స్వర్గసీమ' చిత్రంలో అతి సామాన్యమయిన స్థాయి నుంచి, కథానాయిక స్థాయికి ఎదిగిన సుజాత (భానుమతి) తండ్రిగా ఎన్నెన్నె వేషాలు వెయ్యాలో అన్నింటిని పండించారు. ఆయన నటజీవితంలో చిరస్మరణీయమైన పాత్రలు రెండు. 'అసాధ్యాన్ని సుసాధ్యం చేస్తాను అల్లుడూ' అంటూ సుయోధనునకు అభయం ఇచ్చిన మాయలమారి శకునిగా 'పాండవవనవాసం'; విజయనగర సామ్రాజ్యనాశనానికి బీజం వేసి పదహారుగురు పాత్రులను మట్టుబెట్టి, బాలతిరుమల రాయలను హత్యచేసి ఆనేరాన్ని అప్పాజిపై వేసి, శ్రీకృష్ణదేవరాయలను నమ్మించిన హంవీరుడు (మహామంత్రి తిమ్మరుసు).

ఇంకా 'బాటసారి' చిత్రంలో జమిందారును తప్పుదోవ పట్టించి, ఆయన అభిమానించిన మాధవి ఆస్తిని కైంకర్యం చేసిన గుమాస్తా ఆళ్వారుగాను, దుర్మార్గులతో చేతులు కలిపి, ఫలితంగా వారిచేతిలోనే బలయిపోయిన జమిందారుగా, 'జమిందారు' చిత్రంలోనూ, ఇంకా 'రహస్యం, ధర్మదేవత' వంటి చిత్రాల్లో సహాయపాత్రలు పోషించారు.

ఈయన వ్రాసిన 'వెంకన్న కాపురం' అనే నాటికను ఆంధ్రదేశంలోని పలునాటక సమాజాలు ప్రదర్శించాయి. ఎన్నెన్నో నాటక కళాపరిషత్ పోటీలకు న్యాయనిర్ణేతగా వ్యవహరించారు. నటనను పవిత్రమైన వృత్తిగాను, రంగస్థలాన్ని పవిత్ర దేవాలయంగాను భావించి జీవితాన్ని తరింప చేసుకున్న క్యారెక్టర్ ఆర్టిస్టు లింగమూర్తి.




# లక్ష్మిరాజ్యం

'ఆలకించండి బాబూ ఆలకించండి, అదృష్టమున్న అయ్యల్లారా' (ద్రోహి), 'ఇక పై నా గతేమి లేదా యిక సుఖమే యీ జగాన' (సంసారం), 'రాజులెందరు మారినా మనరోజులేమి మారవు' (రాజు-పేద), అన్న గీతాలకు తెరపై శోక, కరుణ విషాద భావాలకు ప్రాణంపోసిన విశిష్ట నటి లక్ష్మీరాజ్యం.

1922లో విజయవాడ సమీపంలో పుట్టిన లక్ష్మీరాజ్యం, రంగస్థలంపై పులిపాటి వెంకటేశ్వర్లు, రామతిలకం ప్రభృతులతో కలిసి పలునాటకాల్లో నటించడమే కాక అటు సంగీతంలోనూ, ఇటు హరికథల్లోనూ, సాధన చేసి ప్రావీణ్యం సంపాదించారు.

తారాబ్రహ్మ సి. పుల్లయ్య దర్శకత్వంలో 1935లో 'శ్రీకృష్ణ తులాభారం'తో చిత్రరంగానికి పరిచయమయ్యారు. తరువాత వరుసగా, శ్రీకృష్ణలీలలు, మాయాబజార్, ఇల్లాలు చిత్రాలలో నటించినా ఆమెకు నటిగా గుర్తింపు తెచ్చిన చిత్రం కె.ఎస్.ప్రకాశరావు సరసన నటించిన 'అపవాదు'. 1939లో ఇల్లాలు చిత్రంలో ఉమామహేశ్వరరావుకు జంటగా నటించారు.

సారథీ రామబ్రహ్మంగారి చిత్రం 'పంతులమ్మ' లక్ష్మీరాజ్యంను సమర్ధురాలయిన నటిగా నిరూపించింది. యల్.వి.ప్రసాద్ దర్శకత్వంలో తయారైన ద్రోహి చిత్రంలోని సీత పాత్ర ఆమె నట జీవితాన్ని గొప్ప మలుపు తిప్పింది. అప్పట్లో ఆ ద్రోహి చిత్రంలోని మరో కథానాయిక జి.వరలక్ష్మితో షూటింగ్ సందర్భంగా సెట్స్‌పై తీవ్రంగా గొడవపడటం వింతగా చెప్పుకున్నారు. ఆ వెనువెంటనే అదే ప్రసాద్ దర్శకత్వంలో వచ్చిన 'సంసారం'లో సామాన్య గుమాస్తా యన్.టి.ఆర్. సరసన ఆయన భార్యగా నటించిన 'మంజుల' పాత్ర. ఆమె నట జీవితంలో మరొక మంచి పాత్ర 'రాజు-పేద'లోని పోలిగాడి పెళ్ళాం.

లక్ష్మీరాజ్యం నట జీవితంలో నటించినవి సుమారు ముప్పయి చిత్రాలే అయినా,

ఆ తరహా పాత్రల్లో బీదరికపు యిల్లాలి బాధల్ని తెరపై అత్యంత సహజంగా ఆవిష్కరించి ప్రేక్షకుల అభిమానం చూరగొన్నారు.

శ్రీధర్ రావును వివాహం చేసుకున్నాక, రాజ్యం పిక్చర్స్ స్థాపించి 1952లో 'దాసి' చిత్రాన్ని సి.వి.రంగనాథ్‌దాస్ దర్శకత్వంలో నిర్మించారు. రెండవ ప్రయత్నంగా జంపన చంద్రశేఖరరావు దర్శకత్వంలో హరిశ్చంద్ర (1956) నిర్మించారు. అందులో యస్.వి.రంగారావు హరిశ్చంద్రునిగా, గుమ్మడి విశ్వామిత్రునిగా, లక్ష్మీరాజ్యం చంద్రమతిగా నటించారు. వారు తీసిన మూడవ చిత్రం 'కృష్ణలీలలు' (1959) దీనికి మొదట సి.పుల్లయ్య గారిని దర్శకత్వం అనుకుని, కొన్ని కారణాల చేత ఆయన విరమించగా జంపన దర్శకత్వంలో చిత్రం పూర్తి చేశారు.

రాజ్యం పిక్చర్స్‌ను చిరస్మరణీయతను తెచ్చిన చిత్రం 'నర్తనశాల' (1963). ఇందులో యన్.టి.రామారావు, యస్.వి.రంగారావు, రేలంగి, ముక్కామల, సావిత్రి, సంధ్య వంటి హేమాహేమీలు నటించారు. జకార్తాలో జరిగిన అంతర్జాతీయ చలన చిత్రోత్సవంలో ఈ చిత్రం ప్రశంసలు పొందటమే కాక యస్.వి.రంగారావు (కీచకుడు) ఉత్తమనటుడిగా టి.వి.యస్.శర్మ ఉత్తమ కళాదర్శకునిగా ఎంపిక అయ్యారు. ఈ చిత్రాలన్నిటికి సుసర్ల దక్షిణామూర్తి శ్రావ్యమైన సంగీతం అందించారు.

ఆ తరువాత తీసిన మూడు చిత్రాలకు ఘంటసాల సంగీతం అందించారు. వాటిల్లో మొదటిది కె.కామేశ్వరరావు దర్శకత్వంలో తయారైన శకుంతల. ఇందులో టైటిల్ రోల్‌ను బి.సరోజాదేవి పోషించగా, దుష్యంతునిగా ఎన్.టి.ఆర్. నటించారు. ఈ చిత్రం వారికి చేదు అనుభవాల్ని మిగిల్చింది. రెండవ చిత్రం సి.యస్.రావు దర్శకత్వంలో అక్కినేని ద్విపాత్రాభినయంలో నిర్మించిన 'గోవుల గోపన్న'. ఈ చిత్రం విజయం సాధించింది. అయితే అదే సి.యస్.రావు దర్శకత్వంలో చివరిగా తీసిన చిత్రం 'రంగేళి రాజా' ఫలితాలు ఆశాజనకంగా లేకపోవటంతో చిత్ర నిర్మాణానికి పుల్‌స్టాప్ పెట్టింది రాజ్యం పిక్చర్స్. అంతేకాదు నటనకు కూడా స్వస్తి పలికారు.

1987లో మరణించిన లక్ష్మీరాజ్యం నటజీవితంలో యెన్నదగిన చిత్రం 'సంసారం'. నిర్మాతగా అందించిన అద్భుత చిత్రం 'నర్తనశాల'.



# ముక్కామల

హీరోగా సినీరంగంలో కాలుబెట్టి కళ్ళల్లో క్రౌర్యం పాలు హెచ్చుగావటంతో విలన్‌గా మారి, ఆ తరువాత క్యారెక్టర్ ఆర్టిస్టుగా వందలాది చిత్రాల్లో భేష్ అనిపించుకున్న నటుడు ముక్కామల.

అసలు పేరు ముక్కామల కృష్ణమూర్తి. పుట్టింది 1920లో గుంటూరులో, గ్రాడ్యుయేషన్ పూర్తి చేసింది ఎ.సి.కాలేజీలో. ఆ రోజుల్లోనే యన్.టి.రామారావు, కొంగర జగ్గయ్య ప్రభృతులతో కలిసి నాటకాలాడారు. వాటిల్లో చెప్పుకోదగ్గవి రవీంద్రుని శాక్రిఫైస్, రాయప్రోలు వారి 'కొండవీటి పతనం'.

షేక్స్‌పియర్ వ్రాసిన ఒథెల్లో, మేక్‌బెత్, మర్చంట్ ఆఫ్ వెన్నిస్ వంటి ఆంగ్లనాటకాల్లో ప్రధానభూమికలు పోషించారు. ముక్కామల రచయిత కూడా; భక్త కబీర్ నాటకాన్ని వ్రాసి ప్రధానపాత్ర పోషించారు.

సి.పుల్లయ్య వద్ద 1945లో 'మాయామశ్చీంద్ర' చిత్రానికి దర్శకత్వశాఖలో పనిచేయవలసిన ముక్కామల, అనుకోని పరిస్థితుల వల్ల ఆ చిత్రంలో హీరో గోరక్‌నాథ్ వేషం వేశారు. నాటినుంచి 1987లో తుది శ్వాస విడిచే వరకు సుమారు మూడు వందల చిత్రాల్లో విభిన్న పాత్రలు ధరించారు.

స్ఫురద్రూపం, కళ్లల్లో క్రౌర్యం, సంభాషణలు పలకటంలో విలక్షణ విరుపు, ఇవి ఆయనలోని కొన్ని ప్రత్యేక లక్షణాలు.

రాగిణి వారి 'ధర్మదేవత'లో ఆవేశపూరితమైన కథానాయకునిగా, హెచ్.ఎం.రెడ్డి తీసిన 'నిర్దోషి' చిత్రంలో సంఘర్షణకు లోనయిన లాయర్ విజయ్‌గా చక్కగా నటించారు. ఈ చిత్రాన్ని తమిళంలో తీసినపుడు ముక్కామలకు శివాజి గణేశన్ డబ్బింగ్ చెప్పారు. స్వప్నసుందరి చిత్రంలో హీరోను కత్తులబోనులో బంధించిన మాంత్రికునిగా 'ఈ కత్తుల బోను, ప్రియురాలి కౌగిలి కన్న మెత్తగా ఉంది కదూ' అని పరిహసించడం, దానికి

తగ్గట్టు కనుబొమ్మలెగరేయటం అప్పట్లో గొప్ప విలనీగా భావించేవారు.

నిజానికి పాతాళభైరవి మాంత్రికుని వేషం కూడా ముక్కామలకు దక్కవలసింది. అయితే విధి నిర్ణయం వేరుగా ఉంది.

ముక్కామలలో భావుకత వున్న దర్శకుడు కూడా మనకు కన్పిస్తాడు. ఇందుకు నిదర్శనంగా స్వీయ దర్శకత్వంలో ఈయన నిర్మించిన 'మరదలుపెళ్లి', 'ఋష్యశృంగ' చిత్రాలే. 'మరదలు పెళ్ళి'లో టంగుటూరి సూర్యకుమారి కథానాయిక. 'ఋష్యశృంగ'లో హరనాధ్ కథానాయకుడు, ఈ రెండు చిత్రాలు ఆర్థికంగా ముక్కామలను నిరుత్సాహ పరచాయి.

ముక్కామలలోని కళాకారుణ్ణి సమర్థవంతంగా ఉపయోగించుకున్నవారు ముగ్గురు. ఒకరు యన్.టి.రామారావు, రెండవ వారు బి.విఠలాచార్య, కాగా మూడవ వ్యక్తి బాపు. ఈ ముగ్గురూ రూపొందించిన పలు చిత్రాల్లో వైవిధ్యభరిత భూమికలను పోషించారు ముక్కామల. పౌరాణికాల్లో విశ్వామిత్రుడు, దుర్యోధనుడు, జానపద చిత్రాల్లో మహారాజు, సేనాని, మాంత్రికుడు, సాంఘిక చిత్రాల్లో జడ్జి లాయర్, పోలీసాఫీసర్ ఈ తరహా సహాయ పాత్రలకు పరిపూర్ణ న్యాయం చేకూర్చారు ముక్కామల. క్రైయిమ్ సినిమాలలో సైంటిస్టుగానూ, అప్పుచేసి పప్పుకూడులో అంధుడుగానూ ఆ పాత్రలకు న్యాయం చేశారు.

బాపు రూపొందించిన 'ముత్యాలముగ్గు'లో ఆస్తికోసం దుర్మార్గుడైన కాంట్రాక్టర్ రావుగోపాలరావుతో చేతులు కలిపి పచ్చని సంసారంలో చిచ్చులు రేపిన ఆశాపరుడిగా, హలం నాట్య భంగిమలు చూసి గుటకలు వేసే గుంటనక్క పాత్ర ఓ వెరైటీ. బాపూ సృష్టించిన మరో అద్భుతసృష్టి సంపూర్ణరామాయణంలో శ్రీరాముని సవాలు చేసిన పరశురామునిగా, 'సీతాకల్యాణం'లో సృష్టి ప్రతిసృష్టి చేసిన విశ్వామిత్రునిగా నట విశ్వరూపాన్ని ప్రదర్శించాడు ముక్కామల.

మాయలమారి, అగ్గిరాముడు, మాయాబజార్, శోభ, మానవుడు-దానవుడు, అప్పుచేసి పప్పుకూడు, గురువును మించిన శిష్యుడు, గులేబకావళికథ, జగదేకవీరునికథ, స్నేహం వంటి చిత్రాలు ముక్కామల కృష్ణమూర్తి నటజీవితంలో ఎన్నదగినవి.



# జి.వరలక్ష్మి

"నీ సరి నీవేనే జనానా లేనెరజాణవులే' అంటూ 'స్వప్నసుందరి'లో కోయరాణిగా స్వయంగా పాడి, హొయలొలికిస్తూ, నటించారు జి. వరలక్ష్మి .తనగొంతులో హస్కీగా శృంగార రసాన్ని ఒకలపోయటం ఓ విశేషం. ఓ దశాబ్ద కాలం (1950–60)లో కథానాయికగా, ప్రతినాయికగా, గుణచిత్రనటిగా, హాస్య, రౌద్ర, శృంగార రసప్రధానమైన పాత్రలో రాణించిన విలక్షణ నటి వరలక్ష్మి.

1926లో ఒంగోలులో గరికిపాటివారి యింట జన్మించిన వరలక్ష్మి నటనపట్ల ఆకర్షితురాలై విజయవాడ వెళ్ళి అక్కడ తుంగల చలపతిరావు, కోటిరత్నం వంటి ఆనాటి ప్రముఖుల రంగస్థల నటబృందంలో చేరారు. సక్కుబాయిలో రాధ, వరవిక్రయంలో కమల, రంగూన్ రౌడీలో ప్రభావతి పాత్రలు ధరించి మెప్పించారు. హెచ్.యం.రెడ్డి ప్రోత్సాహంతో 'బారిష్టరు పార్వతీశం' (1940) చిత్రం ద్వారా సినీరంగ ప్రవేశం చేశారు.

నా చెల్లెలు చిత్రంలో రామశర్మ సరసన నాయికగా నటించిన వరలక్ష్మి ఆ వెంటనే అతను కథానాయకుడుగా నటించిన 'పల్లెపడుచు'లో వయసు మళ్ళిన జమీందారిణిగా నటించి, రచయిత పినిశెట్టి శ్రీరామమూర్తి సృష్టించిన పాత్రకు ప్రాణం పోశారు. 1943లో నటుడు, దర్శకుడు నిర్మాత అయిన కె.ఎస్.ప్రకాశరావును వివాహం చేసుకున్నాక ప్రకాశ్ పిక్చర్స్ స్థాపించి వారిద్దరూ 'మొదటిరాత్రి'లో నటించటం, ఓ విశేషం. ద్రోహి, దొంగల్లో దొర, వింధ్యారాణి చిత్రాల్లో వేంప్ పాత్రల్లో కూడా శభాష్ అనిపించేలా నటించారు.

చిన్నతనంలో స్టంట్ సినిమాలు ఎక్కువగా, ఇష్టపడి చూసేవారు వరలక్ష్మి, ధైర్యం, సాహసం, మొండితనం, కలుపుగోలుతనం వరలక్ష్మి సహజలక్షణాలు. 'దొంగలొస్తున్నారు జాగ్రత్త'లో జగ్గయ్య చెల్లెలుగా సాత్వికంగా ఒకవైపు, దుర్మార్గుల ఆటకట్టించే ముసుగు వీరునిగా ఆమె నటన, అందులో గుర్రపు స్వారీలు, కత్తియుద్ధాలు,

ఫైట్స్ సునాయాసంగా చేసి ప్రేక్షకులను ఆశ్చర్యపరిచారు. 1952లో విజయావారి 'పెళ్ళి చేసిచూడు'లో యన్.టి.ఆర్ సరసన ప్రథమార్ధంలో ఎంతో హుషారుగా, ద్వితీయార్ధంలో ఎంతో గంభీరంగా నటించి ప్రశంసలు పొందారు.

సుమారు వంద తెలుగు, తమిళ చిత్రాల్లో పని చేసిన వరలక్ష్మి, భారత ప్రొడక్షన్స్ వారు నిర్మించిన హిందీ చిత్రాలు 'వనరాణి', 'డూ ఆర్ డై', 'సర్కస్ కింగ్' చిత్రాలలో నటించి జాతీయస్థాయి గుర్తింపు పొందారు. అవి స్టంట్ చిత్రాలే కావటం ఓ విశేషం.

కథానాయిక నుంచి క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా మారిన తరువాత కూడా అనేక వైవిధ్యమైన పాత్రల్ని పోషించారు జి.వరలక్ష్మి. పౌరాణికాలలో 'వీరాంజనేయ'లో మండోదరిగా, 'వీరాభిమన్యు'లో ద్రౌపదిగా, 'రేణుకాదేవి మహత్యం'లో జమదగ్ని భార్య రేణుకగా గుమ్మడి సరసన, భీష్మలో కుంతిగా నటించారు. ప్రతిభావారి 'శ్రీలక్ష్మమ్మకథ'లో గయ్యాళి ఆడపడుచుగా, ఇద్దరు మిత్రులు చిత్రంలో అక్కినేని మేనత్తగా చూపులేక పోయినా తెలివిగా ఎలానడచుకోవాలో తెలియచెప్పే పాత్రను; 'లేతమనసులు'చిత్రంలో అహంకారియైన నాయిక తల్లి 'దుర్గమ్మ'గా కూతుర్ని, అల్లుడ్ని వేరు చేసిన పాత్ర; అన్న ప్రేమకోసం తపించిన చెల్లెలుగా 'మాంగల్యబలం'లో, ఇరవై యేడేళ్ళ వయసులో రెట్టింపు వయసుగల పాత్రను; కన్నతల్లి చిత్రంలో అక్కినేని, నంబియార్‌లకు తల్లిగాను; వీటన్నిటిలో తన నటనలో గాంభీర్యం, దయాగుణం, క్షమ, సంయమనం, ప్రదర్శించి ప్రేక్షకులను రంజింప చేశారు.


1952లో 'రాయలసీమ కరువునిధి' కోసం, యన్.టి.ఆర్‌తో కలిసి నాటకాలు ప్రదర్శించారు. నటనలోనే కాక దర్శకత్వంలోనూ ఆమెకు అనుభవం ఉండేది. చంద్రశేఖర్ ఫిల్మ్ సంస్థ స్థాపించి 'మూగజీవులు' చిత్రాన్ని తన దర్శకత్వంలో రూపొందించారు.

అనుపమ ప్రొడక్షన్స్‌వారు నిర్మించిన 'ముద్దుబిడ్డ' చిత్రంలో కొంతకాలం షూటింగ్ జరిగాక, ఆ సాత్విక పాత్ర డైలాగులు నచ్చక, దర్శకులు తిలక్‌తో విభేదించి చిత్రం నుంచి తప్పుకున్న ఆత్మాభిమానం గల నటి జి.వరలక్ష్మి.

తమిళంలో యమ్.జి.ఆర్ సరసన 'గులేబకావళి'లో నటించారు జి.వరలక్ష్మి. ఈమె అక్క కుమార్తె ప్రసన్నలక్ష్మి నాగరత్నంగా పేరు మార్చుకొని తెలుగు గులేబకావళికథలో యన్.టి.ఆర్ సరసన, శ్రీకృష్ణపాండవీయంలో హిడింబిగాను నటించింది.

నిండైన నటనకు నిదర్శనంగా వెండితెరపై తొలితరం నుంచి ప్రకాశించిన నటీమణులలో ఒకరు జి.వరలక్ష్మి, గోరంతదీపంలో కూడా అల్లురామలింగయ్య సరసన చిన్నదయినా గుర్తుండిపోయే పాత్రలో నటించారు. 'మహానటి' నాటకాన్ని ప్రదర్శించిన మరో మహానటి అనదగ్గ క్యారెక్టర్ ఆర్టిస్టు జి.వరలక్ష్మి, అనటంలో సందేహం లేదు.

# గోవిందరాజుల సుబ్బారావు



'సంగూ' అంటూ కళ్ళెర్ర చేసిన 'బాలనాగమ్మ'లోని మాయలఫకీర్, షావుకారులోని పిసినారి వడ్డీవ్యాపారి చెంగయ్య, కన్యాశుల్కంలోని లుబ్ధావధానులు; ఈ మూడు పాత్రలు తనదైన శైలిలో పోషించి ఆనాటి ప్రేక్షకుల అభిమానాన్ని పొందిన విలక్షణ నటుడు గోవిందరాజుల సుబ్బారావు.

నాటకరంగంలోనూ, సినిమారంగంలోనూ, కొత్త కోణాల్లో నటనను చూపిన గోవిందరాజుల సుబ్బారావు విలక్షణనటుడు. అంతేకాక సినిమా యాక్టరు కావటానికి ముందే వృత్తిరీత్యా డాక్టరు. అంతకంటే ముందు స్టేజి యాక్టరు.

1895లో జన్మించిన సుబ్బారావు విద్యార్థి దశలోనే మర్చెంట్ ఆఫ్ వెనిస్ నాటకంలో నటించారు. యల్.ఎం.పి.ప్యాసై వైద్యవృత్తిని చేపట్టారు. నాటకాల్లో గయోపాఖ్యానం, ప్రతాపరుద్రీయంలో యుగంధరుడు, బొబ్బిలియుద్ధంలో హైదర్‌జంగ్, బుస్సీ పాత్రలు పోషించారు. కన్యాశుల్కం నాటకంలో గిరీశం, సూత్రధారుడు, పోలిశెట్టి, బంట్రోతు, కరటకశాస్త్రి లాంటి పాత్రల్ని కడు సమర్థవంతంగా పోషించారు.

గూడవల్లి రామబ్రహ్మంగారి 'మాలపిల్ల' చిత్రంతో తొలిసారి సినీరంగంలో ప్రవేశించారు. ఛాందస భావాలు గల, సంప్రదాయవాది సుందరరామశాస్త్రిగా, ఆ పాత్రకు ప్రాణం పోశారు. 'గుణసుందరికథ'లో మహారాజుగా నటించారు. 1942లో జెమిని వారి 'బాలనాగమ్మ'లో మాయలఫకీర్‌గా తిరుగులేని విలన్ అనిపించారు. 'పల్నాటియుద్ధం'లో నాగమ్మకు (కన్నాంబ) దీటైన సమ ఉజ్జీగా, బ్రహ్మనాయుడుగా రాణించారు. విజయావారి 'షావుకారు'లో చెంగయ్యగా టైటిల్‌రోల్ పోషించారు. ఒక పక్క పిసినారితనం, మరోవంక పొరుగింటి కుటుంబం మీద కక్ష చివరికి పశ్చాత్తాపం ఈ భావాలను చక్కగా ప్రదర్శించారు.

తగు విరామంతో సంభాషణలు పలుకటంలో వీరిది ప్రత్యేకశైలి, భాగ్యరేఖ, చరణదాసి చిత్రాల్లోని సాత్వికాభినయం మరపురానిది.

హోమియోపతి డాక్టరుగా వృత్తి సాగిస్తూ, అణుశాస్త్రంపై, ఇనార్గానిక్ ఇవల్యూషన్ అనే గ్రంథం రచించి ప్రఖ్యాత శాస్త్రవేత్త ఐన్‌స్టీన్‌తో ఉత్తరప్రత్యుత్తరాలు నడిపిన బహుముఖ ప్రజ్ఞాశాలి గోవిందరాజుల సుబ్బారావు 1959లో కాలధర్మం చెందారు.



# ఋష్యేంద్రమణి

"నను దయ గనుమా, నా మొరవినుమా మది నిన్నెనమ్మితి మాతా" అంటూ కుమారుని క్షేమంకోరి దేవిని ప్రార్థించే కన్నతల్లిగా, జగదేకవీరునికథ, గులేబకావళికథ, జయసింహలలో భక్తిరసాన్ని పండించారు. అభిమన్యుని ఘటోత్కచునిబారి నుండి నిలువరించటానికై విల్లమ్ములు చేపట్టి 'అఖిలరాక్షస మంత్ర తంత్రాతిశయము నెనచు శ్రీకృష్ణసోదరి నగుదునేని' అని 'మాయబజార్'లో సుభద్రగా రౌద్రాన్ని, వదిన రేవతి ప్రవర్తనకు ఆవేదన చెందిన ఆడపడుచుగా, భర్తల శౌర్యాన్ని చూసి గర్వించే పడతిగా ఎన్నో భావాలను నటనలో పలికించారు. అతిశయం, ఆడంబరం కల మల్లీశ్వరి తల్లి నాగమ్మ, విప్రనారాయణుడు వంటి భక్తశిఖామణిని ధనంకోసం పీడించిన వేశ్యమాత చెప్పుకోదగ్గవి. ప్రముఖ దర్శకుడు కె.ఎస్.ప్రకాశరావు కథానాయకునిగా నటించిన చిత్రం 'పత్ని'. అందులో కథానాయిక కణ్ణగిగా, నిర్దోషియైన భర్తకు మరణశిక్ష విధించిన రాజును శపించిన సన్నివేశంలో ఆవేశపూరితంగా నటించారు. ఇలా ఎన్నో ఎన్నెన్నో కరుణ, ఆవేశం, క్రోధం, శాంతం, భక్తి వంటి లక్షణాలు గల పాత్రలకు తగ్గట్టు తనను తాను మలచుకొని వాటిని రక్తి కట్టించిన ప్రతిభాశాలి ఋష్యేంద్రమణి.

చిన్నప్పుడే సంగీతం, నృత్యం నేర్చుకొన్నారు. ఆమె నటించిన తొలిరంగస్థల నాటకం 'సావిత్రి'.


ఋష్యేంద్రమణి 1935లో శ్రీకృష్ణతులాభారం చిత్రంలో సత్యభామగా సినీరంగప్రవేశం చేశారు. ఆమె రెండవ చిత్రం 'తల్లిప్రేమ', మూడవ చిత్రం పైన పేర్కొన్న 'పత్ని' (1942– దర్శకుడు గూడవల్లి రామబ్రహ్మం). సినిమా రంగానికి రాక పూర్వం ఆమె రంగస్థలనటిగా, చింతామణి, సావిత్రి నాటకాల ద్వారా పేరు సంపాదించారి కథానాయిక పాత్రల తరువాత నుంచి ఆమె గుణ చిత్రనటగానే, అనేక చిత్రాలలో

నటించి, మెప్పించారు. ఎక్కువ చిత్రాలలో ఆమె యన్.టి.రామారావుకు తల్లిగాను, అత్తగాను నటించారు.

ఆమెలోని ప్రజ్ఞను గుర్తించిన యన్.టి.ఆర్ తమ యన్.ఎ.టివారి చిత్రాలలో ఎక్కువ అవకాశాల నిచ్చారు. వారి 'జయసింహ' చిత్రంలో రాజ్యకాంక్షగల భర్త యస్.వి.ఆర్.కు కన్నకొడుకులా పెంచిన బావగారి పుత్రుడు జయసింహునికి మధ్యనలిగిన భార్యగా కన్నకొడుకు కాంతారావుకు అన్న పట్ల బాధ్యత అప్పగించిన తల్లిగా ఆమె నటన కరుణా రసపూరితం. 'పాండురంగ మహాత్మ్యం'లో వ్యసనపరుడైన కుమారునిపట్ల ఆవేదన చెందే తల్లిగా, 'సంపూర్ణరామాయణం'లో రావణమాత కైకసిగా, 'శ్రీకృష్ణసత్య'లో గాంధారిదేవిగా, విజయవారి 'గుండమ్మకథ'లో మిక్కిలినేని సరసన, ఎ.ఎన్.ఆర్, ఎన్.టి.ఆర్‌లకు మేనత్తగాను, యస్.వి.ఆర్ సరసన 'మిస్సమ్మ'లో తప్పిపోయిన పెద్ద కూతురు సావిత్రి కోసం పరితపిస్తూ చిన్నకూతురు జమున అల్లరితనం ఆనందించే తల్లిగాను, 'సంఘం' చిత్రంలో, యస్.వి.రంగారావు సరసన అమాయకపు భార్య అప్పాయమ్మగా విభిన్న పాత్రలు పోషించారు.

'శ్రీకృష్ణావతారం'లో కుంతిదేవి, 'శ్రీకృష్ణతులాభారం', 'దీపావళి' చిత్రాలలో అదితిగా,'శ్రీకృష్ణార్జున యుద్ధం'లో గంధర్వరాజు గయుని భార్యగా, 'శ్రీకృష్ణవిజయం'లో దేవకీ దేవిగా వివిధ పౌరాణిక పాత్రలు పోషించారు ఋష్యేంద్రమణి.

అనేక సాంఘిక చిత్రాలలో తల్లిగా, బామ్మగా, అత్తగా పలు పాత్రలను పోషించిన ఋష్యేంద్రమణి నటించిన చివరి చిత్రం 'షిర్డిసాయిబాబా మహాత్మ్యం'. పాతతరానికి చెందిన నటీమణులలో ప్రత్యేకత కలిగిన నటీమణి అని తెలుగువారు గర్వంగా చెప్పుకోదగ్గ నటి ఋష్యేంద్రమణి.



# గౌరీనాథశాస్త్రి

తెనాలి తాలుకా పిడపర్తిలో జమీందారి హోదాలో బతికే జంధ్యాల వంశంలో జన్మించారు. రెండవతరం నటుడు గౌరీనాథశాస్త్రి. ఆయన పెద్దగా చదువుకోలేదు. అయితే సినిమాలన్నా, నటన అన్నా సరదా ఉండేది.

భారీ విగ్రహం, స్ఫురద్రూపం, విశాల పాలభాగం, కొనదేరినముక్కు, భావస్ఫోరకమైన నేత్ర ద్వయం, విచిత్ర వేగంతో కూడిన కంఠ స్వరం, వీటితో నిండుగా, గంభీరంగా కన్పిస్తారు గౌరీనాథశాస్త్రి. ఇవి చూసి ముచ్చటపడిన దర్శకులు కె.వి.రెడ్డి 'భక్తపోతన'లో శ్రీనాథుని పాత్ర ఇచ్చి ప్రోత్సహించారు. తరువాత సి.పుల్లయ్య 'మాయామశ్చీంద్ర'లో కథానాయకుని వేషం ఇచ్చి ప్రోత్సహించారు. ఆ వెంటనే శోభనాచల పతాకంపై మీర్జాపురం రాజా, చిత్రపు నారాయణమూర్తి దర్శకత్వంలో తీసిన భీష్మ చిత్రంలోనూ, జ్యోతి సిన్హా దర్శకత్వంలో వచ్చిన 'ఒక రోజు రాత్రి' చిత్రంలోనూ ప్రధానపాత్ర పోషించారు గౌరీనాథ శాస్త్రి.

పూర్ణిమ నాయికగా తంగిరాల హనుమంతరావు దర్శకత్వంలో 'గీతాంజలి' చిత్రాన్ని, కుమారి నాయికగా 'ఆకాశరాజు' చిత్రాన్ని నిర్మించారు. 'ఆకాశరాజు' చిత్రానికి రచయిత కవిసామ్రాట్ విశ్వనాథసత్యనారాయణ.

కె.వి.రెడ్డి రూపొందించిన 'పెద్దమనుషులు'లో ప్రధానమైన ఛైర్మన్ ధర్మారావుగా తడిగుడ్డలతో గొంతులుకోసే విలన్‌పాత్రను గంభీరంగా పోషించి శభాష్ అనిపించుకున్నారు శాస్త్రి.

హిందీ చిత్రం 'కిస్మత్' ఆధారంగా నరసు స్టూడియోస్ నిర్మించిన 'భలేరాముడు'లో కథానాయికల తండ్రి జమిందారు నారాయణబాబు పాత్రను కూడా ఆవేశం, అనురాగం కలగలిపి నటించి జీవం పోశారు. నాగయ్య తీసిన 'రామదాసు'లో కబీర్‌గా నటిస్తూ తుదిశ్వాస విడిచారు. తక్కువ సినిమాల్లో నటించినా గంభీర పాత్రలను, అంతకుమించిన గంభీరంగా పోషించి ఔననిపించుకున్న నటుడు గౌరీనాథశాస్త్రి.



# టి.జి.కమలాదేవి

టి.జి.కమలాదేవి అసలుపేరు గోవిందమ్మ. సినిమాల్లోకి వచ్చాక ఆమె పేరు మార్చుకున్నారు. ఈమె పాటలు రికార్డ్‌లో విన్న హెచ్.ఎం.రెడ్డిగారు 'తెనాలిరామకృష్ణ'లో ఎల్.వి.ప్రసాద్‌గారి ప్రక్కన భార్య వేషం వేయించారు. 'సీతారామజననం'లో అహల్యగా నటించారు. గూడవల్లి రామబ్రహ్మంగారి 'మాయాలోకం'లో సహాయపాత్రను, ప్రతిభా బలరామయ్య నిర్మించిన "ముగ్గురు మరాఠీలు" చిత్రంలో నాగేశ్వరరావు సరసన నాయికగా నటించి, తన పాత్రలకు పాటలను తానే పాడుకున్నారు. 'చూడామణి, దక్షయజ్ఞం, పార్వతీ కల్యాణం' చిత్రాలలో ఆమె ముఖ్య పాత్రలు పోషించారు. వాహినివారి గుణసుందరి కథలో పార్వతీదేవి వేషం వేసి, యక్షిణిపాటకు ప్లేబాక్ కూడా పాడారు.

1951లో విజయావారి పాతాళభైరవిలో ఇతిహాసం విన్నారా అంటూ ఉజ్జయిని సాహసగాథలు చెప్పే బుర్రకథను పాడుతూ, నటించారు. ఆ సంవత్సరం చివర్లో వచ్చిన వాహినివారి 'మల్లేశ్వరి'లోనూ, మల్లీశ్వరి ఇష్టసఖిగా నటించి, తోటలో పూవులు కోస్తూ, ఝుం ఝుం ఝుం తుమ్మెదా అని పాడుతూ, నృత్యం చేస్తూ, మల్లి నాగరాజుల కలయికకు సాయపడే జలజ పాత్రను ప్రేక్షకులు మరువరానిదిగా పోషించారు.

'ఇల్లరికం' చిత్రంలో కథానాయిక మేనత్తగా నటించారు. కొంతకాలం సినిమాలకు డబ్బింగ్ చెప్పారు. కె.ఆర్.విజయ దేవతగా నటించిన అనేక చిత్రాలకు కమలాదేవి డబ్బింగ్ చెప్పారు. రంగస్థలంపై ఆమె సక్కుబాయి, రోషనార, అలెగ్జాండర్ వంటి నాటకాలు వేసారు. 'రోషనార'లోని కొన్ని పాటలకు సంగీత దర్శకుడు చక్రవర్తి ట్యూన్ చేశారు. మద్రాస్‌లోని ఆంధ్రమహాసభాకార్యదర్శిగా ఎన్నో సంవత్సరాలు, సేవ చేశారు. తాను నాటకాలు ఆడడమే కాక ఇతర బృందాల నాటకాలను చెన్నపురి ఆంధ్రమహాసభ ఆధ్వర్యంలో ఆడించారు. ప్రతీ ఏడూ కనీసం వారంరోజులు నాటకాల పోటీలు నిర్వహించేవారు.

కమలాదేవిలో మరో విశేషం ఆమె నుంచి బిలియర్డ్స్ ప్లేయర్. 1991-92 సంవత్సరాలకు ఆమె మహిళల విభాగంలో నేషనల్ ఛాంపియన్ ఇప్పటికి మద్రాస్‌లో ప్రశాంతంగా, యాక్టివ్‌గా జీవిస్తున్న కళాకారిణి టి.జి.కమలాదేవి.



# ఎస్.వి.రంగారావు

**(18.7.1918-3.7.1974)**

జకార్తాలో జరిగిన అంతర్జాతీయ చలనచిత్ర పోటీల్లో పాల్గొన్న నర్తనశాల చిత్రంలో కీచక పాత్రధారి ఎస్.వి.రంగారావు ఉత్తమనటుడిగా ఎంపిక కావటం తెలుగు చలనచిత్ర చరిత్రలో చెప్పుకోదగ్గర అంశం.

పీటర్-ఓ-టూల్, ఏంథోని క్విన్ వంటి హాలివుడ్ నటుల సరసన నిలువగల నటుడు, యస్.వి.రంగారావు.

పృధ్వీరాజ్ కపూర్, అశోక్‌కుమార్, ఓంప్రకాష్, ప్రాణ్... ఈ నలుగురు విశిష్టనటుల్ని కలబోస్తే ఒక యస్.వి.రంగారావు అవుతారు.

“ఆంధ్రదేశంలో యస్.వి.రంగారావు పుట్టడం మన అదృష్టం. ఆయన దురదృష్టం”. ఇది విశ్వనట చక్రవర్తిగా వినుతికెక్కిన విశిష్టనటులు యస్.వి.రంగారావు గూర్చి సహనటులు గుమ్మడి వెంకటేశ్వరరావు వెలిబుచ్చిన అమూల్య అభిప్రాయం.

పైన పేర్కొన్న నటులందరూ, నిజంగా, ఒక్కో తరహా పాత్రలకు మాత్రమే పరిమితం. కాని యస్.వి.రంగారావు అన్ని తరహా భూమికల్ని, అలవోకగా పోషించి శభాష్ అనిపించుకున్నారు.

ఒక విశిష్టనటనాశైలి యస్.వి.రంగారావుకు మాత్రమే సాధ్యం. సంభాషణలతో నిమిత్తం లేకుండా కంటి చూపుతో, ముఖకవళికల విన్యాసంతో పాత్ర పరంగా నటనను ఆవిష్కరించిన ఏకైక నటుడు రంగారావు.

ఆయనకు సంభాషణలు రాయటానికి చిత్ర విచిత్ర పద ప్రహేళికతో పింగళివారి కలం, శిష్ట, విశిష్ట, సంక్లిష్ట సమాసాలతో సముద్రాలవారి లేఖిని పరవళ్ళు తొక్కేవి. ఇవి రంగారావు గొంతు నుంచి జాలువారి ప్రేక్షకులకు రససిద్ధిని కలిగించాయి. ఇందుకు ‘పాతాళభైరవి’లోని ‘నేపాళమాంత్రికుడు, మాయాబజార్‌లోని ఘటోత్కచుడు, పాండవ వనవాసంలోని సుయోధనుడు, నర్తనశాలలోని కీచకుడు కొద్ది ఉదాహరణలు మాత్రమే.

జూలై 3, 1918న నూజివీడులో జన్మించారు, సామర్ల వెంకట రంగారావు.

స్కూల్లో విద్యార్థి దశలోనే, మాంత్రికుని అసిస్టెంటుగా నటించి మార్కులు కొట్టేశారు. బి.యస్సీ పట్టం పొందాక కాకినాడ యంగ్‌మెన్స్ హాపీక్లబ్ రంగారావులోని నటనకు తగిన వేదిక అయింది. అక్కడే ఖిల్జీరాజ్యపతనం, పీష్వా నారాయణరావు, ఒథెల్లో, మర్చంట్ ఆఫ్ వెనిస్ వంటి నాటకాల్లో నటించి ప్రశంసలు పొందారు. "షైలాక్" పాత్ర పోషణ భవిష్యత్తులో "పాతాళభైరవి'లోని నేపాళమాంత్రికుని పాత్ర పోషణకు సహకరించిందని ఆయన పలుమార్లు చెప్పుకున్నారు.

ఫైర్ ఆఫీసర్‌గా కొంతకాలం పనిచేసినా, నటన పట్ల ఆయనకున్న మక్కువచేత, ఆయన బంధువు బి.వి.రామానందం తీసిన 'వరూధిని' చిత్రంలో కథానాయకుడైన ప్రవరాఖ్యుని పాత్ర పోషించారు. ఆ చిత్రం సక్సెస్ కాలేదు. తరువాత మనదేశం, షావుకారు, పల్లెటూరి పిల్ల చిత్రాల్లో చిన్న చిన్న వేషాలు ధరించారు.

ఇంతలో విజయా వారు 1951లో నిర్మిస్తున్న 'పాతాళభైరవి' చిత్రంలో నేపాళ మాంత్రికునిగా అవకాశం ఇచ్చారు. నాటి నుంచి జూలై 18 1974లో మరణించే సమయానికి నూటయాభై తెలుగు చిత్రాల్లోనూ, ఎనభై యేడు తమిళ, రెండు కన్నడ, మూడు మలయాళ, మూడు హిందీ చిత్రాల్లోనూ నటించి, విశిష్ట నటుడిగా తన నటజీవితాన్ని సార్థకం చేసుకున్నారు.

నటనలో సహజత్వం కోసం నిరంతరం, తపించేవారు. అందుకోసం ఎందరినో పరిశీలించేవారు. ఒకసారి ప్లాట్‌ఫారం మీద ముక్కుపుటాలెగరేసిన మనిషి మేనరిజాన్ని 'పెళ్ళిచేసి చూడు'లో ధూపాటి వియ్యన్న పాత్రలో చూపారు. ఒక అంధుడికి రూపాయి దానం చేస్తే అతను పొందిన అనుభూతిని 'సంతానం' చిత్రంలోని పాత్ర ద్వారా ఆవిష్కరించారు.

మతిమరపు లాయరు కుటుంబరావు (తోడికోడళ్ళు), వృద్ధాప్యంలో మానసిక వ్యధకు లోనయిన రాజు (రాజు–పేద), రౌడీలకు సింహస్వప్నమయిన కత్తులరత్తయ్య, అంధుడైన మేజర్ (సుఖదుఃఖాలు), ఇద్దరు కథానాయకులకు తండ్రిగా (గుండమ్మకథ, దేవుడు చేసిన మనుషులు), మొగల్‌సామ్రాట్ అక్బర్ (అనార్కలి) ఇలా ఎన్నెన్నో పాత్రలు, చెప్పుకోవచ్చు. అయితే రంగారావు అభిమానించిన పాత్ర "బంగారుపాప"లోని కోటయ్య; రౌడీగా, సాత్త్వికునిగా, కరుణ కలగలసిన ఆ పాత్రలో ఆయన చూపిన వైవిధ్యనటన అపూర్వం. ముఖ్యంగా 'తాధిమితకధిమి తోలుబొమ్మ' పాటకు చూపిన హావభావాలు ప్రేక్షకుల్ని కంటతడిపెట్టిస్తాయి.

ఆంధ్రప్రేక్షకులు తెలుగుసినిమా పరిశ్రమ గర్వంగా చెప్పుకొనే మహత్తర పౌరాణిక చిత్రం 'మాయాబజార్'లో ఘటోత్కచునిగా న భూతో న భవిష్యతి అన్న తరహాలో ఆ పాత్రను పోషించి ఆ చిత్ర ఘన విజయానికి కారకులైనారు.

"హరిశ్చంద్ర' పాత్ర నిర్వహణకు, బాపు తీర్చిదిద్దిన రావణ పాత్ర (సంపూర్ణ రామాయణం)కు ఎక్కడా పొంతనలేదూ అలాగే ప్రజల్ని పీల్చివేసే 'పల్లెటూరు' విలన్‌కు 'నమ్మిన బంటు' పేదరైతుకు ఎక్కడా పోలిక లేదు.

డైలాగ్ డెలివరీలో వేగం, స్పష్టత, విరామం, వైవిధ్యం, అర్థవంతమైన, అందమైన భావస్ఫోరకమైన విరుపులు, అందుకు తగ్గ ఆంగికాభినయం రంగారావు సొత్తు. తెలుగు ప్రేక్షకులతో పాటు తమిళ ప్రేక్షకులు యస్.వి.రంగారావును అభిమానించారు.

రంగారావు మంచి దర్శకుడు. ఆయన స్వీయదర్శకత్వంలో నిర్మించిన చదరంగం, బాంధవ్యాలు చిత్రాలు ఈ విషయాన్ని రుజువు చేశాయి. వాటికి ప్రభుత్వ పురస్కారాలు కూడా లభించాయి.

రంగారావుకు వేట అన్నా, క్రికెట్ అన్నా ఎంతో ఇష్టం. సినిమాల్లో బిజీగా వున్నా నాటకరంగాన్ని విస్మరించక పినిశెట్టి శ్రీరామమూర్తి రాసిన, 'పంజరంలో పక్షులు' నాటకాన్ని అప్పుడప్పుడూ ప్రదర్శించేవారు.

ఇంతటి మహానటుడు మన ఆంధ్రుల సొత్తు కావటం మన అదృష్టమేకాక గర్వకారణం కూడా అదే ఆయన హాలీవుడ్‌లో పుట్టి వుంటే ఆస్కార్ అవార్డులతో ముంచెత్తేవారు. అక్కడ పుట్టక పోవటం ఆయన దురదృష్టం. ఏమైనా తెలుగువారు సగర్వంగా చెప్పుకోదగిన నటయశస్వి, యస్.వి.రంగారావు.

**పృథ్వీరాజ్ కపూర్, అశోక్‌కుమార్, ఓంప్రకాష్, ప్రాణ్... ఈ నలుగురు విశిష్టనటుల్ని కలబోస్తే ఒక యస్.వి.రంగారావు అవుతారు. "ఆంధ్రదేశంలో యస్.వి.రంగారావు పుట్టడం మన అదృష్టం. ఆయన దురదృష్టం". ఇది విశ్వనట చక్రవర్తిగా వినుతికెక్కిన విశిష్టనటులు యస్.వి.రంగారావు గూర్చి సహనటులు గుమ్మడి వెంకటేశ్వరరావు వెలిబుచ్చిన అమూల్య అభిప్రాయం.**



# సూర్యకాంతం

డిశంబరు 1927 సం॥లో కాకినాడలో పొన్నాడ వారి ఇంట జన్మించారు సూర్యకాంతం. చిన్నతనం నుంచి నటనలో, నాటకాల్లో ఉత్సాహం కన్పరచి తన పంతొమ్మిదో యేట 'నారద నారది' చిత్రం ద్వారా, సినీరంగ ప్రవేశం చేశారు.

1946 నుంచి 1950 దాకా సహాయ పాత్రలు ధరించినా, సాధనావారి 'సంసారం' చిత్రంలోని గయ్యాళి పాత్ర ద్వారా ప్రేక్షకుల్లో గుర్తింపు పొందారు. ఆ వెంటనే అద్భుతమైన పాత్రలు ఆమెను వెతుక్కుంటూ వచ్చాయి. వాటిల్లో 'బ్రతుకుతెరువు', 'ప్రేమ', 'అమ్మలక్కలు', 'పెళ్ళిచేసి చూడు', 'చంద్రహారం' చెప్పుకోదగ్గవి.

భరణీ భానుమతి సరసన 'చక్రపాణి' చిత్రంలో మనోరమ పాత్రలో 'అంతెందుకు సగం చాలు' అంటూ హాస్యరసాన్ని అవలీలగా ఆవిష్కరించారు. కోడళ్ళని ఆరళ్ళు పెట్టే అత్త, సంసారాల్లో చిచ్చురేపే మందర తరహా పాత్రలు, భర్తను అదుపు ఆజ్ఞలో వుంచుకొనే గడసరి ఇల్లాలి పాత్రలు ఆమెకోసమే రచయితలు సృష్టించేవారు. నాగభూషణం, రేలంగి, రమణారెడ్డి, యస్.వి.రంగారావు సరసన ఎన్నెన్నో పాత్రల్ని రసవత్తరంగా పండించారు.

హీరో, హీరోయిన్ల పరంగా, కథాపరంగానో సినిమా టైటిల్స్ వుండటం పరిపాటి. అయితే కథకు కీలకమయిన ఒక పాత్ర అందునా అంతకుముందు గయ్యాళి పాత్రలకు పేరొందిన నటి ధరించే పాత్ర పరంగా 'గుండమ్మకథ' అని టైటిల్ నిర్ణయించటం విచిత్రమైతే ఆ చిత్రం బాక్సాఫీస్ బద్దలుకొట్టి ఆల్‌టైం ఎంటర్‌టైనర్‌గా పేరొందడం చారిత్రాత్మక విషయం. ఆ విధంగా నటిగా సూర్యాకాంతం చరితార్థురాలు. (ప్రస్తుతం ఆ చిత్రాన్ని రీమేక్ చేయాలంటే గుండమ్మపాత్రకు సరిపడిన నటీమణి ఎవరూ లేకపోవటం కూడా ఆమెకే దక్కిన క్రెడిట్.)

రక్తసంబంధం చిత్రంలో కాపురాన్ని కూల్చిన దుష్టపాత్రలో జీవించిన ఆమెను ఎదురుగా కన్పిస్తే ఏమయినా చేసేయ్యాలన్నంత కోపం ప్రేక్షకులకు కలుగుతుంది.

అంతకుముందు సూర్యకాంతం అనే పేరు చాలా ఇళ్ళల్లో తమ ఆడపిల్లలకు పెట్టుకున్నా, నటిగా సూర్యకాంతం ప్రాచుర్యం పెరిగాక ఆ పేరు పెట్టుకోటానికి చాలామంది సాహసించలేదు. అంతటి పాపులారిటి సంపాదించిన నటలోక విదుషీమణి సూర్యకాంతం.


యస్.వి.రంగారావు వంటి మహానటునితో భార్యగా, (మాంగల్యబలం, మంచిమనసులు, వెలుగునీడలు) ఆయనకు తల్లిగా హిడింబి పాత్రలో 'మాయాబజార్'లో 'సుపుత్రానీకిదితగదంటిని కదరా అంటూ, ఘటోత్కచుని (యస్.వి.ఆర్) కట్టడి చేయటం, ఆ పాత్రల్ని సజీవంగా, ఆవిష్కరించటం, యస్.వి.రంగారావు, సూర్యకాంతంలకే చెల్లింది.

అన్నపూర్ణావారి 'దొంగరాముడు, తోడుకోడళ్ళు, ఇద్దరుమిత్రులు, చదువుకున్న అమ్మాయిలు' చిత్రాలలో రేలంగి కాంబినేషన్‌లో నటనలో పోటీపడ్డారు. బాపు రూపొందించిన చిత్రాలు 'బుద్ధిమంతుడు'లో నాగభూషణం భార్యగా, 'అందాలరాముడు'లో పెసరట్లమ్ముకొనే సామాలమ్మగా, 'ముత్యాలముగ్గు'లో కాంట్రాక్టర్ రావుగోపాలరావు భార్యగా సహజంగా నటించారు. లవకుశలో రమణారెడ్డి కాంబినేషన్‌లో సూర్యకాంతం 'ఎందుకే నా మీద కోపం' అనే పాటను చిత్రీకరించారు దర్శకులు సి.పుల్లయ్య.

తెరపై గయ్యాళిగా నటించినా తెర వెనుక జీవితంలో ఆమె హృదయం నవనీతతుల్యం. షూటింగ్‌లో అందరితోనూ కలుపుగోలుగా, అప్యాయితగా వుండేవారు. అంతేకాదు తమ ఇంటి నుంచి రకరకాల పచ్చళ్ళు, పిండివంటలు తెచ్చి తోటి కళాకారులకు వడ్డించి, వారు తృప్తిగా తింటూండే ఆనందించే సహృదయత ఆమెది.

యావత్ భారత చలన చిత్ర చరిత్రను అవలోకిస్తే ఆ తరహా పాత్రల్ని కొంత మేరకు పోషించగలిగిన నటి హిందీ చిత్రరంగంలో దుర్గాఖోటే. అయితే సూర్యకాంతం సాత్విక ప్రధాన భూమికల్ని పోషించిన సందర్భాలూ ఉన్నాయి.

ఆమె సన్మానాలకు, సత్కారాలకు, ప్రెస్‌కాన్ఫరెన్స్‌లకు, బిరుదులకు దూరంగా వుండేవారు. వృత్తిని దైవంగా భావించి పాత్రకు పరిపూర్ణ న్యాయం చేకూర్చిన నటీనటుల్లో అగ్రశ్రేణిలో చెప్పుకోదగ్గ విలక్షణనటి సూర్యకాంతం.



# గుమ్మడి వెంకటేశ్వరరావు

**(9.7.1927-26.1.2010)**

9.7.1927న తెనాలి తాలుకా రావికంపాడులో జన్మించిన గుమ్మడి వెంకటేశ్వరరరావు తొలిసారిగా రంగు వేసుకున్నది హైస్కూల్ విద్యార్థిదశలో ఒక పేదరైతు వేషంలో, నటనపై అభిరుచి ఏర్పడ్డాక మాధవపెద్ది వెంకట్రామయ్యగారి ఆశీస్సులతో దుర్యోధన పాత్ర పోషించారు.

1950 ప్రాంతంలో తమిళనాడు టాకీసు అధినేత టి.ఎన్.సౌందర్‌రాజన్‌గారి అదృష్టదీపుడు చిత్రం ద్వారా సినీరంగ ప్రవేశం చేసిన గుమ్మడి, "రేపల్లెలో రాధ" చిత్రం దాకా 50 సంవత్సరాల కాలంలో ఐదువందల చిత్రాలలో భిన్న విభిన్న భూమికలు పోషించారు.

సాత్త్విక, ఆంగిక, వాచికాభినయానికి ఒక నిఘంటువుగా ప్రశంసించబడ్డారు. తెలుగు భాషా సౌందర్యం ఆయన గొంతులో పల్లవించింది. కళ్ళు మూసుకొని వింటే ఆ గొంతులో వాచకవరంగా సప్తస్వరాలు, నవరాగాలు విన్పిస్తాయి. ఆయన కల్చర్ ఆఫ్ వాయిస్ అంత ఘనమైనది.

'అర్ధాంగి' చిత్రంలో వయస్సులో తనకంటె ఏడెనిమిది సంవత్సరాలు పెద్దదైన శాంతకుమారికి భర్తగా జమీందారు పాత్ర పోషణతోనే గుమ్మడి నటజీవితం మలుపు తిరిగింది. అది వేజెళ్ళ "మరోమలుపు"తో పరాకాష్టకు చేరింది.

ఇక క్లిష్టమైన భూమికల ప్రసక్తి వస్తే అంజలీదేవితో కులదైవం, భానుమతితో అనురాగం, జమునతో చిరంజీవులు, మాఇంటి మహాలక్ష్మి, సావిత్రితో విచిత్ర దాంపత్యం, దేవికతో పండంటికాపురం – ఇవన్నీ ఆయన గంభీర ఉదాత్తనటనకు తార్కాణాలే.

మరి పౌరాణిక పాత్రల ప్రసక్తి వస్తే విశ్వామిత్రుడు (హరిశ్చంద్ర) దశరధుడు (సంపూర్ణరామాయణం) ద్రోణుడు (ఏకలవ్య) బలరాముడు (మాయాబజార్) ధర్మరాజు (పాండవవనవాసం) మరపురానివి.

యస్వీరంగారావు వంటి మహానటుడుండగా, మహామంత్రి తిమ్మరుసు పాత్ర తనకు దక్కటం ఒక అదృష్టంగా భావిస్తారు గుమ్మడి. 'రాయా' అంటూ శ్రీ కృష్ణదేవరాయల్ని సంబోధించడంలోనే ఆత్మీయత, అధికారం కలబోసిన ఓ విచిత్ర శబ్దం వినిపిస్తుంది.

గుమ్మడి ధరించిన కొన్ని పాత్రల్ని పరిశీలిస్తే విలనీని అండర్‌ప్లే చేస్తూ, తడి గుడ్డలతో గొంతులు కోస్తూ, నమ్మిన వాళ్ళకే ద్రోహం చేస్తూ, తేనెపూసిన కత్తిలా, గుండెలు తీసిన బంటులా నటించాలంటే యావత్ భారతచలనచిత్రరంగంలో గుమ్మడికి సాటి మరెవ్వరూ లేరు అనిపించుకున్న సందర్భాలు ఎన్నో వున్నాయి.

ఇటువంటి పాత్రలకు బీజం వేసింది ఎన్.టి.రామారావు. ఆయన స్వంత బ్యానర్‌పై నిర్మించిన "తోడు దొంగలు" చిత్రంలో గుమ్మడి, ఎన్.టి.ఆర్ ఇద్దరూ దుష్టపాత్రలు పోషించారు.

'నమ్మినబంటు'లో రైతుకు అన్యాయం చేసిన జమీందారు భుజంగరావు, నమ్మిన పాలేరును మోసగించి అతని భార్యను పొందగోరే మునసబు "ఏదినిజం"లో, శరత్ నవల ఆధారంతో తీసిన 'వాగ్దానం'లో తియ్య తియ్యని మాటలతో కథానాయికను నియంత్రించాలనుకునే పెద్దమనిషి, దివాన్ భానోజిరావుగా 'ఇద్దరు మిత్రులు', పాలిష్ట్ పెద్దమనిషిగా కనిపించే అండర్ గ్రౌండ్ డాన్‌గా 'జగత్‌కిలాడీలు', నమ్మకస్థుడనే ముసుగులో మోసాలు చేసే విలన్‌గా 'లక్షాధికారి'; ఇవన్నీ సాంఘిక చిత్రాల్లో విలనీని అండర్‌ప్లే చేసేవి. వాటిలో అత్యంత సహజంగా నటించారు గుమ్మడి.

నేనూ మనిషిలో జడ్జిగా, అక్కినేనితో అండర్‌వాటర్ ఫైట్ చేసిన 'వదిన'లో డైరెక్టర్ యముడిగా, ప్రత్యేకత కల పాత్రలు.

ఇక జానపదాల్లో అన్నకుమారుడిని హతమార్చాలని కుట్ర పన్నిన పినతండ్రి ప్రచండుడిగా 'రాజమకుటం'. స్వార్థంతో తన కుమారునికే రాజ్యం కట్టబెట్టాలని, మాయోపాయాలు పన్నిన రాజగురువుగా 'వీరకంకణం'. కపట సన్యాసిగా "అపూర్వ సహస్రశిరచ్ఛేద చింతామణి"ని వంచించిన మాయావి, 'రహస్యం' విలన్ శ్రీకంఠ ప్రభువుగా యస్వీరంగారావుతో పోటీపడి నటించారు. ఈ పాత్రల్ని నిశితంగా పరిశీలిస్తే గుమ్మడి విలన్‌గా ఎంతగా రాణించారో తెలుస్తుంది.

ఆ తరువాత ఆదుర్తి సుబ్బారావు గుమ్మడిని 'మంచి మనసులు' చిత్రంలో కథానాయకుని అన్నగా కరుణరసపూరితమైన పాత్రలో నటింపజేశారు. కాలగమనంలో అనేక చిత్రాల్లో సగటు మనిషి పాత్రలు, గుండెజబ్బుతో బాధపడుతూ, తుదిశ్వాస తీయబోయే పాత్రలు ఎక్కువ ఆయన్ని వరించాయి.

యావత్ భారతదేశంలో ఎక్కడ అంతర్జాతీయ చలన చిత్రోత్సవంజరిగినా అక్కడ తప్పనిసరిగా ప్రత్యక్షమయ్యే వ్యక్తి గుమ్మడి. డిగ్రీలు లేకపోయినా నట విశ్వవిద్యాలయంలో

డాక్టరేటును మించిన స్థాయిలో ఆయా చిత్రాల గుణగణాలను ఆయన విశ్లేషిస్తుండే శ్రోతలు పరవశించేవారు. ఆయన కంటబడ్డ ప్రతిభకు, ఉచితంగా పబ్లిసిటీ ఇవ్వడం ఆయనకో సరదా ఫలితంగా సినీరంగంలో అవకాశం పొందిన వారెందరో. (గణేశ్‌పాత్రో, మోదుకూరి జాన్సన్, ధూళిపాళ, ముప్పాళ రంగనాయకమ్మ) తనకు తగినవి కాదేమో, అనుకున్న పాత్రలను నిర్మాత, దర్శకులు ఆఫర్ చేస్తే సున్నితంగా తిరస్కరించి, ఆయా పాత్రలకు తగిన నటుల్ని సూచించిన సంస్కార హృదయం ఆయనది.

వారు నాకు అత్యంత ఆత్మీయులు. వారి జీవితచరిత్ర 'తీపిగుర్తులు – చేదుజ్ఞాపకాలు' పేరిట గ్రంథరూపంలో వచ్చినప్పుడు రచనాసహకారం అందించటం నాకు తీపిగుర్తు.

తెలుగువారు, సినిమాచరిత్ర గర్వించదగ్గ మహానటుడు, మహామనీషి గుమ్మడి, వారిని తెలుగు విశ్వవిద్యాలయం 'కళాప్రపూర్ణ' బిరుదుతో సత్కరిస్తే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 'రఘుపతి వెంకయ్య' అవార్డుతో గౌరవించింది. 16.1.2010న ప్రసాదు లాబ్‌లో మిత్రులందరితో కలిసి రంగుల మాయాబజార్ చిత్రం చూసి 'బహుశా ఇది చూడటం కోసమే నేను బ్రతికున్నానేమో' అని కంటతడి పెట్టారు. అది జరిగిన పదిరోజులకు 26.01.2010న కీర్తిశేషులయ్యారు.

**యస్వీరంగారావు వంటి మహానటుడుండగా, మహామంత్రి తిమ్మరుసు పాత్ర తనకు దక్కటం ఒక అదృష్టంగా భావిస్తారు గుమ్మడి. 'రాయా' అంటూ శ్రీ కృష్ణదేవరాయుల్ని సంబోధించడంలోనే ఆత్మీయత, అధికారం కలబోసిన ఓ విచిత్ర శబ్దం వినిపిస్తుంది.**



# పి.హేమలత

కుటుంబ కథాచిత్రాల్లో (ఉమ్మడికుటుంబం, మంచికుటుంబం, ఆదర్శ కుటుంబం, రెండుకుటుంబాల కథ) తల్లి వదిన, అక్కవంటి పెద్దతరహా పాత్రల్ని సామర్థ్యంతో సహజనటనతో తెరపై ఆవిష్కరించి, ఈమె మన కుటుంబ సభ్యురాలా అన్న భ్రమ కలిగించినన నటీమణి పి. హేమలత.

1926లో గుడివాడలో జన్మించిన అడుసుమిల్లి హేమలత వివాహానంతరం, భర్త శేషగిరిరావు ప్రోత్సాహంతో పరితాపం నాటకంలో కథానాయిక పాత్ర పోషించి, ఆంధ్ర నాటక కళాపరిషత్తులో ప్రదర్శించారు.

ఆ తరువాత పినిశెట్టి శ్రీరామమూర్తి రచన 'పల్లెపడుచు'లో వాంప్ టచ్ వున్న జమీందారిణి రమాదేవి పాత్రను పోషించారు.

స్ఫురద్రూపం, ఖంగునమ్రోగే కంఠస్వరం, భావాన్ని స్పష్టంగా ప్రదర్శించే సువిశాల ఫాలభాగం ఆమెకు పెట్టని అభరణాలయ్యాయి.

ప్రజానాట్యమండలితో సంబంధాలుండటం వల్ల తాతినేని ప్రకాశరావు తీసిన 'పల్లెటూరు'లో అత్యవసరంగా ఓ లాయరు భార్య వేషం వుంటే దానికి హేమలత పేరును సిఫార్సు చేశారు చదలవాడ కుటుంబరావు. తరువాత అవార్డు విన్నింగ్ మూవీ 'తోడుదొంగలు'లో యన్.టి. రామారావు భార్యగా నటించారు. ఆ తరువాత యన్.టి. ఆర్‌కు తల్లిగా మాతృదేవత, సవితి కొడుకు వంటి సాంఘిక చిత్రాల్లోనూ, లక్ష్మీకటాక్షం, గండికోట రహస్యం వంటి జానపద చిత్రాలలోనూ నటించారు.

గుమ్మడిగారితో ఆమె ఎక్కువ చిత్రాల్లో నటించారు. సంబరాల రాంబాబు, ఇల్లరికం, సెక్రటరీ, చదువుకున్న అమ్మాయిలు వంటి చిత్రాల్లో భార్యగాను, ఆత్మగౌరవంలో ఆయనకు తల్లిగాను నటించారు.

అక్కినేని తల్లిగా దొంగరాముడు, భార్యాబిడ్డలు వంటి చిత్రాల్లో బరువైన పాత్రలు పోషించారు.

హేమలత నటించిన పౌరాణిక చిత్రాల్లో చెప్పుకోదగ్గవి భూకైలాస్, (రావణుని తల్లి కైకసి) శ్రీకృష్ణరాయభారంలో (కుంతి) సంపూర్ణరామాయణం (కౌసల్య) బాలనాగమ్మ, రాజనందిని, వారసత్వం, జమిందారు చిత్రాల్లో ఈమెపై కొన్నిపాటలు కూడా చిత్రీకరించారు.

మల్లమ్మకథ, తిరుపమ్మకథ, తోబుట్టువులు చిత్రాల్లో గయ్యాళి తరహా పాత్రలు పోషించారు. రమణారెడ్డి సరసన 'గుండమ్మకథ', సి.యస్.ఆర్ కాంబినేషన్‌లో 'నిత్యకల్యాణం-పచ్చతోరణం', రామన్నపంతులు కాంబినేషన్‌లో 'కన్యాశుల్కం' (వెంకమ్మ) రామలింగయ్యతో 'బలిపీఠం' చిత్రాల్లో వైవిధ్యమైన పాత్రలు నిర్వహించారు. ఆమె నటించిన చివరిచిత్రం 'సీతమ్మ సంతానం' (1976)

బి.యన్.రెడ్డి 'బంగారుపాప' ప్లాన్ చేసినప్పుడు రౌడీ కోటయ్య (యస్.వి. రంగారావు)ను మాటలతో కంట్రోలు చేసే అక్కపాత్రను సృష్టించారు. ఆ పాత్రకు హేమలతను ఎంపిక చేసిన తరువాత, మేకప్ ఎఫెక్ట్‌ను దృష్టిలో ఉంచుకొని, పాత్ర స్వభావం చెడకుండా చెల్లెలుగా మార్చి చిత్రీకరించారు. ఆ పాత్ర పోషణలో ఆమె విజయం సాధించారు. ఆ తరువాత యస్.వి.రంగారావు కాంబినేషన్‌లో కలసివుంటే కలదు సుఖం, నమ్మినబంటు చిత్రాల్లో నటించారు.

సినిమారంగానికి దూరమైన తరువాత హేమలత ప్రస్తుతం హైదరాబాద్‌లో హైదర్‌నగర్ ప్రాంతంలో ప్రజాపిత బ్రహ్మకుమారి శాంతిసమాజంలో ప్రశాంత జీవనం సాగిస్తున్నారు.

రెండు మూడు తరాలకి చెందిన హేమాహేమీల వంటి నటీనటులందరి సరసన పాతిక సంవత్సరాల నటజీవితంలో దాదాపు మూడువందల పెద్దతరహా పాత్రల్ని పోషించి, ప్రేక్షకుల్ని మెప్పించిన నటీమణి పి. హేమలత.



# ఆర్.నాగేశ్వరరావు

1928లో జన్మించిన రాజనాల నాగేశ్వరరావు ఆలీఘర్ ముస్లిమ్ యూనివర్సిటీ నుండి డిగ్రీ పొందారు. కొంతకాలం హైదరాబాద్‌లో పారమౌంట్ థియేటర్‌కు మేనేజర్‌గా పని చేశారు. దర్శకులు సి.పుల్లయ్యగారి ఆహ్వానంతో 'సంక్రాంతి' సినిమాలో తొలిసారిగా నటించారు.

ఆరడుగుల స్ఫురద్రూపం, నిప్పులు చెరిగే కళ్ళు, విశాలమైన ఫాలభాగం, ఆర్.నాగేశ్వరరావుకున్న ప్రత్యేక లక్షణాలు. ఈ లక్షణాల వల్లనే అవకాశాలు అతన్ని వెతుక్కుంటూ వచ్చాయి.

సి.పుల్లయ్య దర్శకత్వంలో రూపొందిన 'సంక్రాంతి' చిత్రం ద్వారా సినీరంగం ప్రవేశం చేశారు. ఆ వెంటనే ఘంటసాల నిర్మించిన 'పరోపకారం' చిత్రంలో విలక్షణ పాత్ర పోషించిన ఆర్.ఎన్.ఆర్.పై 'జోడెడ్ల నడుమ జోరైన రగడ రేతిరి రేగిందోయ్' అనే పాటను చిత్రీకరించారు. దానిని ఘంటసాల పాడటం ఓ విశేషం.

దేవదాసు, కన్నతల్లి, పరోపకారం చిత్రాల్లో సహాయ పాత్రలు పోషించారు. బి.ఎ.సుబ్బారావు నిర్మించిన 'రాజు–పేద' పక్షిరాజా వారి 'అగ్గిరాముడు' చిత్రాల్లోని దుష్టపాత్రలకు న్యాయం చేశారు.

అన్నపూర్ణావారి 'దొంగరాముడు' చిత్రంలో 'బాబుల్‌గాడి దెబ్బంటే గోల్కొండ అబ్బా అనాలి' అనే రౌడీ బాబుల్‌గాడిగా నటించి, సినిమా అభిమానులు దశాబ్దాలు గడిచినా మరచిపోలేని డైలాగ్‌తో ఆర్.నాగేశ్వరరావు నిలిచిపోయారు. 'అరె నిజం చెబితే జైల్లో పెడతారేంటండి, చచ్చినా నిజం చెప్పను' అంటూ అమాయకత్వం కలబోసిన విలనిజాన్ని తన నటనలో ప్రదర్శించిన గొప్పనటుడు ఆర్.ఎన్.ఆర్. సావిత్రితో కలిసి ఆ చిత్రంలోనే ఆయన నటించిన పాట సన్నివేశం 'రారోయి మా ఇంటికి' ప్రేక్షకులు మరువలేరు. '

‘అదే మన తక్షణ కర్తవ్యం’ అన్న ఒక్క డైలాగ్‌నే దుశ్శాసనునిగా ‘మాయాబజార్’ చిత్రంలో మార్చి మార్చి పలుకటం, విజయావారి ‘అప్పుచేసి పప్పుకూడు’లో యన్.టి.ఆర్. చేత తన్నులు తిని ‘అదే మనిషి – అదే దెబ్బ’ అనటం కూడా మరపురానివి.

యన్.టి.ఆర్. కాంబినేషన్‌లో విలన్‌గా ‘జయంమనదే’, ‘ఇంటిగుట్టు’, ‘శభాష్‌రాముడు’, ‘రాజనందిని’, ‘రేచుక్క–పగటిచుక్క’ చిత్రాలలోనూ, అక్కినేని కాంబినేషన్‌లో విలన్‌గా ‘దొంగల్లో దొర’, ‘ఇల్లరికం’ చిత్రాల్లోనూ ఓహో అన్పించేలా నటించారు.

సిగరెట్ కాల్చటంలో రింగు రింగులుగా పొగవదలటం, అతని స్పెషాలిటి. ‘ఇల్లరికం’ చిత్రంలో ఆర్.నాగేశ్వరరావు ధరించిన శేషగిరి పాత్రను పరిచయం చేసే సన్నివేశంలోనే ఈ పాయింట్‌ను ఎస్టాబ్లిష్ చేశారు దర్శకులు తాతినేని ప్రకాశరావు.

ఆర్.నాగేశ్వరరావు హుందాగా నటించిన చిత్రాల్లో చెప్పుకోదగ్గవి ‘ఇలవేలుపు’ ఆశ్రమ యజయాని నాన్నగారు; ‘పెళ్ళినాటి ప్రమాణాలు’లోని మిలటరీ ఆఫీసర్. ఇదో విలక్షణమైన భూమిక. హీరోయిన్‌కి అన్న, హీరో కృష్ణారావుకు స్నేహితుడు. తరువాత బావ అవుతాడు. తన బావ టైపిస్ట్ రాధ (రాజసులోచన)తో చనువుగా వుండటాన్ని ముందుగా అపార్థం చేసుకొని తరువాత నిజం తెలుసుకొని ఆమెనే భార్యగా స్వీకరించే విచిత్రమైన పాత్రలో చాలా హోమ్లీగా నటించారు.

అతి చిన్న వయసులో ముప్పైమూడో ఏట (1959) కాన్సర్ వ్యాధితో పోరాడి మరణించినపుడు యావత్ ఆంధ్రప్రేక్షకులు అటు సినీరంగ ప్రముఖులు ఎంతో బాధపడ్డారు.

> ***సినీ నటజీవితం యేడు సంవత్సరాలే, నటించినవి 30 సినిమాలే అయినా చిరయశస్సు నార్జించి విలన్ వేషాలంటే ఆర్.ఎన్.ఆరే వెయ్యాలి అన్నంత ఖ్యాతి సంపాదించిన అందమైన విలన్ ఆర్.నాగేశ్వరరావు.***



# నాగభూషణం

సహజ నటనతో ఉదాత్తపాత్రల్ని పోషించినంత కాలం పట్టించుకోని చిత్రపరిశ్రమ, ప్రేక్షకులు ఒక తమిళ నటుణ్ణి అనుకరించి నటిస్తే ఆ నటునికి బ్రహ్మరథం పట్టి ఆకాశానికి ఎత్తేసారు. ఆ తరువాత ఆయనే ఓ ప్రత్యేక తరహా పాత్రల్లో పరిశ్రమను శాసించారు. ఆయన ఎవరో కాదు విలన్‌గా, కామెడి విలన్‌గా అటు సినిమారంగంలో, ఇటు నాటక రంగంలోనూ ప్రసిద్ధి పొందిన 'రక్తకన్నీరు' నాటభూషణం.

నెల్లూరులో కొంతకాలం రైల్వేశాఖలో ఉద్యోగం చేసిన చుండు నాగభూషణం, ప్రజా నాట్యమండలిలో సభ్యునిగా చేరి నాటక ప్రదర్శలివ్వటం సాగించారు.

సినిమారంగంలో అవకాశాల కోసం ప్రయత్నించి 'పల్లెటూరు', 'అర్ధాంగి', 'రేచుక్క' చిత్రాలలో గుర్తింపు గలిగిన పాత్రల్ని పోషించారు.

'రేచుక్క' చిత్రంలో కథానాయిక తండ్రి చిట్టి వీరన్నగా కొద్దిసేపే కనిపించినా అతనిలోని స్పార్క్ గమనించిన నిర్మాతలు వారి తదుపరి చిత్రం 'ఏది నిజం'లో హీరో పాత్ర నిచ్చారు. ఈ చిత్రంలో అమాయకుడైన పల్లెటూరి యువకునిగా, వైణికుడు ఎస్.బాలచందర్ దర్శకత్వంలో అత్యంత సహజంగా నటించారు నాగభూషణం. ఈ చిత్రానికి రాష్ట్రపతి బహుమతి కూడా లభించింది. అయినా పరిశ్రమ నుంచి కమర్షియల్ ఆర్టిస్టుగా బ్రేక్ లభించలేదు.

ఎవరిని ఎప్పుడు ఏ విధంగా అందలాలెక్కిస్తుందో, ఎవరిని అధఃపాతాళానికి అణగద్రొక్కుతుందో తెలియని విచిత్ర పరిశ్రమ చిత్రసీమ, ఇందుకు ఉదాహరణ నాగభూషణం జీవితం, తమిళంలో యం.ఆర్.రాధా నటించిన 'రక్త కన్నీరు' తెలుగులోకి డబ్ చేసినపుడు తన గళాన్ని ఎరువిచ్చారు నాగభూషణం. అది సక్సెస్ కావటంతో అదే టైటిల్‌తో రక్తకన్నీరు నాటకాన్ని ఆంధ్రప్రదేశ్‌లో వందలాది ప్రదర్శనలిచ్చి ఆ ప్రదర్శనల్లో సమకాలీన సమస్యలపై చెణుకులు విసిరి పాపులర్ అయ్యారు.

ఆ సమయంలోనే బాబూ మూవీస్ వారు నిర్మించిన 'మంచి మనసులు' చిత్రంలో

తమిళంలో యం.ఆర్.రాధా పోషించిన పాత్రను తెలుగులో పోషించారు. అది హిట్ కావటంతో నాగభూషణం దశ తిరిగింది.

'ఉమ్మడి కుటుంబం', 'కథానాయకుడు' ఈ రెండు చిత్రాలు నటుడిగా నాగభూషణం స్థాయిని ఎంతగానో పెంచాయి.

అక్కణ్నుంచి వెనక్కి తిరిగి చూడనవసరం లేనంత బిజీగా, 1980 వరకూ విలన్‌గానూ, కామెడికలబోసిన విలన్‌గా వందలాది పాత్రల్లో రాణించారు. కొన్నిటిలో సాత్విక పాత్రలు కూడా పోషించారు.

వాటిల్లో చెప్పుకోదగ్గవి 'మోసగాళ్ళకు మోసగాడు', 'బంగారు బాబు', 'మహమ్మద్ బీన్ తుగ్లక్', 'వింత దంపతులు', 'ఆత్మీయులు' మొదలైనవి.

తనకున్న పాపులారిటీ దృష్టిలో పెట్టుకొని రూపొందించిన 'నాటకాల రాయుడు' చిత్రంతో కాంచనతో కథానాయికునిగా నటించారు. అది విజయవంతం కాలేదు. బాపూ తీసిన 'బుద్ధిమంతుడు'లో శేషాద్రి, 'అందాలరాముడు'లో జమీందారు జె.బి. పాత్రను అత్యంత సహజంగా పోషించారు.

రవి ఆర్ట్ థియేటర్స్ పతాకంపై "ఒకే కుటుంబం', 'భాగస్తులు', 'ప్రజానాయకుడు' చిత్రాలను నిర్మించారు. వాటిలో మొదటిది వ్యాపార పరంగా ఫరవాలేదనిపించినా, మిగతా రెండూ నిరాశను మిగిల్చాయి.

యస్.వి.రంగారావు కాంబినేషన్‌లో 'అందరూ దొంగలే' (మాతృక హిందీ విక్టోరియా 203) చిత్రంలో హిందీలో ప్రాణ్ పోషించిన పాత్రను అద్భుతంగా పోషించారు. 'కురుక్షేత్రం'లో శకుని పాత్ర పోషించినపుడు, ప్రేక్షకులకు శకుని పాత్ర పట్ల గల అభిమానం వల్ల, నాగభూషణంను ఆ పాత్రలో రిసీవ్ చేసుకోలేకపోయారు.

అడవి రాముడులో 'చరిత్ర అడక్కు చెప్పింది విను' అంటూ ఆ పాత్రను పండించి ప్రేక్షకుల నీరాజనాలందుకున్నారు.

చివరిదశలో వేషాలు తగ్గిపోయినా, నాగభూషణం గౌరవ ప్రదంగానే తనువు చాలించారు.



# నిర్మలమ్మ

**(1925-2009)**

ఆంధ్రదేశంలో అప్యాయత వెల్లివిరిసే కుటుంబ వాతావరణంలో, ఓ పెద్దదిక్కుగా, ప్రేమను పంచి యిచ్చే తల్లి, అమ్మమ్మ, బామ్మ పాత్రలకు ప్రతిరూపంగా చెప్పుకోవాల్సిన నటీమణి నిర్మలమ్మ.

నిర్మల రంగస్థలంపై సాంఘిక నాటకాల్లో కథానాయికగా రాణించి, సినీరంగ ప్రవేశం చేసి, 1943లో ప్రతిభావారి 'గరుడ గర్వభంగం'లో కీలకమైన పాత్ర పోషించారు. ఆ వెంటనే 'పాదుక'లో కూడా ముఖ్యభూమిక నిర్వహించి, సినిమారంగం కలసిరాకపోవటంతో, తిరిగి సాంఘిక నాటకాల్లో నటించి హీరోయిన్ లేని లోటు తీర్చారు. వాటిల్లో 'దొంగాటకం', 'నేటినటుడు' 'నాటకం'లోని ప్రధానపాత్రలు ముఖ్యమైనవి.

సినిమారంగంలో నిర్మాణ వ్యవహారాలు చూస్తున్న జి.వి.కృష్ణారావుతో పెళ్ళి జరిగాక తిరిగి సినిమారంగంలో పునఃప్రవేశించారు. ఆదుర్తి నిర్మించిన 'కృష్ణప్రేమ' పౌరాణిక చిత్రంలో 'రుక్మిణి'గా, పి.ఎ.పి వారి 'భార్యాభర్తలు'లో గుమ్మడి సరసన హీరో తల్లిగా నటించారు. ఆ కోవలో గుమ్మడి – నిర్మల కాంబినేషన్ దాదాపు పాతిక చిత్రాల వరకూ కొనసాగింది.

నిర్మల నటజీవితంలో ఒక బ్రేక్ ఇచ్చిన పాత్ర 'మనుషులు మారాలి'లో హీరో తల్లి. తరువాత పింజల సుబ్బారావు నిర్మించిన జానపద చిత్రం 'పేదరాశి పెద్దమ్మ' కథలో టైటిల్ రోల్ పోషించారు.

1980 వరకూ తల్లి పాత్రల్లోనూ, ఆ తరువాత వయసు రీత్యా బామ్మ, అమ్మమ్మ పాత్రల్ని పోషించారు. 'ప్రేమాభిషేకం'లో హీరోయిన్ శ్రీదేవి బామ్మగా, 'ప్రేమమందిరం'లో కథానాయిక జయప్రదకు ముత్తవ్వ (వేశ్య) పాత్రను అత్యంత సహజంగా నటించారు.

విజయ బాపినీడు నిర్మించిన చిత్రాలకు నిర్మలమ్మ శాశ్వత ఆర్టిస్టు. అంతేకాదు

సహజత్వం ఉట్టిపడే పాత్రలు ఆమె కోసం ఆయన సృష్టించేవారు. ఇందుకు 'మగమహారాజు', 'నాకూ పెళ్ళాం కావాలి', 'గ్యాంగ్‌లీడర్' చిత్రాల్ని ఉదాహరణగా చెప్పుకోవచ్చు.

'పదహారేళ్ళ వయసు'లో రంగస్థల నటి సీతాలతతో కలిసి సహజత్వానికి దగ్గరగా ఉండే మహిళల వీధి పోరాట దృశ్యాల్ని రక్తి కట్టించారు.

'బలిపీఠం' చిత్రంలో కథానాయకుని సోదరిగా హరిజనయువతిగా, యాసభాషను, మరదలి పట్ల ప్రేమను చక్కగా ఒప్పించారు. ఇటీవల చిత్రం 'సీతారామరాజు'లో నాయకురాలు నాగమ్మ తరహాలో పగబట్టిన భూమిక సమర్థవంతంగా పోషించటం, ఓ విశేషం.

'మావిచిగురు'లో అల్లు రామలింగయ్య కాంబినేషన్‌లో 'కోదండరాముడంట కొమ్మలారా' పాటలో ఆయనకు దీటుగా నటించి సన్నివేశాన్ని రక్తి కట్టించారు.

రేలంగి నరసింహారావు దర్శకత్వంలో 'చలాకీమొగుడు – చాదస్తపు పెళ్ళాం' చిత్రాన్ని నిర్మలమ్మ నిర్మించారు. 'అమావాస్యచంద్రుడు' చిత్రంలో ప్రముఖ దర్శకులు ఎల్.వి.ప్రసాద్ భార్యగా, 'స్వాతిముత్యం'లో కమల్‌హాసన్‌కు బామ్మగా నటించి మెప్పించటం చెప్పుకోదగ్గ విశేషం.

భర్త మరణం తరువాత చిత్రాలు కొంత తగ్గించుకున్నా ఆత్మీయుల కోరిక మేరకు అడపాదడపా నటిస్తునే వున్నారు. సుమారు ఆరువందల పై చిలుకు చిత్రాలలో నటించిన నిర్మలమ్మ నట జీవితంలో రెండు, మూడు సార్లు నంది అవార్డ్ అందుకున్నారు. పలు సాంస్కృతిక సంస్థలు ఆమెను ఘనంగా సత్కరించాయి.

హిందీ చిత్రరంగంలో లలితాపవార్, తమిళరంగంలో మనోరమ విలక్షణపాత్ర పోషణలో సిద్ధహస్తులు, ఆ కోవలో తెలుగువారు సగర్వంగా చెప్పుకోదగిన నటీమణులు ఇద్దరు. ఒకరు సూర్యకాంతం, మరొకరు నిర్మలమ్మ.అనారోగ్యంతో కొంతకాలం సినీరంగానికి దూరంగా ఉండి 2009లో కీర్తిశేషులయ్యారు.



# రాజనాల

'ప్రభుత్వ ఉద్యోగం చేస్తున్నావు. సినిమాలపై సరదా వుంటే అక్కడకే వెళ్ళి ఉద్ధరించవచ్చుగా, ఈ ఉద్యోగం ఎందుకు' అని మండిపడ్డ ఆఫీసర్ సూచనను, పాజిటివ్‌గా తీసికొని ఉద్యోగాన్ని వదిలిపెట్టిన ఆశావాది రాజనాల కల్లయ్య.

సినిమారంగంలో టాకీ పితామహుడు హెచ్.ఎం.రెడ్డి నిర్మించిన 'ప్రతిజ్ఞ' చిత్రంలో తొలిసారిగా విలన్‌గా నటించే అవకాశం లభించటంతో పొంగిపోయారు. రెండవ అవకాశం తిరిగి హెచ్.ఎం.రెడ్డి నిర్మించిన 'వద్దంటే డబ్బు'లో జమీందారుగా నటించి రెడ్డిగారిని మెప్పించి మరో విజయం సాధించారు.

కొన్ని చిత్రాలలో గుణ చిత్రనటునిగా అప్పుడప్పుడు సాత్త్విక పాత్రలు పోషించినా, విలన్‌గానే ఆయన ముద్రపడ్డారు. ఈ రాజనాలలోని నటుణ్ణి పూర్తిగా ఆవిష్కరించిన విశిష్టవ్యక్తి జానపద బ్రహ్మ విఠలాచార్య. అంతకుముందు కూడా యన్.టి.ఆర్ సరసన 'జయసింహ' చిత్రంలో దుష్టసేనాని పాత్రను కూడా సమర్ధవంతంగా పోషించారు రాజనాల.

నిత్యం వ్యాయామం చేయటం వల్ల ఆయన శరీరం ఆయన అదుపాజ్ఞలలో వుండేది. ఆ రోజుల్లోనే గబ్బిట వెంకట్రావు నిర్వహణలో రూపొందిన 'విష్ణుమాయ' చిత్రంలో ఆంజనేయుని పాత్రకు ప్రాణప్రతిష్ఠ చేశారు రాజనాల. ఆయన ఆంజనేయుని భక్తుడు. ఉపాసకుడు ఆ పాత్రను పోషించేటప్పుడు చాలా నియమనిష్టలు పాటించేవారు.

'శ్రీ కృష్ణపాండవీయం'లో శిశుపాలుడు, 'శ్రీకృష్ణాంజనేయ యుద్ధం'లో ఆంజనేయుడు, 'వీరాభిమన్య'లో దుర్యోధనుడు, 'దానవీరశూరకర్ణ'లో ద్రోణాచార్యుడు, 'వినాయకచవితి'లో శతధన్వుడు, 'శ్రీకృష్ణావతారం'లో శిశుపాలుడు, 'పాండవవనవాసం'లో సైంధవుడు వంటి పాత్రలు పోషించి పౌరాణికాల్లో కూడా శభాష్ అనిపించుకున్నారు.

తరువాతి కాలంలో అటు యన్.టి.రామారావుతోనూ, యిటు కాంతారావుతోనూ, అసంఖ్యాకంగా నిర్మితమైన జానపద చిత్రాల్లో మాంత్రికునిగా,

సేనాధిపతిగా, ప్రతినాయక పాత్రలు పోషించి, అన్నిటా వారికి తగ్గ సమ ఉజ్జీ అనిపించుకున్నారు.

రొటీన్ విలన్ పాత్రలకు భిన్నంగా 'దొంగల్లో దొర' చిత్రంలో సి.ఐ.డి ఆఫీసర్‌గా, 'రైతుబిడ్డ'లో హీరో సహకరించిన స్నేహితునిగా, 'అల్లూరిసీతారామరాజు'లో మేజర్ గుడాల్‌గా, 'రాము'లో కామెడీ కలగలిపిన విలన్‌గా వెరైటీ నటన ప్రదర్శించారు.

విఠలాచార్య నిర్మించిన సాంఘిక చిత్రం అన్నా-చెల్లెలులో రాజనాల పోషించిన రౌడీ పాత్ర ఆయన జీవితంలో చెప్పుకోతగ్గది. భార్య దేవికను కొట్టి, వెంటనే 'కొట్టిన చెయ్యేకోరు' అన్నపాటలో చూపిన నటన మరపురానిది.

ఆడబ్రతుకు, కుటుంబగౌరవం, బందిపోటు, ఖైదీకన్నయ్య, వరలక్ష్మీ వ్రతం, చిక్కడు-దొరకడు, గండికోట రహస్యం వంటి అయిదువందల పై చిలుకు చిత్రాల్లో పనిచేసిన రాజనాల నటన, విలనీకి అలంకార ప్రాయమైన విలక్షణమైన నవ్వు ప్రేక్షక హృదయాల్లో చెరగని ముద్ర వేశాయి.

ఆ తరహా పాత్రలకు రూపకల్పన జరగకపోవటం, జానపద, పౌరాణిక చిత్రాల నిర్మాణం సన్నగిల్లటంతో హైదరాబాద్‌కు మకాం మార్చిన రాజనాలకు. అవకాశాలు లేకపోవటం, షుగర్ వ్యాధి రావటం వల్ల ఒక కాలు కోల్పోటంతో నిరాశా, నిస్పృహలకులోనై 1998 తనువు చాలించారు.

దేశరక్షణ నిధికోసం, పోలీసు సంక్షేమ నిధికోసం ఎన్.టి. రామారావు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొని ఒక కళాకారుడుగా తన బాధ్యతను నెరవేర్చుకున్నారు.



# పెరుమాళ్ళు

కృష్ణాజిల్లా ఉంగుటూరు గ్రామంలో జన్మించారు. సూరపనేని లక్ష్మీ పెరుమాళ్ళు. కొంతకాలం ఉత్తర హిందూస్థానంలో చదువుకుని నాటి యువజనోద్యమాలకు సమాంతరంగా వెలసిన వైజ్ఞానిక ఉద్యమాల్లో పాల్గొన్నారు. 1943 ప్రాంతంలో సుంకర విరచితమైన 'కష్టజీవి' బుర్రకథను రసవత్తరంగా చెప్పి, పెత్తందార్ల దోపిడీ విధానాన్ని, లంచగొండితనాన్ని ఎండగట్టారు. రాత్రిళ్ళు బుర్రకథలు చెబుతూ, పగలు ఇంటింటికి తిరిగి బియ్యం, బట్టలు సేకరించి వాటిని కరువు ప్రాంతాల్లోని బాధితులకు అందజేసేవారు. వీరితోపాటు మిక్కిలినేని రాధాకృష్ణమూర్తి, వారి శ్రీమతి బుర్రకథల్లో పాల్గొన్న సందర్భాలున్నాయి.

సుంకర–వాసిరెడ్డి సంయుక్త రచన 'ముందడుగు' నాటకంలో కోడూరి అచ్చయ్య దర్శకత్వంలో కథానాయకుని తల్లి పాత్ర ధరించి ప్రేక్షకుల నీరాజనాలందుకున్నారు. అందుకు భిన్నమైన దాదా పాత్రను 'మా భూమి' నాటకంలో పోషించారు.

నాగభూషణం నిర్మించిన 'ప్రజానాయకుడు'లో ఆయన నిజజీవితానికి దగ్గరగా ఉన్న పాత్రను (కోటీసు) పోషించారు. బడుగురైతు, రైతుకూలి, పెద్ద సంసారాన్ని ఈదలేక అవస్థ పడే సగటు మనిషి తరహా పాత్రలు ధరించటానికి ఆ రోజుల్లో పెరుమాళ్ళు పెట్టింది పేరు. ఇందుకు ఉదాహరణగా 1955లో విడుదలయి అనూహ్య విజయాన్ని సాధించిన 'రోజులు మారాయి' చిత్రంలో బడుగురైతుగా కథానాయకుడి తండ్రి కోటయ్య పాత్రలో జీవించిన పెరుమాళ్ళను సినీ విమర్శకులు, ప్రేక్షకులు మరచిపోలేరు. ముఖ్యంగా తనతో వేరు పడ్డ కొడుకు సహాయాన్ని అర్థించటానికి అహంకారం అడ్డురాగా, అందుకు భార్యను మధ్యవర్తిత్వం నెరపమని కోరినపుడు నటుడిగా పెరుమాళ్ళు చూపిన సంయమనం అనితర సాధ్యం.

రోజులు మారాయితో పాటు 'వరకట్నం' చిత్రంలోని కథానాయిక తండ్రి, 'పరివర్తన'లోని జమిందారు నౌకరు, 'అంతా మనవాళ్ళే' చిత్రంలోని నిజాయతి గల పత్రికా సంపాదకుడు పాత్రలు చెప్పుకోదగ్గవి.

'శ్రీశ్రీశ్రీ మర్యాదరామన్న, పుట్టిల్లు', 'చిట్టితల్లి' వంటి చిత్రాల్లో నటించిన పెరుమాళ్ళు శతాధిక చిత్రాల్లో నటించినా ఎప్పుడూ వేషాల కోసం వెంపర్లాడలేదు. ఆయన ధరించవలసిన పాత్రలు ఆయన్ని వెతుక్కుంటూ వచ్చేవి.

కె.బి.తిలక్ అనుపమ పతాకంపై స్వీయదర్శకత్వంలో రూపొందించిన 'ముద్దుబిడ్డ, ఈడు-జోడు, యం.ఎల్.ఎ' వంటి చిత్రాలలో సెంటిమెంట్‌కు ప్రాధాన్యత గల ఉదాత్తప్రాతలు పోషించారు.

'ప్రేమ్‌నగర్' చిత్రంలో హీరో కళ్యాణ్ మంచిచెడ్డలను బాధ్యతో చూసే సేవకుడు మల్లుగా కొద్దిసేపే నటించినా ఓహో అనిపించారు. కళ్యాణ్ పుట్టినరోజును జ్ఞాపకం చేసి పూలదండతో సత్కరించగా, హీరో పులకించిపోతాడు. ఆ విధంగా నటనలో ఆర్ద్రత ప్రదర్శించటం పెరుమాళ్ళకే చెల్లింది.

అయితే ఆయన వ్యక్తిగత స్వభావానికి భిన్నమైన భూమికను 'శ్రీకాళహస్తి మహత్యం' నాటకంలో పోషించారు. అది విలనీ టచ్ వున్న పూజారి పాత్ర. దానికి కూడా ఆయన న్యాయం చేశారు. ఆ నాటకాన్ని ఆంధ్రదేశమంతటా వల్లం నరసింహారావు, పద్మనాభం బృందంతో కలసి ప్రదర్శించారు.

మద్రాస్ ఫిలిం ఫాన్స్ సత్కారాన్ని అందుకున్న పెరుమాళ్ళు 1972లో కన్నుమూసారు.

కళాకారుడుగా జీవించి దానిమూలంగా వచ్చే ప్రతిఫలాన్ని సామాన్యులకు అందజేయడానికి త్రికరణశుద్ధిగా అంకితభావంతో కృషిచేసిన పెరుమాళ్ళు ధన్యజీవి.



# కె.వి.ఎస్.శర్మ

9.02.1924న గుంటూరు జిల్లాలో జన్మించిన కలపటపు వెంకట సుబ్బరాయశర్మ (కె.వి.యస్.శర్మ) బాల్యం, విద్య విజయవాడలో గడిచాయి. హైస్కూల్ రోజుల్లోనే యన్.టి.రామారావు వారికి సహాధ్యాయి. గుంటూరులో డిగ్రీ చదివిన రోజుల్లో యన్.టి.ఆర్. కె.వి.యస్ శర్మ కలిసి జగ్గయ్యతో నాటకాలాడారు.

ఆ తరువాత నాగపూర్‌లో 'లా' చదివిన శర్మ విజయవాడ వచ్చి నాటకాల్లో పాల్గొన్నారు.

పాతాళభైరవి శతదినోత్సవ సంబరంలో భాగంగా డి.వి.నరసరాజుగారి నాటకంలో పేజీలకొద్దీ డైలాగులు చెప్పే కామరాజు పాత్రను కె.వి.యస్‌శర్మ పోషించగా దానికి ఇంప్రెస్ అయిన చక్రపాణి, శర్మను మద్రాసు పిలిపించి, తొలిసారిగా 'చంద్రహారం చిత్రంలో జోగారావు ధరించిన నిక్షేపరాయుడికి సహాయకులుగా వుండే "ఎంతచెబితే అంతగాళ్ళు" పాత్రను వేయించారు.

శర్మ సామర్థ్యం మీద, నటనమీద వున్న నమ్మకంతో యన్.టి.రామారావు "జయసింహ" (1955) చిత్రంలో యస్.వి.రంగారావు వద్ద చండసేనునిగా సహాయక విలన్ పాత్రను ఇవ్వగా అద్భుతంగా రాణించారు శర్మ.

1960 ప్రాంతంలో ''వీరపాండ్యకట్టబ్రహ్మన్న'' డబ్బింగ్ చిత్రం విడుదలయినప్పుడు శివాజిగణేశన్ పలికిన ఎందుకు కట్టాలిరా శిస్తు, నీరు పోశావా, నారు నాటావా? వంటి డైలాగులు ప్రేక్షకుల్ని ఉద్రేకపరచి చప్పట్లు కొట్టేలా చేశాయి. ఈ గొంతు కె.వి.యస్.శర్మది అని తెలుసుకుని ఆశ్చర్యపోయారు. ఎందుకంటే, అంతవరకూ శివాజికి జగ్గయ్య డబ్బింగ్ చెప్పేవారు కనుక.

అంతకుముందు యన్.జి. రామచంద్రన్‌కు కూడా "ఆలీబాబా నలభై దొంగలు" చిత్రానికి శర్మ డబ్బింగ్ చెప్పారు.

వందలాది డబ్బింగ్ చిత్రాలకు గాత్రదానం చేసి ఖంగుమనే కంఠస్వరంతో

పాత్రకు ప్రాణం పోసిన శర్మ. నటుడిగా శతాదిక చిత్రాల్లో తన బహుముఖ ప్రజ్ఞను కనబరిచారు. ఒకకంట క్రౌర్యాన్ని, మరోకంట కరుణను ప్రదర్శించి ప్రేక్షకుల చేత, పరిశ్రమచేత శభాష్ అనిపించుకున్నారు.

తొలిదశలో యన్.టి.ఆర్ ఈయనపట్ల చూపిన ఆదరణ మరువలేనిది. పాండురంగ మహాత్మ్యంలో ఈయనపై 'హర, హర, హర, శంభో' అన్న పాటను కూడా చిత్రీకరించారు.

'సీతారామకల్యాణం'లో పరశురామునిగా ఒకేఒక్క సన్నివేశంలో గొప్పగా నటించి తన ప్రజ్ఞను ప్రదర్శించారు. అలాగే 'గులేబకావళి కథ' చిత్రంలో సేనాపతిగా దుష్టభూమిక సమర్థవంతంగా పోషించారు.

'చిట్టితమ్ముడు' చిత్రంలో కొంగముక్కు, గూనివాడు అయిన దొంగవేషం, అనురాగంలో పిచ్చివానిగా, సతీఅనసూయలో సుమతి భర్త కౌశికునిగా, ఇంకా దొంగల్లో దొర, విమల, పల్నాటియుద్ధం, రక్తసంబంధం, తోటలో పిల్ల కోటలో రాణి, వీరాభిమన్యు చిత్రంలో శకుని – ఇలా వైవిధ్యమున్న పాత్రలు పోషించి, వాటికి న్యాయం చేశారు.

వరవిక్రయం నాటకంలోని శింగరాజు లింగరాజు తరహా పాత్రను "అభిమానం" చిత్రంలో పోషించగా ఆయనపై చిత్రీకరించిన పాట "మదినిన్ను నెరనమ్మి కొలుతునే మాతా దయగను ధనలక్ష్మీ" లో చూపిన హావభావాలు మరపురానివి. 'శాంతినివాసం' చిత్రంలో కథానాయక రాజసులోచనకు తండ్రిగా ప్లీడరు వేషంలో తమాషా హాస్యాన్ని పలికించారు. వీరు నటించిన చివరిచిత్రం 'శ్రీమతి'.

ఖంగునమ్రోగే కంఠస్వరంతో,నవరసాలు, నవరాగాలు పలికించటం ఓ గొప్పకళ. ఆ కళలో నిష్ణాతులైన వారిని అభిమానించే ప్రేక్షకుల జ్ఞాపకాల్లో సుస్థిరస్థానం పొందిన విలక్షణ నటుడు కె.వి.యస్.శర్మ.



# ఛాయాదేవి

"ఇవి పిడకలు కొట్టిన చేతులే నాతో పెట్టుకోకు అని మహానటి సావిత్రితోనూ, దానికి ఉండి ఒకటే మనకు లేక ఒకటే అని" జమునను గూర్చి గుండమ్మ కథలో సూర్యకాంతంతోనూ పోటీగా మాట్లాడిన నటి ఛాయాదేవి. ఆ చిత్రంలో సూర్యకాంతంతో సమ ఉజ్జీగా అనేక సన్నివేశాలను గయ్యాళితనం, గడుసుతనం కలిసిన దుర్గమ్మ పాత్రను తన నటనతో పండించారు.

గుంటూరులో జన్మించిన ఛాయాదేవి, కొంతకాలం నృత్యం కూడా అభ్యసించారు. మద్రాసు వెళ్ళి సినిమాల్లో నటించాలనుకున్న ఆమెకు తొలి అవకాశం 1942లో 'దీనబంధు' చిత్రం ద్వారా లభించింది. ఆమె నటనకు తగిన పాత్ర 1953లో యన్.టి.రామారావు నిర్మించిన 'పిచ్చిపుల్లయ్య' చిత్రంలో వితంతువు ఐన ఓ జమీందారిణిగా అవకాశం వచ్చింది. ఆ చిత్రంలోని ఆమె నటనకు పలువురి ప్రశంసలు పొందారు ఛాయాదేవి. 'కన్యాశుల్కం'లోని పూటకూళ్ళమ్మగా మరో మంచి అవకాశం లభించింది.

నిండయిన విగ్రహం, మంచి ముఖకవళికలు కలిగిన ఛాయాదేవి, క్యారెక్టరు నటిగా గయ్యాళి పాత్రలు, సవితి తల్లి పాత్రలు, హాస్యపాత్రలు పోషించి వెండితెరను తన నటనతో రక్తి కట్టించారు. దాదాపు రెండు వందల చిత్రాల్లో నటించి, ప్రతిపాత్రకు ఒక గుర్తింపు తెచ్చారు.

రమణారెడ్డి సరసన హాస్యనటి పాత్రలో అపూర్వ సహస్రశిరచ్ఛేద చింతామణిలోను, కె.వి.రెడ్డి దర్శకత్వంలోని పెళ్ళినాటి ప్రమాణాలులో గడుసు ఇల్లాలుగాను నటించారు. జగపతివారి 'అదృష్టవంతులు'లో సూర్యకాంతంతో పోటీగా పెసరట్ల పేరమ్మగా హాస్యం పండించారు.

పూజాఫలంలో యల్.విజయలక్ష్మి తల్లిగా వేశ్య మాత పాత్ర, డబ్బు పిచ్చి గల


జమిందారిణిగా భలే అమ్మాయిలలోనూ, పాడిపంటలులో శేషమ్మ, తల్లిప్రేమ, అత్తలు-కోడళ్ళు, సంబరాల రాంబాబు, చిట్టితమ్ముడు, గంగ-మంగ ఇలా ఎన్నో సాంఘిక చిత్రాలు, మోహిని భస్మాసురలో శచీదేవిగా, కృష్ణావతారంలో శిశుపాలుని తల్లిగా, సంపూర్ణరామాయణంలో మంధరగా ఎన్నో పౌరాణిక చిత్రాలలోను, పల్నాటియుద్ధంలో మాంచాల తల్లి రేఖాంబగా, శ్రీకాకుళ ఆంధ్ర మహవిష్ణుకథలో మహారాణిగా యస్.వి.ఆర్. సరసన, పరమానందయ్య శిష్యులకథలో నాగయ్య సరసన విభిన్న పాత్రలు పోషించారు.

అన్నిటిని మించి చెప్పుకోదగినది మాయాబజార్‌లోని 'రేవతి' పాత్ర బలరామునిగా గుమ్మడి నటించగా, శృంగార, వీర రసాలను, అసూయ, ఆడంబరం లక్షణాలను ఎంతో సహజంగా నటించి మెప్పించటమేకాక లాహిరి లాహిరి పాటలో చివర పల్లవిలో నౌకా విహారం చేయటం ముద్దుగా అభినయించటం, ఓ ప్రత్యేకత. ఇదే రేవతి పాత్రను 'శ్రీకృష్ణార్జునయుద్ధం'లో మిక్కిలినేని సరసన పోషించారు.

ఆమె నటించిన ఇతర చిత్రాలలో చెప్పుకోదగ్గవి 'తల్లిప్రేమ, గండికోటరహస్యం, ఉమాచండీగౌరీ శంకరుల కథ, గులేబకావళికథ, బాటసారి'.

ఏ పాత్ర పోషించినా తన నటనతో దానికి ఓ గుర్తింపు తెచ్చి, మన చుట్టుప్రక్కల వున్న వారిలా అనిపింప చేయగల సహజత్వం ఆమె సొంతం, సాత్విక పాత్రలతో ఆమె అందం, ఓ విధమయిన చిరునవ్వు వెలికి వచ్చి ప్రేక్షకుల్ని మురిపిస్తాయి.

మధుమేహ కారణంగా, ఓకాలు కూడా తొలగించారు, అనారోగ్యంతో తనువు చాలించిన ఛాయాదేవి, సూర్యకాంతం తరువాత ఆస్థాయి నిలబెట్టుకున్న ఏకైక నటి.





# రామన్నపంతులు

ఔత్సాహిక నాటక రంగానికి నటుడిగా, దర్శకునిగా, న్యాయనిర్ణీతగా, రేడియో ఆర్టిస్టుగా విశిష్ట సేవలందించిన వ్యక్తి విన్నకోట రామన్నపంతులు.

వృత్తి రీత్యా లాయరు. అదే ఆయనకు ప్రధానం. ప్రవృత్తి నటన. ఎప్పుడు కేసులతో బిజీగా వుంటూ నటనపై మమకారాన్ని చంపుకోలేక వీలుచిక్కినపుడల్లా నాటక ప్రదర్శనల్లో పాల్గొనేవారు.

1950 ప్రాంతాల్లో విజయవాడలో సుంకర కనకారావు (అరుణోదయ నాట్యమండలి) కొప్పరపు సుబ్బారావు (రాఘవ కళాకేంద్రం) డి.వి.నరసరాజు, మాచినేని, కె.వెంకటేశ్వరరావు, రామచంద్రకాశ్యప, కె.వి.యస్.శర్మ, విన్నకోటరామప్పపంతులు, నిర్మల ప్రభృతులతో కలిసి గురజాడవారి కన్యాశుల్కం నాటకం విజయవంతంగా ప్రదర్శించేవారు. ఆ నాటకంలోని 'తాంబూలాలు ఇచ్చాను తన్నుకు చావండి' అంటూ అగ్నిహోత్రవధాన్లు పాత్రను రామన్నపంతులు కోసమే గురజాడ వారు సృష్టించారా అన్నంత గొప్పగా ఆ పాత్రకు ప్రాణం పోశారు.

సుస్పష్ట విలక్షణ వాచకాభినయానికి పెట్టింది పేరు రామన్నపంతులు బి.యన్.రెడ్డి వాహిని పతాకంపై తీసిన "బంగారుపాప" చిత్రంలో జమిందారు పాత్రనిచ్చి రామన్నపంతులుగారిని ప్రోత్సహించారు.

ఆ తరువాత వినోదావారు నిర్మించిన 'కన్యాశుల్కం' చిత్రంలో నాటకంలో పోషించిన అగ్నిహోత్రావధాన్లు పాత్రను పోషించి 'దీని సిగతరగ, ప్రతివాడు నా సొమ్ము తిని, నన్ను అనేవాడే. తాంబూలాలిచ్చేసాను తన్నుకుచావండి" అంటూ ఛాందసంగా మాట్లాడిన డైలాగ్‌లకు, నటనకు ఇటు ప్రేక్షకులనుంచి, పరిశ్రమనుంచి ప్రశంసలందుకున్నారు.

ఆ సంవత్సరమే (1955) అన్నపూర్ణవారు కె.వి.రెడ్డి దర్శకత్వంలో నిర్మించిన 'దొంగరాముడు' చిత్రంలో జగ్గయ్యకు అన్నగా హుందాగల, భూమిక పోషించారు.

లాయర్‌ల వృత్తిపట్లగల అంకితభావంతో, ఆయన ఎప్పుడూ సినిమా వేషాల కోసం వెంపర్లాడి, విజయవాడ దాటి మద్రాస్ చుట్టూ ప్రదక్షణలు చేయలేదు. ఆయనే కావాలి, ఆయనచేతే వేషం వేయించాలి అనుకున్న బాపూరమణలు పిలిచి వారిలో తొలిచిత్రం 'సాక్షి'లో తడిగుడ్డతో గొంతులు కోసే విలన్ మునుసుబు పాత్రను ధరింపజేశారు.

అన్నపూర్ణవారి 'చదువుకున్న అమ్మాయిలు'లో కథానాయక సావిత్రికి తండ్రిగానూ, భరణీవారి 'బాటసారి'లో కథానాయకుడు అక్కినేనికి తండ్రిగానూ, బాపుతీసిన 'బంగారు పిచ్చిక'లో చంద్రమోహన్ తండ్రిగా గంభీరమైన పాత్రలు పోషించారు.


జంధ్యాల తొలిచిత్రం ముద్దమందారంలో కథకు కీలకమయిన పాత్రను రామప్పపంతులు చేత వేయించారు. ఆ తరువాత మల్లెపందిరి వంటి కొన్ని జంధ్యాల చిత్రాలలో మాత్రమే పంతులుగారు నటించారు.

వీరి అబ్బాయి విజయరాం కూడా రంగస్థలంపైనా సినిమారంగంలోనూ, రాణించన నటుడే, అతని సహోధ్యాయులు సుత్తివీరభద్రరావు, సుబ్బరాయశర్మ. వీరంతా రామప్పపంతులు దర్శకత్వంలో దశమగ్రహం, సంభవామి యుగేయుగే నాటకాలు ప్రదర్శించేవారు. నటుడు మురళీమోహన్ కూడా ఆ ప్రదర్శనలో తొలిసారి రంగు వేసుకున్నారు.

1964లో ఈ గ్రంథకర్త తన మిత్రబృందంతో కలసి ఏలూరులో డి.వి. నరసరాజుగారి 'నాటకం' ప్రదర్శించినపుడు వారందరికీ సూచనలు ఇచ్చి స్వయంగా మేకప్ చేయడం ఓ విశేషం.

నటనకు, ఆహార్యానికి సంబంధించి అటు ఆలిండియా రేడియోలోనూ, ఇటు వేదికల మీద ఆయన ఎన్నో లెక్చర్లు ఇచ్చారు. వాటిపైన నటశిక్షణ, రూపశిల్పం అనే పుస్తకాలు కూడా వ్రాసారు.

సినిమానటుడిగా తక్కువ చిత్రంలో నటించినా ఆయన ప్రేక్షకుల హృదయాల్లో నిలిచిపోయింది అగ్నిహోత్రావధాన్లుగానే.



# మిక్కిలినేని

'జీవనమే పావనము, నవజీవనమే పావనము' అని అర్ధాంగితో కలిసి వీణా నాదాన్ని ఆలపిస్తూ ఆ దుర్గాదేవి పూజను అలసత్వం చేసే మహారాజుగా 'కనకదుర్గ పూజా మహిమ'లో కన్పించి, ఘంటసాల స్వరానికి అభినయించిన విలక్షణ క్యారెక్టర్ ఆర్టిస్టు మిక్కిలినేని రాధాకృష్ణమూర్తి.

ఆరడగులు పైన ఎత్తు దానికి దగ్గ లావుతో నిత్యం వ్యాయామం చేసే శరీరం. సువిశాలమైన నుదురు, కంగుమనే కంఠస్వరం, సునిశితమైన చూపులు కలిసిన ఈ ఆకర్షణీయమైన రూపం చూసి నటులు నందమూరి ఎంతగానో ముచ్చటపడి, తన సరసన ప్రతిష్ఠాకరమైన పాత్రలకు మిక్కిలినేనిని ఎంపిక చేసేవారు.

గుంటూరు జిల్లా లింగాయపాలెంలో 1916 జూలై 7 జన్మించారు మిక్కిలినేని. వెటర్నరీ విద్యలో డాక్టరు డిప్లొమా పొందారు. చిన్నతనం నుంచి జానపద కళారూపాలను అభిమానించి, అందులో ప్రావీణ్యత సంపాదించారు. చింతామణి, రంగూన్‌రౌడీ నాటకాల్లో ప్రధానపాత్రలు పోషించి, గాయక నటుడు అనిపించుకున్నారు.

పునాదిపాడులో మహాత్మాగాంధీ, ప్రసంగం విని, అభిమానించి స్వాతంత్ర్య పోరాటంలోపాల్గొని జైలు శిక్ష అనుభవించారు. కమ్యూనిస్టుపార్టీని అభిమానించి ప్రజానాట్యమండలిలో కీలక పాత్ర పోషించారు. ప్రజా నాట్య మండలికి చెందిన పెరుమాళ్ళు, నాగభూషణం, తాతినేని ప్రకాశరావు వంటి వారితో కలిసి మద్రాసు వెళ్ళారు, సినీరంగంలో తమ సత్తా చూపటానికి.

కె.యస్.ప్రకాశరావు 1951లో నిర్మించిన 'దీక్ష' చిత్రం నుంచి 'భైరవద్వీపం' (1994) వరకూ సుమారు 400 పైగా తెలుగు చిత్రాలలో సౌమ్యపాత్రలు, దుష్టపాత్రలు రెండింటినీ సమానంగా ఒప్పించి, మెప్పించిన నటులు మిక్కిలినేని.

ఆకర్షణీయమైన రూపం కనుక మహారాజు, మాంత్రికుడు, ధర్మరాజు, బలరాముడు, కర్ణుడు వంటి పాత్రలెన్నో చేశారు. పాండవవనవాసంలో దుశ్శాసనునిగా,

ద్రౌపది వలువలూడ్చే సన్నివేశంలో పాట జరుగుతుండగా చెయ్యెత్తి సైలెంట్ లాఫ్ నవ్వుతారు,  అదో స్పెషల్ ఎట్రాక్షన్‌గా నిలిచింది.

చారిత్రక చిత్రాలలో తెనాలి రామకృష్ణలో రాజద్రోహి కనకరాజు, 'పల్నాటియుద్ధం' కన్నమదొర, 'మహామంత్రి తిమ్మరుసు'లో రామలింగనాయకుడు, అమరశిల్పిజక్కనలో విష్ణువర్ధనుడిగా నటించారు. పౌరాణికాలలో యన్.ఎ.టి. వారి సీతారామకల్యాణం జనకుడు, శ్రీకృష్ణపాండవీయం, శ్రీకృష్ణసత్య, దానవీరశూరకర్ణ, మద్విరాటపర్వంలో భీష్మునిగా, వరకట్నం చిత్రంలో కుటుంబ పెద్దగా, ఉమ్మడి కుటుంబంలో తండ్రిగా ఎన్.టి.ఆర్‌తో కలిసి 150 పైగా చిత్రాలలో నటించారు. 'రాజకోటరహస్యం, భామావిజయం, అగ్గివీరుడు, ప్రతిజ్ఞాపాలన, లక్ష్మీకటాక్షం' వంటి చిత్రాలలో మహారాజుగా నటించారు. సాంఘిక చిత్రాలలో 'మేనరికం'లో జమిందారు, 'కులగోత్రాలు'లో దొంగ, 'లక్షాధికారి'లో రౌడీ; ఇవేకాక జడ్జి, లాయరు, డాక్టరు, పోలీస్‌ఆఫీసరు వంటి పాత్రలెన్నిటినో సునాయాసంగా పోషించిన నటులు మిక్కిలినేని.

మిక్కిలినేనిలో మంచి రచయిత ఉన్నాడన్న విషయం, ఆయన వ్రాసిన 'ఆంధ్రనాటకరంగచరిత్ర', నాటకరంగానికి చెందిన నటుల వివరాలతో కూడిన 'నటరత్నాలు' గ్రంథాలు తెలియచేశాయి. నటరత్నాలు గ్రంధాన్ని తనను అభిమానించి, ప్రోత్సహించిన నటరత్న ఎన్టీరామారావుకు అంకితమిచ్చారు. ఆంధ్ర నాటకరంగ చరిత్ర పుస్తకానికి కేంద్ర సాహిత్య అకాడెమీ అవార్డ్ లభించింది. వీరు వ్రాసిన 'జానపద కళారూపాలు' పుస్తకానికి తెలుగు విశ్వవిద్యాలయ పురస్కారం లభించింది. ఆంధ్ర విశ్వవిద్యాలయం కళాప్రపూర్ణ పురస్కారం అందించి గౌరవించింది.

మిక్కిలినేని భార్య శ్రీమతి సీతారత్నం మాభూమి నాటకంలో మిక్కిలినేనితోపాటు వీరనారి సీతమ్మ పాత్ర పోషించారు. వీరికి సినారె, గుమ్మడి, నేరెళ్ళ వేణుమాధవ్, ఎన్.టి.ఆర్. మంచి మిత్రులు. బహుముఖ ప్రజ్ఞాశాలి మిక్కిలినేని రాధాకృష్ణమూర్తి 21.02.2011న స్వర్గస్తులయ్యారు.



# యం. బాలయ్య

సినీరంగంలో నటుడిగా జీవితాన్ని ప్రారంభించి, ఆ తరువాత కధారచయితగా, నిర్మాతగా, దర్శకునిగా బాధ్యతలు స్వీకరించి విజయం సాధించినవారు బహు కొద్దిమంది.

హిందీలో వి. శాంతారాం, రాజ్‌కపూర్, మనోజ్‌కుమార్‌లను తెలుగులో యన్.టి.రామారావు, కృష్ణ, భానుమతిలను ఉదహరించవచ్చు. ఆ కోవలో చెప్పుకోదగిన మరో విశిష్ట వ్యక్తి యం.బాలయ్య.

గుంటూరుజిల్లా అమరావతి మండలం చావపాడులో గ్రామంలో 09-04-1930న జన్మించారు బాలయ్య. హైస్కూల్ విద్య గుంటూరులో పూర్తిచేసి మద్రాసు లయోలా కాలేజీలో బి.ఎస్.సి పాసయ్యి, అక్కడే గిండిలోని ఇంజనీరింగ్ కాలేజీలో నాలుగు సంవత్సరాలు మెకానికల్ ఇంజనీరింగ్ పూర్తిచేశాడు. ఆ దశలోనే ఒక నాటకంలో నటించి మెప్పించారు. ఆ తరువాత ఆంధ్రసాహితీ సమితికి కార్యదర్శిగా వుంటూ, ఆత్రేయ చేత ప్రగతి నాటకం రాయించి తాపీ చాణిక్య దర్శకత్వంలో విజయవంతంగా ప్రదర్శించి పోటీల్లో మొదట బహుమతి పొందారు.

కాకినాడలో 1952 నుంచి 1955దాకా లెక్చరర్‌గా పనిచేసి 1956లో మద్రాస్‌లోని తిరువత్తియార్‌లో కె.సి.పి కంపెనీలో చేరారు.

సరిగ్గా ఆ సమయంలోనే సారథీవారు 'ఎత్తుకు పైఎత్తు' చిత్రం తీస్తూ కొత్త నటుణ్ణి హీరోగా పరిచయం చేయాలనే ఉద్దేశ్యంతో ఉన్నారు దర్శకుడు తాపీ చాణిక్య అంతకుముందే పరిచయం ఉన్న బాలయ్యను బలవంతంగా ఆ వేషానికి ఒప్పించారు.

బాలయ్య ఆ చిత్రంలోని పాత్రను సమర్థవంతంగా పోషించారు. వెనువెంటనే వరుసగా భాగ్యదేవత, కుంకుమరేఖ, మనోరమ, పార్వతీకళ్యాణం (శివుడు) గుళ్ళోపెళ్ళి, చివరకు మిగిలేది చిత్రంలో కధానాయకునిగా హుందాగా నటించారు.

'మాయాబజార్' చిత్రంలో శ్రీకృష్ణునిగా యన్.టి.ఆర్ నీరాజనాలందుకోగా, ఆ కృష్ణుని పాత్రను బాలయ్య, ఆదుర్తి సుబ్బారావు దర్శకత్వంలో 'కృష్ణప్రేమ'లో పోషించారు.

పాలిష్డ్ విలన్లుగా గుమ్మడి, జగ్గయ్య పేరొందిన రోజుల్లో 'మొనగాళ్ళకు మొనగాడు' చిత్రంలో ఆ తరహా పాత్రను స్టయిల్‌గా సిగరెట్ కాల్చడంతో సహా ఉత్తరాది నటుడు అశోక్ కుమార్‌కు ధీటుగా నటించడం, ఓ విశేషం.

ఇదిలా ఉండగా స్వంతంగా సినిమా ఎందుకు తీయకూడదు అనే ఆలోచన వచ్చింది. దానికి దోహదం అయింది 'తుఫాన్' పత్రికకు బాలయ్య రాసిన నలుపు తెలుపు కథ, నవయుగ డిస్ట్రిబ్యూటర్ చంద్రశేఖర్‌రావుకు బాగా నచ్చటం, అదే కథను అమృతా ఫిలింస్ పేరిట, కె.విశ్వనాధ్ దర్శకత్వంలో 'చెల్లెలికాపురం' పేరుతో నిర్మించగా అది ఆర్థికంగా విజయవంతమై బంగారునంది గెల్చుకొంది.

ఆ తరువాత నిర్మాతగా 'నేరము-శిక్ష', 'అన్నదమ్ముల కథ', 'ప్రేమ-పగ', 'చుట్టాలున్నారు జాగ్రత్త', 'ఊరికిచ్చినమాట', నిజం చెబితే నేరమా', 'కిరాయిఅల్లుడు', 'పసుపుతాడు', ఈనాటి బంధం మేనాటిదో' చిత్రాలు నిర్మించారు. వీటన్నిటికీ బాలయ్యే కథ సమకూర్చారు. నాలుగు చిత్రాలకు ఆయనే దర్శకత్వం వహించి, అన్నదమ్ముల కథ ద్వారా వారి అబ్బాయి తులసీరామ్‌ను వెండితెరకు పరిచయం చేశారు.

క్యారెక్టర్ ఆర్టిస్టుగా బాలయ్య అనేక ఘనవిజయాలు సాధించారు. ఈయన రాణించిన పౌరాణిక పాత్రలు అర్జునుడు(పాండవవనవాసం) ధర్మరాజు (శ్రీకృష్ణ పాండవీయం) కురుక్షేత్రం, శివుడు(భక్తకన్నప్ప), చారిత్రాత్మక చిత్రం 'భక్తపోతన'లో రామసింగభూపాలుడు. 'లక్ష్మీకటాక్షం, వీరపూజ, ప్రచండభైరవి, సింహాసనం' వంటి జానపద చిత్రాల్లో విలక్షణ పాత్రలు పోషించారు.

ఇక చారిత్రాత్మక చిత్రాల్లో చెప్పుకోదగ్గవి, బొబ్బిలియుద్ధం(ధర్మారాయుడు) అల్లూరిసీతారామరాజు (అగ్గిరాజు) పల్నాటియుద్ధం (మలిదేవరాజు) శివభక్త (కన్నడ చిత్రం) సింహాసనం (హిందీ), 'అన్నమయ్య'లో కథానాయకుని తండ్రిగా, 'మల్లీశ్వరి'లో నాయిక కత్రినాకైఫ్ తాతగా, 'అయోధ్య రామయ్య'లో పోలీసుకమీషనరుగా విభిన్న పాత్రలను బాలయ్య పోషించారు.

హీరోగా సినీరంగ ప్రవేశంచేసి, సమర్థతగల నటునిగా, భావకుడైన రచయితగా, సామాజిక స్పృహగలిగిన నిర్మాతగా, అభిరుచి ఉన్న దర్శకునిగా వీటన్నిటిని మించిన నిండైన సంస్కారంతో సంభాషించే బాలయ్య బహుముఖ ప్రజ్ఞాశాలి.



# రమణమూర్తి

తెలుగు టాకీల మొదటి రెండు దశకాల్లో (1931–50) పౌరాణికాల్లో నటించిన రంగస్థల నటులు, సినీరంగ ప్రవేశం చేయగా, మూడవదశకంలో (1951–60) సాంఘిక నాటకాల్లో పేరొందిన ఎందరో నటులు సినీరంగ ప్రవేశంచేసి అక్కడ కూడా తమ సమర్థతతో రాణించారు. అటువంటి వారిలో ప్రథమపంక్తిలో రమణమూర్తిని పేర్కొనాలి.

20–05–1933న పుట్టిన జొన్నలగడ్డ వెంకటరమణమూర్తి తన పదమూడవయేట 1946లో 'ఇంట్లో ఈగ' అనే నాటికను హైస్కూల్‌లో ప్రదర్శించి వందరూపాయిలు బహుమతి అందుకోవటం మొదటి అనుభూతి. స్వాతంత్ర్యం సిద్ధించిన అర్ధరాత్రి (14–08–1947)న 'విధినిర్వహణం' నాటకం ప్రదర్శించారు. అంతర్ విశ్వవిద్యాలయ నాటకపోటీల్లో ఆత్రేయ రచన "విశ్వశాంతి" ప్రదర్శించి ఉత్తమ ప్రదర్శన బహుమతి పొందారు.

అయితే భమిడిపాటి నామాటే నెగ్గింది, విశ్వనాథ "దొంగాటకం" నాటకాల్లో స్త్రీ పాత్ర పోషించి మెప్పించటం విశేషం.

ఆ తరువాత ఆత్రేయ నాటకాలు "యన్.జి.వో, ఎవరు దొంగ, కప్పలు, నరసరాజు 'నాటకం' గురజాడవారి 'కన్యాశుల్కం', భమిడిపాటి రాధాకృష్ణ రచన 'కీర్తిశేషులు', శ్రీరామమూర్తి రచనలు 'కాళరాత్రి, ఫణి" ఆరుద్ర రాసిన చారిత్రాత్మక నాటకం 'కాటమరాజుకథ' దేశవ్యాప్తంగా ప్రదర్శించి ప్రశంసలందుకున్నారు.

కొన్నిగంటలు పట్టే 'కన్యాశుల్కం' నాటకాన్ని ఎడిట్‌చేసి, స్వీయదర్శకత్వంలో రూపొందించిటమే కాక, అందులో కథానాయకుడు గిరీశం పాత్రను అద్భుతం అన్న స్థాయిలో పోషించటం రమణమూర్తి సాధించిన ఘనవిజయం.

దర్శకుడు కె.బి.తిలక్ రమణమూర్తిలో నటనా సామర్థ్యాన్ని గ్రహించి 'ఎం.ఎల్.ఏ' చిత్రంలో గిరిజ సరసన ప్రధానపాత్రను పోషించే అవకాశం కల్పించారు.

రాజశ్రీవారు, సి.యస్.రావు దర్శకత్వంలో తీసిన 'శభాష్‌రాముడు', 'మంచిమనసుకు మంచిరోజు' చిత్రాల్లో ప్రాధాన్యతగల పాత్రలు ఇచ్చి ప్రోత్సహించారు.

ఘంటసాల పాడిన విషాదగీతాలలో ఒకటి 'బావా మరదళ్ళు' చిత్రంలోని "పయనించేమన వలపుల బంగరునావ" అలాగే ఆయన ఆలపించిన లలితగీతాల కోవలోని పాట 'మంచిమనసుకు మంచిరోజు' చిత్రంలోని "రావే నా చెలియా" ఈ రెండు పాటలకు తెరపై తన అభినయంద్వారా ప్రాణం పోసిన నటుడు జె.వి.రమణమూర్తి.

'బావా మరదళ్ళు' చిత్రంలో కృష్ణకుమారితోనూ, 'పెళ్ళితాంబూలం'లో జమునతోనూ సమ ఉజ్జీగా, గంభీరపాత్రల్లో కథానాయకునిగా నటించారు. ఆయన కథానాయికునిగా నటించిన మరికొన్ని చిత్రాలు 'పెళ్ళిమీద పెళ్ళి', 'పీటల మీద పెళ్ళి', 'అన్నా చెల్లెలు', 'ఆశాజీవులు'.

1971లో 'అమాయకురాలు' చిత్రంలో సహాయపాత్ర పోషించిన తరువాత, అనుకోకుండా యాక్సిడెంట్‌కు గురికావటంతో అయిదు సంవత్సరాలు నటనకు దూరంగా వుండవలసి వచ్చింది. 1976లో కె.ఎస్.రామిరెడ్డి చిత్రం 'అనురాగాలు' ద్వారా పునః ప్రవేశం చేసిన రమణమూర్తి అదే సంవత్సరం, శ్రీవిశ్వనాథ్ తీసిన 'సిరిసిరిమువ్వ' చిత్రంలో పూజారిపాత్ర పోషించడంలో గుణచిత్ర నటునిగా బిజీ అయ్యారు.

ఆ పరంపరంలో "మరోచరిత్ర, ఆకలిరాజ్యం, గుప్పెడుమనసు, మనవూరి పాండవులు, శుభలేఖ, సిరివెన్నెల, సప్తపది" వంటి నూటయాభై చిత్రాల్లో నటించారు. (వీటిల్లో నాలుగు తమిళం, మళయాళం ఒక్కటి, కన్నడం ఒక్కటి)

బుల్లితెర విజృంభించిన గత శతాబ్దంలో (1991-2001) "దేవుడున్నాడా, డామిట్, రాజశేఖర చరిత్ర, డామిట్ కథ అడ్డం తిరిగింది, నవోదయం" మొదలైన సీరియల్స్‌లో నటించారు.

తానా వారి ఆహ్వానంపై భమిడిపాటి రాసిన తరం- అంతరం నాటకాన్ని అమెరికాలోని 20 ముఖ్యనగరాల్లో ప్రదర్శించటం చెప్పుకోదగ్గ విశేషం.

సి.యస్ రావు రచన 'మళ్ళీ ఎప్పుడొస్తారు', డి. విజయభాస్కర్ రచన 'గాంధీ జయంతి' నాటకాన్ని రసవత్తరంగా ప్రదర్శించారు. గాంధీ పాత్రకోసం నియమ బద్ధంగా వుండి బరువు తగ్గించుకోవటం ఆ పాత్ర పట్ల ఆయనకు గల శ్రద్ధను తెలుపుతుంది.

అటు రంగస్థలంపై, ఇటు వెండితెరపైనా (సినిమా, బుల్లితెరపైనా) ఏపాత్ర ధరించినా తన ప్రత్యేకమైన ఆంగిక వాచికాభినయాల ద్వారా ప్రాణం పోసి తన ప్రత్యేకత నిలుపుకుంటున్న ఉభయరంగ ప్రవీణుడు రమణమూర్తి.



# కైకాల సత్యనారాయణ

25.07.1935న కృష్ణాజిల్లా కౌతరంలో కైకాల సత్యనారాయణ కైకాల లక్ష్మీనారాయణ, సీతారామమ్మ దంపతులకు జన్మించిన సత్యనారాయణ 1951 వరకు మాతామహుల ఇంట పెరిగారు. హైస్కూల్ విద్య గుడ్లవల్లేరులో, కళాశాల విద్య గుడివాడలో కొనసాగింది.

కళాశాల రోజుల్లోనే 'పల్లెపడుచు', 'కులంలేని పిల్ల', 'బంగారు సంకెళ్ళు', 'ఆడది', 'సుల్తానీ' మొదలగు నాటకాల్ని ప్రదర్శించి ఎన్నో అవార్డులు అందుకున్నారు.

విజయవాడ హనుమంతరాయ గ్రంథాలయంలో 'ఎవరుదొంగ' నాటకాన్ని ప్రదర్శించినప్పుడు ప్రేక్షకులు అచ్చం యన్.టి.ఆర్‌లా వున్నాడని ప్రశంసించారు. 'పుట్టిల్లు' చిత్ర నిర్మాత డాక్టర్ రాజారావు ఏకంగా హీరో వేషాన్ని ఆఫర్ చేసినా, విద్య పూర్తి కావలిసి వుండడంతో ఆ అవకాశాన్ని సత్యనారాయణ వదులుకున్నాడు.

చదువు పూర్తయ్యాక కొంతకాలం రాజమండ్రిలో కలప వ్యాపారం నిర్వహించారు. తరువాత ప్రసాద్ ప్రొడక్షన్స్‌లో దర్శకత్వ శాఖలో పనిచేసిన కె.యల్.ధర్ ఆహ్వానంపై మద్రాసు వెళ్ళి వేషాలకోసం ప్రయత్నించినా నిరాశ ఎదురయింది.

కె.వి. రెడ్డి వంటి ప్రముఖులు పనికివస్తావు అని ప్రోత్సహించినా, వేషాలు ఇవ్వలేకపోయారు. ఆ సమయంలో డి.యల్ నారాయణ (వినోదాసంస్థ) 'సిపాయి కూతురు' అనే చిత్రంలో సత్యనారాయణకు జమున సరసన హీరో వేషం ఇచ్చారు.

ఆ సినిమా విజయం సాధించలేకపోవటంతో మళ్ళీ వేషాలకోసం ప్రయత్నించి, ఫలితం లేక ఇంటికి వెళ్ళి పోదమనుకున్న సమయంలో విఠలాచార్య వద్ద నుండి కబురు వచ్చింది. దాంతో మోడ్రన్ థియేటర్స్‌వారి 'సహస్ర శిరచ్ఛేద, అపూర్వ చింతమణి'లో రాకుమారుడి వేషం లభించింది. అప్పటినుండి పరిశ్రమలో తిరుగులేని నటుడిగా అనేక చిత్రాల్లో వివిధ పాత్రల ద్వారా నిలదొక్కుకున్నారు.

1965-1975 మధ్య కాలంలో యన్.టి.ఆర్ నటించిన పౌరాణిక, జానపద

చిత్రాలకు, కాంతారావు నటించిన జానపద చిత్రాలకు, అక్కినేని, శోభన్‌బాబు, కృష్ణ నటించిన చిత్రాలకు ఒకే ఒక్క విలన్ కైకాల సత్యనారాయణగా పేరొందారు.

యన్.టి.ఆర్ ప్రోత్సాహంతో 'ఉమ్మడికుటుంబం'లో యన్.టి.ఆర్ సోదరునిగా ఓ అసమర్ధపు భర్తగా సింపతీ గల పాత్రలోనూ రాణించారు. యస్.వి.రంగారావుతో దేవుడు చేసిన మనుషుల్లో చిత్రంలో చేసిన విభిన్న హాస్యపాత్రను చూచి యస్.వి. రంగారావు ఫరవాలేదు నువ్వు నాకు వారసుడివి అని భుజం తట్టారు.

యస్.వి.రంగారావు, యన్.టి.రామారావు పోషించిన దుర్యోధన, రావణ, భీమ, ఘటోత్కచ పాత్రల్ని వారి సరసన నటించి వారికి సరిజోడు అనిపించుకున్నారు.

మతిలేని మహారాజు వేసినా, మాంత్రికుడు వేషం వేసి నిప్పులు చెరిగినా ప్రజలు బ్రహ్మరథం పట్టారు. తిరుగులేని నటనతో, నాటి నుంచి నేటి వరకు, దాదాపు ఎనిమిది వందల చిత్రాల్లో నటించారు సత్యనారాయణ.

ఇతరుల భాగస్వామ్యంలో 'మామా అల్లుళ్ళసవాల్', 'గజదొంగ' చిత్రాలు తీశారు. స్వయంగా రమా ఫిలింస్ ప్రారంభించి సోదరుడు నాగేశ్వరరావు నిర్మాతగా 'ఇద్దరు దొంగలు', 'చిరంజీవి', 'కొదమసింహం', 'బంగారు కుటుంబం', 'ముద్దులమొగుడు' చిత్రాలను నిర్మించారు.

'తాతామనవడు', 'సంసారం – సాగరం', 'కచదేవయాని' చిత్రాల్లో నటనకు నందీ అవార్డులు అందుకున్న సత్యనారాయణను, ఆంధ్రదేశంలోని సాంస్కృతిక సంస్థలు ఘనంగా సత్కరించాయి.


'బంగారు కుటుంబం' ఉత్తమ కుటుంబకథా చిత్రంగా అవార్డు పొందింది.

వీరి వ్యక్తిత్వంపైన, సామర్థ్యంపైనా విశ్వాసమున్న యన్.టి.ఆర్, తెలుగుదేశం పార్టీలో వీరికి సముచిత స్థానం కల్పించారు. ఒక విధంగా ఆ పార్టీ ఆవిర్భావానికి మూల కారకుల్లో సత్యనారాయణ ఒకరు.

1996లో మచిలీపట్నం నియోజక వర్గం నుంచి పార్లమెంటు సభ్యునిగా ఎన్నికయ్యారు. మచిలీపట్నం నుంచి రాజధానికి ఎక్స్‌ప్రెస్ రైలు నడవటానికి, గన్నవరంలో వెటర్నరీ కళాశాల, గుడ్లవల్లేరులో ఇంజనీరింగ్ కళాశాల రావటానికి కృషి చేశారు.

తన స్వంత ఖర్చుతో కృష్ణాజిల్లా కౌతరంలో ప్రసూతి కేంద్రం, గుడివాడలో ఓపెన్‌ఎయిర్ ఆడిటోరియాన్ని నిర్మించారు.

నటునిగా 'యమగోల', 'యమలీల' చిత్రాల్లో గంభీరంతో కూడిన హాస్యాన్ని, 'శారద', 'సావాసగాళ్ళు', 'సిరిసిరిమువ్వ' చిత్రాల్లో కంటతడిపెట్టించే కరుణను, తాయారమ్మ–బంగారయ్యలో శృంగారాన్ని ఘనంగా పోషించిన కైకాల సత్యనారాయణ, నిజంగా నవరస నటనా సార్వభౌముడే.



# డా॥ యం.ప్రభాకరరెడ్డి

**(1935-1997)**

డాక్టరు కావాలనుకొని యాక్టర్ అయ్యాను అని, చిత్రసీమలో చాలామంది వాడుకగా చెప్పేమాట. దాంట్లో నిజం ఎంత వున్నదన్నది పైవాడికే ఎరుక. అలా కాకుండా డాక్టర్ విద్య అభ్యసిస్తూనే మెడికల్ కాలేజి అంతర్ విద్యాలయ నాటక పోటీల్లో పాల్గొని బహుమతి పొందటమే కాక, ఆ బహుమతి నిచ్చిన ప్రముఖ దర్శకులు గుత్తారామినీడు, తాపీ చాణుక్యలను ఆకర్షించిన నటుడే మందడి ప్రభాకరరెడ్డి.

ఇంకో చెప్పుకోదగిన విశేషం, రామినీడు ద్వారా వారి 'చివరకు మిగిలేది' చిత్రంలో తొలిసారిగా డాక్టరు పాత్రలోనే చిత్రరంగంలో ప్రవేశించారు. ఆ తరువాత వైద్య విద్య పూర్తి చేసి హైద్రాబాద్‌లో వృత్తి కొనసాగిస్తున్న సమయంలో నిర్మాత బి.ఏ.సుబ్బారావు తమ పౌరాణిక చిత్రం 'భీష్మ'లో శంతన మహారాజు వేషం ఇచ్చారు. ప్రత్యగాత్మగారి 'పునర్జన్మ'లో అక్కినేని అన్నగా వ్యసనపరుడిగాను, నటించి మెప్పించారు.

సూర్యాపేటలో మెట్రిక్ చదివేకాలంలోనే స్వాతంత్ర్య పోరాటంలో భాగంగా బుర్రకథలు చెప్పేవారితో కలిసి తాను పదం కలిపేవాడు. తెలుగు, హిందీ ఇంగ్లీషు భాషలు అనర్గళంగా మాట్లాడగలిగేవాడు. చక్కని రూపం, సన్నని చిరునవ్వు అదనపు ఆకర్షణగల ప్రభాకరరెడ్డి మొదట్లో విలన్ పాత్రలు ధరించి, మెప్పించి క్యారెక్టర్ యాక్టర్‌గాను అంతపేరు సంపాదించారు.

సాంఘికచిత్రాలలో, రక్తసంబంధంలో సాఫ్ట్‌గా, పాడిపంటలు, మనుషులు మమతలులో స్వార్థపరుడైన విలన్‌గా రక్తి కట్టించారు. పౌరాణికాలలో పాండవవనవాసం, నర్తనశాల, శ్రీకృష్ణపాండవీయం చిత్రాలలో కర్ణునిగా, దానవీరశూరకర్ణ, శ్రీమద్ విరాటపర్వంలో ధర్మరాజుగాను, శ్రీకృష్ణావతారంలో బలరామునిగా, శ్రీకృష్ణ విజయంలో బ్రహ్మదేవునిగా శ్రీకృష్ణసత్యలో అశ్వద్ధామగా నటించారు. జానపదచిత్రాలలో లక్ష్మీకటాక్షం, అగ్గివీరుడు, కంచుకోటలో మహారాజుగా, సేనానిగా, మాంత్రికునిగా, విలన్‌గా నటించారు. చారిత్రక పాత్రలు బొబ్బిలియుద్ధంలో బుస్సీ దొరగాను, పల్నాటియుద్ధంలో

కన్నమదాసు, మహామంత్రి తిమ్మరుసులో వీరభద్ర గజపతిగా, అల్లూరి సీతారామరాజులో మల్లుదొరగా వైవిధ్యంగా నటించారు.

'ప్రేమాభిషేకం'లో ఎ.ఎన్.ఆర్ తండ్రిగా, 'చిన్నకోడలు'లో రాజసులోచన సరసన అసమర్థుడైన భర్తగా, 'ఏడతస్తుల మేడ'లో హీరోయిన్ సుజాతకు తండ్రిగాను చాలా హోమ్లీగా ఆ పాత్రలకు న్యాయం చేశారు.

ప్రభాకరరెడ్డి మంచి నిర్మాత, కథకుడు 'పండంటి కాపురం' చిత్రానికి కథ, రచన చేసి సమర్పించారు. ఆ చిత్రంలో భార్య చాటు భర్తగా సహజ నటన చూపారు. ఇంకా 'ధర్మాత్ముడు, కార్తీకదీపం, నాకు స్వతంత్రం వచ్చింది' చిత్రాలకు కథను సమకూర్చారు. 'మండలాధ్యక్షుడు' సినిమాకు దర్శకత్వం వహించారు. సినీరంగంలోని వివిధ శాఖలకు చెందిన కళాకారుల కోసం హౌసింగ్ సొసైటీ స్థాపించి వారికి ఇళ్లను సమకూర్చటంలో అవిశ్రాంతంగా కృషి చేశారు.

నటుడిగా 450 చిత్రాలలో విభిన్నమైన పాత్రలను తనదైన ముద్రలో పండించి, ప్రేక్షకులను అలరించిన ప్రభాకరరెడ్డి 1997లో పరమపదించారు. తాను, భానుచందర్ కలిసి నిర్మిస్తున్న 'కామ్రేడ్' చిత్రం పూర్తి చేయలేకపోయారు. ఏమైనా క్యారెక్టర్ ఆర్టిస్టుగా జీవితాన్ని సార్ధకం చేసుకున్న నటుడు ప్రభాకరరెడ్డి.



# గీతాంజలి

1948లో జన్మించిన గీతాంజలి శాస్త్రీయ నృత్యాన్ని అభ్యసించి 'రాణిరత్నప్రభ' చిత్రం ద్వారా సినీరంగానికి పరిచయమయ్యారు. ఆమెలోని ముగ్ధత్వానికి ముచ్చటపడ్డ యన్.టి.రామారావు స్వీయదర్శకత్వంలో రూపొందించిన 'సీతారామకల్యాణం' చిత్రంలో కథానాయిక పాత్ర ఇచ్చి ప్రోత్సహించారు. అప్పట్లో ఆమె పేరు మణి. 'పరాశమణి' హిందీ చిత్రంలో, నటించినప్పుడు ఆమె పేరు గీతాంజలిగా మార్చారు ఆ చిత్ర దర్శకుడు బాబూభాయిమిస్త్రీ.

'ఇల్లాలు, పొట్టిప్లీడరు, హంతకులొస్తున్నారు జాగ్రత్త' వంటి కొన్ని చిత్రాలలో కథానాయికగా రాణించారు. 'నవగ్రహ పూజామహిమ', 'శ్రీశ్రీశ్రీ మర్యాదరామన్న' వంటి జానపదచిత్రాలలోనూ, 'భక్తప్రహ్లాద', 'శ్రీకృష్ణపాండవీయం' వంటి పౌరాణిక చిత్రాలలోను, నృత్య ప్రధానమైన పాత్రలు పోషించారు. 'డాక్టరు చక్రవర్తి' చిత్రంలో హీరో సోదరి సుధగా నటించగా ఆమెపై చిత్రీకరించిన 'పాడమని నన్నడగవలెనా' అనే గీతానికి అత్యంత సహజంగా అభినయించారు. లేతమనసులుల్లో వాంప్‌గా నటించిన గీతాంజలి, 'పంతాలు-పట్టింపులు' చిత్రంలో వాణిశ్రీకి సోదరిగా నటించి ప్రేమను త్యాగం చేసే సన్నివేశంలో ఉదాత్త నటన ప్రదర్శించారు.

'లక్ష్మీనివాసం, అదృష్టవంతులు, మూగనోము, పూలరంగడు' వంటి పలు చిత్రాలలో పద్మనాభం జంటగా హాస్యపాత్రలు పోషించి మెప్పించారు. ఈ విభాగంలో చిరస్మరణీయంగా చెప్పుకోదగ్గ వేషం 'సంబరాల రాంబాబు'లోని ఆండాళ్ళు, ఆ జంటపై చిత్రీకరించిన 'పొరుగింటి మీనాక్షమ్మను చూశారా' గీతం అప్పటికి, ఇప్పటికి ప్రేక్షకులను నవ్వుల్లో ముంచెత్తుతూనే ఉంది. 'మురళీకృష్ణ' చిత్రంలో ప్రేమించి భంగపడిన యువతిగా పలురకాల భావాలను అభినయంలో ఆవిష్కరించారు.


నటుడు రామకృష్ణతో వివాహమయ్యాక కొంతకాలం సినీరంగానికి దూరంగా ఉన్నారు.

ఏడెనిమిది ఏళ్ళక్రిందట మకాం హైద్రాబాద్‌కు మార్చాక మళ్ళీ కెమెరా ముందు నిల్చుని, క్యారెక్టర్ ఆర్టిస్టుగా తన ప్రతిభను నిరూపించుకుంటున్నారు. రచయిత మదన్ దర్శకత్వం వహించిన చిత్రం 'పెళ్ళైన కొత్తలో'. ఇందులో కోటశ్రీనివాసరావుకు భార్యగా, జగపతిబాబుకు బామ్మగా పట్టుచీర, నగలు, పెద్దబొట్టుతో ఆప్యాయతలు కలబోసిన పెద్దరికపు పాత్రలో అత్యంత సహజంగా నటించారు. ఈ చిత్రంలో నడకలోనూ, నటనలోనూ కూడా ఓ వైవిధ్యం కన్పిస్తుంది.

వంశీ రూపొందించిన 'గోపి, గోపిక, గోదావరి' చిత్రంలో హీరో వేణుకు అంధురాలైన తల్లిగా బరువైన పాత్రలో పదికాలాలపాటు గుర్తుండేలా నటించారు. కాషాయ దుస్తులు, మెడలో రుద్రాక్షలు, నుదుటిపై నామం, వీటితో అసలు మేకప్‌లోనే వైవిధ్యం ఉండేలా జాగ్రత్తపడ్డారు. తల్లీ, కొడుకులు తమ బంధం తెలియనప్పుడు ఆ కొడుకు పరాయిబిడ్డగా తన ఒడిలోనే సేదదీరిన సన్నివేశంలో తన నటనతో నిండుతనాన్ని చేకూర్చారు.

ముత్యాల సుబ్బయ్య దర్శకత్వంలో వచ్చిన 'ఆలయం' చిత్రంలో ఉమ్మడి కుటుంబానికి పెద్ద దిక్కయిన తండ్రిగా ప్రముఖ దర్శకులు కె.బి.తిలక్ నటించారు. ఆయన నలుగురు కొడుకుల్లో పెద్దవాడు రంగనాథ్, అతని భార్య అంటే, ఆ ఇంటి పెద్దకోడలుగా గీతాంజలి నటించారు. ఉమ్మడి కుటుంబంలోని ఆత్మీయతలు, అనురాగాలు, పొరపాట్లు, పొరపొచ్చాలు వీటిని సమన్వయ పరచిన పెద్దకోడలుగా హుందాగా నటించారు. విజయనిర్మల రూపొందించిన 'నేరము-శిక్ష'లో హీరోకి తల్లితండ్రులు కృష్ణ, విజయనిర్మల కాగా కథానాయిక తల్లిగా పాత్ర పరిధిమేరకు నటించి, మెప్పించారు.

వీరి తనయుడు శ్రీనివాస్ హీరోగా నటించిన రెండు చిత్రాలు 'నిర్ణయం', 'కోయిల' విడుదల కావాల్సి ఉన్నాయి. తెలుగు టాకీ మూడో తరానికి చెందిన కథానాయిక గీతాంజలి, ఆరోతరంలో గుణచిత్ర నటిగా ప్రేక్షకులను మెప్పించటం ఆమెకు దక్కిన అదృష్టం.



# ధూళిపాళ

'అని గట్టిగా అనరాదు, వేరొకరు వినరాదు, అన్నిటికీ అయినవాణ్ణి, అమ్మతమ్ముణ్ని నేనున్నాను కదా' అంటూ దానవీరశూరకర్ణలో సుయోధనునికి తన సూచనను, సలహాల్ని అందించిన దుష్ట శకుని పాత్రకు ప్రాణంపోసిన మహానటుడు ధూళిపాళ సీతారామశాస్త్రి.

సి.యస్.ఆర్, లింగమూర్తి తరువాత శకునిగా రాణించిన విలక్షణ నటుడు శ్రీ ధూళిపాళ. నాటకరంగం నుంచి వచ్చి తమ అభినయంతో, వాక్ధాటితో సినీ కళామతల్లికి జిలుగులద్దిన ఎందరో విశిష్టనటులలో ముందు వరుసలో నిలిచే నటుడు శ్రీ ధూళిపాళ.

గుంటూరుజిల్లా దాచేపల్లిలో 24.09.1921లో జన్మించిన దూళిపాళ త్రిభాషా ప్రావీణ్యం సంపాదించారు. (సంస్కృతం, తెలుగు, ఆంగ్లము) కొంతకాలం ప్లీడరు గుమాస్తాగా పనిచేశారు. తన 13వ యేట నుంచే, నటనపై గల మక్కువతో రంగస్థల నాటకాలలో నటించేవారు.

కొందరు స్నేహితులతో కలిసి 1942లో 'శ్రీస్టార్' థియేటర్ అనే నాటకం సమాజం నెలకొల్పారు. అనేక సాంఘిక, పౌరాణిక, చారిత్రక నాటకాలు ప్రదర్శించేవారు. వేమూరి గగ్గయ్యతో సతీసావిత్రి నాటకంలో అశ్వపతిగా నటించారు దూళిపాళ.

రంగస్థలం మీద ఆయనకు పేరు తెచ్చిన పాత్రలు మయసభలో దుర్యోధన ఏకపాత్రాభినయం, మైరావణ, యుగంధరుడు, గయుడు.

రంగస్థలంపై తొలుత స్త్రీ పాత్రలు కూడా పోషించి, ప్రేక్షకులను మెప్పించారు దూళిపాళ. సత్యభామ చెలికత్తె నళినిగా, చింతామణిలో రాధికగా, బొబ్బిలియుద్ధంలో మల్లమాంబ, ఈ పాత్రలు ధరించింది పురుషుడు అని తెలియనివారు ఎంతటి అందగత్తె ఈమె అని అనుకున్నారుట.

'రోషనార'గా ధూళిపాళ ప్రదర్శించిన నటన చూసిన నటి జి.వరలక్ష్మి తన భావావేశాన్ని అదుపు చేసుకోలేక పోయానని అన్నారు. ఈ నాటకం చూసిన నిర్మాత,

దర్శకుడు, బి.ఎ.సుబ్బారావు తాను నిర్మించే 'భీష్మ' చిత్రంలో దుర్యోధనుడి పాత్ర యిచ్చి సినీరంగానికి పరిచయం చేశారు.

అప్పటి నుండి కరుణ, వీర, రౌద్ర, భయానక, భీభత్స రసాలతో కూడినటువంటి ఏ పాత్రనయినా అమోఘంగా నటించి, ప్రేక్షకుల్ని పరవశింపజేశారు ధూళిపాళ.

ఆయన నటించి పాత్రలన్ని కథానాయకులతో సరిసమాన ప్రాధాన్యతగలవే కావటం ఓ విశేషం. వీరి పౌరాణిక చిత్రాలలో యెన్నదగిన భూమికలు నర్తనశాలలో రారాజు, శ్రీకృష్ణార్జునయుద్ధంలో గయుడు, పాండవవనవాసంలో గంధర్వరాజు, లవకుశలో వశిష్టుడు, వీరాభిమన్యులో ధర్మరాజు, శ్రీకృష్ణవిజయంలో ముచికుందుడు, బాపు సంపూర్ణరామాయణంలో విభీషణుడు, శ్రీరామాంజనేయయుద్ధంలో యయాతి. సాంఘిక చిత్రాలలో విలన్‌గా మట్టిలో 'మాణిక్యం, అందాలరాముడు, సెక్రటరీ' ఇంకా అనేక సినిమాల్లో విలన్‌గాను నటించారు. 'కథానాయకుడు'లో యన్.టి.ఆర్. అన్నగా, 'ఉండమ్మా బొట్టుపెడతా'లో హరిదాసుగా, యస్.వి.ఆర్ తమ్మునిగా, 'బాంధవ్యాలు'లో సాత్వికపాత్రలను సహజనటనతో పండించారు. చారిత్రిక చిత్రాలలో 'బొబ్బిలియుద్ధం'లో నరసారాయుడు, మహామంత్రి తిమ్మరుసులో పెద్దనామాత్యుడు చెప్పుకోదగ్గవి.

ఈ పాత్రలన్నింటికంటె చెప్పుకోదగినది శ్రీకృష్ణపాండవీయంలో శకుని పాత్ర, దానిని అత్యద్భుతంగా పోషించారు ధూళిపాళ. శకుని జీవితగాథను యన్.టి.ఆర్ తెరకనువదిస్తే, గాంధారయువరాజుగా అన్నలిచ్చిన మెతుకులన్ని కలిపి ఒక ముద్దగా చేసికొని, అన్నల చావుకు ప్రతీకారంగా కురువంశాన్ని కూకటివేళ్ళతో పెకలించాలన్న కసితో దుర్యోధనుని వద్దకు చేరే సన్నివేశంలో ధూళిపాళ చూపిన నటన మరపురానిది. 'సమర్థుడైన నటుడుతో నటించినపుడే మన సత్తా రుజువు అవుతుంది' అని ఎన్.టి.ఆర్ ధూళిపాళను గూర్చిన అన్న మాటలు అక్షరసత్యాలు. దానవీరశూరకర్ణ, బాలభారతం, శ్రీమద్ విరాటపర్వంలోనూ శకుని పాత్ర ధూళిపాళే నటించారు. శ్రీకృష్ణసత్యలో సత్రాజిత్‌గా, యన్.టి.ఆర్ నిర్మించిన సామ్రాట్ అశోకలో మహామాత్యునిగాను నటించారు, దీనికి కారణం యన్.టి.ఆర్‌కు, ధూళిపాళ పట్ల గల ప్రత్యేకాభిమానమే.

'పాండవవనవాసం'లో ఒకే ఒక సన్నివేశంలో గంధర్వరాజు చిత్రసేనుడుగా నటించి శభాష్ అనిపించారు. ఆ దృశ్యంలో దుర్యోధనుడుగా నటించిన మహానటుడు ఎస్వీరంగారావు ధూళిపాళకు ఫోన్ చేసి 'నటనలో మమ్మల్ని మింగేసావయ్యా' అని ప్రశంసించటం నా జీవితంలో మరచిపోలేను అంటుండేవారు ధూళిపాళ.

సినీరంగానికి దూరంగా వుంటూ ఆధ్యాత్మిక జీవితానికి అంకితమై ధూళిపాళ తిరిగి వెండితెరపై రెండు చిత్రాలలో తళుక్కున మెరిసారు. వాటిల్లో మొదటిది గుణశేఖర్

రూపొందించిన ‘చూడాలనివుంది’లో విలన్ ప్రకాశ్‌రాజ్‌కు తండ్రిగానూ, రెండోది కృష్ణవంశీ చిత్రం ‘మురారి’లో యజ్ఞాన్ని చేయించే పూజారిగా నటించి వయస్సు పెరిగినా స్వరంలో గాంభీర్యం తగ్గలేదనిపించారు.

సినిమా నటుడు ఐనా, స్వచ్ఛమైన బ్రాహ్మణుడిగా నిత్యకర్మలు నిర్వహిస్తూ, దైవారాధన చేస్తూ క్రమశిక్షణతో జీవించారు.

చివరిదశలో గుంటూరులో జయేంద్ర సరస్వతీ ఆశీస్సులతో సన్యాసం స్వీకరించారు. అక్కడే ఆంజనేయస్వామి దేవాలయం నిర్మించారు. మారుతి ఆశ్రమం ఏర్పాటు చేసుకొని అక్కడే జీవితం గడిపారు. 2007 ఏప్రిల్ పదమూడున దివంగతులైనారు ధూళిపాళ.

చిత్రపరిశ్రమ స్వర్ణయుగం నాటి నుంచి అనేక సాంకేతిక మార్పులకు లోనయినా, తెలుగు సినీచరిత్రలో మరువతగని విశిష్ట నటుడుగా ధూళిపాళ చిరస్మరణీయుడే.

*‘పాండవవనవాసం’లో ఒకే ఒక సన్నివేశంలో గంధర్వరాజు చిత్రసేనుడుగా నటించి శభాష్ అనిపించారు. ఆ దృశ్యంలో దుర్యోధనుడుగా నటించిన మహానటుడు ఎస్వీరంగారావు ధూళిపాళకు ఫోన్ చేసి ‘నటనలో మమ్మల్ని మింగేసావయ్యా’ అని ప్రశంసించటం నా జీవితంలో మరచిపోలేను అంటుండేవారు ధూళిపాళ.*



# పి.జె.శర్మ

మంచి నటుడుగా రాణించాలంటే, ఎవరికైనా స్ఫురద్రూపంతోపాటు, సులక్షణమైన గాత్రంతోడయితే వారికింక ఎదురులేనట్టే. ఈ మాట రంగస్థలానికైనా సినీరంగానికైనా వర్తిస్తుంది అనటం సత్యదూరం కాదు.

అటువంటి సుస్వరం, చక్కదనం కలబోసుకున్న నటుడు పి.జె.శర్మ.

24.5.1933న విజయనగరం జిల్లా కళ్ళేపల్లి గ్రామంలో జన్మించిన పూడిపెద్ది జోగీశ్వరశర్మ (పి.జె.శర్మ) హైస్కూలు విద్యార్థి దశ నుంచే నాటకరంగం పట్ల మక్కువ పెంచుకున్నారు. ఆ కాలంలోనే పేదరైతు, అనార్కలి, పల్లెపడుచు, ఆశాలత, కులంలేని పిల్ల, ఋష్యశృంగ, నవప్రపంచం, నాటకాల్లోనూ వీటూరి వ్రాసిన కల్పన నాటకంలోనూ ప్రధాన భూమికల్ని పోషించారు.

1954వ సంవత్సరంలో అక్కినేని నటించిన "అన్నదాత" చిత్రంలో సతీసావిత్రి అంతర్నాటకం ఉంది. ఆ నాటకాన్ని చూసే ప్రేక్షకులుగా కొందరు ఎక్స్‌ట్రా నటులు పాల్గొన్నారు. వారిలో ఒకరిగా పి.జె.శర్మ నటించారు. ఆ షూటింగ్ రాత్రి ఒంటిగంటకు ముగిసింది. షూటింగ్ అయ్యాక అక్కినేని కారులో ఇంటికి వెళుతూ పి.జె.శర్మను చూసి, పిలిచి లిఫ్ట్ ఇచ్చారు. దారిలో ఆయన శర్మగారి వివరాలు తెలుసుకుని, మీరుమంచి కుటుంబానికి చెందినవారిలా కన్పిస్తున్నారు. అవకాశమొస్తే మంచి నటులు కాగలరు, అని ఈ తరహా ఎక్స్‌ట్రా వేషాలు మానుకోమని సలహా కూడా ఇచ్చారు.

అదే విధంగా 1957లో విజయనగరంలో జరిగిన రాఘవనాటక కళాపరిషత్ పోటీలకు న్యాయనిర్ణేతలు ముదిగొండ లింగమూర్తి, మిక్కిలినేని రాధాకృష్ణమూర్తి, సి.నారాయణరెడ్డి. ఆ ప్రదర్శనల్లో పాల్గొన్న నటుడు పి.జె.శర్మ గాత్రానికై ముగ్ధులైన ఆ త్రిమూర్తులు, మద్రాసులో డబ్బింగ్ చిత్రాలు విరివిగా తయారవుతున్నాయి, మీరు డబ్బింగ్ ఆర్టిస్టుగా ప్రయత్నించండి మంచి భవిష్యత్తు ఉంటుందని సలహా ఇచ్చారు.

ఈ సలహాకు విలువిచ్చిన పి.జె.శర్మ మద్రాస్ వెళ్ళి వారి బంధువులయిన శ్రీశ్రీ

ఆరుద్రల ప్రోత్సాహంతో తొలిసారిగా ఉత్తమ ఇల్లాలు చిత్రంలో (1957) డబ్బింగ్ చెప్పారు. అప్పటి నుంచి వందలాది అనువాద చిత్రాల్లో విలన్‌గా పేరొందిన నంబియార్, వీరప్పన్, అశోకన్ పాత్రలకు ఇటు కథానాయకులుగా పేరు పొందిన శ్రీరామ్, శివాజీ గణేశన్, జెమినిగణేశన్‌లకు, కన్నడ హీరోలు రాజ్‌కుమార్, ఉదయకుమార్‌లకు, మళయాళ హీరో ప్రేమనజీర్ పాత్రకు తెలుగులో తమ గళాన్ని అందించారు.

ఒకవైపు డబ్బింగ్ ఆర్టిస్టుగా వుంటూనే, దర్శకులు కె.వి.రెడ్డిగారి 'భాగ్యచక్రం', బి.ఎన్.రెడ్డిగారి 'రంగులరాట్నం'లో గుర్తింపుగల పాత్రలు పోషించారు. కమలాకర కామేశ్వరరావు దర్శకత్వంలో కురుక్షేత్రం చిత్రంలో కృపాచార్యునిగా నటించారు. ఈ విధంగా అనేకమంది పెద్ద దర్శకుల వద్ద పనిచేయటం శర్మకు దక్కిన అదృష్టం అనుకోవచ్చు.

నటి కృష్ణ జ్యోతిని 1960లో వివాహం చేసుకున్నారు. ఈ దంపతులకు పుట్టిన సంతానం అందరూ కళాకారులు కావటం గొప్ప విశేషం. వీరి పెద్దబ్బాయి సాయికుమార్, తెలుగు, కన్నడ రంగాలలో హీరో మరియు డబ్బింగ్ చెప్పటంలో ఘనుడు, హీరో రాజ్‌శేఖర్ చిత్రాలకు సాయికుమార్ వాయిస్ ఓ స్పెషాలిటి.

రెండో అబ్బాయి రవిశంకర్ కూడా డబ్బింగ్ ఆర్టిస్ట్. మూడవ అబ్బాయి అయ్యప్ప పి.శర్మ దర్శకుడు. కుమార్తెలు ఇద్దరు. కమల సంగీతంలోనూ, ప్రియనాట్యంలోనూ ప్రావీణ్యం సంపాదించారు. సాయికుమార్ తనయుడు ఆది కూడా 'ప్రేమకావాలి' చిత్రం ద్వారా హీరోగా తెలుగుతెరకు పరిచయం అయ్యాడు.

వేములవాడ భీమకవి, సతీసావిత్రి, శ్రీరామాంజనేయయుద్ధం చిత్రాల్లో శివుని పాత్రలో మెప్పించారు పి.జె.శర్మ. భక్తతుకారాంలో మంత్రిగా, మహాకవి క్షేత్రయ్యలో సిద్దేంద్రయోగి పాత్రల్ని కడు సమర్థవంతంగా పోషించారు.

ఎన్నో వందల చిత్రాల్లో జడ్జి, ఐ.జి, లాయర్, విలన్ వంటి విభిన్న ప్రాతలకు ప్రాణం పోశారు పి.జె.శర్మ. జీవనతీరాలు, స్వప్న, కలెక్టర్ జానకి, కల్యాణమండపం, ఈశ్వర్‌అల్లా వంటివి వాటిలో కొన్ని. సి.యస్.ఆర్ తరువాత మద్రాస్‌లోని పాండీబజార్‌లో పదిమంది సినిమా వాళ్ళకు పెద్ద దిక్కుగా మసలుతూ, సలహాలనిస్తుండే పి.జె.శర్మ ఎన్నదగిన క్యారెక్టర్ ఆర్టిస్టు.



# త్యాగరాజు

బి.ఎన్.రెడ్డి నిర్మించిన చిత్రం 'రంగులరాట్నం'. అందులో 'నడిరేయి ఏ జాములో స్వామి నినుచేర దిగివచ్చునో'; భక్తి, కరుణ రసపూరితమైన ఓ వేడికోలుతో కూడిన ఈ పాటకు అభినయించింది త్యాగరాజు, వాణిశ్రీ (తండ్రీ కూతుళ్ళులుగా). ఆ చిత్రంలో ప్రధమార్థంలో ఓపహిల్వాన్‌గా, కుస్తీయుద్ధాలు నేర్పే సాహసిగాను, తరువాత మంచితనం మూర్తీభవించిన ఓ వ్యక్తిగా నటించారు. నటుడిగా ఒక చిత్రంలో విభిన్న పార్శ్వాలు ఆవిష్కరించిన సమర్ధుడైన నటుడు త్యాగరాజు.

ప్రతినాయక పాత్రలతో సినీరంగ ప్రవేశం చెయ్యటానికి, తగిన గంభీర కంఠస్వరం, నిలువెత్తు రూపం ఆయనకు పెద్ద ఎస్సెట్స్‌గా నిలిచాయి. (దేవుడిచ్చిన ఓ వరం అని చెప్పవచ్చు).

హైస్కూల్ విద్య నభ్యసించే కాలంలోనే ఒక స్త్రీ పాత్రను, స్కూల్లో జరిగిన నాటకంలో నటించారు. ఆయన నటనమెచ్చుకున్న ఆనాటి హైద్రాబాద్ ముఖ్యమంత్రి బూర్గులరామకృష్ణారావు ఒక వెండి పాత్రను బహూకరించారు.

హైస్కూల్ విద్య అనంతరం, వరంగల్‌లోనే బి.ఏ. చదివి, నైట్ కాలేజీలో బి.యల్.లో చేరాక స్వంత పనిమీద మద్రాసు వెళ్ళిన త్యాగరాజుకి, అక్కడ సంగీత దర్శకులు టి.చలపతిరావుగారి పరిచయం ఏర్పడింది. ఆయన సహాయంతో దర్శకులు కె.ప్రత్యగాత్మగారు నిర్మిస్తున్న 'మంచి మనిషి' చిత్రంలో యన్.టి.ఆర్. సరసన తొలుత ఓ వేషం లభించింది. ఆ చిత్రం విజయం సాధించింది. కాని త్యాగరాజుకు అవకాశాలు ఎక్కువగా రాలేదు.

అనురూపావారి 'పల్నాటియుద్ధం' చిత్రంలో వీరభద్రుడి పాత్రకు మంచి పర్సనాలిటి వున్న వ్యక్తి కావాలని దర్శకులు జి.రామినీడు, త్యాగరాజును ఎంపిక చేశారు. ఆ చిత్రంలో నాయకురాలు నాగమ్మగా భానుమతి, అనుచరునిగా త్యాగరాజు అద్భుతంగా నటించారు. ఆ తరువాత ప్రతిజ్ఞాపాలన చిత్రంలో విలన్‌గా రాజనాల అనుచరుని పాత్ర

లభించింది. వరుసగా విఠలాచార్య నిర్మించిన పలు జానపద చిత్రాలలో అటు మాంత్రికునిగాను, ఇటు సేనాధిపతిగాను దుష్టపాత్రలు పోషించారు. సురేష్ ప్రొడక్షన్స్ వారి 'పాపకోసం'లో ఓ విలక్షణమైన పాత్రను కొత్తతరహాలో సెంట్‌మెంట్‌ను జోడించి నటించారు. బాపూ తీర్చిదిద్దిన 'సీతాకల్యాణం' పౌరాణిక చిత్రంలోని పరశురాముడు పాత్ర మరువలేనిది.

ప్రముఖ నిర్మాత దర్శకుడు యల్.వి.ప్రసాద్‌గారు హిందీలో నిర్మించిన 'రాజ్ అవుర్ రంక్' వర్ణ చిత్రంలోనూ అవకాశం లభించింది. 'శ్రీకృష్ణాంజనేయయుద్ధం'లో నరకాసురుడిగా, 'శ్రీకృష్ణవిజయము'లో దేవేంద్రుడిగా, 'శ్రీకృష్ణసత్య'లో అహిరావణునిగా, 'కురుక్షేత్రం'లో సైంధవుడిగా పౌరాణికాల్లో రాణించారు. 'అగ్గివీరుడి'లో మాంత్రికుడిగా, 'రణభేరి'లో సేనానిగా, నటించిన త్యాగరాజు 'జన్మభూమి, అదృష్టదేవత, బంగారుపంజరం, ఎవరు మొనగాడు అందంకోసం పందెం, జీవిత బంధం, ఖడ్గవీర' మొదలైన సాంఘిక చిత్రాలలోనూ కె.యస్.ఆర్.దాస్ నిర్మించిన అనేక క్రైం చిత్రాల్లో విజయవంతంగా నటించారు.

ఈ గ్రంథకర్త మాటలు వ్రాసిన 'కలవారి కుటుంబం'(1972)లో విలన్ వేషం వేయటం ఓ విశేషం.

'తాండ్ర పాపారాయుడు'లో గురువుగా, కృష్ణ నిర్మించిన జానపదం 'సింహాసనం'లో కపాలకంతునిగాను తొంభైవ దశకం వరకూ, అనేక పాత్రలు పోషించారు త్యాగరాజు. విలన్ పాత్రలు నటించినా తనదైన ముద్ర కన్పించేలా నటించటం ఒక్క త్యాగరాజుకే చెల్లింది. విలన్‌గా కంటె, విలన్‌గా నటిస్తూ, చివర్లో మంచివాడుగా మారిన పాత్రల్లోనూ, కథకు సపోర్ట్ ఇచ్చే పాత్రల్లోనే ప్రేక్షకులకు కలకాలం గుర్తుండిపోయే నటుడు త్యాగరాజు. 1994 సం॥లో కీర్తిశేషులయ్యారు.



# పి.ఎల్.నారాయణ

అఖిలభారత స్థాయిలో భారతప్రభుత్వం నుంచి నటుడిగా పురస్కారాలు అందుకున్న నటుల్లో ఆద్యుడు ముదిగొండ లింగమూర్తి (పెద్దమనుషులు) తరువాత పి.ఎల్.నారాయణ (యజ్ఞం).

పి.ఎల్.నారాయణ బాపట్లలో రచయిత కొర్రపాటి గంగాధరరావు, దర్శకుల కె.ఎస్.టి.సాయి రూపొందించిన పలు నాటకాల్లో పాల్గొని ప్రశంసలతో బాటు ఎవార్డులు కూడా అందుకున్నారు. 1964లో మూవీమొఘల్ డి.రామానాయుడు నిర్మించిన 'రాముడు – భీముడు' చిత్రంలో ఓ వేడుకలో వేదికపై కనిపిస్తారు. అది తొలి సినిమా అనుభూతి.

ఆ తరువాత యెన్నెన్నో వైవిధ్యమైన పాత్రలు, యెన్నెన్నో చిరస్మరణీయమైన సన్నివేశాలు. 'ఎర్రసైన్యం, అర్ధరాత్రి, స్వతంత్ర్యం' చిత్రాలకు పదునైన సంభాషణలు అందించిన నారాయణ 'ఊరేగింపు' చిత్రానికి దర్శకత్వం వహించటం విశేషం!

'మయూరి'లో కథానాయిక తండ్రిగా అసమర్థునిగా, 'మరోచరిత్ర'లో నాయిక తండ్రిగా, 'పుష్పకవిమానం'లో ముష్టివాడుగా, 'రుద్రవీణ'లో లాయర్‌గా, 'ఈ చరిత్ర ఏ సిరాతో'లో కవిగా, 'రాయలసీమరామన్నచౌదరి'లో బైరాగిగా, 'ఆడదే ఆధారం'లో నిరుపేద తండ్రిగా, యెన్నెన్నో వేషాలు – విన్యాసాలు.

బావ–బావమరిదిలో నిర్మలమ్మకు భర్తగా, అసమర్థుడై అచేతనుడై ప్రతిదానికీ అర్థవంతంగా ఆకాశంలోకి చూసిన సన్నివేశాలు మర్చిపోలేనివి.

'అక్కమొగుడు' చిత్రంలో తనమందు కోసం కన్న కూతుళ్ళనే ఎక్స్‌ప్లాయిట్ చేసి ఆత్మహత్య నాటకం జరిపిన అసమర్థునిగా ఓ ఫిఫ్టీ – ఓటెన్ అంటూ ముష్టెత్తిన పాత్రలో జీవించారు.

'నేటి భారతం, రేపటిపౌరులు' చిత్రాలలో నటనకుగాను రాష్ట్రప్రభుత్వం నంది పురస్కారాన్ని అందుకొని నటనకు జీవితాన్ని అంకితం చేసుకున్న క్యారెక్టర్ ఆర్టిస్టు పి.ఎల్.నారాయణ.



# రావుగోపాలరావు

'అబ్బా, సెక్రటీ, ఎప్పుడూ బిజినెస్ పన్లేనా? కళ్లెట్టుకు సూడు. పైనేదో మర్డర్ జరిగినట్టు లేదూ! ఆకాశంలో సూర్యుడు నెత్తురుగడ్డలా లేదూ! మనిసన్నాక కూసింత కలాపోషన వుండాలా, ఉత్తినే తిని తొంగుంటే మనిషికి గొడ్డుకు తేడా ఏటుంటుంది?' ముళ్ళపూడి కలం నుంచి జాలువారిన ఈ మాటలు రావుగోపాలరావు గొంతులో ప్రాణం పోసుకొని రాత్రికిరాత్రే సూపర్ క్యారెక్టర్ ఆర్టిస్టుగా ఆకాశానికి ఎత్తేశాయి.

కాకినాడలోని యంగ్‌మెన్స్ హాపీ క్లబ్ కళలకు కాణాచి. విఖ్యాత సంగీత దర్శకులు పి.ఆదినారాయణరావు. నటవిదూషీమణి అంజలీదేవి, విశ్వ విఖ్యాత నటసార్వభౌమ యస్.వి.రంగారావు ఆ వేదికరంగం నుంచి సినీరంగప్రవేశం చేసి 'శభాష్' అనిపించుకొన్నవారే! ఆ కోవలో ఆ వేదికనుంచి సినీరంగ ప్రవేశం చేసిన మరో విశిష్టనటుడు నటవిరాట్ రావుగోపాలరావు.

ఆంధ్ర నాటకరంగస్థలంపై ఆవిష్కరింపబడ్డ అద్భుతపాత్రల్లో 'కీర్తిశేషులు' మురారిపొకటి. ఆ పాత్ర నిర్వహణలో కె.వెంకటేశ్వరరావుది ఒక శైలికాగా మరో కోణం నుంచి రంగస్థలంపై ఆ భూమికను ఆవిష్కరించారు రావుగోపాలరావు.

చలనచిత్రరంగంలో ప్రత్యేకస్థానాన్ని పొందిన దర్శకులు గుత్త రామినీడు గారి దృష్టి ఎంత సేపు నవతరంను ప్రోత్సహించటంలో ముందుండేది. ఆ దృష్టి రావుగోపాలరావు పై పడటంలో ఆశ్చర్యం లేదు గానీ ఆ టచ్‌తో నటవిరాట్ స్థాయికి రావుగోపాలరావు ఎదగడం రామినీడుకు గర్వకారణం.

రావుగోపాలరావు చిత్రసీమలో అడుగిడిన తొలినాళ్ళలో సహాయదర్శకునిగా, సహాయరచయితగా యెన్నో అవతారాలు, ఎత్తి ఆయన గళం సరిగా లేదు. వేరే వాళ్ళ చేత డబ్బింగ్ చెప్పించాలి అనుకొన్నారు. 'జగత్ కిలాడీలు'లో అయితే కాలక్రమేణా ఆ గాత్రమే చిత్రవిచిత్ర విన్యాసాలతో ప్రేక్షకుల్ని, శ్రోతల్ని సంభ్రమాచ్యార్యాలతో ముంచెత్తి

అభిమానపాత్రమైంది. ఎస్.వి.రంగారావు తర్వాత ఆస్థాయిలో చక్కని టైమింగ్, పదవిన్యాసంలో విచిత్రశైలి ప్రదర్శించి "ఔరా" అనిపించుకొన్న ధన్యజీవి రావుగోపాలరావు!

ఆయన వందలాది చిత్రాల్లో నటించినా వైవిధ్య భూమికల నిర్వహణరీత్యా యున్నా వ్యాసకర్త దృష్టిలో నవరత్నాలుగా యెన్నదగిన పాత్రల్ని అలవోకగా పరిశీలిద్దాం! అన్నపూర్ణ సినీచిత్ర పతాకంపై కె.విశ్వనాథ్ దర్శకత్వంలో రూపుదిద్దుకున్న 'శారద' చిత్రంలో గ్రామపెద్ద మునసబుగా నటించారు రావుగోపాలరావు ఆ గ్రామానికే ఆభరణమయిన శారదకు ఘోరవిపత్తు వాటిల్లినప్పుడు ఆ విపత్తు తమదిగా భావించి గ్రామస్థుల్ని ఒక తాటి మీద నడిపి శారద జీవితంలో వెలుగు నింపటానికి ప్రయత్నిస్తాడు మునసబు. గంభీర ఉదాత్తనటనకు ప్రతీక మునసుబు పాత్ర.

బాపు–రమణల అపూర్వ అద్భుత సృష్టి 'ముత్యాలముగ్గు'లోని కంట్రాక్టర్. మాటలతో మర్డర్ చేసే మహత్తర భూమిక. పచ్చనికాపురాల్లో చిచ్చుపెట్టి 'అల్లో' అంటూ ఫోను గొట్టి పరామర్శించే వింత మనిషి. అయితే అదే అవస్థ తనకు ఎదురై తన కూతురి కాపురం బలైపోతే? ఆ పాత్రస్థితి ఎట్లా వుంటుంది. 'పాతాళభైరవి' యస్వీరంగారావు నటజీవితానికే టర్నింగ్ పాయింటయితే 'ముత్యాలముగ్గు' రావుగోపాలరావు జీవితాన్ని మరోమలుపు తిప్పింది. సినిమా డైలాగు కాసెట్స్ ప్రాచుర్యం పొందటం 'ముత్యాలముగ్గు' తోనే మొదలైంది.

ఆనాటి 'కాళహస్తి మహాత్మ్యం'లో గుణచిత్ర నటులు ముదిగొండ లింగమూర్తి నిర్వహించిన పూజారిపాత్రను 'భక్త కన్నప్ప'లో రావుగోపాలరావు ఆ స్థాయికి తగ్గకుండా నటించడమంటే కత్తిమీద సాముచేసి గెలిచినట్టే! కె.రాఘవేంద్రరావు దర్శకత్వం వహించిన 'సింహబలుడు' చిత్రంలో వెర్రితనం, చాదస్తం, మూర్ఖత్వం కలగలసిన మహారాజు పాత్ర ఓ వెరైటీ. ఈ తరహా పాత్రల్ని గతంలో సి.యస్.ఆర్. పోషించేవారు. ఇందులో రావుగోపాలరావు చేతిలో ఓ చిన్న సైజు దండ ధరించి మహారాజు పాత్రకు మెరుగులుదిద్దారు. 'మల్లెపూవు'లో మాలీష్‌వాలాగా ఎంత నవ్వించారో, సోషియా ఫాంటసీ 'మావూళ్లో మహాశివుడు'లో శివునిగా అంత గంభీరంగా నటించారు.

శ్రీ దాసరినారాయణరావు దర్శకత్వంలో రూపొందిన 'సర్దార్ పాపారాయుడు' చిత్రంలో ధర్మరాజు పాత్రలో కొత్త తరహా విలనీని ఆవిష్కరించారు రావుగోపాలరావు ముఖ్యంగా జైల్లో విజయరాఘవరాజును అంతమొందించే సన్నివేశంలో చూపిన నటన ఎన్నటికీ మరువలేనిది.

నిజానికి సాదసీదాగా కనిపించే పాత్రల్లో నటన సహజసిద్ధంగా వుంటుంది. ఈ తరహాపాత్ర పోషణ చాలా కష్టం. ఇందుకు ఉదాహరణ కె.వాసు దర్శకత్వం వహించిన 'గోపాలరావుగారి అమ్మాయి'లోని భూమిక. క్రియేటివ్ కమర్షియల్స్ 'ఛాలెంజ్'లో

చిరంజీవితో పోటీపడి డబ్బు విలువను గూర్చి ఛాలెంజ్ చేసే పాత్రలో క్రౌర్యాన్ని కలగలిపి పోషించారు రావుగోపాలరావు.

కుటుంబంలో అవకతవకలు జరుగుతుంటే అందులో కన్నకొడుకే యింటి పరువును మంటగలుపుతుంటే ఆ తండ్రి పడే వేదన వర్ణనాతీతం. కోడిరామకృష్ణ దర్శకత్వంలో రూపొందిన 'ఇంటిదొంగ' చిత్రంలో యీ తరహా పాత్రలో తన నటన ద్వారా ప్రేక్షకులని కంటతడి పెట్టించారు గోపాలరావు.

దర్శకునిగా ఇ.వి.వి.సత్యనారాయణ కీర్తిపతాకను గగనసీమల ఎగురవేసిన చిత్రం ఎ.వి.యం. వారి 'ఆ ఒక్కటి అడక్కు', పొట్టిలాగు, తమాషా చొక్క, ఆపై కండువాలాంటి టవల్‌తో కోట్ల వ్యాపారం చేస్తూ కూతురిపై పెంచుకొన్న ప్రేమకోసం దిగాలుపడి దిగివచ్చిన 'రొయ్యల నాయుడు' పాత్ర రావుగోపాలరావు జీవితంలో మరో విచిత్రమైన భూమిక.

'ప్రేమపిచ్చోళ్లు' చిత్రంలో తను స్నేహితులైన గుమ్మడి, అల్లు రామలింగయ్యలతో కలసి హీరోయిన్ రాధికకోసం పోటీపడ్డ వయస్సు మళ్లిన రసికుడిగా హాస్యాన్ని పండించారు. ఈ కోవలో చెప్పుకోదగ్గ మరో రెండు చిత్రాలు 'గోపాలరావుగారి అమ్మాయి, రావు–గోపాలరావు'. పౌరాణిక చిత్రం 'కురుక్షేత్రం'లో శల్యుడుగాను, విలక్షణ పాత్రలు నిర్వహించారు.

పైన పేర్కొన్నవే గాక అనేకానేక పాత్రల్ని సమర్థవంతంగా పోషించిన రావుగోపాలరావు నిజంగా నటనలో విరాట రూపాన్ని చూపి 'నటవిరాట్', 'తెలుగు కళామతల్లి కంఠసీమలో వెలసిన వెలలేని ఆభరణం.

# చలపతిరావు



మహానటుడు యన్.టి.రామారావు అంటే చలపతిరావుకు ఎంతో అభిమానం. నటుడిగా చలపతిరావు అంటే అంతకుమించి అభిమానం. యన్.టి.ఆర్.కు అందుకే ఆయన స్వీయదర్శకత్వంలో రూపొందించిన ప్రతిష్టాత్మక పౌరాణిక చిత్రం 'దానవీర శూరకర్ణ'లో మూడు పాత్రలు ఇచ్చి ప్రోత్సహించారు. అవి కర్ణుని పెంచిన తండ్రి సూతుడు, ఆ కర్ణుని రక్తాన్ని హరించే కీటకంగా మారిన దేవేంద్రునిగా, కర్ణుని కవచకుండలాలు యాచించే బ్రాహ్మణోత్తముడిగా, ముఖ్యంగా కర్ణుడు సహజ కవచాన్ని శరీరం నుంచి తొలగించిన సన్నివేశంలో చలపతిరావు, మాటలతో నిమిత్తం లేకుండా చూపిన రియాక్షన్ అద్భుతం.

8.05.1944న జన్మించిన, చలపతిరావు బి.యస్.సి పట్టభద్రులు, తొలిసారిగా 1967లో వచ్చిన బాపు చిత్రం 'సాక్షి'లో చిన్నవేషంలో వెండితెరపై తళుక్కున మెరిసారు. 1969లో వచ్చిన 'కథానాయకుడు' చిత్రంలో యన్.టి.ఆర్. కాంబినేషన్‌లో గుర్తింపు గల పాత్ర లభించింది. ఆ తరువాత శతాధిక చిత్రాలలో కథానాయికను రేప్ చేయటానికి ప్రయత్నించిన దుష్టభూమికల్లో రాణించారు. గుణచిత్ర నటుడిగా మారిన తరువాత కొద్దిపాటి హాస్యం కలిసిన తండ్రి పాత్రలు పోషించారు. ఈ కేటగిరిలో చెప్పుకోదగ్గ చిత్రం నటి లక్ష్మి కాంబినేషన్‌లో నాగార్జునకు తండ్రిగా నటించిన 'నిన్నేపెళ్ళాడతా'.

దర్శకుడు ఇ.వి.వి రూపొందించిన బెండు అప్పారావు, ఎవరిగోల వారిదిలో మిగతా హాస్యనటులతో పోటీపడి కామెడీ పండించారు. 'కత్తికాంతారావు'లో ఇన్‌స్పెక్టర్ జనరల్‌గా గంభీరంగా నటించారు. 'నరసింహ'లో జూనియర్ యన్.టి.ఆర్. బాబాయిగా, కీలకమైన పాత్రను పోషించారు. ఓ డజను చిత్రాల్లో లాయర్‌గా నటించారు. 'ఆ నలుగురు' చిత్రంలో యమదూతల్లో ఒకడిగా రఘుబాబుతో కలిసి కౌర్యంతో కూడిన కామెడిని అభినయించటంలో పోటీ పడ్డారు. చలపతిరావు నిర్మాతగా మారి, మిత్రుల భాగస్వామ్యంలో కలియుగకృష్ణుడు, కడపరెడ్డెమ్మ, జగన్నాటకం, పెళ్ళంటే నూరేళ్ళ పంట, ప్రెసిడెంటుగారి అల్లుడు చిత్రాలను అందించారు.

వీరి అబ్బాయి రవిబాబు విలన్‌గా తెరకు పరిచయమయి, అనసూయ, మనసారా వంటి విలక్షణ చిత్రాలకు దర్శకత్వం వహించారు.



# చంద్రమోహన్

డప్పు వాయిటంలో ప్రత్యేకత చూపించి పొట్టివాడయినా గట్టివాడు అనిపించేలా తొలి చిత్రం బి.ఎన్.రెడ్డి 'రంగులరాట్నం'తో సినీపండితులు అచ్చెరువొందేలా, నటనలోనూ వైవిధ్యం, కనబరిచిన నటుడు చంద్రమోహన్.

1943 సం॥ మే 23న కృష్ణాజిల్లా పమ్మిడిముక్కల గ్రామంలో జన్మించిన చంద్రమోహన్ అసలుపేరు మల్లంపల్లి చంద్రశేఖర్‌రావు. బాపట్లలో బి.యస్.సి అగ్రికల్చర్ పూర్తిచేసి కొంతకాలం ఏలూరులో ప్రభుత్వోద్యోగం చేసారు.

సినిమాల్లో నటించాలన్న తపనతో ఉద్యోగాన్ని వదిలిపెట్టి, ఆవైపుగా కృషి మొదలు పెట్టారు. హీరోగా కెరీర్ మొదలు పెట్టి, కమెడియన్‌గా మారి క్యారెక్టర్ ఆర్టిస్టుగా స్థిరపడిన ప్రయోగశీలి చంద్రమోహన్.

ఏ పాత్ర పోషించినా, దాంట్లోకి పరకాయ ప్రవేశం చేసి, చంద్రమోహన్‌గా కాక మనకు ఆ పాత్ర గుర్తుండి పోయేలా నటించటం ఆయనకే చెల్లింది.

'సుఖదుఃఖాలు' చిత్రంలో చెల్లెల్ని ప్రేమించే ఓఅన్నగా గుర్తుండి పోతే, 'పదహారేళ్ళ వయసు'లో శ్రీదేవి సరసన అవిటితనం గల హీరో అయినా, అల్లూరి సీతారామరాజులో కోయ యువకునిగా గర్జించినా, 'సిరిసిరిమువ్వ'లో కథానాయికను కాపాడే ఓ ఆప్తునిగా, మళ్ళీ డప్పు వాయిద్య కళాకారునిగా, 'సీతామాలక్ష్మి'ని సినీతారగా మార్చే త్యాగశీలి, ఇలా ఎన్నో పాత్రలు తొలిరోజుల్లో మనముందు ప్రదర్శితమయ్యాయి. చంద్రమోహన్ ప్రతిభకు అద్దం పట్టాయి. ఎంతోమంది నాయికలు సెంటిమెంటు హీరోగా భావించే నటుడు చంద్రమోహన్. ఎందుకంటే ఆయనతో హీరోయిన్‌గా తొలి చిత్రంలో నటించిన కథానాయికలందరూ అగ్రస్థానానికి చేరుకున్నవారే. మంజుల, రాధిక, జయప్రద, జయసుధ, శ్రీదేవి, ప్రభ, విజయశాంతి, తాళ్ళూరి రామేశ్వరి ఈ కోవలోని వారే కావటం ఓ విశేషంగా చెప్పుకోవచ్చు.

సినీపరిశ్రమలో ఎన్ని మార్పులొచ్చినా, స్థితప్రజ్ఞతతో, తనను తాను విశ్లేషించుకుంటూ తనకు వచ్చిన పాత్రలలో వైవిధ్యాన్ని నటనలో ప్రదర్శిస్తూ ఆవేశ, వేషాలకు లోనుకాక పరిశ్రమలోని వారందరి చేతా మంచినటుడుగా మంచిమనిషిగా గుర్తింపబడ్డ వ్యక్తి చంద్రమోహన్.

హీరో హీరోయిన్ల తండ్రి పాత్రలు పోషించినా వాటికి తన నటనతో చంద్రమోహన్ గుర్తింపు తెచ్చారు. 'కలికాలం' చిత్రంలో తాను మరణించాడనుకొని ఆఫీసు వాళ్ళు కొడుక్కి ఉద్యోగం, యల్.ఐ.సి వాళ్ళు ఇచ్చిన డబ్బులు, తాను బ్రతికి వున్నాడని తెలిస్తే తీసేసుకుంటారని కొడుకు సాయికుమార్ భార్య జయసుధను తనకళ్ళముందే విధవరాలుగా వుంచి, తనను గాలిరాని ఓ డ్రమ్ములో దాస్తే వాళ్ళ స్వార్థాన్ని మన్నించిన కన్నతండ్రిగా చంద్రమోహన్ నటన కరుణపూరితంగా ఉంటుంది.

సోషియో ఫాంటసీ 'ఆదిత్య 369'లో వికటకవి తెనాలిరామకృష్ణునిగా హాస్యం పండించారు.

'నిన్నే పెళ్ళాడతా' చిత్రంలో ఆయిల్‌పుల్లింగ్ మూర్తిగా మాటలు లేకుండా మూకాభినయంతో హాస్యాన్ని పండించారు. 'ముగ్గురు మిత్రులు' చిత్రంలో హీరో శోభన్‌బాబును కాపాడే పొట్టిలాయరుగా, 'అల్లుడు గారు' చిత్రంలో నాయిక శోభనకు అద్దె మొగుడుగా మోహన్‌బాబును సెటప్ చేసి అతని చేత 'ఉలవలబస్తా' అనిపించుకునే లాయర్‌గా జగ్గయ్యకు సహకరిస్తూ. 'పౌర్ణమి' చిత్రంలో ఇద్దరు కూతుళ్ళు త్రిష, చార్మీలకు నాట్యగురువుగా, 'పంచాక్షరి' తండ్రి శంకరనారాయణగా ఇలా యెన్నెన్నో పాత్రల్ని హాస్య, కరుణ విషాదపరమైన నటనతో మెప్పించారు. ముఖ్యంగా కూతురు చిత్రంలో తన కిడ్నీని అమ్ముకుని, ఆ విషయంగా కొడుకులు కోర్టుకులాగితే, కూతురుపట్ల వివక్షచూపి, కొడుకుల్ని ఆదరిస్తే తనకు జరిగిందేమీటో వివరిస్తూ, బాధతో, ఆవేదనతో చెప్పిన డైలాగులు, అక్కడే కుప్పకూలి మరణించిన సన్నివేశంలో నటన ప్రేక్షకుల హృదయాలను కదిలించి, కంటతడి పెట్టిస్తుంది.

2005 సంవత్సరంలో 'అతనొక్కడే' చిత్రంలోని నటనకుగాను ఉత్తమ కారెక్టర్ యాక్టర్‌గా నంది ఎవార్డ్ అందుకున్నారు చంద్రమోహన్.



# అన్నపూర్ణ

మూడు, నాలుగు తరాల క్యారెక్టర్ ఆర్టిస్టుల కాంబినేషన్‌లో వారికి జంటగా, వారితో సరిసమానంగా నటించి జీవితాన్ని ధన్యం చేసుకున్న క్యారెక్టర్ ఆర్టిస్ట్ అన్నపూర్ణ.

ఈ వర్గీకరణలో చెప్పుకోదగ్గవి, గుమ్మడి (ఈ చదువులు మాకొద్దు), జగ్గయ్య (ధర్మవడ్డీ), బాలయ్య (వంశానికొక్కడు), జె.వి.సోమయాజులు(అప్పుల అప్పారావు), రంగనాధ్ (బంగారుకానుక), రావుగోపాలరావు (ఇంటిదొంగ, స్టేషన్ మాష్టార్), ప్రభాకర్‌రెడ్డి (దొంగలు బాబోయ్ దొంగలు), దాసరినారాయణరావు (ధీర్ఘసుమంగళిభవ), చలపతిరావు (పేదలబ్రతుకు), గొల్లపూడి మారుతీరావు (సంసారం ఓ చదరంగం, మనిషికో చరిత్ర) ఇవి కొన్ని ఉదాహరణలు మాత్రమే.

ఒకప్పుడు సంభాషణలు భావస్ఫోరకంగా పలికి సాత్విక పాత్రల్లో పరకాయ ప్రవేశంచేసి, ఆదర్శవంతమైన అమ్మ, అత్త, వదిన అంటే ఇలావుండాలి అని, అనిపించుకున్న మహానటి కన్నాంబ. ఆ నట వారసత్వాన్ని మూడుదశాబ్దాలుగా కొనసాగిస్తున్న నటి అన్నపూర్ణ.

ఈ ఇద్దరికి గల పోలిక ఒక్కటే. రంగస్థలంపై కథానాయికలుగా వైవిధ్య భరితమైన పాత్రలను ధరించి ప్రేక్షకులను మెప్పించి ఆ తరువాత సినీరంగ ప్రవేశం చేసినవారే.

1954లో విజయవాడలో జన్మించిన ఉమ పదమూడేళ్ళ ప్రాయంలో 'పాలేరు' నాటకంతో రంగస్థల ప్రవేశం చేసి నాటి నుంచి పల్లెపడుచు, శ్రీమంతులు, వరవిక్రయం, నటనాలయం, భయం, కనకపుష్యరాగం, సంధ్యారాగంలో శంఖారావం వంటి నాటకాలను ఆంధ్ర దేశమంతటా వందలాది ప్రదర్శనలిచ్చారు.

లలిత కళానికేతన్, గద్దానాపల్లి వంటి నాటక కళాపరిషత్‌లలో ఐదారుసార్లు ఉత్తమ నటిగా అవార్డులందుకున్నారు.

1980–81 ప్రాంతాల్లో ఏలూరు ఎగ్జిబిషన్ సొసైటీవారు నిర్వహించిన నాటక పోటీల్లో ఈ గ్రంధకర్త న్యాయనిర్ణేతగా ఉన్నప్పుడు ఆమెను ఉత్తమనటిగా ఎంపికచేయడం ఓ తీపిగుర్తు.

ఆమె ప్రతిభను గుర్తించిన నిర్మాత గంగాధరరావు దర్శకులు బి.వి.ప్రసాద్ ఉమకు నూతనప్రసాద్ కాంబినేషన్‌లో 'నీడలేని ఆడది' చిత్రంలో వేషం ఇచ్చి సినీరంగానికి పరిచయం చేశారు. అంతకుముందే రంగస్థల నటిగా ఆమె ప్రతిభను చూసి వున్న దర్శకులు దాసరినారాయణరావు, ఆయన రూపొందించిన 'స్వర్గం–నరకం' చిత్రంలో ఏకంగా, మోహన్‌బాబు సరసన కథానాయిక పాత్రనిచ్చి ఆమె భవిష్యత్తుకు బంగారుబాట వేశారు. అంతేకాదు ఆమె పేరును అన్నపూర్ణగా మార్చేశారు. అప్పటి నుంచి, ఇప్పటి దాకా దాదాపు 500 చిత్రాలు ఆమె ఖాతాలో జమ పడ్డాయి.

ముందడుగులో హీరో కృష్ణకు తల్లిగా శివకృష్ణకు భార్యగా సెంటిమెంటును పండించారు. గృహిణిగా ఓ భార్యకు ఉండవలసిన సర్దుకుపోయే తత్వం, పిల్లలంటే అప్యాయత, భర్త అంటే గౌరవంతో కూడిన కొద్దిపాటి భయం వుండటం సహజం, ఆ తరహా ఇల్లాలి పాత్రను 'మనిషికో చరిత్ర', 'సంసారం ఒక చదరంగం' చిత్రాల్లో చాలా కూల్‌గా గొల్లపూడితో పోటీపడ్డారు. ప్రేమతో కూడిన గయ్యాళి తనం ఎలా వుంటుందో, అనేది సవితితల్లి పాత్రలో అభినయించి చూపారు 'ముద్దమందారం' చిత్రంలో.

నేను చిరంజీవి ఫాన్‌ని అంటూ, అధ్యాత్మిక భావాలు గల భర్త సోమయాజుల్ని విస్మరించిన పాత్రలో రాణించారు 'అప్పుల అప్పారావు' చిత్రంలో; బాబ్డ్‌హెయిర్‌తో, స్టైలిష్ కళ్ళజోడుతో మోడ్రన్ డ్రెస్‌లో 'అమ్మనాడాటరో' అంటూ, తెలుగు ఇంగ్లీషు కలిసిన భాషలో ఇంపోర్టెడ్ అల్లుడితో తమాషా చేసిన అత్తగారుగా 'హలోబ్రదర్' చిత్రంలో హాస్యాన్ని పండించటంలో నేనేం తక్కువగాదని రుజువు చేసుకున్నారు.

మొన్నటి సెక్రటరీలో కథానాయిక జయంతికి స్నేహితురాలుగా, నిన్నటి 'నువ్వేకావాలి' హీరో సాయికిరణ్ బామ్మ, నేటి పలు చిత్రాలలో ఈ తరం హీరో, హీరోయిన్లకు అమ్మగా, అమ్మమ్మగా పెద్ద దిక్కుగా ప్రేక్షకుల ఆదరాభిమానాలను అందుకుంటున్న అన్నపూర్ణ నిజంగా క్యారెక్టరు ఆరిస్టులకులంలో అన్నపూర్ణే...



# మురళీమోహన్

24.6.1940న జన్మించిన మాగంటి రాజ్‌బాబు, ఏలూరులో కళాశాల విద్య పూర్తయ్యాక విజయవాడలో ఒకవైపు వ్యాపారం చేస్తూ, మరోవైపు నటనపై ఆసక్తితో జంధ్యాల వ్రాసిన నాటకాల్లో నటుడిగా పాల్గొన్నారు.

'జగమేమాయ' చిత్రంతో మురళీమోహన్ పేరుతో హీరోగా సినీరంగ ప్రవేశం చేసారు (1973). నాటి నుంచి నేటిదాకా దాదాపు 300 చిత్రాల్లో నటించారు. వాటిల్లో హీరోగా నటించినవి సగభాగం కాగా మిగతా సగం కారెక్టర్ ఆర్టిస్టుగా రాణించినవే.

1973–85 వరకూ ఓ పుష్కరకాలం అటూ దాసరి నారాయణరావు (చిల్లరకొట్టు చిట్టెమ్మ, ఇదెక్కడి న్యాయం, మొ॥), కె.రాఘవేంద్రరావు (జ్యోతి, కల్పన, ఆమె కథ మొ॥) వంటి ప్రముఖ దర్శకులు రూపొందించిన చిత్రాల్లో విభిన్న పాత్రలు పోషించి బడ్జెట్‌లో రూపొందించే నిర్మాతల పాలిటి ఆత్మబంధువైనారు.

సోదరుడు కిషోర్ నిర్మాతగా జయభేరి ప్రొడక్షన్స్ ప్రారంభించి 'వారాలబ్బాయి, పిచ్చిపంతులు, ముగ్గురుమిత్రులు, నమ్మినబంటు, వారసుడు, రాజేశ్వరకళ్యాణం' వంటి పలు చిత్రాలు నిర్మించారు.

1985లో రూపొందించిన 'ఓ తండ్రి తీర్పు' చిత్రం మురళీమోహన్ జీవితంలో కొత్త అధ్యాయానికి నాంది పలికింది. వయసు మళ్ళిన తండ్రి పాత్రలో కరుణ, విషాద రసాలు పలికించి ఉత్తమనటుడిగా నంది ఎవార్డు అందుకున్నారు. ఆ తరువాత నుంచీ శతాధికచిత్రాల్లో గుణచిత్ర నటుడిగా రాణించారు.

'నిర్ణయం' చిత్రంలో నాయిక తండ్రిగా సిద్ధాంతాలకు కట్టుబడి యదార్థవాదిగా నాగార్జునతో పోటీపడి నటించి 'శభాష్' అనిపించారు.

నటసమ్రాట్ అక్కినేని కాంబినేషన్‌లో 'సూత్రధారులు' చిత్రంలో గంగిరెద్దులను ఆడించే సహజపాత్రల్లో జీవించారు. 'రావుగారిల్లు' చిత్రంలో ఆయనకు ఆప్తమిత్రుడిగా సలహాలనిచ్చిన పాత్రలో రాణించారు.

'శివ' చిత్రంలో కథానాయకుని అన్నయ్యగా అతని ఆవేశాన్ని కట్టడి చేయడానికి ప్రయత్నించిన వేషంలో ఎంతో సంయమనం చూపారు.

విప్లవ చిత్రాలశిల్పి ఆర్.నారాయణమూర్తి 'వేగుచుక్కలు' చిత్రంలో బడుగురైతు కష్టాలు కన్నీళ్ళకు ప్రతీకగా రూపొందించిన పాత్రకు సహజనటనతో ప్రాణం పోసారు. అందుకు రాష్ట్రప్రభుత్వం నుండి ఉత్తమ సహాయనటుడిగా 'నంది' పురస్కారాన్ని అందుకున్నారు.

'ప్రేమించు' చిత్రంలో అంధురాలైన కూతుర్ని ఆదరించే తండ్రిగా ఉదాత్త నటన ప్రదర్శించి నంది ఎవార్డు కైవసం చేసుకున్నారు. ఇటీవలి దాసరి చిత్రం 'పరమవీర చక్ర'లో బాధ్యతగల మిలట్రీ అధికారి పాత్రలో పరకాయ ప్రవేశం చేసి ప్రశంస లందుకున్నారు.

ఏలూరు కళాశాలలో చదువుకున్నప్పుడు నిర్మాత ఛటర్జీ, క్రాంతికుమార్, కుమార్‌జీ, హీరో కృష్ణ, మురళీమోహన్, ఈ గ్రంథ రచయితనైన నేను బ్యాచ్‌మెట్స్. అప్పట్లో నేను విపరీతంగా నాటకాలు వేసేవాడిని. నన్ను అభిమానించిన మురళీమోహన్ వారు నిర్మించిన 'పిచ్చిపంతులు' చిత్రంలో సరదాగా ఓ వేషం ఇచ్చి ప్రోత్సహించిన సహృదయులు.

పరిశ్రమలోని వారిచేత 'అజాతశత్రువు'గా మన్ననలందుకొంటూ మూవీ ఆర్టిస్ట్ ఎసోసియేషన్‌కు అధ్యక్షునిగా సేవలందిస్తున్నారు. ఫిలిండెవలప్ మెంట్ కార్పొరేషన్ అధ్యక్షునిగా పరిశ్రమ ప్రగతికి సహకరించారు.

రియల్ ఎస్టేట్ వెంచర్స్‌లో ప్రవేశించి 'జయభేరి' ద్వారా ఆ రంగంలోని వారికి మార్గదర్శకులై జీవితాన్ని ధన్యం చేసుకుంటున్న మహనీయుడు మురళీమోహన్.



# గిరిబాబు


మూడు తరాలకు చెందిన కథా నాయకులు నాగేశ్వరరావు, రామారావు, శోభన్‌బాబు, కృష్ణ, కృష్ణంరాజు, మురళీమోహన్, మోహన్‌బాబు, చిరంజీవి, బాలాకృష్ణ, నాగార్జున, వెంకటేష్ వీరందరితోనూ విలన్‌గా నటించిన ఖ్యాతి దక్కించుకున్నవారు ఇద్దరు; వారు కైకాల సత్యన్నారాయణ, యర్రా గిరిబాబు. ప్రకాశం జిల్లా రావినూతలగ్రామంలో 1944లో జన్మించిన గిరిబాబుకు చిన్నప్పటి నుంచి నాటకాలన్న, సినిమాలన్న మోజు, 'జగమేమాయ' చిత్రం ద్వారా సినీరంగానికి విలన్ పాత్రలో పరిచయమయ్యారు. గిరిబాబు 'దొరబాబు' చిత్రంతో ప్రేక్షకులకు చేరువ అయ్యాడు.

ఉత్తమ అభిరుచితో చిత్రాలు అందించే ఉద్దేశ్యంతో నిర్మాతగా మారి "దేవతలారా దీవించండి, సింహగర్జన, ముద్దూముచ్చట, సంధ్యారాగం, మెరుపుదాడి" చిత్రాలను నిర్మించారు. హాస్యం, గాంభీర్యం కలగలిపిన విలక్షణ పాత్రలను చాలా ఈజ్‌తో నటించారు. ఆ కేటగిరిలో చెప్పుకోదగ్గవి – 'నిన్నేపెళ్ళాడతా'లో చలపతిరావు తమ్ముడుగా, 'ఆవిడా మా ఆవిడే'లో నాగార్జున తండ్రిగా, 'పెళ్ళాం చెబితే వినాలి'లో అన్నదమ్ముల్లో ఒకడిగా, 'క్షేమంగా వెళ్ళి లాభంగారండి'లో ఫ్యాక్టరీ యజమానిగా, 'చిత్రం భళారేవిచిత్రం'లో హీరో నరేష్‌కు ఆఫీస్‌లో బాస్‌గా, 'లిటిల్‌సోల్జర్స్' సినిమాలో సుధాకర్‌కు తండ్రిగా, 'సిసింద్రీ'లో కుర్రాడిని కిడ్‌నాప్ చేసిన ముగ్గురులో ఒకడిగా, 'పెళ్ళి' సినిమాలో రిటైర్డ్ మేజర్‌గా, 'సింహాసనం'లో సేనాధిపతిగా, 'కురుక్షేత్రం'లో దుశ్శాసనుడుగా ఆ పాత్రలను రక్తికట్టించారు.

నలభై సంవత్సరాల నట జీవితంలో సుమారు ఆరు వందల చిత్రాల్లో నటించిన గిరిబాబు, దర్శకత్వంలో తయారైన చిత్రాలు 'రణరంగం', 'ఇంద్రజిత్', 'నీ సుఖమే నేకోరుతున్నా'.

గిరిబాబు కుమారుల్లో ఒకరు బోసుబాబు 'ఇంద్రజిత్'లో కథానాయకునిగా నటించగా, మరొక కుమారుడు రఘుబాబు ఆల్‌రౌండ్ ఆర్టిస్టుగా పేరు పొందారు.

స్పష్టమైన తెలుగు ఉచ్చారణతో, తనదైన ప్రత్యేకశైలి డైలాగ్ డెలివరీతో నేటికి ప్రేక్షకులకు తన నటన ద్వారా ఆనందాన్ని అందిస్తున్న ధన్యజీవి గిరిబాబు.



# నూతన్‌ప్రసాద్

"కొత్తదేవుడండీ, కొంగొత్త దేవుడండీ" అంటూ బాపూ రమణలు రూపొందించిన 'రాజాధిరాజా' చిత్రంలో నేను పోషించిన 'సైతాన్' పాత్ర నటుడిగా నాకెంతో తృప్తినిచ్చిన పాత్ర అంటారు నూతన్‌ప్రసాద్.

12.12.1945న కైకలూరులో జన్మించిన వరప్రసాద్. బందరులో ఐ.టి.ఐ చదివి నాగార్జునసాగర్, హైద్రాబాద్‌లో చిరుద్యోగాలు చేసి హెచ్.ఎ.ఎల్‌లో సెటిలయ్యారు. అప్పుడే నటుడు దర్శకుడు భానుప్రకాశ్‌తో పరిచయం కావడంతో రంగస్థలంపై 'సుడిగాలి, గాలివాన, గాలిపటం, వలయం, కెరటాలు' వంటి నాటకాల్లోనూ నాటకరంగ ప్రయోక్త ఎ.ఆర్.కృష్ణగారి దర్శకత్వంలో 'మాలపిల్ల' నాటకం 101 సార్లు ప్రదర్శించారు నూటొక్క జిల్లాల అందగాడు.

బాపుగారి 'అందాలరాముడు'తో సినీరంగప్రవేశం చేసి 'ముత్యాలముగ్గు'లో నిత్యపెళ్ళికొడుకులా వేషం గట్టి ఆపైన వేజెళ్ల సత్యనారాయణగారి 'చలిచీమలు' చిత్రంతో నూతన్‌ప్రసాద్‌గా మారి నూటొక్కజిల్లాల అందగాడిగా ప్రసిద్ధి పొందారు.

అది 1975-76 నాటి మాట. అప్పట్నుంచి భానుమతిగారి భర్తగా 'బామ్మమాట బంగారు బాట' చిత్రం వరకు 365 చిత్రాల్లో నటించారు. ఆ చిత్రం షూటింగ్ సందర్భంగా యాక్సిడెంట్ కావటంతో కొంతకాలం విశ్రాంతి తీసుకొని భగవంతుడు పునర్జన్మ ప్రసాదించాక నేటిదాకా 112 చిత్రాల్లో నటించారు.

దాదాపు 20 చిత్రాల్లో జడ్జి పాత్ర పోషించారు. అదొక రికార్డు. 'సంసారం ఓ చదరంగం'లో ఎడ్మండ్ శామ్యూల్ (చిలకమ్మ జానకి భాషలో ఎద్దుబండి శామ్మూల్) విలక్షణమైన హాస్యాన్ని అందించారు.

విజయ బాపినీడుగారి చిత్రం 'పట్నంవచ్చిన పతివ్రతల్లో' పోలీసాఫీసరుగా 'దేశం చాలా క్లిష్టపరిస్థితుల్లో వుంది' అన్న డైలాగ్ పాత్రపరంగా పడింది. తర్వాత యెన్నో చిత్రాల్లో దాన్ని వాడుకున్నారు. విజయ, బొట్టుకాటుక, కాయ్‌రాజా కాయ్, వసుంధర

వంటి చిత్రాల్లోని భూమికలు, ప్రత్యేకించి ఇంటింటి రామాయణంలో భూమిక తొలిసంవత్సరాల్లో ఎంతో పేరు తెచ్చిపెట్టాయి.

పరమ కర్కోటకుడుగా, బ్రోకరుగా, పూజకు పనికిరాని పువ్వు చిత్రంలోనూ మూర్ఖత్వం, ప్రేమ, సెంటిమెంట్ నిండిన పాత్రలో 'అహనాపెళ్ళంట' చిత్రంలో ప్రదర్శించిన నటన మరపురానిది. 'ఆఖరిపోరాటం'లో కేంద్రమంత్రిగా అమ్రిష్‌పురితో పోటీపడి నటించారు.

'సుందరి-సుబ్బారావు ప్రజాస్వామ్యం, నవభారతం, వసుంధర' చిత్రాల్లో నటనకుగాను రాష్ట్రప్రభుత్వం నందిపురస్కారాలను అందుకున్నారు.

అక్కినేని, నాగార్జున కాంబినేషన్‌లో వచ్చిన 'కలెక్టరుగారబ్బాయి' చిత్రంలో విలన్‌గా ఆ యిద్దరితో పోటీపడటం చెప్పుకోదగ్గ విశేషం.

కె.రాఘవేంద్రరావుగారి అగ్నిపర్వతం, దాసరినారాయణరావుగారి తిరుగుబాటు, బ్లాక్ టైగర్ ఇ.వి.వి.గారి 'అబ్బాయిగారు' వంటి చిత్రాల్లో వెరైటీ పాత్రలు పోషించారు.

నేరాలు- ఘోరాలు, హాట్సాఫ్ వంటి కార్యక్రమాల ద్వారా బుల్లితెర ప్రేక్షకులకు దగ్గరయ్యారు. కొంతకాలం సాంస్కృతిక కేంద్రమైన రవీంద్ర భారతికి కార్యదర్శిగా పనిచేశారు. 30.03.2011న అనారోగ్యంతో కన్నుమూసారు.

*యావత్ భారతీయ చలనచిత్ర చరిత్రలో రికార్డ్‌గా చెప్పుకోవాలసిన అంశం- ఒక క్యారెక్టర్ ఆర్టిస్టు యాక్సిడెంట్‌కు గురై కాలుపోగొట్టుకొని, ఆరోగ్యంతో పుంజుకున్నాక వీల్‌చైర్‌లో వుంటూ శతాధిక చిత్రాలలో నటించి రాణించటం ఆశ్చర్యం, అపూర్వం అనితర సాధ్యం. దీనికి కారణం దైవకృప, నా మనోనిబ్బరమే అంటారు నూతన్‌ప్రసాద్.*



# రంగనాథ్

1946లో మద్రాసులో జన్మించిన తిరుమల సుందర శ్రీరంగనాథ్, ఎనిమిదేళ్ళ వయసులోనే రేణిగుంట ఎలిమెంటరీ స్కూల్లో 'ఏసుక్రీస్తు' నాటకంలో హేరోదురాజుగా నాటకరంగ ప్రవేశం చేశారు.

తిరుపతి వెంకటేశ్వరా యూనివర్సిటీలో బి.ఏ. చదివి, ఆ తరువాత 1966 నుండి 73 వరకూ, రాజమండ్రిలో రైల్వేలో టికెట్ కలెక్టరుగా పనిచేశారు.

1969లో వచ్చిన 'బుద్ధిమంతుడు'లో తొలిసారి కెమెరాముందు తళుక్కుమన్నారు. ఆ తరువాత సావిత్రి దర్శకత్వంలో వచ్చిన 'వింతసంసారం'లో రెండు, మూడు డైలాగులున్న వేషం లభించింది.

రంగనాథ్ పర్సనాలిటీ చూసి ముచ్చటపడ్డ, రాజమండ్రికి చెందిన గిరిబాబు స్వీయదర్శకత్వంలో నిర్మించిన 'చందన' చిత్రలో హీరో వేషం ఇచ్చి ప్రోత్సహించారు. ఆ తరువాత జమిందారు గారి అమ్మాయి, దేవతలారా దీవించండి, పంతులమ్మ, ఇంటింటి రామాయణం, అమెరికా అమ్మాయి, అందమే ఆనందం' వంటి పలుచిత్రాలలో కథానాయిక పాత్రలలో రాణించారు.

జానపదబ్రహ్మ విఠలాచార్య రూపొందించిన 'దొరలు-దొంగలు' చిత్రంలో భగ్నప్రేమికునిగా అతిథిపాత్రలో అలరించారు.

ఆజానుబాహు విగ్రహం, అందుకు తగ్గ గంభీరమైన గొంతు ఉన్న రంగనాథ్‌ను, విలక్షణమైన వెరైటి భూమికలు వెతుక్కుంటూ వచ్చాయి.

ఆ కోవలో రంగనాథ్ విలన్‌గా నటించి రాణించిన తొలిచిత్రం 'గువ్వల జంట' ఒక ఎస్టేట్ జమిందారుగా ఉంటూ తన దగ్గర పనిచేసే నౌకరు భార్యను పొందటానికి ప్రయత్నించిన దుష్టునిగా పాత్రకు న్యాయం చేశారు.

రాఘవేంద్రరావుగారి 'అర్జున్' చిత్రంలో రాజకీయ నాయకునిగాను, అంతిమ తీర్పులో హోంమంత్రిగాను, రాజకీయ నాయకుని పాత్ర పోషణలో హుందాతనం చూపారు.

విశాల దృక్పథం గల న్యాయమూర్తి పాత్రను పోషించిన చిత్రం 'గృహప్రవేశం'. విలన్‌టచ్ వున్న హీరో మోహన్‌బాబు వల్ల అత్యాచారానికి గురికాబడ్డ నాయిక జయసుధతో పెళ్ళి జరిపించిన సంస్కారవంతమైన మహనీయునిగా ఉదాత్తంగా నటించారు.

మెగాస్టార్ చిరంజీవి నటజీవితానికి బ్రేక్ ఇచ్చిన 'ఖైదీ' చిత్రంలో ప్రథమార్ధంలో పోలీస్ ఆఫీసర్‌గా నిండుగా నటించి హీరోయిజమ్ ఎలివేట్ కావటానికి సహకరించారు.

'శ్రీదత్తదర్శనమ్' చిత్రంలో కార్తవీరార్జునిగానూ, 'అష్టలక్ష్మి వైభవం'లో మహిషాసురునిగా నటించి పౌరాణిక పాత్ర పోషణలో తన ప్రత్యేకత ప్రదర్శించారు.

చారిత్రక నేపథ్యంతో దాసరి రూపొందిన చిత్రం 'విశ్వనాథ నాయకుడు'. అందులో రాజరాజచోళుని పాత్ర తనకు లభించటం, నాగమనాయని పాత్ర పోషించిన నడిగర్ తిలకం శివాజి గణేశన్‌తో పోటీపడి నటించి, మెప్పించటం నాకు లభించిన అపూర్వ అదృష్టం అని చెప్పుకుంటారు రంగనాథ్.


నవగ్రహ నాయకి, రాజర్షి అనే తమిళ చిత్రాలలోనూ 'ఏకలవ్య'లోను శివుని పాత్ర పోషించారు. 'తీన్‌బార్' అనే హిందీ చిత్రంలో ఇంగ్లీషు మాట్లాడే జడ్జిగా ఓ విలక్షణ పాత్రను ఆవిష్కరించారు.

బుల్లి తెరకు దర్శకేంద్రుడు కె.రాఘవేంద్రరావు అందించిన అద్భుతమైన సీరియల్స్ 'శాంతినివాసం, సృష్టి' ఈ రెంటిలోనూ, నటించిన రంగనాథ్ సృష్టిలో దక్షప్రజాపతి పాత్రకుగానూ, నంది అవార్డ్ అందుకున్నారు.

'బీర్బల్ కథలు' సీరియల్‌లో మొగలాయి చక్రవర్తి అక్బరుపాత్రకు ప్రాణం పోశారు.

టెన్నిస్ ఆడటం, నా హాబీ అని మురిసిపోయే రంగనాథ్ 'మొగుడ్స్ పెళ్ళామ్స్' అనే చిత్రానికి దర్శకత్వం వహించారు.

రంగనాథ్ ఎంతటి సమర్ధుడైన నటుడో, అంతటి భావుకత ఉన్న రచయిత. 'కవితా సుదర్శనం', 'అంతరంగమథనం' పేరిట రెండు కవితా సంకలనాలను సాహితీ ప్రియులకు అందించారు.



# గొల్లపూడి మారుతీరావు

"ఇదిగో మన అక్రమసంబంధానికి సాక్షియైన హోటల్ బిల్లు – దీన్ని నలుగురుకు చూపించి నీ బ్రతుకు బజారు పాలుచేస్తాను" అంటుందోచిన్నది. "ఏదీ చూడనీ అని కాగితాన్ని దొరకపుచ్చుకుని ఉండగా చేసి గుటుక్కున మింగి బ్రేవ్‌మని తేన్చి, ఇప్పుడు ఎవరితో చెప్పుకుంటావ్ "దటీజ్ సుబ్బారావు" అంటూ నయవంచన చేసే సుబ్బారావు పాత్ర ద్వారా 'ఇంట్లో రామయ్య వీధిలో కృష్ణయ్య' చిత్రంలో తెరమీదకు వచ్చారు గొల్లపూడి మారుతీరావు.

14.4.1939న జన్మించిన మారుతీరావు విశాఖపట్నంలో యూనివర్సిటీ విద్యార్థిగా వున్నప్పుడే నాటికలు, నాటకాలు వ్రాసి నాటి రిజిస్ట్రారు శ్రీ కె.వి.గోపాలస్వామి ప్రశంసలు పొందారు. ఆ తరువాత వ్రాసిన నాటకాలు ఊరూర ప్రదర్శించి విజయభేరి మ్రోగించారు. ఆ దిశగా చెప్పుకోదగ్గ రచనలు 'రాగరాగిణి, మహానటుడు, కరుణించిన దేవతలు, సత్యంగారిల్లెక్కడ, అనంతం, దొంగగారు వస్తున్నారు స్వాగతం పలకండి' వంటి ఓ పాతిక వున్నాయి.

1970వ సంవత్సరం ఆంధ్రనాటక కళాపరిషత్తు విజయవాడలో జరిగినప్పుడు మారుతీరావు వ్రాసిన నాటకం 'కరుణించని దేవతలు' నాటిక 'కళ్ళు' ప్రదర్శించారు. ఈ రెంటికీ రచనకు గాను గొల్లపూడి ఎవార్డు అందుకున్న సందర్భంలో కళాకారులందరూ భుజాలపై ఆయన్ని వూరేగించటం రంగస్థల చరిత్రలో పేర్కొన్నదగిన విశేషం.

ఆల్‌యిండియా రేడియోలో పని చేయటం గొల్లపూడి సాహితీ జీవిత పరిపుష్టికి చేయూతనిచ్చింది.

అక్కినేని – దుక్కిపాటి, కె.విశ్వనాథ్ ప్రోత్సాహంతో 'ఆత్మగౌరవం' (1966) చిత్రానికి సంభాషణల రచయితగా సినీరంగానికి పరిచయమయ్యారు. నాటి నుంచి ఓ 75 చిత్రాలకు రచన కథ, మాటలు, స్క్రీన్‌ప్లే వ్రాసారు. 1988లో 'కళ్ళు' స్క్రీన్‌ప్లేకు నంది ఎవార్డ్ అందుకున్నారు.

'ఇంట్లో రామయ్య – వీధిలో కృష్ణయ్య'కు గొల్లపూడి రచయిత, నిర్మాత కె.రాఘవ, దర్శకుడు కోడిరామకృష్ణ (తొలిచిత్రం). నిర్మాత, దర్శకుడు ఓ నిర్ణయానికి వచ్చి గొల్లపూడి చేత సుబ్బారావు పాత్ర వేయించారు. అది క్లిక్ అయింది. ఆ వెంటనే 'తరంగిణి'లో గద్దముక్కు పంతులు పాత్ర అదీ క్లిక్కయ్యింది. అక్కన్నుంచి వేషాలు గొల్లపూడిని వెతుక్కుంటూ వచ్చాయి. కామెడీ, విలనీ; ఈ రెండు కలిసినవి, కుటుంబ కథాచిత్రాల్లో సహజత్వం, వ్యంగ్యంతో కూడినవి యెన్నో! దాంతో గొల్లపూడిలోని నటుడికి విశ్రాంతి దొరకలేదు. ఒకటా రెండా – రెండువందల డెబ్భై చిత్రాలు (అందులో ఓ పది తమిళం కూడా వున్నాయి.) 'శ్రీనివాసకల్యాణం'లోని పాత్ర వో వెరైటీ.


'ఆలయశిఖరం'లో పూనకంతో వూగి పోతూ ప్రభలు కట్టుకొని చిందులేసిన పాత్ర చెప్పుకోవాలి. మనిషికో చరిత్రలో ఎవడైనా బాగున్నారా అని పలకరిస్తే చాలు వాడికి వో క్లాసు పీకే విలక్షణ మనిషి. 'అభిలాష'లో విలన్ పక్కన వుంటూ 'పాయింట్ ఆఫ్ ఇండియా' అని డైలాగ్ పంచ్‌తో పాత్రను పండించారు.

గొల్లపూడి నటజీవితంలో చిరస్మరణీయమైన భూమిక 'సంసారం ఓ చదరంగం'లో యింటి యజమాని, దానిని తమిళంలో దర్శకులు విసు పోషించారు. తెలుగులో మరిన్ని మెరుగులు పెట్టి తనదైన శైలిలో ఆవిష్కరించారు మారుతీరావు.

పిల్లలు ఒక్కొక్కరిది ఒక్కోదారి; పెద్దకొడుకు యింట్లోనే వేరుగా వుండి లెక్కలు చెబితే, వాళ్ళ లెక్క తప్పినప్పుడు విడమరచి సెంటిమెంటును పక్కకు పెట్టి మోడరన్ దేవదాసుగా 'జగమేమాయ' ఆలపించి అందులో తన గోడును చిలకమ్మ (షావుకారు జానకి)కు వినిపించి ఊరట పొందుతాడు.

అటు రంగస్థలంపైన యిటు సినీరంగంలోనూ రచయితగా రాణించి కారెక్టర్ ఆర్టిస్టుగా సమర్థుడు అనిపించుకున్న గొల్లపూడి మారుతీరావు బుల్లితెరపై రావికొండలరావు దర్శకత్వంలో 'కన్యాశుల్కం' నాటకంలో గిరీశం పాత్రను తనదైన శైలిలో పోషించి రాణించారు.

కీర్తిశేషుడైన కొడుకు శ్రీనివాస్ జ్ఞాపకార్థం అఖిల భారతస్థాయిలో ఉత్తమ దర్శకులకు ఎవార్డు యిచ్చి సత్కరిస్తున్న చరితార్థుడు గొల్లపూడి మారుతీరావు!



# జె.వి.సోమయాజులు

'శంకరాభరణం' శంకరశాస్త్రిగా తెలుగు చలన చిత్రరంగంలోనూ, అటు ప్రేక్షకలోకంలోనూ, సంచలనం సృష్టించిన క్యారెక్టర్ ఆర్టిస్టు జె.వి.సోమయాజులు. ఎన్నో సినిమాల్లో నటించినా, ఆయన ప్రేక్షకుల హృదయాల్లో శంకరశాస్త్రిగానే, నిలిచిపోయారు.

1928వ సంవత్సరం, జూలై నెలలో శ్రీకాకుళం జిల్లాలోని ఓ కుగ్రామంలో జన్మించిన జొన్నలగడ్డ వెంకట సుబ్రమణ్య సోమయాజులు వృత్తిరీత్యా రెవిన్యూ డిపార్ట్‌మెంటులో సామాన్య గుమాస్తా స్థాయి నుంచి, అంచెలంచెలుగా ఎదిగి, డిప్యూటి కలెక్టర్ స్థాయి నందుకున్నారు. ప్రవృత్తిరీత్యా నాటకరంగం పట్ల గల మక్కువతో, సోదరుడు రమణమూర్తితో కలిసి, కాళరాత్రి, కన్యాశుల్కం, కీర్తిశేషులు వంటి పలునాటకాల్లో ప్రధానపాత్రలు పోషించారు.

1979వ సంవత్సరంలో యోగి దర్శకత్వంలో తయారైన 'రారాకృష్ణయ్య' చిత్రం ద్వారా సినీరంగ ప్రవేశం చేశారు. ఆ వెంటనే వచ్చిన అవకాశం, "శంకరాభరణం", కళాతపస్వి కె.విశ్వనాథ్ తాను ఊహించిన శంకరశాస్త్రి పాత్రకు తగిన నటుని కోసం అన్వేషిస్తుండగా, ఆయన దృష్టి సోమయాజులు పై బడింది.

విలక్షణమైన గెటప్‌తో, తక్కువ మాటలతో, ఎక్కువ భావప్రకటనలతో అంతకుమించి సంస్కారంతో కూడిన ధైర్యంతో ఆ పరమేశ్వరునికే తప్ప వేరెవ్వరికీ తలవంచని వ్యక్తిత్వంతో రూపుదాల్చిన సంగీతవిద్వాంసుడు శంకరశాస్త్రి. అంతకుముందు ఏ విధమైన ఇమేజిలేక పోవటం వల్ల దర్శకుని ఊహ మేరకు శంకరశాస్త్రిగా పరకాయ ప్రవేశం చేశారు, సోమయాజులు.

'ఓంకార నాదాను సంధానమౌ గానమే, శంకరా నాదశరీరాపరా, రాగం తానం పల్లవి' అన్న పాటల చిత్రీకరణలో, బాలు గానం, సోమయాజులు అభినయం ఏకోన్ముఖమై, రససిద్ధి కలిగించాయి.

'శంకరాభరణం'తో వచ్చిన ఇమేజిను, క్యాష్ చేసుకోవాలనే ఉద్దేశ్యంతో నవతా కృష్ణంరాజు దర్శకుడు బాపు సోమయాజుల్ని సంగీత విద్వాంసుడు 'త్యాగయ్య'గా చూపించటానికి చేసిన ప్రయత్నం అంతగా ఫలించలేదు.


పెళ్ళీడు పిల్లలు, సరిగమలు చిత్రాల్లో హీరో తండ్రిగాను, గౌతమి చిత్రంలో హీరోయిన్ తండ్రిగాను, శోభన్‌బాబు హీరోగా నటించిన 'దేవాలయం'లో గుడిపూజారిగా, పక్షవాతంతో బాధపడుతూ, తన పూజారి బాధ్యతలు స్వీకరించిన కుమారుని అభినందించడానికై గుడికి వెళ్ళే సన్నివేశంలో నటనలో ఆర్తి ప్రదర్శించారు.

సోమయాజులు నటజీవితంలో శంకరాభరణంతో సమానంగా గుర్తుండి పోయే రెండు చిత్రాలు వంశవృక్షం, సప్తపది. 'వంశవృక్షం' చిత్రంలో జన్మతః సనాతన సాంప్రదాయాలను గౌరవించే వ్యక్తి, తన కుమారుడు చనిపోతే, తన కోడలు స్వయంశక్తితో జీవించాలనే సదుద్దేశంతో పట్నానికి పంపి చదివించటం, యవ్వనంలో వున్న ఆమె భావాలు గమనించి, ఆమెకు పునర్వివాహం జరిపించిన, సంస్కారవంతునిగా ఉదాత్త నటన ప్రదర్శించారు.

ఇక సప్తపదిలో మనవరాలి మనసు అన్యకులస్థుడిపై ఉందని తెలుసుకొని, సాంప్రదాయపు సంకెళ్ళను త్రెంచి వేసి, ఆమె కోరిక మన్నించి, మరో మనువు చేసి, ఛాందసులకు వ్యతిరేకంగా ఆ ఊరు విడిచిన, గంభీర మూర్తి పాత్రలో సోమయాజుల్ని తప్ప మరెవ్వరినీ ఊహించలేము.

ఆ తరువాత స్వాతిముత్యంలో ఆఫీసర్‌గా, కొన్ని చిత్రాలలో న్యాయమూర్తిగా, మరోసారి ఇంటి పెద్దగా పోషించిన ప్రతి పాత్రకు న్యాయం చేశారు.

సోమయాజులుగారి జీవితానికి సంబంధించి, ఒక చారిత్రాత్మక విషయాన్ని ఇక్కడ ఉదహరించి తీరాలి. 'శంకరాభరణం' నటించే నాటికి, ఉద్యోగరీత్యా సోమయాజులుగారు డిప్యూటి కలెక్టరు హోదాలో వున్నారు. ఒక ప్రభుత్వోద్యోగిగా ఆయన సేవలను మరింతగా రాష్ట్ర సాంస్కృతిక రంగానికి విస్తరింపజేయాలనే ఉద్దేశ్యంతో నాటి ముఖ్యమంత్రి మర్రి చెన్నారెడ్డిగారు కల్చరల్ ఎఫైర్స్ పేరిట ఒక శాఖను సృష్టించి దానికి డైరెక్టర్‌గా సోమయాజుల్ని నియమించారు. అప్పటి నుంచి నేటి దాకా ఆ శాఖ రాష్ట్రంలో సాంస్కృతిక రంగానికి, విశిష్ట సేవలందిస్తోంది.



# నర్రా వెంకటేశ్వరరావు

అభ్యుదయ, విప్లవ చిత్రాలు 1980-90ల మధ్య కాలంలో ఎక్కువగా నిర్మించబడ్డాయి. ఆ చిత్రాలలో ఎక్కువగా ప్రతినాయకుని పాత్రలు పోషించిన నటుడు నర్రా వెంకటేశ్వరరావు. వంచనతో కూడిన ఓ రాజకీయ నాయకునిగా, తడిగుడ్డలతో గొంతుకోసే గ్రామపెద్దగా, ఓర చూపుతో, ఓ ప్రత్యేకమైన నవ్వు ద్వారా విలనినీ పండించిన నటుడు నర్రా వెంకటేశ్వరరావు. ప్రకాశం జిల్లా కందుకూరు సమీపంలోని రామచంద్రాపురంలో జన్మించారు. పాఠశాల స్థాయి నుంచి నాటకాల్లో నటించేవారు. ఒంగోలులోని ప్రజానాట్య మండలిలో చేరి నాటకాల్లో పాల్గొనేవారు. చదువుకునే రోజుల నుంచి దర్శకులు టి.కృష్ణతో స్నేహం కొనసాగింది. నర్రా స్నేహితుడు చౌదరి నిర్మించిన 'మల్లెల మనసులు' చిత్రంలో ఎస్.వి.రంగారావు కాంబినేషన్‌లో నటించి చిత్రసీమకు పరిచయమయ్యారు. నాటి నుంచి నేటి 'మేస్త్రీ' చిత్రం వరకూ నటుడుగా కొనసాగారు.

దర్శకులు టి.కృష్ణ, మాదాల రంగారావు నిర్మించిన చిత్రాలలో ముఖ్యభూమికలు పోషించారు. 'యువతరం కదిలింది, విప్లవశంఖం, నేటి భారతం' ఆ కోవలో చెప్పుకోదగ్గవి.

క్యారెక్టరు నటుడిగా 'తల్లీ కూతుళ్ళు', 'ఓసేయ్ రాములమ్మ', 'జగన్నాథం అండ్ సన్స్', 'ప్రతిఘటన', 'రేపటిపౌరులు', 'దేశంలో దొంగలు పడ్డారు', 'అరుణ కిరణం', 'కలికాలం' చిత్రాలలో మంచి నటుడిగా గుర్తింపు తెచ్చే పాత్రలు ధరించి ప్రేక్షకులను మెప్పించారు. పవన్ కల్యాణ్ తండ్రిగా 'తొలిప్రేమ' చిత్రంలోని నర్రా వెంకటేశ్వరరావు నటన అందర్నీ ఎంతగానో ఆకట్టుకుంది.

తెలుగుదనం వుట్టిపడేలా పంచెకట్టు, కండువా ధరించి నోట్లో చుట్టతో స్పెషల్ అపియరెన్స్‌తో కన్పించే పాత్రలే ఎక్కువ పోషించారు నర్రా.

నేను కథారచన చేసిన జానపద చిత్రం 'త్రిలోకసుందరి'లో కథానాయికుని పెంచి పెద్దచేసిన కోయదొరగా నర్రావెంకటేశ్వరరావు నటించటం ఓ విశేషం.

వెండితెరపై బహుముఖమైన నటనతో ప్రేక్షకులను మెప్పించిన నర్రా తన అరువది రెండవయేట 27.12.2010న కీర్తిశేషులయ్యారు.

# శరత్‌బాబు



కథానాయకుడుగా వుంటూనే, నెగిటివ్ టచ్ వున్న పాత్రలు పోషించటంలో సిద్ధహస్తుడు శరత్‌బాబు. ఇందుకు ఉదాహరణగా చెప్పుకోదగ్గ ఉదాత్త చిత్రం. కె.బాలచందర్ రూపొందించిన 'గుప్పెడు మనసు'. అతడొక ఆఫీసర్. భార్య (సుజాత) రచయిత్రి. సెన్సార్ ఆఫీసర్. ఆ దంపతులకు ఒక కుమార్తె. ముచ్చటయిన సంసారం. వాళ్ళ సంరక్షణలో ఉన్న అమ్మాయి సరిత. ఒకానొక బలహీనమయిన క్షణంలో ఆ అమ్మాయితో అక్రమసంబంధం ఏర్పడడం, తద్వారా దాంపత్యంలో పొరపొచ్చాలు రాగా వాటిని సమన్వయించుకోటానికి ప్రయత్నించి, భంగపడ్డ భర్త పాత్రలో సైకలాజికల్ స్ట్రగుల్ తనదైన శైలిలో ఆవిష్కరించారు. అదే బాలచందర్ రూపొందించిన 'ఇదికథ కాదు'లో కథానాయిక సుహాసిని (జయసుధ)ని ప్రేమించి, ఆమెను భార్యగా పొందలేని ఆరాధకుని పాత్రలో ఉదాత్తత ప్రదర్శించారు. నటుడు కాంతారావు నిర్మించిన స్వాతిచినుకులు చిత్రంలో ఇద్దరు కథానాయికల (వాణిశ్రీ, జయసుధ) మధ్య నలిగిన నాయకుడిగా మానసిక సంఘర్షణ చక్కగా ప్రదర్శించారు.

'పంతులమ్మ, క్రిమినల్' చిత్రాల్లోను 'సింహగర్జన' జానపదచిత్రంలోనూ, విశ్వనాథ నాయకుడు చారిత్రక చిత్రంలోనూ, దుష్టభూమికలు పోషించిన శరత్‌బాబుకు, శ్రీరామదాసు, భక్తిరస చిత్రంలో భద్రుని పాత్ర లభించటం ఓ అదృష్టమే.

వంశీ రూపొందించిన 'సితార'లో ఓ జమిందార్‌గా, అన్వేషణలో విలన్‌కాని విలన్‌గా, మెప్పించిన శరత్‌బాబు, భారతీరాజా తీసిన 'సీతాకోకచిలుక'లో చెల్లెలు ప్రేమను మతంపేరుతో తిరస్కరించి, తాను భార్యను ఏమార్చి పనిమనిషితో వ్యభిచరించే ఘరానా పెద్దమనిషిగా, ఆ పాత్రల్లోని రకరకాల షేడ్స్‌ని అభినయంలో చూపారు. వాస్తవిక చిత్రం 'తోడు'లో సహజమైన పాత్రకు మెరుగులుదిద్దారు.

భక్తిరస చిత్రం 'అయ్యప్పస్వామి మహాత్మ్యం'లో అయ్యప్ప భక్తునిగా రజనీకాంత్ 'ముత్తు'లో జమీందారుగా, ప్రతిభావంతంగా నటించారు. శరత్‌బాబు చిత్రాలలో తప్పక ఉదహరించవలసినది ఇటీవల వచ్చిన సంచలన చిత్రం 'మగధీర'. అందులో ఉదయగిరి మహారాజుగా, హుందాతనం, గంభీరత నటనలో ప్రదర్శించి తన ప్రత్యేకతను నిలబెట్టుకున్నారు.



# ఆహుతి ప్రసాద్

మంచి పర్సనాలిటి, అందుకు తగ్గ కంఠ స్వరంతో బుల్లితెర నుంచి చిత్రసీమలో ప్రవేశించి, రాణించిన నటుడు ఆహుతి ప్రసాద్.

కృష్ణాజిల్లా గుడివాడకు చెందిన వ్యవసాయ కుటుంబంలో జన్మించిన ప్రసాద్ సినిమాల్లో చేరాలన్న కోరికతో మధు ఫిలిం ఇన్‌స్టిట్యూట్‌లో శిక్షణ పొందారు. దాని అధినేత వి.మధుసూధన్‌రావు దర్శకులుగా రూపొందించిన, 'విక్రం' సినిమా ద్వారా చిత్రసీమకు పరిచయమయ్యారు. 'ఈ ప్రశ్నకు బదులేది' చిత్రంలో చెప్పుకోదగిన విలన్ పాత్ర పోషించారు. శ్యాంప్రసాద్ రెడ్డి తమ 'ఆహుతి' చిత్రంలో విలన్ పాత్రనిచ్చి ప్రోత్సహించారు. నెగెటివ్ టచ్ ఉన్న రాజకీయనాయకుని పాత్రను తన వైవిధ్యనటనతో పోషించి, ఆ చిత్రం పేరునే తన పేరు ముందు ఇంటిపేరుగా, పరిశ్రమలో గుర్తింపు పొందిన నటుడు ఆహుతి ప్రసాద్.

ఆ తరువాత నుంచి విలన్‌గా ఎన్నో పాత్రల్లో తనదైన శైలిలో నటించి ప్రేక్షకుల మన్నన పొందారు. 'పోలీస్‌భార్య' చిత్రంలో నిజాయితి గల పోలీస్ ఆఫీసర్, మరోకోణంలో 'అయోధ్య రామయ్య'లో అవినీతి వంతుడై, వెన్నుపోటు పొడిచిన పోలీస్ ఆఫీసర్ చెప్పుకోదగ్గవి.

గుణచిత్ర నటుడిగా మెప్పించిన పాత్రల్లో ఒకటి 'నిన్నే పెళ్ళాడతా'. టాబూ తండ్రిగా, మంజుభార్గవిని ప్రేమించి పెళ్ళాడినందుకు బావమరిదితో పంతానికి పోయి అతని కొడుకును ప్రేమించిన తన కూతురి పట్ల కోపం చూపే భూమికలో వైవిధ్య నటన చూపారు ప్రసాద్.

'చందమామ' చిత్రంలోని ప్రసాద్ నటనకుగాను 2007 సంవత్సరానికిగాను ఉత్తమ క్యారెక్టర్ నటుడిగా అవార్డ్ రాష్ట్రప్రభుత్వం నుంచి లభించింది. 'శశిరేఖా పరిణయం'లో జెనిలియా తండ్రి మరో ఉదాత్తమైన పాత్ర పోషించారు. మోహన్‌బాబు నిర్మించిన 'అధిపతి', రాజశేఖర్‌తో 'సత్యమేవ జయతే', శేఖర్‌కమ్ముల 'లీడర్'లో ఎన్నదగిన పాత్రలు పోషించారు.

ఆహుతి ప్రసాద్ నిర్మాతగా కన్నడంలో 3 చిత్రాలను నిర్మించారు.



# ధర్మవరపు సుబ్రహ్మణ్యం

జంధ్యాల 'ష్ గప్‌చిప్' చిత్రంకోసం వో విలక్షణమైన పాత్ర సృష్టించారు. అతడు భగ్న ప్రేమికుడు. ఫ్లాష్‌బ్లాక్‌లో శ్రీలక్ష్మిని ప్రేమించి పెళ్ళి చేసుకోవటంలో ఫెయిలవుతాడు. ఆమె మరొకర్ని పెళ్ళి చేసుకుంటుంది. విధివశాత్తు పాత ప్రేయసీప్రియులు ఒక్క ఆఫీసులోనే పని చెయ్యవల్సివస్తుంది. గత తీపి గుర్తులను నెమరు వేసుకుంటూ, వో పేరడీ పాటకు అభినయిస్తారు. అందులో ఎన్.టి.ఆర్. తరహాలో లాహిరిలాహిరిలో అక్కినేని తరహాలో చెంగావిరంగు చీర, శోభన్ స్టయిల్‌లో 'చరణకింకిణులు', కృష్ణా పంథాలో 'ఓ చిన్నదాన నను విడిచి' పాటలకు స్టెప్స్ వేసి ఉర్రూతలూపారు ధర్మవరపు సుబ్రహ్మణ్యం.


20.9.1954న ప్రకాశంజిల్లా కొమ్మనేనివారి పాలెంలో జన్మించిన ధర్మవరపు సుబ్రహ్మణ్యం రాష్ట్రప్రభుత్వంలో కొంతకాలం రూరల్ డెవలప్‌మెంట్ ఆఫీసరుగా వుద్యోగపర్వం కొనసాగించారు. నటనపై వున్న తృష్ణతో కొడాలి గోపాలరావు వ్రాసిన 'దొంగవీరుడు' నాటకంలో మురళి పాత్రలో బాలనటుడిగా రంగప్రవేశం చేసి తరువాత ఛైర్మన్, లంకెలబిందెలు నాటకాల్లో నటించారు.

1988లో జంధ్యాల రూపొందించిన 'జయమ్ము నిశ్చయమ్మురా' చిత్రంతో సినీ అరంగేట్రం చేసిన ధర్మవరపు నాటి నుండి నేటి దాకా సుమారు 500 పైగా చిత్రాల్లో నవరసాలకు చెందిన పాత్రలు పోషించారు. 'స్వాతికిరణం'లో బాలనటుడు ప్రధానపాత్రదారి. అతను గాయకుడు. ఆ కుర్రాడి తండ్రిగా కరుణరస ప్రధానపాత్ర పోషించారు ధర్మవరం. అలనాటి క్యారెక్టర్ ఆర్టిస్టు నాగభూషణంను అనుకరించి 'దొంగోడు' చిత్రంలో భేష్ అనిపించుకున్నారు.

అమాయకుడు అతి తెలివిగల లెక్చరర్ పాత్ర వుంటే దానిని ఒకేఒక్క ఛాయిస్ ధర్మవరపు సుబ్రహ్మణ్యం. 'ఒక్కడు' సినిమాలో పాస్‌పోర్టు ఆఫీసరుగా 'నువ్వేకావాలి'లో ప్రిన్సిపాల్‌గా విలక్షణ పాత్రలు అభినయించిన తీరు ప్రశంసనీయం.

'శ్రీరామదాసు'లో జ్యోతిష్కుడిగా నటించి 'ఏదీ తొడ నాకు అనుకూలంగా పెట్టు' అంటూ హడావుడి చేసారు.

'యజ్ఞం' చిత్రంలో నటనకుగాను నంది అవార్డు అందుకున్నారు. 'తోకలేని పిట్ట' చిత్రానికి దర్శకత్వంతోబాటు సంగీతదర్శకత్వం కూడా నిర్వహించారు.



# కోట శ్రీనివాసరావు

జననం కంకిపాడులో 10.7.1944 అంటే వయసు 67; చిత్రాల స్కోర్ : 670కి పైగా; పొందిన నంది ఎవార్డులు – ఆరున్నొక్కటి.

నేను సభా వ్యాఖ్యాతగా వున్న పలు సందర్భాల్లో కోట శ్రీనివాసరావును వేదికపై ఆహ్వానించే ముందు – మలితరం మహానటులు ఎస్వీరంగారావు, గుమ్మడి వెంకటేశ్వరరావు, గౌరీనాధశాస్త్రి, మూడు నాల్గుతరాల మహానటులు నాగభూషణం, రావుగోపాలరావు యీ అయిదురుగు కలిస్తే ఒక కోట శ్రీనివాసరావు అవుతారు అనగానే నా స్టేట్‌మెంటును బలపరుస్తూ ప్రేక్షకులు ఆనందపరవశంతో కరతాళ ధ్వనులుతో హర్షాన్ని వ్యక్తం చేసేవారు. నిజమే! ఆయన ధరించిన పాత్రలను విశ్లేషించుకుంటే నా కామెంట్ నిజమే అనిపిస్తుంది.

విజయవాడ ఎస్.ఆర్.ఆర్ కళాశాలలోనూ, ఏలూరు సి.ఆర్.ఆర్ కళాశాలలోనూ ఉన్నత విద్యనభ్యసించే రోజుల్లోనే రంగస్థలంపై మెరిశారు.

అలా నాటకాలు సరదాగా వేస్తూనే స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియాలో వుద్యోగం వెలగబెట్టారు. అయితే సినీ కళామతల్లి ఆకర్ష, ఆకర్ష అంటూ ఆహ్వానించటంతో ఏలూరు కాలేజీలో మా బాచ్‌మెట్ అయిన నిర్మాత క్రాంతికుమార్ తీసిన 'ప్రాణం ఖరీదు' చిత్రంతో అరంగేట్రం చేసారు శ్రీనివాసరావు.

ఉషాకిరణ్ వారి 'ప్రతిఘటన'లో 'నేను కాశీని మాటాడుతుండా' అంటూ విచిత్రమైన యాసతో విలనీని కొత్త తరహాలో ప్రదర్శించి సినీవినీలాకాశంపై విజయకేతనం ఎగురవేసారు.

'వరవిక్రయం'లో సింగరాజు లింగరాజు తరహా పిసినారి పాత్రను పగిలిన కళ్ళజోడులోంచి ఎక్స్‌ప్రెషన్స్ పలికిస్తూ పిసినారి యజమానిగా హాస్యాభిషేకం చేసారు జంధ్యాల తీసిన 'అహనా పెళ్ళంట'లో.

కఠినంగా ప్రవర్తిస్తూ చివరకు హృదయంలో దాగిన ఔదార్యాన్ని ప్రదర్శించిన "ఆ నలుగురు" చిత్రంలోని వడ్డీవ్యాపారి పాత్ర గొప్ప వెరైటీ.

"ఇంట్లో ఇల్లాలు – వంటింట్లో ప్రియురాలు" చిత్రంలో ఒక కొడుకు – ఇద్దరు

కోడళ్ళను దారికి తెచ్చేలా పతాక సన్నివేశంలో త్యాగం గురించి చెప్పినప్పుడు పరిణితి చెందిన పెద్దమనిషిలా ఓహో అనిపించారు.

'అయోధ్యరామయ్య'లో రాజకీయనాయకుడు జవహర్‌రెడ్డి, 'బిగ్‌బాస్'లో విలక్షణమైన హెయిర్ స్టయిల్ సరిచేసుకుంటూ కూల్‌గా నల్లశీను పాత్రలో విలనీనడపటం, 'గణేష్'లో పచ్చినెత్తురు తాగే దుష్టుడు, అంతెందుకు ఒకే ఒక్క సీన్ 'శివ'లో మాచిరాజు పాత్ర ఎంత యీజ్‌తో నటించారో గుర్తుకుతెచ్చుకుంటే చాలు నటన ఆయనకు నల్లేరుపై నడక.

'భర్తగా మారకు బాచ్‌లరూ సోలే బ్రతుకే సో బెటర్' అంటూ 'మనీ'లో పాటకు చేసిన విన్యాసాలు మరువగలమా! అలనాటి యస్.వి.రంగారావును గుర్తుకు తెచ్చే గెటప్‌తో 'వీరప్రతాప్, ఘటోత్కచుడు' చిత్రాలలో మాంత్రికునిగా ఓహో అనిపించారు.

'గాయం-2' చిత్రంలో కొడుకు ఆంజనేయప్రసాద్‌తో కలసి నటించటం కోటకు ఓ తీయని అనుభూతి. దక్షణాది తెలుగు, తమిళ, కన్నడ చిత్రాలలో నటించడమేకాక రామ్‌గోపాలవర్మ రూపొందించిన హిందీ చిత్రం 'సర్కార్'లో తనదైన శైలిలో నటించి ప్రశంసలందుకున్నారు.

ఉత్తమ సహాయనటుడిగా (అయోధ్యరామయ్య), ఉత్తమ కారెక్టర్ యాక్టర్‌గా (ఆ నలుగురు, పెళ్ళైన కొత్తలో), ఉత్తమ విలన్‌గా (గాయం, తీర్పు, గణేష్, చిన్న) నంది ఎవార్డులను అందుకున్న కోట శ్రీనివాసరావు 'తెలుగుతెర' గర్వించదగ్గ కారెక్టర్ ఆర్టిస్టులో ప్రథమ పంక్తిలోనివారు.

**మలితరం మహానటులు ఎస్వీరంగారావు, గుమ్మడి వెంకటేశ్వరరావు, గౌరీనాథశాస్త్రి, మూడు నాల్గుతరాల మహానటులు నాగభూషణం, రావుగోపాలరావు యీ అయిదురుగు కలిస్తే ఒక కోట శ్రీనివాసరావు అవుతారు.**

# యు.సుబ్బరాయశర్మ



1947లో విజయవాడలో జన్మించారు సుబ్బరాయశర్మ. ఎస్.ఆర్.ఆర్ కళాశాలలో డిగ్రీ పూర్తిచేసి 1971లో ఆర్.టి.సిలో ఉద్యోగ పర్వం ప్రారంభించారు.

కాలేజీ రోజుల్లోనే సాంస్కృతిక శాఖ కార్యదర్శిగా 'ఆడది, అంతాయింతే, కీర్తిశేషులు, వాంటెడ్ ఫాదర్స్' వంటి నాటకాలు ప్రదర్శించారు.

అదే విజయవాడ నివాసి రచయిత జంధ్యాలతో దోస్తీకట్టి ఆయన వ్రాసిన జీవనజ్యోతి, ఏక్‌దిన్‌కా సుల్తాన్, లేతగులాబి, గుండెలు మార్చబడును, మధ్యతరగతి మందహాసం, సంధ్యారాగంలో శంఖారావం' వంటి నాటికా నాటకాలు ప్రదర్శించారు.

ఉద్యోగ పర్వం హైద్రాబాద్‌కు మారాక - అప్పుడప్పుడే ప్రారంభించబడ్డ దూరదర్శన్‌కు ప్రచార సంబంధమైన కార్యక్రమాల్లో నటునిగా పాల్గొన్నారు.

'కుక్క' చిత్రంతో నటుడిగా సినీరంగ ప్రవేశం చేసి దాదాపు 200 చిత్రాల్లో విలక్షణ పాత్రలు పోషించారు. 'ఈ ప్రశ్నకు బదులేది'లో చాందసుడైన పిసినారి పాత్రకు న్యాయం చేసారు శర్మ. అప్పుడు జరిగిన విలేకర్ల సమావేశంలో గొల్లపూడి మారుతీరావుకు నటవారసులు సుబ్బరాయశర్మ అని ప్రశంసించారు నిర్మాత రాఘవ.

అన్నపూర్ణ కాంబినేషన్‌లో 'కోదండరాముడు' చిత్రంలో హీరో జె.డి.చక్రవర్తి తండ్రిగా ఓ వెరైటీ పాత్రను పోషించారు. 'పంచాక్షరి'లో వీరు నటించిన పూజారి పాత్రపై ఓ గీతాన్ని కూడా చిత్రీకరించారు. 'శుభలగ్నం'లో మహానటుడు గుమ్మడి సరసన నటించి ప్రశంసలందుకోవటం ఓ తీయని అనుభూతి అంటారు శర్మ.

'ధర్మచక్రం', 'సూరీడు', 'మాతృదేవోభవ', 'మాయలోడు', 'వినోదం', 'యమలీల', 'సింహాద్రి', 'మగధీర', 'అనగనగా ఓ ధీరుడు' వంటి చిత్రాలలో వచ్చిన ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకొన్న క్యారెక్టర్ ఆర్టిస్టు సుబ్బరాయశర్మ.

శర్మ జీవితంలో చెప్పుకోదగ్గ విశేషం ఏమంటే 'శౌర్యం' చిత్రం తమిళ వెర్షన్‌లోనూ, 'మనసంతా నువ్వే' బెంగాలీ వెర్షన్‌లోనూ, 'ఉల్లాసంగా ఉత్సాహంగా' చిత్రం కన్నడ వెర్షన్‌లోనూ నటించడం ఓ అదృష్టమే!



# తెలంగాణ శకుంతల

పూణాలో జన్మించిన శకుంతల ఆంధ్రదేశం వచ్చాక నటనను ఊపిరిగా భావించి రంగస్థలంపై 'సంధ్యాఛాయ, రాగరాగిణి, గారడి, ఒంటికాలిపరుగు, తరంగాలు, పుణ్యస్థలి' వంటి నాటకాలల్లో ప్రధాన స్త్రీపాత్ర ధరించి వేలాది ప్రదర్శనల్లో పాల్గొని వందలాది బహుమతులందుకున్నారు.

తెలుగుతెరపై నటిగా గౌతం ఘోష్ రూపొందించిన 'మాభూమి' చిత్రం ద్వారా పరిచయమయ్యారు. 'ఎర్రసైన్యం, సమ్మక్క, ఒసేయ్ రాములమ్మా' చిత్రాల్లో తెలుగు – తెలంగాణా మాండలికాన్ని వాచకంలో అద్భుతంగా పలికించటంతో చిత్రసీమలో 'తెలంగాణా శకుంతల'గా స్థిరపడిపోయారు.

రాయలసీమ బ్యాక్‌డ్రాప్‌తో రూపొందించిన పలుచిత్రాల్లో రుద్రకాళి రూపంలో కళ్ళెర్రజేసి 'ఏందిరా నీయవ్వ నరుకుతా' అని తొడగొట్టి సవాలు చేస్తే ఆ శబ్దం ఎదుటి ఫ్యాక్ష్యనిస్టు గుండెల్లో పిరంగులు మోగిస్తుంది. ఫ్యాక్షనిస్టు లీడరుగా జయప్రకాశ్‌రెడ్డి, ప్రకాష్‌రాజ్ వంటి వారు రాణించగా, వారికి కౌంటర్‌గా వాళ్ళను సైతం కట్టడి చేసే పాత్రల్లో నువ్వానేనా అనే విధంగా నటించి ప్రశంసలందుకొన్నారు.

'దేశముదురు, నువ్వానేను, నరసింహనాయుడు' చిత్రాల్లో రౌద్రరస ప్రధానం గల పాత్రల్లో రాణించిన శకుంతల 'ఒక్కడు, అల్లరే అల్లరి, ఎవరిగోల వాడిది' వంటి చిత్రాల్లో సీరియస్‌గా నటిస్తూ నవ్వులు పండించారు. అందుకు మరో వుదాహరణ కొండవలసకు భార్యగా నటించిన 'పెళ్ళాంతో పనేంటి' చిత్రం, ఐ.పి.ఎస్ ఆఫీసరుగా సీరియస్‌గా నటించి మెప్పించిన చిత్రం 'సైనికుడు'.

మూడుపదుల సినీజీవితంలో మూడువందలపైగా చిత్రాల్లో నటించి 'లేడివిలన్'గా ఓ బిరుదు ప్రేక్షకులచేత అందుకోవటం ఓ విశేషమైతే, 'రంగులకల, స్వర్ణక్క, నువ్వానేను' చిత్రాల్లో నటనకుగాను రాష్ట్రప్రభుత్వం నంది పురస్కారాలు అందుకోవటం వో చారిత్రాత్మక విశేషం.

నటిగా ఎంత ఎత్తుకు ఎదిగినా, సంస్కారయుతంగా అందరినీ గౌరవించే వ్యక్తిత్వం ఆమెకు దేవుడిచ్చిన వరం – అదే ఆమెకు శ్రీరామరక్ష.



# ప్రకాష్‌రాజ్

సమర్థుడైన కళాకారుడికి భాషా ప్రాంతీయ భావాలకు అతీతంగా అవకాశాలు వచ్చి, నటలోకంలో, స్వర్ణ సింహాసనాన్ని అధిష్టింపజేస్తాయి. ఇందుకు ఉదాహరణగా ఆ తరం వారిలో యస్.వి. రంగారావును, ఈ తరం వారిలో ప్రకాష్‌రాజ్‌ను చెప్పుకోవాలి.

తెలుగువాడైన రంగారావు, తెలుగు తమిళ, కన్నడ సినీరంగాలలో పాగా వేస్తే, నేటి ప్రకాష్‌రాజ్ కన్నడరాష్ట్రం మంగళూరులో పుట్టి (26.03.1966) కన్నడ, తమిళ, తెలుగు రంగాలలో విజయబావుటా ఎగురవేసారు. వందలాది నాటకాలను ప్రదర్శించిన ప్రకాష్‌రాయ్‌ను పేరుమార్చి, ప్రకాష్‌రాజ్‌గా 'డ్యూయెట్' చిత్రం ద్వారా తమిళ చిత్రరంగానికి పరిచయం చేశారు. దర్శకులపతి కె.బాలచందర్.

1996లో 'వినోదం' చిత్రం ద్వారా తెలుగు చిత్రసీమకు పరిచయమైన ప్రకాష్‌రాజ్ పదిహేను సంవత్సరాల్లో సుమారు నూటయాభై చిత్రాలలో విభిన్న భూమికలు పోషించి. క్యారెక్టర్ ఆర్టిస్టు అంటే నిర్వచనం ప్రకాష్‌రాజ్ అనే స్థాయికి ఎదిగారు. కరుడగట్టిన ఫ్యాక్షనిష్టుగా అంతఃపురం సింహాచలం చిత్రాల్లో వెరైటీ గెటప్‌తో ప్రత్యేకమైన డిక్షన్‌తో అమ్మో అనిపించారు. ఔట్ అండ్ ఔట్ పక్కా విలన్‌గా రాణించిన చిత్రాలు "చూడాలని ఉంది, హిట్లర్, పోకిరి, కంత్రి' ఈ తరహాలో బ్రేక్ ఇచ్చిన చిత్రం 'సుస్వాగతం'లో నాయిక దేవయాని తండ్రిగా "నేను మోనార్కును నన్నెవరూ మోసం చేయ్యలేరు" అనే ఊతపదంతోనూ 'గన్‌షాట్'లో హాస్యనటుడు ఆలీకి శాడిస్టుతండ్రిగానూ, విలక్షణ పాత్రలు పోషించారు.

కథానాయికలకు తండ్రిగా 'ప్రేమకువేళాయెరా, ఇడియెట్, గంగోత్రి, ఇంద్ర, వర్షం, బన్ని, జల్సా, చిరుత, పరుగు'. ఈ దిశగా చెప్పుకోదగ్గది త్రిషకు తండ్రిగా చేసిన "ఆకాశమంత" చిత్రంలోని సాత్విక పాత్ర.

అలాగే కథానాయకుడికి తండ్రిగా నటించిన చిత్రాలలో ఎన్నదగినవి 'చక్రం, భద్ర, అమ్మా నాన్నా ఓ తమిళ అమ్మాయి, కొత్తబంగారులోకం'. ఈ కేటగిరిలో

చెప్పుకోదగ్గది 'బొమ్మరిల్లు', పిల్లలు ఎల్లప్పుడు తనకంట్రోలులో, తన ఆలోచనాధోరణిలో బ్రతకాలని శాసించి చివరకు అదిపొరపాటుగా గ్రహించిన తండ్రి భూమికలో గుర్తుండి పోయే నటనప్రదర్శించారు.

సిన్సియర్ పోలీస్ కానిస్టేబుల్ పాత్ర ధరించిన 'ఠాగూర్'లో సంఘ విద్రోహశక్తుల వివరాలనుసేకరించి అధికారులకు వివరించిన సన్నివేశంలో చూపిన నటనలో మనకు ఒక బాధ్యతగల కానిస్టేబుల్ కనిపిస్తాడు. 'అతడు'లో సిన్సియర్ సి.బి.ఐ ఆఫీసర్గాను, 'రాఖీ' చిత్రంలో సిన్సియర్ న్యాయమూర్తిగాను కనిపించిన ప్రకాష్‌రాజ్ 'ఖడ్గం' చిత్రంలో ఒక ముస్లిమ్(అంజద్‌భాయ్)గా వుండి, మతాతీత, కులాతీతమైన భారతదేశ సమగ్రతకు కృషిచేసిన భూమిక ఓ వెరైటీ.

'మహారాణి' చిత్రంలో వేశ్యాగృహ నిర్వాహకురాలిగా విలక్షణమైన మహిళ గెటప్‌తో సమర్థుడైన నటుడికి సాధ్యం కానిది ఏదీలేదని నిరూపించారు.

"ఆదివారం ఆడాళ్ళకు సెలవు, మాస్" చిత్రాలలో లాయర్‌గాను, 'క్షేమంగా వెళ్ళి లాభంగా రండి'లో స్కూల్ మాస్టార్‌గా 'కలెక్టర్ భార్య'లో కలెక్టర్‌గాను, 'ఆవిడే శ్యామల' చిత్రంలో భార్యను అబద్ధాలతో వంచించే భర్తగాను, సహజంగా నటించారు.

ఒకనాటి నాయిక సరితతో కలిసి, పెదవులపై ప్రేమను చిలికిస్తూ, ఘోరంగా హత్యలు చేస్తూ, తనకు సహకరించిన భార్యను ప్రశంసలతో ముంచెత్తే కుహనా భక్తుడు బాలుగా 'అర్జున్' చిత్రంలో ప్రకాష్‌రాజ్ చూపిన నటన హైలెట్‌గా చెప్పుకోవాలి.

'కంజీవరం' తమిళ చిత్రానికి జాతీయ స్థాయిలో ఉత్తమనటుడిగా అవార్డ్ అందుకున్న ప్రకాష్‌రాజ్, తెలుగులో ఉత్తమ సహాయనటుడిగా 'నువ్వే నువ్వే', 'బొమ్మరిల్లు' ఉత్తమ క్యారెక్టర్ యాక్టర్‌గా 'అంతఃపురం, ఆజాద్, అమ్మా, నాన్న ఓ తమిళ అమ్మాయి'. ఉత్తమ విలన్‌గా 'గన్‌షాట్, గంగోత్రి' చిత్రాలకు రాష్ట్రప్రభుత్వ నంది అవార్డు అందుకున్నారు. అంతేకాదు నాలుగుసార్లు ఫిల్మ్‌ఫేర్ ఎవార్డ్‌లను కూడా అందుకున్నారు.



# తనికెళ్ళభరణి

క్యారెక్టర్ ఆర్టిస్టులపై పాటలు చిత్రీకరించిన సన్నివేశాలు అరుదు. అటువంటి అరుదైన అవకాశం 'మనీ' చిత్రంలో అందుకున్న అదృష్టవంతుడు తనికెళ్ళ భరణి. సినీరంగంలో వుండే 420లకు ప్రతినిధిగా రూపొందించబడ్డ 'మాణిక్యం, రౌడీలకు రౌడీలు'వంటి ఖాన్‌దాదా బ్రహ్మానందంను హీరో చేస్తానని 'వారెవా ఏమి ఫేసు, అచ్చు హీరోలా వుంది బాసు' అంటూ బురిడీ కొట్టిస్తాడు. 'పెళ్ళిసందడి'లో తోడళ్లుళ్ళతో కలిసి, బావమరిదిని అతను ప్రేమించిన దాని ఆచూకి చెప్పమని 'రమ్యకృష్ణలాగ వుంటదా' అని సందడి చేశాడు. ఇటీవలి దోస్త్ చిత్రంలో ఆటో డ్రైవర్‌గా వేషంకట్టి డప్పు వాయిస్తూ "ఇప్పసారా కొట్టరో, డప్పుచేత బట్టరో" అంటూ చిందులు వేస్తే థియేటర్‌లో ప్రేక్షకులు ఈలలు వేశారు.

ఎవరీ భరణి, ఏమాకథ అంటూ, కొన్ని రీళ్ళు ఫ్లాష్‌బ్యాక్‌లోకి వెనక్కి వెళితే... పుట్టినతేది 1956 జూలై 14. పెరిగిన వూరు హైదరాబాద్. కాలేజీవిద్య బి.కామ్. థియేటర్ ఆర్ట్స్‌లో డిప్లొమా, నాటకరంగం "ఆకర్ష, ఆకర్ష అని ఆహ్వానించటంతో కొక్కొరకో, చల్‌చల్‌గుర్రం గార్ధభాండం, గోగ్రహణం, జంబూద్వీపం, వంటి పలు నాటకాలను వ్రాసి, దర్శకత్వం వహించి, కీలక పాత్రలు పోషించి, ఆంధ్రదేశాన్ని ఉర్రూత లూపి, నవ్యనాటకరంగ చరిత్రలో తనకొక స్థానం సాధించుకున్నారు.

"కంచు కవచం" చిత్రం ద్వారా రచయితగా చిత్రసీమలో ప్రవేశించటమే కాక నటుడుగా, ఓ సహాయపాత్రలో తళుక్కున మెరిసారు.

సినీరచయితగా, భరణికి బ్రేక్ ఇచ్చిన చిత్రాలు వంశీరూపొందించిన 'లేడిస్‌టైలర్', ట్రెండ్ సెట్టర్ రామ్‌గోపాలవర్మ సృష్టించిన 'శివ'. నటుడిగా కూడా ఈ రెండు చిత్రాలతోపాటు, విలన్‌కు సలహాలిచ్చే శకుని తరహా సహాయదుష్టపాత్రలో రాణించిన చిత్రం "జగదేకవీరుడు అతిలోకసుందరి'.

క్యారెక్టర్ ఆర్టిస్టుగా పుంఖాను పుంఖలుగా  వేషాలు వచ్చి పడడంతో తనలోని రచయితకు తాత్కాలికంగా విశ్రాంతి యిచ్చి, క్యారెక్టర్ ఆర్టిస్టుగా అవిశ్రాంతంగా శ్రమిస్తూ, తనేకావాలని వెతుక్కుంటూ వచ్చిన ప్రతిపాత్రకు తనదైన శైలిలో మెరుగులు దిద్ది, అటు పరిశ్రమ పండితులని, ఇటు పండిత, పామర ప్రేక్షకుల్ని రంజింపజేస్తున్నారు.

ఆ దిశగా ఉదహరించదగిన పాత్రలలో కొన్ని : 'వారసుడొచ్చాడు' చిత్రంలో మందుతో సెలైన్ కలిపి సేవించే నీచ, దుష్టుని పాత్ర, మళయాళ భాషను తెలుగుతో మిళాయించి ఉచ్చారణతో రాణించిన 'నారీ నారీ నడుమమురారి'; పెళ్ళాన్ని అంగట్లో అమ్మకానికి పెట్టిన కలియుగ ఇంద్రుడు; మాటిమాటికి టూత్‌పిక్స్‌తో పళ్ళు కుట్టుకునే విచిత్రజీవి; ఇలా ఎన్నెన్నో విలక్షణ పాత్రలు భరణిని వరించాయి.

యమలీల చిత్రంలో కవిగా అవతారమెత్తిన ఓ గూండా, పత్రికా సంపాదకుడు జెన్ని దగ్గరకు వెళ్ళి 'నాకో బుల్లి చెల్లి, ఆచెల్లికి జరగాలి పెళ్ళి మళ్ళీ మళ్ళీ' అంటూ కవిత్వంతో అదరగొట్టిన సన్నివేశం మర్చిపోగలమా!

మత్స్యకారుల జీవనశైలికి దర్పణం పట్టిన ''సముద్రం చిత్రంలోని శంకర్‌పహిల్వాన్ పాత్రకు నంది అవార్డు లభించటం సముచిత సత్కారమే.

చలం కథతో అభ్యుదయ చిత్రాల దర్శకుడు ఇంద్రకంటి మోహన్‌కృష్ణ రూపొందించిన 'గ్రహణం' చిత్రంలో ప్రధానపాత్రకు ప్రాణం పోశారు భరణి.

ఒక హాస్యనటుడు, ఒక విలన్, ఒక క్యారెక్టర్ ఆర్టిస్టు ఇవన్నీ కలిపిన సంపూర్ణ నటుడు తనికెళ్ళ భరణి అని మహానటుడు అక్కినేని నాగేశ్వరరావు ప్రశంసించారంటే అంతకంటే సర్టిఫికెట్ ఇంకేముంటుంది.

కాసేపు భరణిని సినిమారంగంతో సంబంధంలేని సాహితీవేత్తగా పరిగణించినపుడు మనకళ్ళముందు సాక్షాత్కరించే గ్రంథత్రయము 'పరికిణి, ఎందరో మహానుభావులు, ఆటగదరా శివ'.

తెలుగువారి చిత్రాలు అవార్డులకు దూరం అనే ధృక్పథాన్ని పటాపంచలు చేస్తూ, భరణి రూపొందించిన, సిరా, కీ, హ్రస్వచిత్రాలు అందుకున్న పురస్కారాలు తెలుగువాడయిన భరణిలోని సృజనాత్మక ప్రతిభకు ప్రతీకలు.



# జయప్రకాష్‌రెడ్డి

ఒకసారి మనం 'షోలే' చిత్రాన్ని గుర్తుకు తెచ్చుకుందాం. అందులో ప్రాణభయంతో పరిగెడుతున్న గబ్బార్ సింగ్‌ను గుర్రంపై వెంటాడిన ఠాగూర్ తన చేతిలోకి ఒడిసిపట్టి ఈడ్చుకు వెళ్ళిన సన్నివేశం... దీనికి పోలికగా 'సమరసింహారెడ్డి' చిత్రంలో రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫారమ్ మీద తొడగొట్టి సవాలు చేసిన ఫ్యాక్షనిస్టు లీడర్‌ను కంపార్ట్‌మెంటు డోర్ దగ్గర నిలబడ్డ హీరో చేత్తో ఒడిసిపట్టి బరబరా ఈడ్చుకెళ్ళిన సన్నివేశం! ఈ రెంటిని సమన్వయం చేసుకుంటే హీరోయిజానికి వున్న ప్రాధాన్యతను ఎలివేట్ చేసిన విలన్‌ను అభినందించాల్సిందే! ఫ్యాక్షనిజం కరుడుగట్టిన ఆ విలన్ పాత్రను తన అభినయంతో చిరస్మరణీయం చేసిన నటుడు జయప్రకాష్‌రెడ్డి.

ఏ వయసులో, ఏ నటుడి అదృష్టం ఏ మలుపు తిప్పుతుందో ఎవరూ ఊహించలేరు. అదే సినీ మాయా జగత్తు ప్రత్యేకత. అంతకుముందు ఉపాధ్యాయ వృత్తిలో జీవనయాత్ర కొనసాగిస్తూ, ప్రవృత్తిగా రంగస్థలిపై తనలోని నటుడ్ని శాంతింపచేసుకున్న జయప్రకాష్‌రెడ్డి 'శత్రువు, అభిసారిక' వంటి కొద్దిచిత్రాల్లో సాదాసీదా పాత్రలు పోషించినప్పటికి అతనికి నటుడుగా బ్రేక్ ఇచ్చిన చిత్రం 'సమరసింహారెడ్డి'.

ఆ తరువాత ఆ తరహా పాత్రలు అతనికోసమే ఎందరో రచయితలు, దర్శకులు సృష్టించారు. ఆ వర్గీకరణలో చెప్పుకోదగ్గ చిత్రాలు 'నరసింహానాయుడు', 'ఇంద్ర', 'ప్రేమించుకుందాం రా'.

మీసాలను మెలివేస్తూ కట్టుబాట్లు నడక, నడత, వస్త్రధారణలోనే కాక రాయలసీమ మాండలికాన్ని ఒంట బట్టించుకొని తనదైన శైలిలో ఆ డైలాగుల్ని ఉచ్చరించి, తెలుగు భాషాసౌందర్యానికి సరికొత్త మెరుగులు దిద్దారు.

అసలుసిసలైన నటుడికి ఒక ముద్ర నుంచి బయట పడాలని తపన వుంటుంది. జయప్రకాశ్ రెడ్డిలోని ఆ తపనను చల్లార్చి, క్యారెక్టరు ఆర్టిస్టుగా అతని ప్రతిభకు పట్టం కట్టిన రెండు చిత్రాలు 'ఎవరిగోల వారిదే', 'ఢీ'.

విదేశాలకు వెళ్ళాకా హోటల్‌లో సెటిలయి, రొమాంటిక్‌గా టవల్ చుట్టుకొని

ఆ హోటల్ అంతా భారీ కాయంతో పరిగెత్తి ప్రేక్షకుల్ని నవ్వుల్లో ముంచెత్తారు. ఇక 'ఢీ' చిత్రంలో మాటలతో నిమిత్తం లేకుండా రోగగ్రస్తుడైన మూగవాడిగా 'వీల్‌చెయిర్‌లోనూ మంచం మీద రకరకాల భంగిమలలో భాషాతీతమైన భావాలను పలికించి, నవ్వుల పంటను పండించారు.

'ఓరాధ ఇద్దరు కృష్ణుల పెళ్ళి, బెట్టింగ్ బంగార్రాజు, కబడ్డీ కబడ్డీ, సీతారాముల కళ్యాణం లంకలో' వంటి చిత్రాలలో పోలీసు ఆఫీసర్‌గా కొత్తతరహాలో హాస్యాన్ని పండించారు.

*నిజమైన రంగస్థల అభిమాని తాను సినీరంగంలో ఎంత ఎత్తుకు ఎదిగినా నటుడిగా జన్మనిచ్చిన రంగస్థలానికి ఎంతో కొంతసేవ చేయాలని తాపత్రయ పడుతుంటాడు. ఆ దిశలో తమిళనాట యం.ఆర్.రాధా, తెలుగులో రక్తకన్నీరు నాగభూషణం చేసిన కృషిని ప్రశంసించాలి. జయప్రకాశ్‌రెడ్డి వెండితెరపై సాధించిన విజయాలు ఒక ఎత్తు, అందుకు సమాధానంగా రంగస్థలంపై ఆయన ఆవిష్కరించిన మహా అద్భుతం అలెగ్జాండర్ ఒక ఎత్తు. అది వన్‌మేన్ షో. రంగస్థలంపై ఒకేఒక్క నటుడు గంటన్నరసేపు తన వైవిధ్య నటనతో సమాజాన్ని ఉద్ధరించే ప్రయత్నంలో తనను తాను ఆహుతి చేసుకున్న అలెగ్జాండర్‌గా జయప్రకాశ్‌రెడ్డి తన నట విశ్వరూపాన్ని చూపారు. జయహో జయప్రకాశ్‌రెడ్డి.*



# దాసరి నారాయణరావు

సినిమారంగంలో రాణించాలనుకునే వారికి నాటకరంగం అనుభవం ఓ పెద్ద ఎస్సెట్. దానికి ఉదాహరణగా బహుముఖీనంగా విస్తరించిన దాసరి నారాయణరావుగారి జీవిత చరిత్ర గొప్ప ఉదాహరణ.

4.5.1945న కళలకు కాణాచియైన పాలకొల్లులో జన్మించి, విద్యార్థి దశలోనే నాటకాలు వ్రాసి, దర్శకత్వం వహించి, నటుడుగా పాల్గొని ఉత్తమ ఫలితాలు సాధించారు దాసరి నారాయణరావు. హైద్రాబాదులో ఉద్యోగం చేసినప్పుడు కూడా రంగస్థలాన్ని వదిలి పెట్టలేదు. మద్రాస్ చేరి యస్. భావన్నారాయణ, పాలగుమ్మి పద్మరాజు నిర్మాత రాఘవ రూపొందించిన చిత్రాలకు ఒక వైపు రచనా రంగంలోనూ, మరోవైపు దర్శకత్వ శాఖలోనూ పనిచేస్తూ, అడపాదడపా, చిన్న చిన్న వేషాలు వేసేవారు.

నాటి "తాతా మనవడు'తో మొదలుపెట్టి నేటి 'పరమవీరచక్ర' వరకూ నూటయాభై చిత్రాలకు దర్శకత్వం వహించి గిన్నీస్ బుక్ రికార్డుకెక్కి చరిత్రను సృష్టించారు.

క్యారెక్టర్ ఆర్టిస్టుగా సుమారు ఆరుపదుల చిత్రాలలో హాస్యపరమైన, గంభీరమైన, విలక్షణమైన, భూమికలకు ప్రాణం పోశారు. ఆ వివరాలను విహంగవీక్షణం చేస్తే :

'స్వర్గం–నరకం'లో ఆచారి పాత్ర టిపికల్‌టైప్. దీన్ని ఇద్దరు, ముగ్గురు ఆర్టిస్టులు ప్రయత్నించినా, దర్శకునిగా దాసరి తృప్తిమేరకు నటించలేక పోయారు. అప్పుడు చిత్రయూనిట్ సభ్యుల ప్రోత్సాహం మేరకు ఆయనే ఆ పాత్రను వ్యంగ్యంతో, హాస్యాన్ని రంగరించి అనితర సాధ్యం అనేలా పోషించారు.

'బహుదూరపు బాటసారి' చిత్రంలో భుజాన వ్రేలాడే సంచితో, జయమాలిని కోసం వెంపర్లాడుతూ, హీరో అక్కినేనికి సహకరించే, స్నేహితుని పాత్రలో నటనలో ఎకానమీ చూపారు. ఆ ఎకానమీని ఇంట్లో కూడా అమలుచేసి, ముగ్గురు కొడుకులను మూడుగదుల్లో బంధించి తన పిసినారితనాన్ని చాటుకుంటాడు.

రేలంగి నరసింహారావు రూపొందించిన 'సంసారాల మెకానిక్'లో మరో విచిత్రమైన పాత్ర, దాసరికి లభించింది. పోష్‌లైఫ్‌కి అలవాటు పడ్డ భార్య తనతో విడాకులు

తీసుకుని, విడిపోతే ఆ పరిస్థితి ఇతర సంసారులకు రాకూడదనే భావంతో కొందరు దంపతుల జీవితాలను, సంసారాలను చాకచక్యంతో సరిదిద్దటం ఆపాత్ర స్వభావం.

సమాజాన్ని అనాదిగా పట్టిపీడిస్తున్న రుగ్మత అవినీతి. అందుకు పరాకాష్టగా తెరపై రూపుదిద్దుకున్న చిత్రం 'లంచావతారం'. అందులో లంచాలకు సంబంధించి డిఫరెంట్ షేడ్స్ వున్న ప్రధాన పాత్రలో హాస్యం, విషాదం అభినయంలో పలికించారు దాసరి.

'బంగారు కుటుంబం' చిత్రంలో కథానాయకుడు శ్రీనివాసరావు (అక్కినేని) కుటుంబంలో వచ్చిన ఒడిదుడుకులను సరిదిద్దే 'చెట్టియార్' పాత్రకు ప్రత్యేకమైన తమిళ, తెలుగు మాండలికాన్ని, సంభాషణలో జొప్పించి, కఠినాత్మునిగా కనిపిస్తూనే, ఆ కుటుంబ శ్రేయోభిలాషిగా మెప్పించారు.

ఇక నాటి 'మాయాబజార్'ను సోషలైజ్ చేసి రూపొందించిన 'మాయాబజార్'లో అభినవ ఘటోత్కచుని పాత్ర పోషించి ఆహార్యంలోనూ, అభినయంలోనూ, తనదైన శైలిలో ఆ పాత్ర ద్వారా మహానటుడు యస్.వి.రంగారావు పట్ల గల ఆరాధనా భావానికి నివాళులర్పించారు.

రాజకీయ నేపథ్యంలో రూపొందించిన 'ఎం.ఎల్.ఎ ఏడుకొండలు', 'పిచ్చోడి చేతిలో రాయి'లో పోషించిన పాత్రలు, డైలాగ్‌పంచ్‌తో పండించారు. దాసరి ప్రధాన పాత్రధారిగా టైటిల్‌తో రూపొందించిన చిత్రాల్లో ఎన్నదగినవి కొండపల్లిరత్తయ్య, మామగారు, సూరిగాడు, మేస్త్రీ. కొండపల్లి రత్తయ్య పాత్ర ఎమోషనల్‌గా కొనసాగితే, 'మామగారు, సూరిగాడు' చిత్రాల్లోన్ని పాత్రలు సెంట్‌మెంటుతో ముడిపడ్డాయి. శ్రామిక జీవులకు ప్రతినిది మేస్త్రీ.

'మామగారు' చిత్రంలో కొడుకుకన్న మిన్న అయిన అల్లుణ్ణి, కూతురు మరణిస్తే అతని సుఖంకోరి, మళ్ళీ పెళ్ళి దగ్గరుండి చేయించి, సామాన్యుడులో సైతం సంస్కారభావాలు వుంటాయి అనే లక్షణాలను అభినయంలో చూపారు దాసరి.

అంతే ఉదాత్తతో కూడిన మరో భూమిక సూరిగాడు. ఆడంబరాలకు పోయిన కొడుకు గొప్పింటి అల్లుడై, తండ్రిని పరాయివాళ్ళకు కూలివాడుగా పరిచయం చేస్తే ఆ ఆవేదనను ఆంతర్యంలో అగ్నిగుండంలా దాచుకున్న శాంతమూర్తి సూరిగాడు పాత్ర దాసరి నటజీవితంలో ఓ మేలి ముత్యం.

సమకాలిన, సామాజిక వ్యవస్థలో పెట్టుబడిదారుల నియంతృత్వ పోకడలకు, అడ్డువేసిన శ్రామిక వర్గనాయకునిగా, దాసరి చూపిన మరో విశ్వరూపమే మేస్త్రి.

క్యారెక్టరు ఆర్టిస్టుగా వుంటూ, నాటి మామగారు చిత్రంలోనూ, నేటి మేస్త్రి చిత్రంలోనూ, ఉత్తమ నటునిగా రాష్ట్రప్రభుత్వ నంది అవార్డులను అందుకోవటం, తెలుగు

చలనచిత్ర సీమలోని క్యారెక్టర్ ఆర్టిస్టులందరికి ఆనందాన్నిచ్చే విషయం.

ఈ గ్రంథ రచయితగా నాకు వ్యక్తిగతంగా నచ్చినది 'స్వయంవరం' చిత్రంలోని బిజినెస్ మాగ్నెట్ రాజశేఖర్ పాత్ర. తాను పెళ్ళాడిన యువతి (జయప్రద) అంతకుముందే చంద్రశేఖరును (శోభన్‌బాబు) ప్రేమించిందని తెలిసికొని, అతన్నింటికి ఆహ్వానించి భోజనాల సందర్భంలో వారిద్దరి ఆంతర్యాలని గ్రహించిన సందర్భంలో చాలా పాలిష్‌డ్‌గా, చాలా కూల్‌గా, చాలా బేలన్స్‌గా దాసరి అభినయించినతీరు, నా హృదయంలో చెరగని ముద్ర వేసింది.

రాజకీయాల్లో ప్రవేశించి కొంతకాలం కేంద్రమంత్రివర్గంలో మంత్రిగా తన సేవలను అందించిన దాసరి నారాయణరావు దర్శకునిగాను, క్యారెక్టర్ ఆర్టిస్టుగాను నిజంగా సినీజగత్తులో సర్దారే.

*తెలుగు చలనచిత్ర చరిత్రలో దాసరి నారాయణరావు ఒక వ్యక్తి కాదు, మహత్తరశక్తి. ఏ గాడ్‌ఫాదరు లేకుండా స్వశక్తితో రచయితగా, నటుడిగా, దర్శకునిగా, నిర్మాతగా బహుముఖప్రజ్ఞతో అద్భుతమైన విజయాలు సాధించటమే గాక ఎందరో నటీనటుల్ని, టెక్నీషియన్సును పరిచయం చేసి, ప్రమోట్ చేసి గిన్నీస్‌బుక్ ఆఫ్ రికార్డ్స్‌ల్లో నమోదైన ఘనచరిత్ర ఆయనది.*



# కె.విశ్వనాథ్

దర్శకుడిగా ఉన్నత విలువలతో కూడిన చిత్రాలను అందించటంతోపాటు, కథకు కీలకమయిన పాత్రలను పోషించి, రెండు రంగాల్లోనూ శభాష్ అనిపించుకున్న వారిలో ముందు వరసలో ఉదహరించవలసిన పేర్లు ఉత్తరభారతంలో వి.శాంతారామ్ కాగా, దక్షిణ భారతంలో కళాతపస్వి కె.విశ్వనాథ్.

19.02.1930న జన్మించిన కాశీనాధుని విశ్వనాథ్, విజయవాడలో బి.యస్.సి పూర్తి చేసి వాహిని స్టూడియో సౌండ్ డిపార్ట్‌మెంట్‌లో కొంతకాలం పని చేశారు. దర్శకత్వంపై మోజుతో ఆదుర్తి సుబ్బారావు వద్ద సహాయకునిగా పనిచేసి, అన్నపూర్ణా వారి "ఆత్మగౌరవం"తో దర్శకులైనారు. నాటి నుంచి నిన్నటి 'శుభప్రదం' వరకూ, తెలుగు, హిందీ భాషల్లో సుమారు యాభై చిత్రాలకు దర్శకత్వం వహించారు.

సాంప్రదాయ, నృత్య, సంగీత, సాహిత్యాలకు మానవతా విలువలు జోడించి 'సిరిసిరిమువ్వ', 'సిరివెన్నెల, శుభలేక, సప్తపది, శంకరాభరణం, సాగరసంగమం, ఓ సీతకథ, సీతామాలక్ష్మి, శృతిలయలు, సూత్రధారులు, స్వాతిముత్యం, స్వాతికిరణం, శుభోదయం, శుభసంకల్పం, జీనవజ్యోతి, ఆపద్బాంధవుడు, స్వర్ణకమలం, స్వరాభిషేకం' వంటి ఆణిముత్యాలను అందించి, రసజ్ఞ ప్రేక్షకుల నుంచి 'కళాతపస్వి' బిరుదును కేంద్ర ప్రభుత్వం నుంచి 'పద్మశ్రీ' పురస్కారాన్ని అందుకున్నారు.

కథాపరంగా సన్నివేశాలను, పాత్రల లక్షణాలను, సంభాషణలను నటీనటులకు వివరించి అవసరమైన సందర్భాలలో ఆయన నటించి చూపేవారు. దీనిని పలుసార్లు నిశితంగా గమనించారు కమల్‌హాసన్, యస్.పి.బాలు; ఫలితంగా వారు తలపెట్టిన శుభసంకల్పం చిత్రంలో కథకు కీలకమయిన 'రాయుడు' పాత్రను పోషించాలని విశ్వనాథ్‌కు వివరించి, విశ్లేషించి తమ వాదనతో ఆయన్ను ఒప్పించగలిగారు. దాంతో ఒక అద్భుతమైన క్యారెక్టర్ ఆరిస్టు తెలుగుతెరకు లభించి నట్లయింది. శుభసంకల్పంలో నటనకుగాను ఉత్తమ క్యారెక్టర్ యాక్టర్‌గా రాష్ట్రప్రభుత్వం నుంచి నంది పురస్కారాన్ని అందుకున్నారు. ఈ సంఘటన 1995లో జరిగింది. అప్పటి నుంచి ఈ పదహారు

సంవత్సరాలలో, విశ్వనాథ్ మాత్రమే ఆ పాత్రకు న్యాయం చేయగలరు అనుకున్న సుమారు యాభై చిత్రాల్లో నటించారు.

నాగార్జున కథానాయకుడుగా నటించిన 'వజ్రం' చిత్రంలో కొడుకు శ్రేయస్సు కోసం మూఢనమ్మకంతో మూర్ఖంగా ప్రవర్తించిన తండ్రిగానూ, అదే నాగార్జునకు సంతోషం చిత్రంలో మామగారిగా గంభీరమైన పాత్రను పోషించారు.

'లాహిరి లాహిరి లాహిరిలో' చిత్రంలో విభిన్న భావాలుగల కుమారులకు తండ్రిగా, 'నీ స్నేహం'లో కథానాయిక ఆర్తీఅగర్వాల్‌కు తాతగా హుందాగా నటించారు.

ఫ్యాక్షన్ చిత్రం 'నరసింహనాయుడు'లో విషాదం, ఆవేశం, ఆవేదన, ఆర్ద్రత, ఈ షేడ్స్ అన్ని వున్న కథానాయకుడు (బాలకృష్ణ) తండ్రి పాత్రను తనదైన శైలిలో నటించి ప్రేక్షకులను మెప్పించారు.


అతడు చిత్రంలో ఉన్నది కొద్దిసేపే అయినా ఒక ఆఫీసర్ పాత్రను గుర్తుండి పోయేలా పోషించారు.

కమల్‌హాసన్ చిత్రం 'ద్రోహి'లో తప్పనిసరి పరిస్థితిల్లో అవినీతికి పాల్పడి, ఆత్మహత్య చేసుకున్న సి.బి.ఐ ఆఫీసర్ రొటీన్‌కు భిన్నంగా ఉండే ఓ విలక్షణ భూమిక.

ఇప్పటికి పల్లెటూళ్ళలో సంప్రదాయబద్ధమైన పెద్ద కుటుంబాల్లో ఆ ఇంటి పెద్ద దైనందినకార్యక్రమాన్ని ఒక క్రమపద్ధతిలో జరగాలని కోరుకుంటారు. అటువంటి పాత్రను 'ఆడువారి మాటలకు అర్థాలే వేరు'లో పోషించారు. చిత్రంలో హీరో వెంకటేశ్, విశ్వనాథ్ ఎదురయిన సన్నివేశాలు కొన్ని గిలిగింతలు పెడితే, మరికొన్ని గంభీరంగా వుండి ప్రేక్షకులను మెప్పిస్తాయి.

ఆ ఇద్దరూ అన్నదమ్ములు. సంగీతరంగంలో జంటగా కృషిచేసి, పేరొందిన వారు. వారి ఆంతర్యాలలో ఏ పొర పొచ్చాలు లేకపోయినా, కీర్తిప్రతిష్టలు వచ్చేసరికి, ఆడువారి కారణంగా అపోహలు ఏర్పడడం, ఫలితాలు ఎలా వుంటాయి అనే అంశాన్ని ప్రధానంగా తీసుకున్న 'స్వరాభిషేకం' చిత్రంలో అన్నగా విశ్వనాథ్‌చూపిన అభినయం చిరస్మరణీయం. ముఖ్యంగా రైలులో ప్రసవవేదన పడుతున్న మహిళకు మ్యూజిక్ థెరఫీ ద్వారా ట్రీట్‌మెంటు ఇచ్చిన సన్నివేశంలో విశ్వనాథ్ అత్యంత సహజంగా సన్నివేశాన్ని పండించారు.

ఉదాత్త భావాలు గల పెద్దమనిషి తరహా పాత్రలు ఒకప్పుడు యస్.వి.రంగారావు, గుమ్మడి, జె.వి.సోమయాజులు కాగా నేటి నిర్మాతా దర్శకుల ఛాయిస్ కె.విశ్వనాథ్.



# ఎస్.పి.బాలసుబ్రమణ్యం

సమర్ధుడైన గాయకుడు, సమర్థుడైన సంగీత దర్శకుడు, సమర్థుడైన క్యారెక్టర్ ఆర్టిస్టు, ఈ మూడు లక్షణాలను అందిపుచ్చుకున్నవారు ఉత్తరభారతంలో కిషోర్‌కుమార్, దక్షిణ భారతంలో చక్రవర్తికాగా, ఈ మూడు మౌలిక లక్షణాలతోపాటు బహుభాషా గాయకునిగా, నిర్మాతగా, డబ్బింగ్ కళాకారునిగా, వ్యాఖ్యాతగా, టి.వి సినీ సంగీత కార్యక్రమాల రూపశిల్పిగా, రికార్డింగ్ థియేటర్ అధినేతగా, మానవతా విలువలకు పట్టంగట్టిన మనీషిగా బహుముఖీనమైన ప్రజ్ఞతో అటు వెండి తెరకు ఇటు బుల్లితెరకు, తన విశిష్టమైన సేవలను అందించి, అన్నిటా తనదైన శైలిలో ప్రత్యేకమైన ముద్ర వేసిన వినయగుణ సంపన్నుడు, పద్మభూషణుడు శ్రీ పండితారాధ్యుల, బాలసుబ్రమణ్యం. (జననం 4.6.1946, స్వగ్రామం నెల్లూరు.)

గీత రచయితలు ముక్కున వేలేసుకునే విధంగా ఏకంగా ఇంగ్లీషులో పాట వ్రాసారు 'పడమటి సంధ్యారాగం' చిత్రానికి.

ఆత్మీయంగా పిలుచుకునే బాలు పలురంగాలలో సాధించిన విజయాలు అటుంచి, క్యారెక్టర్ ఆర్టిస్టుగా ఆయన ప్రతిభకు దర్పణం పట్టిన కొన్ని అంశాలను ముచ్చటించుకుందాం.

1972లోనే మహమ్మద్ బీన్ తుగ్లక్ చిత్రంలో తను పాడి 'హ్యాపీ బర్త్‌డే టూయు' అనేపాటకు తానే తెరపై చిందులు వేస్తూ అభినయించారు.

1953లో వచ్చిన హాస్యరస చిత్రం 'పక్కింటి అమ్మాయి'లో హీరో రేలంగి స్నేహితుల్లో ఒకరు సలహాలిచ్చే సి.యస్.రావు, మరొకరు నేపథ్యగాయకుడు ఎ.ఎం. రాజా, దాని హిందీ వెర్షన్ 'పడోసన్'లో ఆ రెండు కలిపి ఒక పాత్రగా మార్చినప్పుడు నటగాయకుడైన కిషోర్ కుమార్ అభినయించారు. అదే పాత్రను1981లో తీసిన 'పక్కింటి అమ్మాయి'లో బాలు పోషించి సంగీత దర్శకుడు చక్రవర్తితో పోటీపడి థియేటర్‌లో నవ్వులు కురిపించారు.

ఓపాపాలాలీ చిత్రంలో రాధిక భర్తగా నటించి, మాటేరాని చిన్నదాని అనే బ్రీత్ లెస్ సాంగును పాడి, ఓ రికార్డు సృష్టించారు.

ప్రేమికుడు చిత్రంలో బాధ్యతలగల పోలీసుగా కొడుకు ముఖం చూడకుండా నేరస్తుడనే భావంతో కాళ్ళపై లాఠీలు విరగగొట్టి ఆ తరువాత నిజం తెలుసుకుని కొడుకును ఓదార్చిన సన్నివేశంలో బాలు నటన ప్రేక్షకులకు కన్నీళ్ళు తెప్పిస్తుంది. ఎన్ని ఎక్కువ చిత్రాల్లో నటించాడు అనేదానికంటే ఎంతగొప్పగా క్యారెక్టర్ ఆర్టిస్టుగా రాణించాడు అనే కోణంలో పరిశీలిస్తే మనకళ్ళముందు సాక్షాత్కరించే పాత్రలను పరామర్శిస్తే,

'ప్రేమ' చిత్రంలో హీరో వెంకటేష్ మిత్రుడుగా ఓపక్క కిళ్ళీలు నములుతూ మరో పక్కపాటలు పాడే విలక్షణ వ్యక్తి, జంధ్యాల దర్శకత్వంలో వచ్చిన హాస్యరస ప్రధానచిత్రం వివాహ భోజనంబులో పోలీస్ ఇనెస్పెక్టర్‌గా స్టేషన్‌కు వచ్చిన వాళ్ళకి మ్యూజిక్ థెరపీతో ట్రీట్‌మెంట్ ఇవ్వడం, దీర్ఘసుమంగళిభవ చిత్రంలో హీరో రాజశేఖర్ పనిచేసే కంపెనీ ఓనర్‌గా విలక్షణ హావభావాలు ప్రదర్శించి నాయిక రమ్యకృష్ణకు కటువుగా వుండే జీవిత సత్యాలు భోదించారు.

ఊయల చిత్రంలో సమాజం పట్ల బాధ్యత గల డాక్టరు పాత్రను హుందాగా పోషించారు. ఈ తరహా డాక్టరు పాత్రను హాస్యంతో గంభీరతను మేళవించి చేసిన చిత్రం భామనే, సత్యభామనే 'దేవుళ్ళు' చిత్రంలో భక్తుడిగా పాట పాడి కామెడీ పండించటం ఓ విశేషమైతే, పర్సనాలిటీలోనూ, అభినయంలోనూ, దాసరి నారాయణరావుతో పోటీపడ్డ చిత్రం "పానకాలు–పర్వతాలు". 'ఇంద్ర" చిత్రంలో పాటల పోటీకి న్యాయనిర్ణేతగా నటించిన బాలు సహజంగా "పాడుతా తీయగా" మకుటంతో వేలాది టి.వి. కార్యక్రమాలు నిర్వహించి ఆంధ్ర దేశం నలుమూలల నుంచి వచ్చిన అస్యంఖ్యాక, ఔత్సాహిక గాయనీ గాయకుల్ని ప్రోత్సహించారు, ఇంకా ప్రోత్సహిస్తునే వున్నారు. అదే "పాడుతా తీయగా" అనే టైటిల్‌తో వచ్చిన చిత్రంలో రికార్డింగ్ కంపెనీ ఓనర్‌గా సహజ సిద్ధమైన పాత్రలో పరకాయప్రవేశం చేశారు.

ఇక క్యారెక్టర్ ఆర్టిస్టుగా బాలును చిరంజీవిని చేసిన చిత్రం పవిత్ర బంధం, ఒకపక్క తన కొడుకు హీరో వెంకటేశ్ ప్రపోజ్ చేసిన ఏడాది కాంట్రాక్ట్ మ్యారేజి అగ్రిమెంట్, మరోపక్క తన కొడుకు జీవితాన్ని సరిదిద్దే అమ్మాయికి అన్యాయం జరగకూడదనే ఆవేదన ఈ సంఘర్షణ మధ్య అద్భుతం, అపూర్వం, అనితర సాధ్యం అనే తరహాలో ఆ పాత్రకు ప్రాణప్రతిష్ట చేశారు బాలు. అందుకే 1996వ సంవత్సరానికి పవిత్రబంధంలోని నటనకుగాను ఉత్తమ సహాయనటుడిగా రాష్ట్రప్రభుత్వ నంది పురస్కారాన్ని అందుకున్నారు.

# క్యారెక్టరు ఆర్టిస్టులుగా రాణించిన మరికొందరు

ఇంతకుముందు ప్రకరణంలో పేర్కొన్న వారే కాక టాకీల తొలి దశకం నుంచి నేటివరకూ క్యారెక్టరు ఆర్టిస్టులుగా రాణించిన వారిలో మరికొందరి గురించి రేఖామాత్రంగా తెలుసుకుందాం.

**వాహినికుమారి :** వాహిని పతాకంపై బి.ఎన్.రెడ్డి రూపొందించిన 'సుమంగళి, దేవత' చిత్రాలలో క్లిష్టమైన కథానాయిక పాత్రలను పోషించి, తనపై చిత్రీకరించినపాటలను తానే పాడుకుని, వాహిని కుమారిగా ముద్రపడ్డ నటి కుమారి.



ఆ తరువాతి కాలంలో క్యారెక్టరు ఆర్టిస్టుగా ఆమె పోషించిన మూడు మరవలేని భూమికలు – 'మల్లీశ్వరి' చిత్రంలో శ్రీకృష్ణదేవరాయులు పట్టపురాణి తిరుమలదేవి, యల్.వి.ప్రసాద్ రూపొందించిన సాంఘిక చిత్రం 'పెంపుడు కొడుకు'లో యస్.వి.రంగారావుకు భార్యగా, శివాజిగణేశన్‌కు తల్లిగా, మానసిక సంఘర్షణగల భూమిక కాగా, మూడవది 'కాళహస్తి మహాత్మ్యం'లో పూజారి (లింగమూర్తి) భార్యగా భర్త ఆగడాలను సహనంతో భరించిన శాంతమూర్తి భూమిక, చెప్పుకోతగ్గవి.

**వల్లభజోశ్యుల శివరాం :** వాహిని స్టూడియోలో సౌండ్ డిపార్ట్‌మెంటులో ఇంజనీరుగా పనిచేసిన వల్లభజోశ్యుల శివరాం, మంచి స్పార్కు వున్న నటుడు.



వాహిని పతాకంపై కె.వి.రెడ్డి తీసిన 'భక్త పోతన'లో మల్లన్నగాను, 'గుణసుందరికథ'లో శాపగ్రస్తుడైన యువరాజుగాను, 'విప్రనారాయణ'లో శ్రీరంగపట్టణ మహారాజుగాను, 'మంచి–చెడు'లో విలన్ టచ్ వున్న పాత్రలో హీరో ఎన్.టి.ఆర్ సోదరునిగాను, 'మంచిమనసులు' చిత్రంలో పతాక సన్నివేశంలో కోర్టులో జడ్జిగాను, తనకు లభించిన పాత్రలను తనదైన శైలిలో తెరపై ఆవిష్కరించారు శివరాం.

**వంగర వెంకట సుబ్బయ్య :** పండిత వంశంలో జన్మించి సుస్పష్టమైన భాషోచ్చారణతో హాస్య పాత్రలతో పాటు, క్యారెక్టరు ఆర్టిస్టుగా రాణించారు. 'బంగారు పాప'లో హీరో కోటయ్యకు అన్యాయం చేసి అతని భార్య రామిని లేవదీసుకుపోయిన నయవంచకుడు



గోపాలస్వామి; 'నా బొంద నాకేం తెలుసు' అంటూ హీరో దొంగరాముడికి, చిన్నతనంలో పాఠాలు చెప్పిన పంతులుగాను, ఛైర్మెన్ ధర్మారావుతో చేతులు కలిపిన పూజారిగా 'పెద్దమనుషులు' చిత్రంలోనూ, ప్రతీ విషయాన్నీ అనుమానించి కంగారుపడే మంత్రిగా నటించిన 'జయసింహ', రుక్మిణీదేవి సందేశాన్ని శ్రీకృష్ణునకు చేరవేసిన పురోహితుడు అగ్నిద్యోతనుడు (శ్రీకృష్ణపాండవీయం) చెప్పుకోదగ్గ పాత్రలు.



**ఎ.వి.సుబ్బారావు :** 'కీలుగుర్రం' చిత్రంలో మోహిని వలలో పడి గర్భవతియైన మహరాణిని అడవులు పాల్జేసిన మహారాజు, పల్లె ప్రజల సంపదలను హరించి, వాళ్ళకు సుఖశాంతులు లేకుండా చేసిన 'పల్లెటూరి పిల్ల', విలన్ కంపనదొర, వంచకుడైన మునిసిపల్ ఛైర్మన్‌తో చేతులు కలిపిన 'పెద్దమనుషులు', కాంట్రాక్టర్ నాగోజి, కథానాయకుడుతో తలపడ్డ 'సౌధామిని' చిత్రంలోని దుష్టభూమిక; ఇవి సుబ్బారావు నటజీవితంలో చెప్పుకోదగ్గ పాత్రలు.

**మహంకాళి వెంకయ్య :** 'పెళ్ళిచేసి చూడు' చిత్రంలో తను ప్రేమించిన చిట్టి కోసం 'ఎవడొత్తాడో చూత్తాగా' అంటూ, వీరంగం వేసారు. 'ఇంటిగుట్టు' చిత్రంలో హీరో కుటుంబానికి హానితలబెట్టిన దుష్టునిగా, 'రాజనందిని'లో రంకెలు వేసి కుమార్తెను కట్టడి చేయటానికి ప్రయత్నించిన దొంగలనాయకుడుగాను, అదే దొంగలనాయకుడిగా జయసింహు'నితో పోటీపడి అతని కండబలానికి గుండెబలానికి జోహారులర్పించటం; కొంతకాలం విరామం తరువాత భూతవైద్యునిగా 'మంచి మనసులు' చిత్రంలో హడావిడి చెయ్యటం, ఎన్నదగినవి.



**డాక్టరు శివరామకృష్ణయ్య :** 1940–50 మధ్య కొన్ని చిత్రాల్లో సహాయ పాత్రలు పోషించిన డాక్టరు శివరామకృష్ణయ్యకు గుర్తింపు తెచ్చింది 'పెళ్ళిచేసి చూడు' చిత్రంలోని వెంకటపతి పాత్ర. ఆ తరువాత 'అర్థాంగి, మాంగల్యబలం, పెళ్ళిసందడి, ఆరాధన, పరమానందయ్యశిష్యులకథ' చిత్రాలలో గంభీరతకు హాస్యాన్ని రంగరించిన పాత్రల్లో రాణించారు.





**డాక్టర్ వక్కలంక కామరాజు :** వృత్తిరీత్యా డాక్టరైన కామరాజు ప్రవృత్తి రీత్యా ఉదాత్త, గంభీర పాత్రలకు ప్రాణం పోసిన క్యారెక్టరు ఆర్టిస్టు. 'రాజు-పేద'లో రాజ కుటుంబ క్షేమం కోరిన మంత్రిగాను, 'అర్ధాంగి'లో నమ్మకస్తుడైన దివాన్‌గాను, 'జయసింహ'లో మగధ సామ్రాజ్య మహారాజుగాను, 'తెనాలి రామకృష్ణ'లో బాబర్‌పాదుషాగాను ఆ పాత్రలకు తన నిండైన విగ్రహంతో పాటు గంభీరమైన నటనతో మెప్పించారు.

**సంధ్య :** కథానాయికగా రాణించిన, తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి జయలలితకు మాతృమూర్తి సంధ్య. 'తెనాలి రామకృష్ణ' చిత్రంలో శ్రీకృష్ణదేవరాయుల పట్టమహిషిగా



నటించగా ఆమెపై 'చందన చర్చిత నీలకళేబర' అనే గీతాన్ని చిత్రీకరించారు. 'మాయాబజార్'లో రుక్మిణిగా రాణించారు. ఈ రెండింటిలోనూ, ఆమె సరసన హీరో ఎన్.టి.ఆరే. ఇక మహా నటుడు యస్.వి.రంగారావు భార్య (భానుమతి)గా 'పాండవ వనవాసం'లోనూ, సోదరి (సుధేష్ణ)గా 'నర్తనశాల'లోనూ నిండుగా కన్పించారు. 'లవకుశ' చిత్రంలో శ్రీరాముని సోదరి శాంతాదేవి పాత్ర కూడా చెప్పుకోదగ్గది. గుమ్మడి కాంబినేషన్‌లో ఆమె నటించిన చిత్రం 'నిత్యకళ్యాణం – పచ్చతోరణం'. రమణారెడ్డి కాంబినేషన్‌లో 'భార్యాభర్తలు' చిత్రంలో వారిరువురి పైనా 'కనకమా నా మాట వినుమా' అనే హాస్యగీతం చిత్రీకరించారు. చెప్పుకోదగ్గ మరో రెండు చిత్రాలు 'కులగోత్రాలు', 'వెలుగునీడలు'.

**వల్లం నరసింహారావు :** ప్రజానాట్యమండలి నటుడిగా రంగస్థలంపై రాణించి, 'మాగోపి, ప్రపంచం' చిత్రాలలో హీరోగా నటించి, ఆ తరువాత డబ్బింగ్ ఆర్టిస్టుగా యం.జి.రామచంద్రన్, శివాజిగణేశన్, నంబియార్, ప్రేమనజీర్, రాజ్‌కుమార్‌లకు గాత్రదానం చేశారు. 'రోజులుమారాయి', 'కలసివుంటే కలదు సుఖం', 'కులదైవం', 'ఇదికథ కాదు' చిత్రాలలో సహాయపాత్రలు పోషించిన నరసింహారావు 'భక్త అంబరీష', 'సంపూర్ణరామాయణం' చిత్రాలలో నారదపాత్రలు రక్తి కట్టించారు.



**ఏ.పుండరీకాక్షయ్య :** యన్.టి.ఆర్. సమీప బంధువైన పుండరీకాక్షయ్య రంగస్థలంపై 'కరువురోజులు, ఆత్మవంచన' వంటి నాటకాల్లో నటించి, యన్.టి.ఆర్ రూపొందించిన

చిత్రాల ప్రొడక్షన్ ఎగ్జిక్యూటివ్‌గా పని చేశారు. నిర్మాతగా మారి 'మహామంత్రి తిమ్మరుసు, ఆరాధన' వంటి చిత్రాలు నిర్మించారు. ఈయనలోని నటుణ్ని పరిపూర్ణంగా ఆవిష్కరించిన చిత్రం 'కర్తవ్యం'. 'నీ జీవితం మీద నాకు విరక్తి కలిగింది' అంటూ తడిగుడ్డలతో గొంతులుకోసే, రాజకీయ నాయకుడి పాత్రను కొత్త తరహాలో రక్తికట్టించారు. ఆ తరువాత 'ప్రాణదాత, మాధవయ్యగారి మనవడు, పోలీస్‌బ్రదర్స్, బ్రహ్మ, అశ్వని, శివయ్య' వంటి ఓ పాతిక తెలుగు, కన్నడ చిత్రాలలో క్యారెక్టరు ఆర్టిస్టుగా రాణించారు.



**మనోరమ :** యావత్ భారతీయ భాషల్లో రికార్డు స్థాయిలో 1500 చిత్రాలలో నటించి గిన్నిస్‌బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో నమోదయిన విలక్షణ నటి మనోరమ 26.5.1943న జన్మించారు. అలనాటి తమిళనాడు ముఖ్యమంత్రులు సి.యన్.అన్నాదొరై, ఎం.కరుణానిధిలతో రంగస్థల ప్రదర్శనల్లో నటిగా పాల్గొన్నారు. వెండితెరపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా పనిచేసిన యన్.టి.రామారావు, తమిళనాడు ముఖ్యమంత్రులుగా పనిచేసి యం.జి.రామచంద్రన్, జయలలితలతో కలిసి అటు హాస్య పాత్రలను, ఇటు విలక్షణ పాత్రలను సమసామర్థ్యంతో పోషించి, స్వయంకృషితో, తనకంటూ ఒక చరిత్ర సృష్టించుకున్న గుణచిత్ర నటి మనోరమ. 'భారతీయుడు' చిత్రంలో పెన్షన్ కోసం పరితపించిన వృద్ధురాలి పాత్రలో కరుణరసాన్ని పోషించి మెప్పించారు, 'అల్లరి ప్రియుడు, రిక్షావోడు, పోలీస్ బ్రదర్స్' చిత్రాలలో బామ్మగా నటించి తెలుగు ప్రేక్షకుల హృదయాలలో సముచిత స్థానాన్ని పొందారు.





**రమాప్రభ :** 5.8.1947లో జన్మించిన రమాప్రభ 'చిలకా–గోరింక' (1966) చిత్రం ద్వారా సినీరంగ ప్రవేశం చేశారు. నాటి నుంచి, 1000కి పైగా చిత్రాలలో హాస్యనటిగాను, క్యారెక్టరు ఆర్టిస్టుగాను రాణించారు. క్యారెక్టరు ఆర్టిస్టుగా సెకెండ్ ఇన్నింగ్స్ ప్రారంభించాక 'నిన్నేపెళ్ళాడుతా, దేవదాసు, ఠాగూర్, నేనింతే, లాహిరి లాహిరి లాహిరి, అదుర్స్' చిత్రాలలో యాక్టివ్ వుండే బామ్మ అంటే ఇలావుంటే బాగుండును అనే రేంజ్‌లో అదరగొట్టారు. లోలోపల పురుషుడంటే అభిమానం వున్నా బయట మాత్రం వాళ్లని చాలా దూరంగా వుంచాలి అనే సన్యాసినిగా 'దేశముదురు'లో ఓహో అనిపించారు.



**కోవై సరళ :** ఒక మనోరమ, ఒక సూర్యకాంతం, ఒక రమాప్రభ ఈ ముగ్గురిని ఒకటిగాజేసి కో.వై.సరళగా సృష్టించాడు ఆ బ్రహ్మ. బ్రహ్మానందం కాంబినేషన్‌లో 'శ్రీరామచంద్రుడు, సందడేసందడి, తిరుమల తిరుపతి వెంకటేశా, క్షేమంగా వెళ్ళి లాభంగా రండి' చిత్రాల్లో భర్తకు అనుకూలంగా వున్నట్టు నటిస్తూ, అతన్ని దారి లోకి తెచ్చుకునే గడసరి ఇల్లాలిగానూ, ఇహ 'దేశముదురు' చిత్రంలో కోరికలు చల్లారని సన్యాసిగా, చాలా చాలా బ్యాలెన్స్‌డ్‌గా నటించి, తెలుగుభాషను ఉచ్చరించటంలో తనదైన శైలిలో కొత్త సొబగులను అద్దిన విలక్షణ నటి కో.వై.సరళ. ప్రముఖ నటుడు కమల్‌హాసన్‌తో 'సతీలీలావతి'లో జంటగా వో సంచలనం సృష్టించారు.



**కాకరాల :** ప్రజానాట్యమండలి నాటకాల్లో రాణించి, 'రంగుల రాట్నం' చిత్రంలో దర్శకత్వ శాఖలో బి.ఎన్.రెడ్డికి సహక రించటమేకాక, ఆ చిత్రంలో ఓ దుష్టభూమికను సమర్ధవంతంగా పోషించారు. 'మాభూమి' చిత్రంలో సహజసిద్ధమైన రైతు పాత్రలో జీవించిన కాకరాల, కుమ్మరితాతగా 'దేవుడు చేసిన పెళ్ళి'లోనూ, మూగబాలిక తండ్రిగా 'అడవిరాముడు'లోనూ, 'శుక్రవారం మహాలక్ష్మి'లో కథానాయికకు అలనాటి కణ్వమహర్షి వలె నీతులు బోధించిన ఉపాధ్యాయుడుగాను అత్యంత సహజంగా నటించారు.



**జి.వి.నారాయణరావు :** 'అంతులేని కథ' చిత్రంలో 'వికటకవి' గా 'తాళికట్టు శుభవేళ' అనే పాటకు అభినయించిన నారాయణ రావు ఆ తర్వాత చిలకమ్మ చెప్పింది సుబ్బారావుకు కోపం వచ్చింది. చిత్రాలలో ప్రధాన పాత్ర పోషించారు. దమ యంతి పతాకంపై చిత్రాలు నిర్మించారు. గుణచిత్ర నటుడుగా మారిన తారువాత 'గ్యాంగ్‌లీడర్'లో హీరో స్నేహితునిగా, 'చక్రం'లో హీరో తండ్రిగా ఉదాత్త నటన ప్రదర్శించారు.




**కవిత :** 'వెంకటేశ్వరవ్రత మహాత్మ్యం, ప్రెసిడెంటు పేరమ్మ' వంటి చిత్రాల్లో కథానాయికగా రాణించిన కవిత, 'ప్రేమా భిషేకం'లో కధానాయకుడు రాజేష్ మిస్సయిన పెళ్ళికూతురిగా, 'నిన్నేపెళ్ళాడుతా'లో చంద్రమోహన్ భార్యగా, 'మధుమాసం'లో చలపతిరావు కాంబినేషన్‌లో హీరో సుమంత్‌కు తల్లిగా క్యారెక్టర్ ఆర్టిస్టు పాత్రలను పోషించారు.




**మంజుభార్గవి :** కె.ఎస్.ప్రకాశరావుగారి 'గాలిపటాలు' చిత్రం ద్వారా సినీరంగ ప్రవేశం చేసి, 'కృష్ణవేణి, సోగ్గాడు' చిత్రాల్లో నృత్యాలు చేసిన మంజుభార్గవి నట జీవితంలో ఆమెను చిరస్మరణీయం చేసిన పాత్ర 'శంకరాభరణం'లోని తులసి. భాషాతీత భావాలను ఉదాత్తంగా ప్రదర్శించారు. 'యమలీల'లో ఆలీ తల్లి పాత్రలో గంభీరంగానూ, 'నిన్నే పెళ్ళాడుతా'లో ఆహుతి ప్రసాద్ భార్యగా హుషారుగా నటించారు.




**రఘునాథరెడ్డి :** రంగస్థలంపై 'కీర్తిశేషులు, ఆకాశరామన్న' వంటి నాటకాల్లో ప్రధానపాత్రలు పోషించి 'సర్పయాగం' చిత్రం ద్వారా సినీరంగప్రవేశం చేసారు. 'ప్రేమ పల్లకి'లో చాంధసభావాలు గల సంగీతజ్ఞునిగా 'ప్రేమించుకుందాంరా'లో హీరో వెంకటేష్‌కు తండ్రిగా, 'ఒరేయ్ రిక్షా'లో విలన్‌గా తన ప్రతిభను నిరూపించుకున్నారు.



**వంకాయల సత్యన్నారాయణ :** రంగస్థలంపై రాణించి 1977లో వచ్చిన "అత్తవారిల్లు" చిత్రం ద్వారా సినీరంగ ప్రవేశం చేశారు. "చందమామరావే", "ఇంద్రుడు చంద్రుడు", "శుభలేఖ", "సూత్రధారులు" వంటి సుమారు 50 చిత్రాల్లో పలురకాల భూమికలు పోషించిన వంకాయల నటజీవితంలో చెప్పుకోదగ్గ అద్భుతమైన పాత్ర సితామహాలక్ష్మి చిత్రంలో విశ్వనాథ్ సృష్టించిన స్టేషన్ మాష్టార్; ఒక పక్క తన కూతురి సంసారం ఇబ్బందుల్లో వుంది అన్న బాధను భరిస్తూనే మరోవైపు తన్ను అభిమానించిన కొండయ్య కోరికను మన్నించి కథానాయిక సీతాలుకు కొద్దిపాటి చిరిగిన బనీనుతో హార్మోనియం ముందు కూర్చొని "మావి చిగురుతినగానే కోయిల పలికేనా' (దేవులపల్లి రచన, బాలు గానం) అంటూ, పాట నేర్పి పరవశించిన సన్నివేశం మరచిపోలేము.



**జీవా :** అతి శక్తివంతమైన కళ్ళు జీవాకు దైవుడిచ్చిన వరం. విలనీని హాస్యంతో జోడించి వంశీ తీసిన 'ఔను వాళ్ళిద్దరూ ఇష్టపడ్డారు, దొంగరాముడు అండ్ పార్టీ' చిత్రాల్లో మెప్పించారు. 'శుక్రవారం మహాలక్ష్మి, కబాడీ కబాడీ, ఆంజనేయులు, బెండు అప్పారావు' చిత్రాలలో కూడా వెరైటీ పాత్రలను సమర్ధవంతంగా పోషించారు.



**దేవదాస్ కనకాల :** రంగస్థలంపై తన ప్రతిభను ప్రదర్శించి విశ్వనాథ్ రూపొందించిన "ఓసీతకథ, మాంగ్యలానికి మరో ముడి, సిరిసిరిమువ్వ'' చిత్రాలలో విలన్‌గా, దాసరి నారాయణరావు తీసిన 'గోరింటాకు'లో నాయిక సుజాతకు శాడిస్ట్ భర్తగాను రాణించారు. లాయర్, జడ్జి, పోలీస్ ఆఫీసర్, డాక్టర్ వంటి సామాజికంగా వుండే వేషాలు ఎన్నెన్నో. వీరి శ్రీమతి లక్ష్మీదేవి కూడా ఆర్టిస్టే. వారిద్దరూ ఫిలిం ఇన్‌స్టిట్యూట్ నిర్వహించారు. వీరి కుమారుడు రాజీవ్ వెండితెరపై ఆర్టిస్టుగాను, కోడలు సుమ బుల్లితెరపై వ్యాఖ్యాతగాను ఓహో అనిపించుకుంటున్నారు. దేవదాస్ కనకాల దర్శకత్వంలో రూపొందిన రెండు చిత్రాలు 'చలిచీమలు', 'పుణ్యభూమి కళ్ళు తెరచింది'.



**పరుచూరు వెంకటేశ్వరరావు :** అకౌంటెంట్ జనరల్ ఆఫీసులో కొంతకాలం ఉద్యోగం చేసి, సామాజిక స్పృహతో 'సమాధి కదుతున్నాం చందాలివ్వండి' వంటి నాటకాలందించి, సోదరుడు గోపాలకృష్ణతో కలిసి, సుమారు 300ల పై చిలుకు చిత్రాలకు రచన చేశారు. నటుడిగా, వెండితెరపై స్కోరు ఓ వంద చిత్రాలు. ఐతే వీటిల్లో చెప్పుకోదగ్గవి 'కర్తవ్యం, నువ్వొస్తానంటే నేవద్దంటానా, హనుమాన్ జంక్షన్, ఒక్కడు, ఒంటరి, వర్షం, భద్రాచలం, హనుమంతు, కలెక్టరుగారి భార్య'; వెంకటేశ్వరరావు పోషించిన పాత్రల్లో ప్రత్యేకత ఏమంటే, విలన్‌కు సన్నిహితంగా వుంటూనే, తనలోతాను మాట్లాడుకుంటూ, మంచిని కోరేటటువంటి విలక్షణమైన భూమికలు. 'ఆశయం'లోని నటనకుగాను ఉత్తమ సహాయ నటుడిగాను, సింధూరంలో నటనకుగాను ఉత్తమ క్యారెక్టరు ఆర్టిస్టుగాను, రాష్ట్ర ప్రభుత్వ నంది అవార్డ్ అందుకున్నారు.

**పరచూరి గోపాలకృష్ణ :** సోదరుడు వెంకటేశ్వరరావుతో కలిసి, చిత్రరచనా ప్రస్థానం కొనసాగించిన గోపాలకృష్ణ యన్.టి.ఆర్ సూచనపై 'అనురాగ దేవత' చిత్రంలో



తొలిసారిగా వెండితెరపై తళుక్కున మెరిసారు. ఆ తరువాత ఎత్తులు వేసే జిత్తుల మారి విలన్‌గా 'బ్రహ్మరుద్రులు'లోని బలగం బ్రహ్మాజి, 'ప్రతిధ్వని' చిత్రంలో బలగం పొట్టిసీతయ్య, పాత్రలను పోషించారు. 'కథానాయకుడు, ఆడబడుచు' వంటి చిత్రాల్లో కూడా విలన్ వేషాలే వేశారు. 'మొగుడుగారు' చిత్రంలో తాను ధరించిన పాత్ర ద్వారా రాజకీయ నాయకుడు అనే పదానికి,

ఇచ్చిన వివరణ (రావణుడు, జరసంధుడు, కీచకుడు, యయాతి, నారదుడు, కుచేరుడు, దూడూబసవన్న) మరచిపోలేము. ఈ అపూర్వ సోదరులిద్దరూ కలిసి, 'సర్పయాగం, కాయ్‌రాజా కాయ్, శ్రీకట్నలీలలు' వంటి ఓ అరడజను చిత్రాలకు దర్శకత్వం వహించారు. 'కాయ్‌రాజ్ కాయ్'లో గుర్తించుకోదగిన డాక్టరు పాత్రను నాచే ధరింపజేసి, మద్రాస్ పిలిపించి డబ్బింగ్ చెప్పిచటం నాకో తీపిగుర్తు.



**శివపార్వతి :** కళలకు కాణాచియైన తెనాలిలో జన్మించిన, శివపార్వతి రంగస్థలంపై 'పల్లెపడుచు, యధారాజా తథాప్రజ, ఈనాడు' నాటకాల్లో రాణించి, 1991లో పరుచూరి రఘుబాబు నాటక కళాపరిషత్తులో 'ముగింపు చెప్పండి' నాటకం ద్వారా సినీప్రముఖులను మెప్పించారు ఫలితంగా సురేష్ రామానాయుడు గారి 'సర్పయాగం' చిత్రంలో ప్రాధ్యాన్యత గల పాత్రను పోషించారు. 'ఒరేయ్ రిక్షా, సీమసింహం, యమదొంగ, అమ్మనాకోడలా' వంటి 100 చిత్రాలలో గుణచిత్రనటిగా రాణించిన శివపార్వతి, రాఘవేంద్రరావు దర్శకత్వంలో 'అన్నమయ్య, శ్రీరామదాసు, పాండురంగడు' (కె.విశ్వనాథ్ భార్యగా) వంటి భక్తిరస చిత్రాలలో మెప్పించటం ఓ విశేషం. శివపార్వతిలోని మహానటిని గుర్తించిన మహానటుడు యన్.టి.రామారావు తాను స్వీయదర్శకత్వంలో రూపొందించిన 'వీరబ్రహ్మేంద్రస్వామి చరిత్ర'లో కీలకమయిన గొర్రెల యజమానురాలి పాత్రనిచ్చి ప్రోత్సహించటం, ఓ మరపురాని అనుభూతి అంటారు శివపార్వతి.

**జయలలిత :** 'శృతిలయలు' చిత్రంతో సినీపరిచయమైన జయలలితకు బ్రేక్‌నిచ్చిన చిత్రం సురేష్ వారి 'ఇంద్రుడు-చంద్రుడు'. విలన్ చరణ్‌రాజ్‌తో చేతులు కలిపి, మేయర్‌ని



అంతమొందించిన వాంప్ వేషం. ఆ తరువాత 'ఏప్రిల్ 1 విడుదల, అప్పుల అప్పారావు, గోపి గోపిక గోదావరి' వంటి చిత్రాలలో గుణచిత్ర నటిగా రాణించిన జయలలిత నటజీవితంలో చిరస్మరణీయమైన భూమిక చలం కథతో రూపొందించిన ఇంద్రకంటి మోహనకృష్ణ చిత్రం 'గ్రహణం'లో లభించింది. ఆమె జీవితంలో మరువలేని ఘట్టాలు రెండు. మొదటిది తనికెళ్ళభరణి భాగస్వామ్యంలో ఆలోచనలను రేకెత్తించే 'కీ', హ్రస్వచిత్రాన్ని రూపొందించటం, దానికి అవార్డులు రావటం, కాగా రెండోది గురజాడ అప్పారావుగారి క్లాసిక్ 'కన్యాశుల్కం' బుల్లితెర ధారావాహిక కార్యక్రమంలో మధురవాణి పాత్రను పోషించి మెప్పించటం.



**నాజర్ :** నిర్మాత కె.యస్.రామారావు రూపొందించిన 'చంటి' చిత్రంలో జమిందారుగా తన సోదరి క్షేమం కోరి కథానాయకుని హింసించటానికి సోదరుల సహాయంతో ప్రయత్నించి విఫలుడైన పెద్దన్నయ్యగా తెలుగు ప్రేక్షకులకు దగ్గరయ్యారు. ఆ తరువాత నాజర్ స్వతహాగా ముస్లిమ్ అయినా ఓ ఛాందసబ్రాహ్మణుని పాత్రను 'బొంబాయి' చిత్రంలో అత్యంత సహజంగా పోషించారు. 'రక్షణ, సింహాద్రి, పోకిరి, అతడు, నాయకుడు, క్రిమినల్' వంటి పలు చిత్రాలలో తనదైన శైలిలో మెప్పించిన నాజర్ నటజీవితంలో చెప్పుకోదగ్గ పాత్ర 'శ్రీరామదాసు'లోని తానీషా.



**రామిరెడ్డి :** జర్నలిస్ట్‌గా జీవితాన్ని ప్రారంభించి, కాంట్రాక్టర్‌గా ఓ వెలుగువెలిగి కుటుంబ మిత్రులైన శ్యాంప్రసాద్‌రెడ్డి ప్రోత్సాహంతోనూ అయిష్టంగానే, కెమెరాముందుకు వచ్చిన రామిరెడ్డి బెస్ట్ విలన్‌గా ఎన్నో అవార్డులు వరించాయి. తొలిచిత్రం 'అంకుశ'మే ఆయన నటజీవితానికి ఓ బ్రేక్ ఇచ్చింది. ఆ తరువాత శ్యాంప్రసాద్‌రెడ్డి, కోడిరామకృష్ణ రూపొందించిన 'దేవీ, అమ్మోరు' చిత్రాల్లోని దుష్టభూమికలు ఎంతగానో పేరు తెచ్చాయి. 'జగదేకవీరుడు – అతిలోకసుందరి'లో నలుగురి దుష్టులల్లో ఒకరిగాను, 'పెద్దరికం' చిత్రంలో నలుగురి అన్నదమ్ముల్లో ఒకడిగాను నటించిన, రామిరెడ్డిని గుర్తుకు తెచ్చుకుంటే అతనినుదిటిపై సూర్యబింబంలా మెరిసే ఎర్రనిబొట్టు అతని పాత్రల పాలిట ట్రేడ్ మార్కుగా నిలిచింది.



**రఘువరన్ :** రామ్‌గోపాలవర్మ చిత్రం 'శివ'ను అభిమానించిన ప్రేక్షకులెవ్వరూ, ఆ చిత్ర విజయానికి పరోక్షంగా సహకరించిన దుష్టభూమిక భవానీని మర్చిపోలేరు. ఒక గుటకలో మందు కొట్టేసి, నిప్పులు చెరిగే కళ్ళతో "4 లారీలతో మనుషుల్ని తీసుకెళ్ళి, వాణ్ని చంపిచేయండి' అంటూ అనుచరులు నానాజీకి ఆదేశించిన సన్నివేశం ఎంత థ్రిల్లింగ్‌గా వుందో ఒక్కసారి ఊహించుకోండి. 'రక్షకుడు, పసివాడి ప్రాణం, ఒకేఒక్కడు, మాస్' వంటి పలు చిత్రాలలో ఆ తరహా విలన్ వేషాల్లో ఓహో అనిపించిన రఘువరన్ నట జీవితంలో చెప్పుకోదగ్గ విలక్షణ చిత్రం 'సుస్వాగతం'. అందులో హీరో పవన్‌కల్యాణ్ తండ్రిగా, సెంటిమెంటుకు తలవంచిన ఉదాత్త పాత్ర.



**వై.విజయ :** రామవిజేతావారి 'తల్లితండ్రులు' చిత్రం ద్వారా సినీరంగప్రవేశం చేసిన వై.విజయను దర్శకులు బాలచందర్ 'మన్మధలీల'లో హలో మైడియర్ రాంగ్ నంబర్ అంటూ అటు హీరో కమల్‌హాసన్ పైకి ఇటు రసిక హృదయాల మీదకి అభినయం ద్వారా మన్మధబాణాలు సంధించారు. కోడిరామకృష్ణ చిత్రం 'మంగమ్మగారి మనవడు'లో గోకిన రామారావుకు తలంటి పోసిన పులుసుపాత్రలో కిక్కెక్కించారు. 'పెళ్ళాం చెబితే వినాలి'లో దోమలు కుడుతున్నాయి అంటూ భర్త విరహాన్ని ప్రదర్శిస్తే అందుకు తగ్గ మందు వేస్తుంది. 'ఆత్మీయుడు' చిత్రంలో రెండవ కథానాయకుడు మురళిమోహన్‌కు జంటగా నటించారు. నేను రచన చేసిన 'శుక్రవారం మహాలక్ష్మి' చిత్రంలో భర్త, వుంగరాల బంగారయ్య (వేలు) సహాయంతో కథానాయిక (సితార)ను అంతమొందించటానికి పలు పథకాలు వేసి తాత్కాలికంగా విజయం సాధించిన, పతాకసన్నివేశంలో మనవరాలి చేతిలో పరాజయం పొందిన దుష్టభూమిక కడు సమర్ధవంతంగా పోషించారు.




**ఆలపాటి లక్ష్మి :** ఈవె తండ్రి ఆలపాటి సత్యం, ఆంధ్రనాటకరంగ స్థలాన్ని ఉర్రూతలూపిన మహానటుడు. నటన ఆమెకు వారసత్వంగా లభించిన ఆస్తి. నేను వ్రాసిన 'దేశమంటే మనుషులోయ్' నాటకంలోనూ, సివంగి కూన నాటికలోనూ, కథానాయిక పాత్రను సమర్ధవంతంగా పోషించారు. 'కాయ్‌రాజా కాయ్' చిత్రంలో లాయర్ పాత్ర ద్వారా సినీరంగ ప్రవేశం చేశారు. 'శ్రీరాములయ్య, చిత్రం ఒక విచిత్రం, సై' వంటి పలుచిత్రాలలో గుణచిత్ర నటిగా వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకున్న ఆలపాటి లక్ష్మి నటజీవితంలో మరువలేని మహత్తర చిత్రం "అమ్మో ఒకటోతారీఖు'. మధ్యతరగతి జీవులకు 1వ తారీఖు వస్తుందంటే, జీతం వస్తుందన్న ఆనందంతో పాటు, బాకీలు కట్టాలన్న ఆవేదన మానసికంగా ఇబ్బంది పెడుతుంది. యల్.బి.శ్రీరాం కాంబినేషన్‌లో సామాన్యమహిళ పడే ఇబ్బందులను నటనలో అత్యంత సహజంగా ఆవిష్కరించారు ఆలపాటి లక్ష్మి.




**మహర్షి రాఘవ :** తను హీరోగా నటించిన మహర్షి చిత్రం పేరునే తన ఇంటి పేరుగా మార్చుకుని, క్యారెక్టరు ఆర్టిస్టుగా కెరియర్ కొనసాగించారు. 'చంటి' చిత్రంలో కథానాయకుడి తల్లికి తాళికట్టబోయిన వెర్రిబాగులోడి పాత్ర, నోట్లో వేలేసుకుని

చంటిపిల్లాడిలా అమాయకంగా, హీరో నరేష్ మిత్రబృందంలో, ఒకడిగా, 'చిత్రం భళారే విచిత్రం'లో ముచ్చటైన అల్లరి చేశారు. 'బలరామకృష్ణులు' చిత్రంలో హీరో శోభన్‌బాబుకు బావమరిదిగా చేసిన వేషం ఓ వెరైటి.




**చరణ్‌రాజ్ :** ఈ పేరు చెప్పగానే ప్రేక్షకులకు 'ప్రతిఘటన'లోని కాళీ పాత్ర గుర్తు వస్తుంది. కథానాయికను నడిబజార్‌లో అల్లరిపెట్టి ఆమె చేతిలోనే హతుడయిన కాళీగా చరణ్‌రాజ్ చేత చక్కగా నటింపజేశారు దర్శకుడు టి.కృష్ణ. 'జగదేకవీరుడు – అతిలోకసుందరి'లో నలుగురి విలన్స్‌లో ఒకడిగాను, 'ఇంద్రుడు–చంద్రుడు'లో మేయర్‌ను హతమార్చిన దుష్టునిగాను, చరణ్‌రాజ్ చూపిన నటన అలనాటి విలన్ ఆర్.నాగేశ్వరరావును గుర్తుకు తెస్తుంది. వీటికి భిన్నంగా పోలీస్ ఆఫీసర్ పాత్ర పోషించిన చిత్రం 'ఆశయం'.



**నాగబాబు :** చిరంజీవి సోదరుడు నాగేంద్రబాబు, నాగబాబుగా రూపాంతరం చెంది 'కౌరవుడు'లో హీరోగా నటించారు. 'చందమామ, మనసుమాట వినదు' వంటి చిత్రాల్లో పెద్దమనిషి తరహా పాత్రలను హుందాగా పోషించారు. 'అంజీ' చిత్రంలో కోయగూడెంలో వైద్యుడుగా, ఆహార్యంలోనూ అభినయంలోనూ వైవిధ్యాన్ని చూపారు. 'అందరూ దొంగలే' చిత్రంలో నాయిక అంకిత తండ్రిగా గంభీరంగా నటించారు.

**వైజాగ్ ప్రసాద్ :** విశాఖపట్నంలో ప్రముఖ రంగస్థల నటుడు మిశ్రో దర్శకత్వంలో 'బలేపెళ్ళి, కలలరాజ్యం, వరవిక్రయం' వంటి నాటకాల్లో కీలక పాత్రలు పోషించి, జంధ్యాల తీసిన 'బాబాయ్–అబ్బాయ్' ద్వారా వెండితెరకు పరిచయమయ్యారు. బట్టతల ఆయనకు ఓ ప్లస్ పాయింట్. 'శృతిలయలు' చిత్రంలో కథానాయిక తండ్రి పాత్రలో ఉదాత్తంగా నటించి, 'నువ్వూ–నేను'లో హీరో ఉదయకిరణ్ తండ్రిగా పాలిష్డ్ విలన్ అంటే ఎలా వుంటాడో నటనలో చూపారు. 'అల్లరిరాముడు'లో మినిష్టరుగాను, 'భద్ర'లో హీరో మేనమామగా, గౌరిలో హీరోయిన్ తండ్రిగా, ఇలా ఏ పాత్ర వచ్చినా దానికి తనవంతు న్యాయం చేశారు. ప్రసాద్ నటజీవితంలో చిరస్మరణీయమైన భూమిక 'చెన్నకేశవరెడ్డి' (హీరోయిన్ శ్రియ తండ్రి) లభించింది.





**షియాజిషిండే :** మహారాష్ట్రలో మరాఠీ నాటకరంగంపై స్వయంప్రతిభతో నటుడిగా రాణించిన షిండే, తెలుగు సినీరంగంలో తనదైనశైలిలో విలక్షణంగా సంభాషణలు పలికి ప్రేక్షకులకు చేరువ అయ్యారు. సీరియస్‌గా నటిస్తూనే, కామెడి పండించటం షిండే స్పెషాలిటి. 'నేనింతే'లో సినిమా నిర్మాత, 'అతడు'లో రాజకీయ నాయకుడు, 'కిక్'లో బ్యాంక్ ఆఫీసర్, 'పోకిరి'లో పోలీస్ కమీషనర్ (పాపులర్ డైలాగ్ లేచామా, తిన్నామా, పడుకున్నామా, తెల్లారిందా) కొన్ని ఉదాహరణలు మాత్రమే. వీటికి విరుద్ధంగా 'అరుంధతి' చిత్రంలో దుష్టశక్తులను కట్టడిచేసే అన్వర్ పాత్రలో తనకు తానే సాటి అనిపించుకున్నారు.

**ఆశిష్ విద్యార్థి :** ఈయన కూడా మరాఠీ రంగస్థలంపై ప్రకాశించి, తరువాత విక్రమ్ చిత్రం ద్వారా తెలుగు చిత్రసీమ ప్రవేశించి, తనకంటూ, ఒక ప్రత్యేక గుర్తింపు పొందారు



ఆశిష్ విద్యార్థి. దుర్మార్గుడైన పోలీస్ ఆఫీసర్‌గా 'పోకిరి'లో ఆయన అభినయం చూసినప్పుడు, లోకంలో ఇంతటి క్రూరులు కూడా వుంటారా అన్న భావన ప్రేక్షకులకు కలుగక మానదు. ఇందుకు భిన్నంగా నిజాయితి గల పోలీస్ ఆఫీసర్‌గా 'నరసింహ'లోను, సాత్విక స్వభావం గల కథానాయకుని తండ్రిగా సుహాసిని కాంబినేషన్‌లో నటించిన చిత్రం 'వరుడు'. ఒక చేత్తో కారు నడుపుతూ, మరో చేత్తో పిస్టలు చూపించి హీరోను కన్ఫ్యూజ్ చేస్తూ అతను చెప్పే ఫ్లాష్‌బ్యాక్ కథను వింటూ కథాగమనానికి కీలకమయిన కిడ్నాపర్ పాత్రలో సీరియస్‌గా వుంటూనే ప్రేక్షకుల్ని నవ్వించారు. (చిత్రం : అలామొదలైంది)

**సుధ :** హీరో, హీరోయిన్లకు ఓ మంచి సోదరి, ఓ మంచి వదిన వుంటే ఆ పాత్రకు



నిర్మాత, దర్శకుడు సుధనే ఎంపిక చేస్తారు. 'గ్యాంగ్‌లీడర్'లో హీరోకు వదినెగా, మురళిమోహన్ కాంబినేషన్‌లోనూ, 'కృష్ణ'లో రవితేజకు వదినెగాను (చంద్రమోహన్ కాంబినేషన్‌లో) సాత్త్విక పాత్రలు పోషించి, అందుకు భిన్నంగా 'ఆమె'లో ఆస్తి కోసం కోడలిపై అత్యాచారం చేయబోయిన భర్తను నరికి చంపిన పాత్రలో సహజ ఆవేశాన్ని ప్రదర్శించారు. 'మన్మధుడు'లో హీరో నాగార్జునకు పిన్నిగా (తనికెళ్ళ భరణి కాంబినేషన్‌లో) చాలాచాలా హోమ్లీగా అత్యంత సహజంగా నటించారు.



**ఢిల్లీ రాజేశ్వరి :** అటు ఫ్యాక్షన్ చిత్రాలలోనూ, ఇటు సామాజిక చిత్రాలలోనూ, భాద్యతగల ఇల్లాలుగా, వెరైటీ పాత్రలను దక్కించుకున్న అదృష్టవంతురాలు ఢిల్లీ రాజేశ్వరి. 'ఇంద్ర'లో తన కన్నకొడుకును తన భర్తే క్రూరంగా సంహరిస్తే, ఆ కడుపుకోతను భరించిన తల్లిగా ఎంతో సంయమనంతో నటించారు. ఇందుకు భిన్నంగా 'చిత్రం' అనే చిత్రంలో చీరెల కోసం భర్త భరణిని యాగీ చేసే గయ్యాళి పాత్ర ఓ వెరైటి. ఆ భరణికి జంటగా 'సముద్రం' చిత్రంలో మతిలేని భార్యగా అద్భుతంగా నటించారు. 'ఢీ' చిత్రంలో హీరోకి తల్లిగా, అతనుకోరిన అమ్మాయిని చేసుకోమని ప్రోత్సహించిన పాత్రలోని సంస్కారాన్ని నటనలో ప్రదర్శించారు.




**పరేష్ రావల్ :** ఈ పేరు చెప్పగానే శంకర్‌దాదా చేతిలో అష్టకష్టాలు పడ్డ, లింగం మామ గుర్తుకువస్తాడు. హిందీ చలనచిత్ర సీమలో తనకంటూ ఓ గుర్తింపు పొందిన పరేష్‌రావల్ 'మనీ' చిత్రం ద్వారా తెలుగు ప్రేక్షకులకు దగ్గరయ్యాడు. భార్యను హతమార్చటం కోసం పథకం పన్ని హతాశుడైన భర్తగా అనుక్షణం, పాత్ర పరంగా కన్‌ఫ్యూజన్ అంటే ఏమిటో నటనలో చూపారు. 'క్షణం క్షణం'లో లాకర్‌లోన సొమ్ముకోసం, హీరో హీరోయిన్లను వెంటాడే విలక్షణ వ్యక్తిగా కళ్ళలో పలు రకాల భావాలు పలికించారు. 'బావగారూ బావున్నారా' చిత్రంలో అహంకారియైన భూకామందు పాత్రలో, అల్లుడుగా వచ్చిన హీరో చిరంజీవితో గొడవలు పడుతు, చివరకు తన తప్పులు తెలుసుకున్న మామగా, పాత్రలోని ఢిపరెంటు షేడ్స్‌ను నటనలో ఆవిష్కరించారు.

**బెంగుళూరు పద్మ :** పుట్టింది విజయవాడలో నయినా కొంతకాలం బెంగుళూరులో వుండడం చేత బెంగుళూరు పద్మగా ఫిక్స్ అయిపోయి దర్శకులు సాగర్ రూపొందించిన 'స్టూవర్ట్‌పురం దొంగలు' చిత్రం ద్వారా సినీరంగ ప్రవేశం చేశారు. 'ఛాంపియన్' చిత్రంలో



అమాయకురాలిగా హాస్యపాత్రను, 'ప్రేమించుకుందాంరా' చిత్రంలో ఉత్తమ ఇల్లాలిగానూ, 'ఓ చిన్న మాట' చిత్రంలో సత్యనారాయణ భార్యగానూ నటించారు. సినీరంగంలో సమర్థురాలైన నటిగా నిరూపించుకున్న బెంగుళూరు పద్మకు, బుల్లితెర స్వాగతం పలికింది. 'దేవత, రుతురాగాలు' వంటి పలు సీరియల్స్‌లో ఆమె ప్రతిభకు తగ్గ పాత్రలు లభించాయి.



**ముఖేష్‌రుషి :** కోరాఖద్దరు పంచె, లాల్చీ, బిళ్ళంచు కండువాతో కోటేరు ముక్కుతో అందాన్నిస్తూ, పౌరుషానికి ప్రతీకలుగా వున్న మీసాలను మెలేస్తూ, నిప్పులు చెరిగే ఫ్యాక్షనిష్టు పాత్ర వుంటే దానికి సంపూర్ణ న్యాయం చేకూర్చే ఆర్టిస్టు ముకేష్‌రుషి. ఇందుకు 'ఇంద్ర' చిత్రం, గొప్ప ఉదాహరణ. అందుకు భిన్నంగా 'ఒక్కడు' చిత్రంలో హీరో మహేబాబు తండ్రిగా, పోలీస్ కమీషనర్‌గాను, 'బృందావనం' చిత్రంలో కథానాయకుడు జూనియర్ ఎన్.టి.ఆర్. తండ్రిగాను, సీరియస్‌నెస్‌తో కూడిన గంభీర పాత్రలను సునాయాసంగా రక్తి కట్టించారు.



**సుమన్ :** 'తరంగిణి, బావాబావమరిది, నేటి భారతం, పరువు ప్రతిష్ట' వంటి పలు చిత్రాల్లో హీరోగా నటించిన సుమన్ తరువాతి కాలంలో క్యారెక్టర్ ఆర్టిస్టుగా పవర్‌ఫుల్ రోల్స్ పోషించారు. 'గంగోత్రి' చిత్రంలో విలన్ ప్రకాష్‌రాజ్‌కు విశ్వాసపాత్రుడు భూమికలో (అర్జున్ తండ్రిగా), 'సీతారామ కళ్యాణం లంకలో' చిత్రంలో ఫ్యాక్షనిష్టు పాత్రను, 'అన్నమయ్య'లో శ్రీవేంకటేశ్వరస్వామిగాను, 'శ్రీరామదాసు'లో శ్రీరామునిగాను నటించి మెప్పించారు. 'పౌరుడు'లో హీరో సుమంత్‌కు తండ్రి పాత్రలో డిగ్నిఫైడ్‌గా అభినయించారు. వెంకటేశ్వరస్వామిగా నటించిన మరోచిత్రం 'దేవుళ్లు'.

**శ్రీహరి :** తెలుగు సినిమా కథ, కథనం, పాత్రల రూపకల్పన, చిత్రీకరణ – ఈ



నాలుగు అంశాలలో గత రెండు దశాబ్దాలుగా వచ్చిన మార్పులను గమనిస్తే, క్యారెక్టరు ఆర్టిస్టు అన్నపదానికి సరైన నిర్వచనం 'శ్రీహరి' అని చెప్పాలి. విలన్‌గా సినీరంగ ప్రవేశం చేసి 'హలో బ్రదర్' చిత్రంలో విలనీని కామెడీతో కలగలిపి ఓహో అనిపించిన శ్రీహరి హీరోగా మారి 'భద్రాచలం, సింహాచలం, అయోధ్యరామయ్య, గణపతి' వంటి సినిమాల్లో విలక్షణమైన హీరో పాత్రలో తనకంటూ ఒక ఇమేజ్‌ను సాధించుకున్నారు. గుణచిత్ర నటుడిగా మారిన తరువాత ఆయనకు తగిన పాత్ర 'నువ్వొస్తానంటే నేనొద్దంటానా' చిత్రంలో లభించింది. ఓ పల్లెటూరి మోతుబరి ఆసామి తన చెల్లెలను ఓ ధనవంతుడు ప్రేమిస్తే, ఆ ప్రేమకు కఠిన పరీక్షలు పెట్టి, వారి ప్రేమలోని నిజాయితి గుర్తించి, ఆశీర్వదించిన అన్న పాత్ర ద్వారా తన నటజీవితాన్ని మరో మలుపు తిప్పుకున్నారు

శ్రీహరి. 'ఢీ' చిత్రంలో కూడా కథానాయిక అన్నగా అనురాగం పంచుతూ, మరో ప్రక్క మురాకక్షలును ఎదుర్కొంటూ, తన వద్ద పని చేసిన హీరో సామర్థ్యాన్ని గుర్తించి, చెల్లెలుతో పెళ్ళి జరిపించిన, గంభీర పాత్ర, చెప్పుకోదగ్గది. రాజమౌళి అద్భుత సృష్టి 'మగధీర' కాగా అందులోని షేర్‌ఖాన్ పాత్ర మరో అద్భుత సృష్టి. గత జన్మలో హీరోకి ప్రత్యర్థిగా నిలిచి, అతనిశక్తికి తలవంచి, మరు జన్మలో హీరోకు సహకరించిన పాత్రలో చిరకాలం గుర్తుండి పోయేలా నటించారు శ్రీహరి.

**ఇంకా టాకీల తొలిదశకం నుంచీ ఇంకా క్యారెక్టరు ఆర్టిస్టులుగా రాణించినవారు..**

గిడుగు సీతాపతి, వడ్లమాని విశ్వనాథం, కె.వి.సుబ్బారావు, మద్దాళి కృష్ణమూర్తి, కొచ్చర్లకోట సత్యనారాయణ, యడవల్లి సూర్యనారాయణ, పువ్వుల సూరిబాబు, ఈలపాటి రఘురామయ్య, గౌరీపతి శాస్త్రి, అడ్డాల నారాయణరావు, ఏ.ఎల్.నారాయణ, సదాశిరావు, నిడుముక్కల సుబ్బారావు, దైతా గోపాలం, రామానుజాచారి, బలిజేపల్లి లక్ష్మీకాంతకవి, గిరి, అద్దంకి శ్రీరామమూర్తి, కోటేశ్వరరావు, గాడేపల్లి, గుదిరాజు కేశవరావు, లక్ష్మయ్యచౌదరి, మాధవపెద్ది సత్యం, ఉదయకుమార్, ఎస్.వి.రామదాసు, ఎస్.వి.జగ్గారావు, జగ్గారావు, మల్లాది సత్యనారాయణ, రాళ్ళబండి కుటుంబరావు, రాళ్లబండి కామేశ్వరరావు, టెలిఫోన్ సత్యనారాయణ, జూనియర్ ఏ.వి.సుబ్బారావు, సి.హెచ్.కృష్ణమూర్తి, జి.యన్.స్వామి, చట్ల శ్రీరాములు, గోకిన రామారావు, కోటశంకరారవు, రాజా కృష్ణమూర్తి, యం.బి.జి.తిలక్, సూర్య, పృధ్వీ, ఆనందకుమార్, కాశీనాధ్‌తాతా, కాదంబరి కిరణ్, బెనర్జీ, బ్రహ్మాజీ, రాళ్ళపల్లి, శివాజీరాజా, జెన్ని, నాగరాజు, సుబ్రహ్మణ్యం, ఏడిద నాగేశ్వరరావు, నిర్మాత అశోక్‌కుమార్, ముక్కు నరసింహారావు, మేల్‌కోటే, చంద్రమౌళి, ఎస్.వి. సుబ్బారావు....

రామతిలకం, సుందరమ్మ, ఎం.వి.రాజమ్మ, లక్ష్మీకాంతమ్మ, టంగుటూరి సూర్యకుమారి, మాలతి, బి.జయమ్మ, సి.హేమలత, హేమలతమ్మారావు, ఇందిరాచార్య, శేషుమాంబ, శేషారత్నం, బెజవాడ రాజరత్నం, కాకినాడ రాజరత్నం, పూర్ణిమ, పి.ఆర్.వరలక్ష్మి, పుష్పలత, రమాదేవి, డబ్బింగ్ జానకి, పండరీబాయి మొన్నటి ఝాన్సీ, నేటి యాంకర్ ఝాన్సీ పల్లవి, హేమ, రజిత, మధుబాల మొ॥వారు.

ఇతర భారతీయ భాషా చిత్రాలతో పోల్చిచూస్తే తెలుగు చలన చిత్రసీమలోనే ఎక్కువమంది క్యారెక్టరు ఆర్టిస్టులు వున్నారనిపిస్తుంది. ఇది తెలుగువారికి గర్వకారణం.





యస్.వి. రామారావు

- సబ్ రిజిస్ట్రార్‌గా పదవీ విరమణ
- నటుడు, నాటక రచయిత, దర్శకుడు
- సినీ రచయిత, వ్యాసకర్త, చరిత్రకారుడు
- వక్త, ప్రయోక్త, వ్యాఖ్యాత, 'సినీ విజ్ఞాన విశారద'
- 'హాసం క్లబ్స్' స్టేట్ కన్వీనర్
- 'తెలుగు తెర', 'నాటి 101 చిత్రాలు' నంది అవార్డులగ్రహీత

ప్రేక్షకుణ్ని సినిమాహాలు వరకు రప్పించడానికి
హీరో హీరోయిన్ల లేదా డైరక్టర్ యిమేజి పనికి వస్తుంది.
కానీ లోపలికి వచ్చాక అతన్ని కడదాకా కూర్చోబెట్టగలిగేది కారెక్టర్ ఆర్టిస్టులే...
కథ నడిపించేది, పట్టున్న సన్నివేశాలను రక్తి కట్టించేది, హీరో పాత్ర ఎలివేటయ్యేందుకు
అతనితో పోటీపడి నటించేది కారెక్టర్ ఆర్టిస్టులే...
హీరోలా యిమేజి చట్రంలో యిరుక్కుపోకుండా, నటనపై మాత్రమే దృష్టి కేంద్రీకరించి,
నవరసాలు పోషించగలిగేది కారెక్టరు ఆర్టిస్టులే...

వీరికి పాటలుండవు, నృత్యాలుండవు, డ్రీమ్ సీక్వెన్సులుండవు,
వెరైటీ కాస్ట్యూమ్సుండవు, విదేశాలలో షూటింగులుండవు,
వాల్‌పోస్టర్లలో ఫోటోలుండవు, సింగిల్ కార్డులుండవు,
అయినా తమ అభినయంతో సినిమాకు దన్నుగా నిలబడతారు.
నిత్యజీవితంలోని పాత్రలకు దగ్గరగా వుంటూనే విభిన్నత అద్దుతారు.
అందుకే నాయికా నాయకులు తోకచుక్కల్లా ఓ వెలుగు వెలిగి రాలిపోతారు
కారెక్టరు ఆర్టిస్టులు దశాబ్దాలపాటు నిలిచివుండి ప్రకాశిస్తూనే వుంటారు.
తెలుగునాట సమర్థులైన కారెక్టరు ఆర్టిస్టులకు ఎప్పుడూ కొదవ లేదు
ఐనా వారి జీవితాలు గ్రంథస్తం అయిన సందర్భాలు గుప్పెడే
అలనాటి సియస్సార్, కన్నాంబలనుండి,
ఈనాటి ప్రకాష్ రాజ్, తెలంగాణా శకుంతలవరకు

తెలుగుతెరకు పరిపుష్టి కూర్చిన 100 + కారెక్టర్ ఆర్టిస్టుల
జీవనరేఖలు, నటజీవిత విశేషాలు, అరుదైన ఛాయాచిత్రాలు
మీ చేతిలో వున్న యీ ఒక్క పుస్తకంలోనే..

ఇది కిన్నెర ప్రచురణ

పేజీలు -136

వెల - రూ. 80/-

